RNI No. APTEL/2003/12253

భావవీణ


కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

Vol : 17 Issue No. 11 Monthly November 2020 ISSN No. : 2456-4702 Rs. : 15/-



పొట్లపల్లి రామారావు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 17 - Issue. 11 - November 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నాయని కృష్ణకుమారి

జానపద వాఙ్మయానికి

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Contents (విషయ సూచిక)

1. తెలంగాణ సాహిత్య వికాసం - కథా ప్రక్రియ ప్రస్థానం	- బాలమణి	5
2. నాంచారయ్య - 'తీర్పు' - మార్పు	- డా॥. బి. లక్ష్మిప్రియ	11
3. తెలంగాణ జానపద కళలు అస్థిత్వపు మూలాలు-మనుగడ	- డా॥. గడ్డం వెంకన్న	18
4. సుంకోజి దేవేంద్రాచారి కథలు - మానవీయ ధోరణులు	- డా॥. ఎం. హరికృష్ణ	22
5. అభ్యుదయ సాహిత్య వాదిగా శ్రీశ్రీ	- పెరుగుపల్లి బలరామ్	28
6. పత్రిక సాహిత్యంలో వివిధ రూపాలు పరిణామాలు	- డా॥. సుభాష్ చంద్రబోస్	31
7. దేశ భక్త కవి కాళోజీ	- డా॥. వెల్దండి శ్రీధర్	36
8. మూలమలుపు - ఒక ప్రతీకాత్మక దృశ్యమానం	- డా॥. వి. త్రివేణి	41
9. మానవి నవలలో స్త్రీమూర్తులు	- కె. వీరేష్‌రావ్	52
10. తెలంగాణ సంస్కృతిలో పండుగల విశిష్టత	- కళ్యాణం అన్నపూర్ణ	57
11. ప్రాచీన భారతంలో ఆదిమ తెగలు సామాజిక జీవనం	- కిరణ్మాయి	62
12. శ్రీశ్రీ సినిమా పాటలు - అభ్యుదయ విప్లవ కవిత్వం	- మమతా కురెళ్ల	67
13. దాశరథి రంగాచార్య నవలలు - తెలంగాణ సామాజిక అంశాలు	- సి. హెచ్. నాగలక్ష్మి	72
14. ప్రాచీన సాహిత్యంలో వృత్తుల ప్రస్తావన	- రామడుగు రమాదేవి	77
15. వావిలికొలను రాజ్యలక్ష్మి కథల్లో కుటుంబ జీవనం	- సయ్యద్ అఫ్రీన్	81
16. సి.నా.రె సినిమా పాటలు - చమత్కార వైవిధ్యం	- పి. రమేష్	85
17. సి.నా.రె సినిమా పాటలు - చమత్కార వైవిధ్యం	- డా॥. డి.ఉదయ కుమారి	91
18. వి.ఆర్.రాసాని 'శ్రీరామ నిర్యాణము' - వస్తు వైవిధ్యం	- ఎ. దశరథన్	94
19. అన్వర్ ముస్లింవాద సాహిత్యం	- డా॥. వెల్దండి శ్రీధర్	99
20. తెలుగు దినపత్రికలు - సాహిత్యసేవ	- దారిశెట్టి లక్ష్మినరసింహం	106
21. లల్లాదేవి గారి లకుమాదేవి నవల : సమాలోచన	- డా॥. శిరీష ఉడ్పుగంటి	109
22. ఆచార్య ముదిగొండ శివప్రసాద్ వంశధార నవల - స్త్రీ పాత్ర చిత్రణ	- పిట్టా శాంతి	113
23. తెలంగాణ సామెతలు - పదస్వరూపం	- సంగి రమేశ్	118
24. పల్నాడు ప్రాశస్త్యం	- బి. వేణునాయక్	126
25. కులతత్వాన్ని కుళ్ళబొడిచిన వేమన	- కె. పుల్లారెడ్డి	130
26. OBC Movements in Andhra Pradesh &Telangana	- Dr. Battu Kiritam	133
27. Select Telugu Texts : Portrayal of Nature	- Dr. Venkata Ramaiah Gampa	137
28. Translating Phrasal Verbs from English to Telugu	- K. Emmanuel Babu	144

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ సాహిత్య వికాసం - కథా ప్రక్రియ ప్రస్థానం

- బొలమణి

ఆధునిక యుగంలో ఆంధ్ర, తెలంగాణ సాహితీ వారసత్వం అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ ఉన్నది. 20శతాబ్ది ఆదిలో ఆవిర్భవించిన నవ్యకవితా ధోరణులు మొదలు కొని నేటి కవిత్వోద్యమాన్నింటిలోనూ తెలుగు కవులు ముఖ్య పాత్ర వహించి ముందంజ వేశారు. రాయప్రోలు, కృష్ణశాస్త్రిలతో ప్రారంభమైన భావ కవిత్వం దిశదెసలు వ్యాపించింది. తెలంగాణ ప్రాంతంలో కూడా ఈ ఉద్యమ ప్రభావం కనిపిస్తుంది. అనేక భావకవితా రచనలు వెలువరించారు. పల్లా దుర్గయ్య, గంగిరెద్దు, పాలవెల్లి సంపుటులు గ్రామీణ ప్రకృతి శోభను, పల్లీయ జీవితాన్ని అతిసుందరంగా వర్ణించాయి. గంగుల శాయిరెడ్డి కాపుబిడ్డ కర్షక కవిత్వశాఖలో కలికితురాయిగా ఎన్నదగినవి. అదే విధంగా అభ్యుదయ కవిత్వ భాగమైన తెలంగాణా విముక్తి పోరాట కవిత్వం సాహిత్య చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా గుర్తింపు పొందింది. ఈ మార్గంలో దాశరథి, రుద్రవీణ, అగ్నిధార, కావ్యాలు నిజాంరాజు నిరంకుశ పాలనను ఎదిరించి స్వాతంత్ర్య సమరంలో ప్రత్యక్షంగా పాల్గొన్న కవి దాశరథి ఈయన "తిమిరంతో సమరం కేంద్ర సాహిత్య అడాడమీ బహుమతి పొందింది. ఇది అభ్యుదయ కవులకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. యాదగిరి, తిరునగరి, రామాంజనేయులు, సుద్దాల హనుమంతు పాటల ద్వారా విముక్తి పోరాటానికి అండగా నిలిచారు. కాళోజీ ప్రజల బాధని తన గొడవగా చేసికొని ప్రజా పోరాటానికి ప్రతినిధిగా నిలిచాడు.

సమకాలీన ఉద్యమాల చైతన్యాన్ని జీర్ణించుకొని మానవతావాద మంత్రాన్ని వినిపించిన కవి సి.నారాయణ రెడ్డి, ఆయన నిరంతర కవితా ప్రస్థానంలో నాగార్జున సాగరం, కర్పూర మైలురాళ్ళ గోచరిస్తాయి. నవ్య సంప్రదాయ మార్గంలో వెలువడిన కావ్యాలు వానమామలై వరదా చార్యులు పోతన చరిత్రము, జగన్నాధా చార్యుల రైతు రామాయణం ఇంకా ఈ మార్గంలో ఉత్పల సత్య నారాయణచార్య, వేముగంటి నరసింహచార్యులు పద్యకావ్యాలు వెలువరించారు. నంవత్కుమార, పేర్వారం, వేనరెడ్డి, సుప్రసన్న మొదలైన కవులు అనుభూతి పరమైన కవితా సంపుటులు ప్రచురించారు. "దిగంబర కవుల్లో చెరబండరాజు (బద్దం భాస్కరరెడ్డి) జ్వాలాముఖి (ఏవీ రాఘవాచార్యులు), నిఖిలేశ్వర్ (యాదవరెడ్డి) అనేక రచనలు చేశారు. ఈ చైతన్యంతో 1970లో విప్లవ రచయిత సంఘం ఆవిర్భవించింది.

బండారు అచ్చమాంబ, సురవరం, వట్టికోట, భాస్కర భట్ల, నెల్లూరి కేశవస్వామి, బూర్గాల రంగనాథరావు, నందగిరి ఇందిరాదేవి, పి.యశోదారెడ్డి, ఇల్లిందల సరస్వతి, సురమౌళి, గూడూరి సీతారాం ఎందరో కథానిక రచనలో విశిష్టతను గడించారు. కథానికా రంగంలోనే కాకుండా నవలా ప్రక్రియలో అనేక సామాజిక దృక్పథంతో నవలలు వెలువడ్డాయి.తడకమళ్ల వెంకటకృష్ణారావు కంబకంధర చరిత్ర, కామారూప కథ ఇటీవల వెలుగులోనికి వచ్చాయి. వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి, గంగు సాయుధ పోరాటాన్ని వివరించిన నవలలు. వీటితో పాటు దాశరధి రంగాచార్య చిల్లర దేవుళ్ళు, జనపదం నవలలు జనజీవితానికి దర్పణం పడతాయి. భాస్కరభట్ల కృష్ణారావు యుగసంధి, వెల్లువలో పూచిక పుల్లల అస్తిత్వావాద నవలు వచ్చాయి. వి.తిరుపతయ్య బడుగు జీవుల జీవన పోరాటాన్ని చిత్రించారు. 1950 తరువాత మాదిరెడ్డి సులోచనా సామాజిక దృక్పథంతో అనేక నవలలను రచించారు.

సృజనాత్మక రంగంలోనే కాక పరివోధన రంగంలో తెలంగాణ ప్రాంతం విశిష్టతను సాధించింది. ఆదిరాజు

వీరభద్రరావు, సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణ రావు, బిరుదురాజు రామరాజు, గడియారం రామకృష్ణశర్మ మొదలైనవారు సంస్కృతి, సాహిత్యాల పరిశోధనలో వాసికెక్కారు. కేంద్రసాహిత్య అకాడమీ తొలిబహుమతిని అందుకుకొన్న సురవరం, ఆంధ్రుల సాంఘిక చరిత్రతో పాటు రామాయణ విశేషములు, హిందువుల పండుగలు వ్యాసాలు వీరి పరిశోధనకు నిదర్శనాలు. భిన్నూరి నరసింహశాస్త్రి (బి.యన్.శాస్త్రి) శాసనాల శాస్త్రిగా పేరు పొందారు. జానపద వాఙ్మయంపై బి.రామరాజు, ప్రబంధ వాఙ్మయంపై పల్లా దుర్గయ్య, శతక ప్రక్రియపై కె. గోపాలకృష్ణరావు హరివంశాలపై పి.యశోధారెడ్డి, సాహిత్య విమర్శపూ కొవెల సంపత్కు మాచార్య అమేయ మైన ప్రతిభతో పుట్టిననేల రుణం తీర్చుకొన్నారు. వీరేకాక తెలుగు సాహిత్య చరిత్రలో ప్రసిద్ధమైన కవుల, రచ యితలు రచయిత్రుల అనేకమంది రచనలు చేసి తెలంగాణఖ్యాతిని ఇనుమడింప చేశారు. ఇంకా మిగిలి ఉన్న తెలంగాణ సాహిత్యాన్ని అందుబాటులోకి తెచ్చు కోవడం పట్ట కంకణధారులం కావాలి. ప్రజల రాజ కీయంగా, నైతికంగా, సాంఘికంగా, సాంస్కృతిక పరంగా చైతన్యం కావాలి. ప్రజలకు అవసరమైన భావచూతన్యానికి భాషే ఆధారం అన్న సంగతి మరచిపోకుండా సృష్టించే సాహిత్యం ప్రజలను ఆలోచింపజేయాలి. ఉత్తేజపరిచి కార్యోన్ముఖులను కావించాలి. నియోగి రచనలు తెలం గాణ ప్రజలకు ఓ ఆశను కలిగించాయి. ధైర్యం చెప్పాయి. దారి చూపాయి. ఎంతోమంది అభాగ్యులను, పీడిత జనులను చైతన్యం చేశాయి.

తెలంగాణలో ఆధునిక కథ ఎప్పుడు మొదలయిందన్న విషయాన్ని పరిశీలిస్తే తెలుగులో మొదటి కథ తెలంగాణ లోనే ప్రారంభమైందన్న విషయం అర్థమవుతుంది. ఆంగ్లభాషా సాహిత్యాల పరిచయంతో తెలుగులోకి ఆధునిక కథ ప్రవేశించినా అది ఆ భాషా సాహిత్యాలతో కోస్తా ప్రాంతానికున్నంత పరిచయం లేని తెలంగాణ నుంచి రావడం విశేషం. అంతే కాకుండా తెలుగులో కథ వస్తున్న చారిత్రకకాలంలో తెలంగాణలో తెలుగు చదువు కునే అవకాశాలు కూడా చాలా తక్కువే. పోతే కథానిక మధ్యతరగతి చదువరుల కోసం, మధ్యతరగతి ఎక్కువగా ఉన్న ప్రాంతం నుంచి వచ్చే అవకాశముందని విమర్శకుల అభిప్రాయం. ఈ అభిప్రాయం ప్రకారం తెలుగు కథ మధ్యతరగతి ఆవిర్భవించిన కోస్తాప్రాంతం నుంచి, ఆంగ్లేయ విద్యా ప్రభావం ఎక్కువగానున్న కోస్తా ప్రాంతం నుంచి రావల్సింది. కాని అలా జరుగలేదు. మొదటి తెలుగు కథ ఆంగ్లేయ విద్య, పాలన ప్రభావం అంతగా లేని, మధ్యతరగతి అసలే లేని సమయంలో తెలంగాణ నుంచి రావడం విశేషం. తెలంగాణలోనూ, తెలుగు సాహిత్యంలోనూ మొదటి కథ 1901-1902 ప్రాంతంలో భండారు అచ్చమాంబచే రాయబడిన స్త్రీవిద్యయే. భండారు అచ్చమాంబ తెలంగాణ వైతాళికుల్లో ఒకరయిన కొమర్రాజు లక్ష్మణరావు చెల్లెలు. ఆమె పుట్టింది నల్లగొండ జిల్లాలో, పెరిగింది, కథలు రాసింది, జీవితం కొనసాగిం చింది తెలంగాణలోనే. ఈమె సంఘ సంస్కర్త వీరేశలింగం పంతులుగారికి సమవయస్కురాలు. వీరేశలింగం సంఘ సంస్కరణ ఉద్యమంతో ప్రభావితురాలైన ఈమె సంస్క రణ నేపథ్యంతోనే కథలు రాసింది. ఆ కాలంలో తెలం గాణలో ముఖ్యంగా, కోస్తా ప్రాంతంలోనైనా స్త్రీకి విద్య నేర్పడం సాహసంతో కూడుకున్న పని. ఎంత సంపన్న లయినా స్త్రీని ఇంటికే పరిమితం చేసేవారు కాని బడికి తోలేవారు కాదు.

స్త్రీవిద్య యొక్క ఆవశ్యకతను తెలుపుతూ రాయ బడిన ఈ కథ తెలుగు కథల్లో మొట్టమొదటి కథ అనడంలో సందేమం లేదు. ఆధునిక కథ కుండాల్సిన లక్షణాలన్నీ సంతరించుకున్న ఈ కథను మొదటి కథగా అంగీకరించడానికి ఏ అభ్యంతరాలూ ఉండాల్సిన పనిలేదు. ఎప్పుడో ఎవరో నిర్ణయించిన కథానిక లక్షణా లను నూటికి నూరు పాళ్ళు అనుసరించిన కథకులెవరూ లేరు. విషయ సేకరణలోనూ, కథ చెప్పడంలోనూ ఆధు నికతను సంతరించుకొని, సరళమైన భాషలో రాయబడిన

ఈ కథ ఖచ్చితంగా మొదటి కథే. సమకాలీన సామాజిక ప్రయోజనమున్న వస్తువును తీసుకొని స్త్రీ విద్య యొక్క అవశ్యకతను నొక్కి చెబుతూ రాయబడిన ఈ కథే మొదటి కథ. ఆ కాలంలో కలం పట్టిన రచయితలు, కవులపై అప్పుడు తెలుగు సమాజంలో జరుగుతున్న సంస్కరణ ఉద్యమాల ప్రభావమున్నట్టే భండారు అచ్చమాంబపై కూడా సంస్కరణోద్యమాల ప్రభావ ముంది. స్త్రీ విద్యతో పాటు మరో 12 కథలు రాసింది అచ్చమాంబ. దంపతుల ప్రథమ కలహం, సత్పాత్రదానం లాంటి నీతి బోధక కథలను రాసిందీరచయిత్రి. ఈమె రాసిన ప్రసిద్ధ కథ 'ధనత్రయోదశి'. ఇందులో బొంబాయికి వలస వెళ్లినవారి విషయం, మానసిక సంఘర్షణ, ధనం కంటె గుణం మిన్న అన్న సందేశం ఉంది. ఆ కాలంలోనే బొంబాయి వలసల గురించి ప్రస్తావించిన అచ్చమాంబ అసలుసిసలైన తెలంగాణ బిడ్డ. నీతి, నిజాయితీ, నైతికత ఎప్పటికైనా మేలు చేస్తాయన్న సందేశాన్ని ఈ కథ ద్వారా ఇచ్చిన అచ్చమాంబ సంఘ సంస్కరణకు, సాంస్కృతిక పునర్వికాసానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహిళామణి. ఇలా తెలంగాణ నుంచే కాకుండా, తెలుగు నుంచే మొట్టమొదటి కథ నందించిన ఘనత ఓ మహిళా మణికి, తెలంగాణ నేలకు దక్కుతుంది. స్త్రీలకు చదువు కునే అవకాశాలు, బయటకు వెళ్ళే అవకాశాలు కూడా అంతగా లేని సమయంలో చదువుకోవడమే కాకుండా తెలుగు సాహిత్యానికి మొదటి కథానిక నందించిన ఘనత భండారు అచ్చమాంబకే దక్కుతుంది. ఇలా ఆమె ప్రతికూల పరిస్థితుల్లో చదువుకొని రచయిత్రిగా, సామాజిక కావ్యకర్తగా జీవితాన్ని గెలుచుకున్న మహిళామణి. 1901-1902 ప్రాంతంలోనే తెలంగాణలో కథ ప్రారంభ మైనా 1912లో మాడపాటి హనుమంతరావు కథలు రాసేంతవరకు తెలంగాణ నుంచి ఆధునిక కథ రాక పోవడం గమనించదగిన విషయం.

ఇలా సంస్కరణ నేపథ్యంతో స్త్రీవిద్య ఆవశ్యకతను నొక్కి చెబుతూ ప్రారంభమైన తెలంగాణ తెలుగుకథ జ్వాజ్వల్యమానంగా వెలుగుతుంది. ఆశు సాంప్రదాయం నుండి ఆశు సాంప్రదాయ లిఖిత కథకు అనేక పోకడలు పోతుంది. అయితే భండారు అచ్చమాంబ తర్వాత కొంత ఖాళీ ఏర్పడినా, మాడపాటి తర్వాత కథలు ఎక్కువగా రాకున్నా అన్ని కాలాల్లోనూ తెలంగాణతనాన్ని ప్రతి బింబించే గొప్ప కథాసాహిత్యం వచ్చింది. నేల విడిచి సాము చేయని కథాసాహిత్యం వచ్చింది. డిటెక్టివ్ సాహిత్యం, ఆరడుగుల ఎత్తున్న కథానాయకుల ప్రేమ సాహిత్యం, భూతప్రేత నవలా సాహిత్యం, సినీ నవలా సాహిత్యం వస్తున్న సమయంలోనూ తెలంగాణ నుంచి జనజీవన సంఘర్షణ సాహిత్యమే వచ్చింది. తెలుగు సాహిత్యాన్ని, కథా సాహిత్యాన్ని వ్యాపారమయమై పోకుండా తెలంగాణ కథ కాపాడింది. అన్ని ఉద్యమా లను, మార్పులను, రాజకీయాలను తనలో సంలీనం చేసుకొని తెలంగాణ రచయితలు అద్భుతమైన కథా సృజనం చేసారు. అస్తిత్వవాద, దళితవాద, దండోరా, బహుజనవాద, మైనారిటీ, రపాంతీయ, విప్లవవాద ఉద్యమాలనువేటినీ వదిలిపెట్టకుండా తెలంగాణ కథ సమకాలీన ఉద్యమాలకు భాష్యాలను పలికింది. ప్రపంచాన్ని కుదిపివేసిన, కుదిపివేస్తున్న పారిశ్రామికవిప్లవ, మార్క్సిస్టు విప్లవ, ప్రపంచీకరణ పరిణామాలకు అద్దం పడుతూ, విశ్లేషిస్తూ, పరిష్కారాలను చూపుతూ తెలంగాణ కథకులు కథలు రాసారు. రాస్తున్నారు. చారిత్రక దృష్టితో విభజన చేసినపుడు తెలంగాణ కథాకాలాన్ని నాలుగు భాగాలుగా విభజించవచ్చు. తెలంగాణలో కథ ప్రారంభ మైన 1902 నుంచి హైదరాబాద్ దక్కన్ ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడిన 1956 వరకు ప్రారంభ కాలంగా, ఈ కాలంలో కలం పట్టిన రచయితలను మొదటితరం రచయితలుగా పేర్కొనవచ్చు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన 1956 నుంచి తెలంగాణలో విప్లవోద్యమాలు వేళ్ళూనుకొని నీ బాంచెన్ కాల్మొక్తా అన్న వాళ్ళే తిరుగుబాటు చేసే దశకు చేరుకున్న దశ 1975 వరకున్న కాలాన్ని తెలంగాణ కథావికాస దశగా, ఈ కాలంలో కలం పట్టిన రచయితలను రెండవతరం

రచయితలుగా పేర్కొనవచ్చు. 1975 నుండి 1995, వరకు తెలంగాణ కథకు ఉజ్వల దశగా, ఈ కాలంలో కలం పట్టిన రచయితలను మూడవతరం రచయితలుగా చెప్పవచ్చు. 1995 తర్వాత కలంపట్టి రాసిన రచయితలను ఈ తరం కథా రచయితలుగా, ఈ కాలంలో వచ్చిన కథలను ప్రపంచీకరణ యుగకథలుగా పేర్కొనవచ్చు. అంటే ఆయా కాలాల్లో కలం పట్టిన ప్రసిద్ధులైన రచ యితలు ఆ కాలానికే పరిమితమైండ్రని కాదు. కొందరు అక్కడికే ఆగిపోతే మరికొందరు కాలంతో నడిచి ఆ తర్వాతి కాలాల్లోనూ తమ రచనా వ్యాసంగాన్ని కొన సాగిస్తున్నారు. ఈ విభజననుసరించి తెలంగాణ కథా సాహిత్యంలో వచ్చిన వివిధ పరిణామాలను, తెలంగాణ కథా దీపధారులను, సమాజంపై ప్రభావం చూపిన ప్రసిద్ధ కథలను పరిశీలిద్దాం. ఈ నాలుగు కాలాల మధ్య స్పష్ట మైన తేడా ఉంది. ఆ తేడాలను గమనించి రచయితలు సమకాలీన, రాజకీయార్థిక, సామాజిక విషయాలను తమ కథల్లో నిక్షిప్తం చేసారు. తొలితరంలో కలంపట్టిన రచయితలు హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్నవారు. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడకముందే కలం పట్టినవారు. నైజాం పాలనను చవి చూసినవారు. మలితరంలో కలం పట్టినవారు ఆంధ్రప్రదేశ్ అవతరణను చూసినవారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పరిస్థితిని చూసినవారు. మూడవతరంలో కలం పట్టినవారు స్వాతంత్ర్యానంతరం పుట్టినవారు. ఉమ్మడి రాఫంలో పెరిగినవారు. 1968-69 తెలంగాణ పోరాటం, 1970ల విప్లవ పోరాటాలు చూసిన వారు. పోరాటాల్లో, పోరాట ప్రాంతంలో జీవిస్తున్నవాళ్ళు. నాలుగవతరంలో కలం పట్టినవాళ్ళు ప్రపంచీకరణ ప్రభావంతో పెరిగి పెద్దయిన వారు. ఈ అన్ని తేడాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ కథకులు ఓ చారిత్రక దృష్టితో కథలు రాసారు. స్థలకాలాల చైతన్యంతో కథలు రాసారు. అన్ని సామాజిక, సాంఘిక, భాష, రాజకీయ, ఆర్థిక పరిణామాలకు స్పందించి కథలు రాసారు.

సమకాలీన సమాజాన్ని అవిష్కరిస్తూ, సమస్యలకు మూలాల్ని అన్వేషిస్తూ, సామాజిక వాస్తవికతకు దర్పణం పడుతూ పరిష్కారాల్ని సూచిస్తూ సాగింది తెలంగాణ కథాప్రస్థానం. స్థిరీకృత, ఆధిపత్య భావజాలాన్ని ప్రశ్నిం చడంతో కథా రచయితలు తెలంగాణలో ఒకడుగు ముందు వేసినారు. తెలంగాణ ప్రాంతం సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సంక్షోభానికి గురవడం ఈ ప్రాంత కథా రచయితలకు బలమైన వాహికగా, కథావస్తువుగా నిలచింది. ప్రధానంగా పరాయీకరణ, వలసలు, గ్రామాలు విశ్వంసమవడం, మనిషి వ్యాపార వస్తువుగా మారడం, సంస్కృతి విచ్ఛిన్నతకు పరాయి వారి భాషా, సంస్కృతుల ఆధిపత్య ధోరణులు, జీవనవిధానంలోని అంతరాలు, సామాన్యునికి చేరని స్వాతంత్ర్య ఫలాలు కథా రచయితల్ని తీవ్రంగా ఆలోచింపజేశాయి.

ఏ ప్రాంత సాహిత్యానికైనా, ఆ ప్రాంత సమకాలీన సమాజమే వస్తువును సృష్టిస్తుంది. అలాగే తెలంగాణ కథా సాహిత్యానికి ఇక్కడి వివిధ కాలాల్లో, వివిధ రకాలుగా ఏర్పడ్డ అనేక సమస్యలు, సంఘర్షణలు, అసమానతలు, ఆధిపత్యాలు, వివక్షలు కథా వస్తువులైనాయి. ప్రధానంగా ఇక్కడి కథావస్తువులన్నీ ఆయా రచయితల అనుభవా ల్లోంచి వచ్చిన సజీవ దర్పణాలు. తెలంగాణా అనేక ఉద్యమాలకు పురిటిగడ్డగా పేరు పొందింది. తెలంగాణ సాయుధ పోరాటం. కార్మికోద్యమాలు, గిరిజన పోరాటాలు, భూమికోసం జరిగిన తిరుగుబాట్లు, దొరల దౌర్జన్యాలకు గురైన పేద ప్రజలనిస్సహాయతలు ఇక్కడి కథలకు ప్రధానవస్తువులైనాయి. తెలంగాణ కథా సాహిత్యాన్ని అధ్యయనం చేసినట్లైతే అందులో గ్రామీణ జీవితం, సామాజిక పరిస్థితులు, గృహజీవనం, వ్యవ సాయం, కూలీ నాలీ బ్రతుకులు, విద్యా విషయాలు, వివిధ వృత్తులు, ఆలయాలు, ఉత్సవాలు, జాతరలు, అప్పుసప్పులు, వెట్టిచాకిరీ, ఇలా ఎన్నో అంశాలు కని పిస్తాయి. వీటికి తోడు కులాలు, వర్ణాలు, వర్గాలు దర్శన మిస్తాయి. ఆయా కుల వర్ణ వర్గాల్లోఉన్నవాళ్ళూ, లేని వాళ్ళూ మనకు కనిపిస్తారు. అలాగే పంటలూ, భూముల

క్రయ విక్రయాలు, సర్కారు పన్ను నీటిపన్ను ఇవి ప్రాధాన్యం వహిస్తాయి. వీటన్నింటికీ తోడు ప్రభుత్వం, రెవెన్యూ పోలీసు వ్యవస్థ, గ్రామాధికారుల వ్యవస్థ అడుగడుగునా తొంగిచూస్తాయి. ఇంక ఇవి కాకుండా వంటలు, అభిరుచులు, మనస్తత్వాలు, ఆచారాలు, ఆటపాటలు, పెళ్లిపేరాంటాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు ఇలా ఒకటా రెండా తెలంగాణ కథా సాహితీ విశ్లేషణ ద్వారా తెలంగాణ సర్వస్వాన్ని నిర్మాణం చేయవచ్చు.

1956కి పూర్వం తెలంగాణాలో ఇరవై మందికి పైగా మహిళా కథకులు తమ కథా రచ నలు వెలువరించారన్న విషయం తెలుస్తుంది. అందులో కోరాడ భూషణమ్మ, భారతమ్మ, శిరుగూరి రత్నమ్మ, పి.సరళాదేవి, ఎ.పి. సీతాదేవి, భారతీ రత్నకాంబ, విజయలక్ష్మి తదితరులు ముఖ్యులు, శిరుగూరిరత్నమ్మ "వినాశకాలే విపరీ తబుద్ధి' వంటి కథల్ని రచించారు. పి.సరళాదేవి, విజయనగరం ప్రాంతానికి చెందినవారు కాని ఒక దశాబ్ద కాలం పాటు మన తెలంగాణాలో తెలంగాణాలో ఉండి 'ఎదురు చూస్తున్న ముహర్తం, కుంకుమ రేఖలు' వంటి కథా సంపుటాలను వెలువరించారు. భారతీ రత్నకాంబ ఆంధ్ర మహిళా సభలకు అధ్యక్షత వహించి స్త్రీ చైతన్యం కోసం పాటు పడ్డారు. వందేళ్ళ తెలంగాణ తెలుగు కథా చరిత్రలో తొలితరం తెలంగాణా మహిళా కథకుల కథలు ఖచ్చితంగా నిలుస్తాయని తెలుగు సాహితీ లోకం ఆశి స్తుంది.

తెలంగాణ కథకులు మొదటినుంచి కథలు రాసి ఊర్కోలేదు. సమాజవికాసం కోసం కృషి చేసారు. వాళ్ల జీవితాలు, సాహిత్యం వేరు కాదు. అనేక రకాల అనను కూలతల నడుమ తెలంగాణ కథ అట్టడుగువర్గాల నుంచే వికసించింది. తొలిమలితరాల్లో గణనీయమైన కథలు వచ్చినా భూస్వాముల దోపిడీని పీడనను ఎదుర్కొనే కథలే ఎక్కువ వచ్చాయి. నైజాం రాష్ట్రంలో పీడనకు మించిన సంస్కరణకు మించిన కథా వస్తువులు రచయితలను ప్రభావితం చేయలేకపోయాయి. అందుకే తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చి నైజాం పీడన పోయే వరకు వలస జీవితాల చిత్రణ జరగలేదు. తర్వాత దశకంలో వలస చిత్రీకరణ జరిగినా చాలా తక్కువ కథలు వచ్చాయనే చెప్పాలి. పారి శ్రామికీకరణ కార్మికుల వలసకథలు 80ప్రాంతంలో మొదలయ్యాయి. వలసలు రెండు రకాలుగా సాగాయి.బతుకు దెరువు కొరకు ఒక రకమైతే సంపాదన కోసం మరో రకం. కథా సాహిత్యంలో ఎక్కువగా బతుకు దెరువు కోసం వెళ్ళిన వలసలనే చిత్రించడం జరిగింది.

తెలంగాణ కథ ఎప్పుడూ నేలవిడిచి సాము చెయ్య లేదు. యదార్థాలను చిత్రించింది. గ్రాంథిక భాష నుంచి సరళ గ్రాంథికం, వ్యవహారికం, తర్వాత ప్రజల భాషలోకి తెలంగాణ కథ మలుపు తిరిగింది. 1948 నుండి 1956 వరకు అంటే ఎని మిది సంవత్సరాలు. 1956లో ఆంధ్ర ప్రదేశ్ అవతరణ జరిగింది. ఈ ఎనిమిది సంవత్సరాల్లో ముఖ్యంగా మధ్యతరగతి జీవితం నుంచి ఎక్కువ కథలు వచ్చాయి. జి.రాములు, గూడూరి సీతారాం, జి.సురమౌళి, దాశరథి, హీరాలాల్ మోరియా, కందుకూరి లింగరాజు, వట్టికోట ఆళ్వారుస్వామి, పొట్లపల్లి రామారావులాంటి రచయితలు మధ్యతరగతి జీవితాల్లోంచి ఎదిగి కథలు రాసారు. యుగాంతం తర్వాత వలసల్లో చెప్పుకోదగిన కథలు రంగడు, మారాజు, లచ్చి కథలు. ఇవి గూడూరి సీతారాం రాసిన కథలు. తెలంగాణ భాషలో, యాసలో, నానుడులతో రాసిన నికార్సయిన కథలు ఇవి.

1956-70 ప్రాంతంలో తెలంగాణలో చాలా మార్పు లొచ్చాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణతో ఉద్యోగాలు కోల్పోయినవారు, వృత్తి కార్మికులు, రైతులు, భూ నిర్వాసితులు వలస వెళ్ళారు. గ్రామాల్లో భూస్వాములు వేళ్ళూనుకోవడంతో వెట్టిచాకిరి పెరిగింది. గోదావరి నదీతీరం వెంట బొగ్గుగనులు బయటపడి బొగ్గు ఆధారిత పరిశ్రమలు పెరిగాయి. దాంతో కార్మిక వలసలు పెరిగాయి. యాజమాన్యపుదోపిడీ పెరిగింది. భూ పోరాటాలు మొదలయ్యాయి. తెలంగాణ భాషమీద

సాహిత్యం మీద వివక్షత పెరిగింది. భూపోరాటాలు మొదలయ్యాయి. తెలంగాణ భాష మీద సాహిత్యం మీద వివక్షత పెరిగింది. వ ృత్తి కార్మి కులు, భూస్వాముల ఆగడాలకు తట్టుకోలేని వారు బొంబాయి, బీవండి, షోలాపూర్కు, భూనిర్వాసితులు మైనింగ్ ఏరియాలకు, రైతులు, కూలీలు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. 1962లో డా॥ సి.నారాయణరెడ్డి రాసిన 'బొంబాయి పోయిండు నా కొడుకు ఏడ ఉన్నాడో, ఏం తిన్నాడో' పాట నేత కార్మికుల వలసను తెలుపు తుందిఈ మధ్యకాలంలో హీరాలాల్ మోరియా, రామలింగం, తాడిగిరి పోతరాజు, బోయ జంగయ్య, యశోదారెడ్డి, మాదిరెడ్డి సులోచన, దాశరథి రంగాచార్య, గంగుల నరసింహారెడ్డి, చావా శివకోటి మొదలైన వారంతా కథలు రాసారు. ఈ కథల్లో దొరల పీడన, ప్రతిఘటన, గ్రామీణ జీవితాల చిత్రణ ఉంది. ఈ కాలంలో జరిగిన వలసల మీద కథలు 1980 తర్వాత గాని రచయితలు చిత్రించలేదు. అలా చిత్రించిన కథలను కూడా వేళ్లమీద లెక్కించవచ్చు. అప్పుడు వచ్చిన మొట్టమొదటి పాలమూరు వలస కథ బి.ఎస్.రాములు 'తిరుగుబాటు' కథ. తెలంగాణాలో ఉద్యమం వివిధ సమయాల్లో వివిధ రూపాన్ని తీసుకుంది. నైజాం ప్రభుత్వానికి వ్యతి రేకంగా సాయుధ రైతాంగ పోరాటంగా స్వాతంత్ర్యానికి ముందూ ఆ తరువాత కాలంలో సాగింది. తెలంగాణపై వలసవాదుల పెత్తనానికి వ్యతిరేకంగా 1968-72 ప్రాంతంలో తెలంగాణ ఉద్యమంగా సాగింది. తర్వాత దశలో నక్సలైట్ ఉద్యమం ఊపిరి పోసుకుంది. 1975 నుండి 1985 వరకు ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం తెలంగాణా కథకు కొత్త ఊపిరినిచ్చింది. ఉద్యమకథలు సింగరేణి కార్మిక కథలు విరివిగా వచ్చాయి.

తెలంగాణా కథానికవస్తువైవిధ్యాలపుట్ట. ఈ కథానికల్లో నిక్షిప్తమయిన వస్తువులను ఏకరువు పెట్టడం కూడా పెద్ద కథ అవుతుంది. పోరాటాల ఫలితంగా తెలంగాణాలో వచ్చిన మార్పులను, పోరాటాల వల్ల అల్లాడిన గ్రామాలను, తుపాకీ మోతలను, దళితుల, కార్మికుల, వృత్తిపనివాళ్ళ వెతలను, మోటబావులు, చెరువులు, కుంటలు, ఇంకిన చెలమలు, నీళ్ళులేని బోరుపాక్కలు, విరిగిన నాగళ్ళు, మూలపడ్డ తొండాలు, చీకుపట్టిన పల్లకీలు, చేతులు విరిగిన మగ్గాలు, ముంబాయికో, దుబాయికో వలసలు వెళ్ళే కుటుంబాలు ఈ వలసలు వెళ్ళేవారు దళారుల చేతిలో మోస పోవడాలు, గోరు చుట్టుపై రోకలిపోటులాగా దేశీయ సమస్యలతో సతమత మయ్యే జనానికి పడగెత్తిన ప్రపంచీకరణ బాధ. ఇలా అనేకానేక సమస్యలు తెలంగాణ కథానికలకు ఇతివృత్తు లయ్యాయి. తెలంగాణా కథకులు వైవిధ్యమైన కథానికలు రాసి తెలుగు కథకు ఒక దృక్పథాన్ని ఏర్పరిచారు.

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నాంచారయ్య - 'తీర్పు' - మార్పు

- డా॥. ఐ. లక్ష్మిప్రియ, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

అది గుంటూరు జిల్లాలోని వేజండ్ల మాదిగ పల్లె. దనం, అధికారం, అహంకారం, వున్నవారికి మాదిగలకి మధ్య జరిగిన సంఘటన, సంఘర్షణను, ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు 'రంధి' అనే శీర్షికతో నవలగా రూపాన్ని ప్రాణాన్ని పోసి వాస్తవికతకు దగ్గరగా మన కళ్ళ ముందు చిత్రం నడుస్తున్నట్లు రూపొందించారు. 'రంధి' తెలుగు పదం రంధి సంస్కృత రూపం. ప్రకృతి తెలుగు వికృతి సంస్కృతం. రచయిత ఈ పదాన్ని నవలలో పూర్తిగా కేవలం '3' సార్లు మాత్రమే ఉపయోగించారు. ఆయా సందర్భాలు నవల శీర్షికలోని ఆంతర్యానికి అద్దం పట్టాయి. ఒక సందర్భంలో నాయిక సువ్వి వాడింది, ఒక సందర్భంలో రచయిత నాంచారయ్య గురించి ప్రస్తావించినప్పుడు వాడారు, మరో సందర్భం నాంచారయ్య భార్య లచ్చిందేవి పాత్ర గుండా 'రంధి' అనే మాట వాడటం కనిపిస్తుంది.

నవల ఆద్యంతభరితంగానూ చదువరులకు ఉత్సాహ భరితంగానూ, మనస్సును కదిలించే నిజాలతోనూ, గుండెలోని ఆవేదన కళ్ళలో చూపించడంలోనూ, మనిషి లోని మనీషిని చూపించడంలోనూ, మౌనంతో, నిశ్శబ్దంలో అనంత భావాలను తెలియజేయవచ్చు అని చిత్రించడం (వి)భిన్న మనసులని, విధి రాతకు తలవంచుతూ వ్యక్తి అంత:రూపాన్ని, కులం, మతం, డబ్బు, పదవి, బలం, అహంకారాల నడుమ వ్యక్తి జీవన స్థితిగతులకు నిలువటద్దం 'రంధి' నవల.

రోషం, పౌరుషం, కోపం, అహంకారం, ధనపిచ్చి, కుల పిచ్చితో విర్రవీగిపోతూ మంచిని, మానవత్వాన్ని, సమాజ హితాన్ని మర్చి పెట్రేగిపోతున్న మనిషి జీవిత సత్యాన్ని తెలుసుకుని అందరూ మెచ్చుకునే అందరికి నచ్చే తీరులో మారితే వున్న తృప్తిని రచయిత తెలియచేశాడు.

నవలలో కథాగమన విధానం చక్కటి ప్రయాణం అయితే అందులో నాంచారయ్య పాత్ర తనలో వచ్చిన తర్కబద్ధం అయిన మార్పు నవలకి జీవంపోస్తూ చిత్రించారు రచయిత. నాంచరయ్యలో వచ్చిన మార్పుకు కారణాలు తెలుసుకోబోయె ముందు నాంచారయ్య ఎలాంటి వ్యక్తి ఏఏ కారణాల వల్ల తర్కబద్ధమైన మార్పు కనిపిస్తుంది అంటే...

గుంటూరు జిల్లాలోని వేజండ్ల మాదిగ పల్లెలో కోటయ్యను పల్లెలో అందరూ కోటి అని పిలుస్తారు. ఒక్కగానొక్కకూతురు సువ్వి రంగు నలుపు అయినా చాలా అందగత్తె రోషం, పౌరుషం, పట్టుదల వున్న బిడ్డ చదువుకుని టీచరు కావాలనేది సువ్వి ఆశయం. ఆ ఊరిలో డబ్బు, అహంకారం, కోపం, కులపిచ్చి నిండుగా వున్న నాంచారయ్య లచ్చిందేవిల కొడుకు రాముడు. ఒక్కగానొక్కకోడుకు గారాభంగా పెరిగాడు. నాంచారయ్యకు ఊరిజనం అందరూ భయపడుతారు. అప్పులు ఇస్తాడు, వడ్డీలు తీసుకుంటాడు అవసరం అయితే ప్రాణాలు తీయిస్తాడు. ఎవరూ ధైర్యం చేసి మాట్లాడరు నాంచారయ్యను ఎవరూ ముట్టకోరు, దూరంగానే వుండి మాట్లాడాలి. వాళ్ల ఇంటికి వెళ్లి నీళ్లు, మజ్జిగ తాగినా వాళ్ళే గ్లాసు శుభ్రం చేసి విధిగా ఆ గ్లాసుకు కేటాయించిన స్థానంలోనే పెట్టాలి. అది రూలు ఎవరు వచ్చినా అప్పుకైనా శుభకార్యానికైనా గుమ్మంబైటనే తిండి, తీర్థం, అప్పు, జమ ఏ విషయం చెప్పదలచిన గుమ్మం బయట నుంచే చెప్పాలి, 'జీతగాళ్లు తప్ప' ఎవరూ ధైర్యం చేసి లోపలికి రారు. వస్తే చచ్చినట్లే.

రాముడికి నాంచారయ్య మంచి బుద్దులు, నడవడిక నేర్పలేదు అలాగని చెడుచేస్తుంటే అడ్డుకోలేదు. తల్లి ఎన్నో సందర్భాల్లో చెడును తప్పు అని చెప్పడానికి ప్రయత్నం చేసినా నాంచారయ్య ఊరుకోడు. లచ్చిందేవిని తిట్టి

ఒక్కగానొక్క కొడుకని గారాంభం చేశాడు. రాముడిని స్కూల్లో టీచర్ మందలిచ్చాడని టీచర్‌ని తిట్టడం, కొట్టడం, చెయ్యి విరకొట్టడం వరకు వచ్చింది. ఊర్లో ఎవరూ ఏమి మాట్లాడరు. భయం నాంచరయ్య చంపు తాడని. తెనాలిలో బడి వుంది. గుంటూరు మీదుగా వెళ్ళే రైలు బండికి రాముడు, సువ్వి ఇద్దరు వెళ్ళి చదువుకొని రావాలి. సువ్విని మూగవాడు అయిన చందిరి రైలు బండి వరకు తోడుగా వచ్చి దిగబెట్టి వెళ్ళేవాడు. మళ్లీ రైలు వచ్చే సరికి సిద్ధంగా స్టేషన్‌కి చేరుకుని సువ్విని ఇంటి దగ్గర దిగబెట్టేవాడు. చిన్నప్పటి నుంచి ప్రక్క ప్రక్క ఇళ్లవాళ్ళు కావడం వల్ల అలవాటు అయింది. రాముడికి జీతగాడు తోడు వస్తాడు. రైలు బండి లేటుగా వస్తే కుర్చోడానికి దిమ్మె కట్టించాడు నాంచారయ్య. అందులో రాముడు మాత్రమే కుర్చోవాలి లేకపోతే ఖాళీగా వుండాలి. రైలులో మాత్రం అందరూ కలిసే వెళ్ళాలి.

రాముడు ఎక్కిన రైలు పెట్టెలో ఒక రోజు సువ్వి ఎక్కిం దని సువ్విని కారు నలుపు, రాక్షస బొగ్గు నలుపు దీనికి చదువెందుకురా అని ఈసడించుకున్నాడు. సువ్వి ఏడ్చింది. రాముడు గురించి ఇంట్లో అమ్మా నాన్నకు చెప్పి ఎడతెరపి లేకుండా ఏడ్చింది. తరువాత రోజు నుండి రాముడు ఎక్కిన రైలు పెట్టి తప్పించి మరొక దానిలో ఎక్కసాగింది ఫస్ట్‌ఫారం పాసయింది హుషారుగా ధైర్య వంతురాలుగా పెరగసాగింది.

ఒకరోజు సువ్వి ఎక్కిన రైలు పెట్టెలోకి రాముడు కావాలనే ఏడిపించాలనే ఎక్కాడు సువ్వికి వణుకు పుట్టింది. అయినా ధైర్యంగా కుర్చొంది. రాముడికి కోపం వచ్చింది రైలు వేగం పుంజుకుంది మగరాయుడిలా సువ్వి కుర్చుంది అని కోపం వచ్చింది. నేను ఎక్కిన పెట్టెలో నువ్వు ఎందుకు ఎక్కావు అన్నాడు. నేను ఎక్కలేదు "నువ్వే" ఎక్కావు అంది. ఇక్కడ మొదలైంది సమస్య రాముడుకి 'నువ్వే' అనేటప్పటికి ఎక్కడలేని కోపం వచ్చింది. నువ్వేందే నువ్వు అంటున్నావు ఏమండీ సారూ... దొరగారూ అనకుండా ఏకవచనంలో అగౌరవంగా పిల స్తావా అని కోపం రెట్టింపు అయింది. సువ్వికి ఏడుపుతో కూడిన కోపం కళ్ళ నీళ్ళై మెరుస్తూవుంది.

మాదిగ పిల్ల తన ఎదుటలేవకుండా, దండం పెట్ట కుండా, కుర్చోండి అంటూ పక్కకు తప్పుకోకుండా, కుర్చోవటం చూస్తూ ఉంటే రాముడికి రేగుతూ వుంది కోపం, ఒకరినొకరు తిట్టుకున్నారు. నాతోనే ఎదురు మాట్లాడతావా అని రాముడికి కోపం వచ్చి లేచి ఎదురు రొమ్ములపై కొట్టాడు. సువ్వి ఏడ్చింది పుస్తకాలు అడ్డు పెట్టుకుంది, రైలు పెట్టెలో వున్న అందరూ గమనిస్తూనే వున్నారు. ఎవరు ఏమి మాట్లాడలేకపోయారు నాంచా రయ్యకు భయపడి, ఒక ముసలాయన మాట్లాడితే అయన్ను తిట్టాడు. అంతలో రైలు గుంటూరులో ఆగింది. ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.

ఒకరోజు చందిరికి గుంటూరులో పనివుందని సువ్వితో పాటు రైలు ఎక్కాడు, రాముడికి కోపం వచ్చింది. మాదిగది దీనికి వీడు కాపలావాడా అని చందిరిని కుక్క అన్నాడు సువ్వికి కోపం వచ్చింది నువ్వే కుక్క అంది. రాముడిని, వెంటనే కొట్టడానికి లేచాడు చందిరి రాము చేతిని అడ్డగించి గట్టిగా చేయి పట్టుకున్నాడు, రాముడు చేయి విడిపించుకోలేకపోయాడు. గిలగిలలాడిపోయాడు. అప్పుడు సువ్వి నవ్వుతూ చప్పట్లుకొడుతూ "అయిందా పెళ్లి అణిగిందా రంధి?" అనింది, రాముడికి సువ్విపై కోపం పెట్రేగి పోయింది. అలాగే సువ్విపై కోరిక పెరిగింది.

ఒకరోజు రైలుదిగుతుంటే వెనుక నుంచి వాటేసు కున్నాడు రాముడు కింద పడిపోకుండా సువ్విని చందిరి పట్టుకున్నాడు. సువ్విని 'లంజ' అని తిట్టాడు, రాముడిని చెంప చాచి కొట్టింది, అతి పెద్ద సాహసమే మాదిగ మగ వాడే ఆపనిచేయలేదు. సంపన్నుడి కుమారుడు హత్యలు చేసే చేయించే నాంచారయ్య కొడుకును కొట్టడం, సామాన్యమైన విషయం కాదు. తండ్రి కొడుకులు బాగా ఆలోచించి సువ్వికి బుద్ధి చెప్పాలనుకున్నారు. మళ్ళీ ఇద్దరూ రైలు బండి ఎక్కారు రాముడు అందరిని తోసు కుని సువ్వి దగ్గరకు వచ్చాడు. మళ్ళీ గొడవ పెట్టు

కున్నాడు. ఎదురురొమ్ములపై గుద్దాడు. ఈసారి సువ్వి తాచుపామయింది. రాముడు మీద మీదకి వస్తుంటే ముక్కుపై గుద్దింది రక్తం వచ్చి చొక్కా తడిచిపోయింది. రాముడికోపం పెరిగి బూతులు తిట్టసాగాడు. రక్తం చూసేసరికి సువ్వికి భయం పుట్టుకొచ్చింది. రాముడుకి కోపం వచ్చి లంజా! నిన్ను నెత్తురు కారెట్టు చెరచకపోతే నాపేరు రాముడే కాదు అని శపథం చేశాడు. సువ్వి తండ్రి కొటి, ఊరిలోని మాదిగ పెద్దలు, చందిరి అందరూ శతవిధాలుగా నాంచారయ్యకు క్షమాపణ చెప్పి మొత్తు కున్నారు. అది చిన్న పిల్ల ఏదో కోపంలో రాముడు తిట్టాడు, కొట్టాడు అని అలా చేసింది నీ బిడ్డకు చెప్పండి క్షమించ మని చేసిన శపథం మానుకోమని నాంచారయ్యను ప్రాధేయపడ్డారు అయినా ప్రయోజనం లేదు. నాంచా రయ్య ఏమాత్రం జాలి, దయ ఆడబిడ్డ అనే కరుణ లేకుండా నా బిడ్డ పెరుస్తాడు ఇది సత్తెం అని ఊరి పెద్దలు అందరి ముందు తెలియజేశాడు.

మరుసటి రోజు నుంచి సువ్వి చదువుకు వెళ్ళడానికి రైలు బండి దగ్గరకు రావడమే మానేసింది. సువ్వి అమ్మా నాన్న రాముడికి భయపడి పెళ్లి కుదిర్చారు చందిరితో ఒకరోజు రాముడు సమయం చూసి సువ్విని ఎత్తుకెళ్ళి వళ్ళంతాహునం చేశాడు. కొట్టాడు రక్కాడు, రక్తం కళ్ళ చూశాడు, కానీ చెరచలేదు. ఊరంతా తెలిసిపోయింది రాముడు సువ్విని చెరిచాడని, నాంచారయ్య తన బిడ్డ రాముడిని తప్పు చేశావు అని అనలేదు. ఊరి పెద్దలందరూ మొరపెట్టుకున్నా రాముడిది తప్పు అనలేదు సమర్థించాడు. మాదిగ పెద్దలు పంచాయితీ పెట్టించాలని తీర్మానించి మునసబు, ప్రెసిడెంటు, కరణం గ్రామంలో న్యాయం చెప్పేవారు, దండన నిర్ణయించారు నష్టపరి హారం చెల్లించాలి అని పెద్దల తీర్మానం నాంచారయ్యకు డబ్బులు చెల్లించడం కష్టం కాదు సులభం అనిపించింది. అంగీకరించాడు, నష్టపరిహారం డబ్బులు తప్పు చేసిన రాముడే సువ్వి చేతికి అందించాలని అనుకున్నారు, రాముడు ఊరి పెద్దలతో సువ్వి ఇంటికి వచ్చాడు సువ్విని చూడగానే రాముడి కళ్ళు ఉబకసాగింది. సువ్వి చేతులు పట్టుకుని డబ్బు ఇవ్వబోయాడు. వద్దు అంది డబ్బులు గాలికి ఎగిరి రాముడి ముఖాన పడింది. ఊహించని పరిణామం. కొట్టడానికి చేయి ఎత్తాడు రాముడు చందిరి మళ్ళీ చేయి పట్టి ఆపాడు సువ్వి ఒంటిపై చేయి పడనీయలేదు. రాముడితరం కాదు చందిరి చేతిలో నుంచి చేయి విడిపించుకోవటం చందిరంతట చందిరే వదిలితేనే సాధ్యం. కోపంతో రాముడు మళ్ళీ సువ్విని "నువ్వు బతకవు అన్నాడు అన్నాడు. "నిన్ను చెరిసి పీక పిసికి చంపి రైలు కింద పెట్టకపోతే విను, నేను రాముణ్ణే కాదు" అన్నాడు, వణికిపోయింది సువ్వి బైరాగి గట్టిగా అరిచాడు సువ్వి సావదు అని రాముడు మాత్రం సువ్విని చంపాలనే ప్రయత్నంలో చాలా తీవ్రమైన కృషే చేస్తు న్నాడు, అందరూ ఆదమరచినప్పుడు సువ్వి ఇంటికి వెళ్లి అఘాయిత్యం చేయడం, మళ్లీ మళ్లీ ప్రయత్నించడం ప్రయత్నం విఫలం కావడం ఓర్చుకోలేక ఒక నర్సుని కలిసి మత్తుమందు ఇంజక్షన్ తెచ్చుకున్నాడు. దానిని ప్రయో గించి అనుభవించి చంపాలనుకున్నాడు కుదరలేదు, సువ్వి ఇంటికి వచ్చిన రాముడు చందిరి చేతుల్లో పట్టు బడ్డాడు. రాముడిని కట్టేసి బట్టలూడదీశాడు అవమానం భరించలేకపోయాడు. కోపజ్వాలలతో రగిలిపోయాడు. తనమీద తనకే అసహ్యం వేసింది. బట్టలు లేకుండా పోవడం పరాభవంగా భావించాడు కోపం పోయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కోపం బయటకి రావటం లేదు. గుండెను కాలుస్తూ వుంది. దయాభిక్ష అర్థించలేడు నేను సువ్విని చెరచలేదు చేరిచే శక్తి నాకు లేదు అన్నాడు. నెమ్మదిగా చందిరి వింటున్నాడు కళ్ళలో నీళ్ళు వచ్చాయి, రాముడి కాళ్లకి కట్లు విప్పినాడు బట్టలు తొడిగినాడు భుజాన రాముడిని ఎత్తుకుని రైలుకట్ట పక్కగా నడుస్తు న్నాడు నన్ను చింతచెట్టు కింద దించు అంటే దించాడు. రాము చందిరితో నా వల్ల నీకు గానీ, సువ్వికి గానీ ఇంక ఏ ప్రమాదం వుండదు నిజం! చచ్చెమనిషి అబద్ధం చెప్పడు అన్నాడు. చందిరి వంగి రాముడు గడ్డం పట్టు

కున్నాడు చందిరిని తన్ని పొమ్మన్నాడు చందిరి వెళ్లి పోయాడు. రాముడు లేచి నిలబడి నువ్వి కోసం తెచ్చుకున్న మత్తు మందు సిరంజు నిండా నింపుకుని తన శరీరానికి ఎక్కించుకున్నాడు. బ్రతకటం ఇష్టం లేదు రైలు పట్టాలపై తలపెట్టిపడుకున్నాడు. రైలు వేజండ్లలలో ఆగింది. అంతాగోల! రద్దీ! చేబ్రోలు రైలు గేటు వద్ద జనం పోగయ్యారు...

నాంచారయ్యలో తర్కబద్ధంగా వచ్చిన మార్పుకు మొదట బీజం పడింది ఇక్కడే. రాముడి మృతదేహం రెండు ముక్కలుగా చూడగానే నోటమాట రాలేదు. ఊరిజనం గుమిగూడారు శవాన్ని చూడగానే ఆ గుంపులో ఒకడు "పోరా నా కొడకా" అన్నాడు ఆ గొంతు వినిపించింది నాంచారయ్యకు ఈ సందర్భంలో ఏవరైనా జాలిపడతారు కానీ అటువంటి మాట అన్నాడు. "ఇటువంటి చావు చావు గాదు" అన్నారెవరో! ఇలాంటి మాటలు నాంచారయ్య మనసుని కుంగదీశాయి. ఆ ఊరు నాంచారయ్య ఏడుపు బాధ చూడలేదు అలాంటిది గుండెలవిసెలా ఏడ్చాడు నాంచారయ్య. ఆ ఏడుపు చూసి తట్టుకోలేకపోయారు గ్రామ ప్రజలు.

తలను మొండాల్ని కలిపికుట్టించండి అని నాంచార్య చెప్పాడు. ఎవరైతే ముట్టుకుంటే నచ్చదో వారిలో నుంచే మాదిగపల్లె నుంచే కాటికాపరి వచ్చి తల మొండాన్ని కలిపాడు. మునుపటి రాముడిలా వుండటాన్ని చూసి నాంచారయ్య ఆనందించి, ఆనందంగా ఏడ్చాడు. రాముడి శరీరాన్ని ఇంటి వద్దకు చేర్చడానికి మాదిగలే నలుగురు వచ్చారు తన బిడ్డను పట్టుకుని ఎత్తుకుని తీసుకునిపోతుంటే మాదిగ పెద్దలు బలంలాగా కనిపించారు. ఇంటికి శవాన్ని చేర్చారు ఊరందరూ వచ్చి రాముడి శవాన్ని చూసి నిండునూరెళ్ళు బ్రతకవలసినవాడు అర్ధాంతరంగా చనిపోయాడని ఏడవ సాగారు.

నాంచారయ్యలో మార్పుకు కారణమైన మరోక అంశం సువ్వి రాముడిని చూడటానికి రావటంతో నాంచరయ్య కఠినమైన గుండె కరిగి ఇంకా బాధతో ఏడ్చాడు. చంపుతానని శపథం చేసినవాడు చచ్చిపోతే ఆనందించక పోగా దు:ఖిస్తున్న పీడితురాలిని బాధితురాలిని చూసి వేదన చెందాడు. కోటిని పిలిచి నువ్విని ఇంటికి తీసుకుపో! అన్నాడు. అది కోటికి అద్భుతమనిపించింది. చందిరి రాముడి శవం దగ్గరకు పోయి దండం పెట్టాడు, మాదిగవాళ్లను దగ్గరకు రావద్దు అని కసురుకునే నాంచారయ్య దగ్గరగా వచ్చి చూడనిస్తున్నాడు. కాళ్ళకు మొక్కనిస్తున్నాడు.

మార్పుకు కారణమైన మరో అంశం నాంచారయ్య భార్య స్పృహతప్పి పడిపోయింది. భార్య అవస్థ చూసి నాంచారయ్య తల నిమురుతూ వున్నాడు. కొడుకు ముఖంలోకి చూసి భర్త ముఖంలోకి తెరిపారజూచి "తీరిందా మీరంధి?" అంది. నాంచారయ్య బళ్ళున ఏడ్చాడు. ఊరి మాదిగ పెద్దలు, కరణం, మునసబు, ప్రెసిడెంటు మొదలైన వాళ్ళ ఓదార్పు నాంచారయ్య భరించలేకపోయాడు. పెద్దగా ఏడ్చాడు, నాకర్మ అని అనుకున్నాడు.నాకు తలకొరివి పెట్టవలసిన కొడుక్కి నేను తలకొరివి పెట్టవలసివచ్చింది అని ఏడ్చాడు, ఎన్నడూ పలకరించని గ్రామస్థులు, ఏమి పట్టనట్లుండే తటస్థుల్ని విరోధుల్ని కూడా నన్నిహితుల్ని చేసిన ఈ సందర్భం ఆశ్చర్యంగా అనిపించినా నాంచారయ్య బైట పడలేదు. మీ చేతుల్లోనే కదా వాడి చివరి ప్రయాణం అన్నాడు నాంచారయ్య.

మనసును కదల్చిన మరో సందర్భం. పాడే ఎత్తె సమయం అయింది. అందరూ ఆడవాళ్ళే! పనికిరారు మగవాళ్ళు జీతగాళ్ళు కూలివాళ్ళు! వీళ్ళ వల్ల కాదు. బంధువులు ఆస్తిపాస్తులకు వారసులు అయిన వాళ్ళు అక్కడ ఎక్కడా పత్తాలేరు కనీసం పది ఇళ్లకైనా కబురు చేశాడు వస్తాపద అన్నారు గానీ ఒక్కరు కూడా రాలేదు. అప్పులు తీసుకున్నవాళ్ళు, బంధువులు, అయినవాళ్ళు ఎవరూ రాలేదు. ఇది సహజ మరణం కాదు కదా అని వారి భయం. మనిషి కూలబడ్డాడు. నెత్తిన చేయిపెట్టుకుని బోరున ఏడ్చాడు, ఆపదలో బంధు గణం ముఖం

చాటుచేసుకున్నారు అని బాధ. నాంచారయ్య జీతగాళ్ళు నలుగురు వున్నారు ముందుకొచ్చి "సిన దొరను మేం ఎత్తుకొని పెంచెం, కాటికి మోయటం మాకు కష్టం కాదు అన్నారు" జీతగాళ్ళ చేతులు పట్టుకున్నాడు.ఎప్పుడు తాకని మనిషి తాకితే తల్లడిల్లిపోయారు, నాంచారయ్య నిప్పుల కుంపటి తీసుకున్నాడు. శవయాత్ర మొదలైంది. ఎనిమిది మంది జీతగాళ్ళు భుజాలు మార్చుకుంటూ పాడే మోస్తున్నారు.

బంధువులు, అప్పలు తీసుకున్నవారు శవయాత్రలో తోడు రాలేదు. కష్టాల్లో మనిషి తోడు లేకపోవడం కన్నా బాదాకర సందర్భం ఏముంటుంది? ఆలోచించి గుండెలు పగిలాయి, చివరికి రాముడి శవానికి అగ్నితోడై నాలుకలు కోస్తుంది.

నాంచారయ్యలోని మార్పు స్పష్టంగా భయటపెట్టిన అంశాలు కొన్ని అవి కొడుకు చనిపోయిన నాటి నుండి 10 రోజులు అయింది బయటకి రాలేదు నాంచారయ్య జీతగాళ్లకి చెప్పి పనులు అన్ని చేయిస్తున్నాడు. మాదిగ జీతగాళ్లని పిలిచి మాదిగ పెద్దల్ని పిలిపించాడు. ఇంట్లోకి ఎప్పుడూ రానివ్వడు అటువంటిది రానిచ్చాడు. మాదిగ పెద్దలతో తన మాటగా ఊరందరిని వచ్చి భోజనాలు చేసి పొమ్మన్నాడు. నీళ్ళు తెచ్చుకోవలసిన అవసంర లేదు ఆకులు తీయవలసిన పనిలేదు అని ప్రత్యేకించి చెప్పాడు. ఆ పని చేయడానికి పనివాళ్ళు వున్నారు అని స్పష్టంగా తెలియజేశాడు. ప్రత్యేకించి కోటి గాడి కుటుంబాన్ని సువ్వి, చందరిని పిలవమన్నాడు.

ఒక్కగానొక్క కొడుకు సావడంతో నాంచారయ్యలో పెద్ద మార్పు ఊహించని మార్పు వచ్చింది. అందరూ వచ్చి భోజనాలు చేసి వెళ్ళారు సువ్వి, చందిరి మొ॥ వాళ్ళకు ప్రత్యేకంగా పెంకుటింటిలో వంట గదిలో భోజనాలు ఏర్పాటు చేయించాడు. దగ్గరుండి వడ్డన చేయించాడు. నాంచారయ్య బంధువులు మాత్రం భోజనాలకు రాలేదు. పల్లెలో అందరికి ఇది పెద్ద ఆశ్చర్యంగా వుంది పిల్లికి బిచ్చం పెట్టని నాంచారయ్య పనులు అన్ని అయిపోయాక జీతగాళ్ళకు రెండేసి జతల బట్టలు పెట్టాడు. కుట్టించుకోవడానికి డబ్బులు ఇచ్చాడు ఆ డబ్బులతో పాతిక జతల బట్టలు కుట్టించుకోవచ్చు. అంతలా మార్పు కనిపించింది.

ఈ సందర్భంలో భార్య లచ్చిందేవి గుండె కరిగి పోయింది. మంచం దగ్గర కుర్చుని భార్య తల నిమురుతూ చాలా పొరబాటు చేశాను తప్పంతా నాదే! కొడుకును చేజేతులారా పోగొట్టుకున్నాను నాది తప్పే అన్నాడు భార్య బోరున ఏడ్చి పాతికేళ్ళనాటి పదహారేళ్ళ పిల్లగా మారిపోయింది. పాయ్యి దగ్గరకు పోయి జేతగాళ్ళ చేతికూడు కాక తనే వంటచేసి వడ్డించింది నాంచారయ్యకు ఆరోజు నుంచి జీతగాళ్ల చేతి కూడు తినే అవసరం రాలేదు.

ఎవరూ ఊహించని అనుకోని పరిణామం నవలకు మలుపు ఈ అంశం. ఊర్లోకి వస్తానని జీతగాడితో కబురు చేశాడు నాంచారయ్య. ఎవరూ వచ్చి నన్ను తీసుకోపోవద్దు నే వస్తానని కబురు చేయటం వింత. ఈ వింతకు కారణం రాముడు చనిపోయాక కొన్ని సంఘటనలు, ఆస్తి పెరిగాక ఎవరికి ఇవ్వాలి? శవయాత్రలో లేని చావు కూటికి రాని బంధు బలగానికి తన కష్టార్జితం ఎందుకు చెందాలి? అని అనిపించింది. తను చనిపోతే నలుగురు వుంటారు? ఆస్తి పంచుకోవటానికి వుంటారు పాడే మోయడానికి వుండరు. రాముడి మరణం పెద్ద ఆలోచన తెచ్చింది.

నాంచారయ్య ప్రయత్నం అంతా నలుగురితో బాగుం దామన్న ఆరాటమే ఇంతకాలం సంపాదన 'రంధి'లో సంసారం దూరం చేసుకొన్న దౌష్ట్యం తన నెత్తిన మొట్టి కాయ కొట్టినట్లు ఉలిక్కి పడ్డాడు. పల్లెలోని నాంచారయ్యను ఆహ్వానించటానికి మాదిగ పెద్దలని రావద్దన్నా ఆనవాయితీ ప్రకారం వచ్చారు. సిద్ధంగా ఉన్న నాంచారయ్య వాళ్ళతోపాటు ఊరినుంచి పల్లెలోకి ప్రయాణం చేయలేదు. వచ్చిన మాదిగ పెద్దల యోగక్షేమాలు అడిగాడు. గ్లాసుల్లో మజ్జిగ ఇప్పించాడు. కడగబోతే జీతగాడు తీసుకుని శుభ్రం చేసి వంటగదిలో గ్లాసుల్లో

పెట్టాడు. మిగతా గ్లాసుల్లో కలిసిపోవడం మాదిగలకు అనూహ్య గౌరవం కలిగినట్లు తృప్తిగా ఉంది. కోటయ్య ఇంటికి పోదాం అన్నాడు, నాంచారయ్య కోటిగాడు అననందుకు మాదిగ పెద్దలు ఉబ్బితబ్బిబయ్యారు. కోటి కుటుంబం నాంచారయ్యను చూసి భయంతో వణికి చచ్చారు. ఏం కోటయ్య మంచం వేయవా అన్నాడు అదరాబదరా మంచం వేసి దుప్పటి పరిచాడు కోటి, నాంచారయ్య కుర్చున్నాడు ఊరిజనం అందరికి ఆశ్చర్యం, కళ్లుతాటికాయల్లా చేసి చూస్తున్నారు ఈవింతని.

ఈరోజు ఆదివారం స్కూలుకు సెలవు, సువ్వి ఇంట్లోనే వుంది. సువ్విని పిలిచి విచారించాడు, రాముడు సెరిచాడా అన్నాడు సువ్విలేదు ప్రయత్నం చేశాడు కుదరలేదని కొట్టిరక్కి నారక్తం కళ్ళచూశాడు. మరి రాముడు చేసిన తప్పుకు జరిమానా కట్టాలని తీర్మా నించారు కదా ఆ డబ్బు నా దగ్గర ఉంటే భారంగా వుంది తీసుకో అన్నాడు. వెనక్కుపోయింది, సువ్వి తండ్రి, భర్తకు చెప్పాడు మీరైనా తీసుకోమనండి అని, అటునుంచి చందిరి ఇటునుంచి కోటయ్య వచ్చి రెండు చేతులు జతచేసి దోసిలి పట్టారు. డబ్బు పెట్టగానే దోసిలి మూసేశారు. మళ్లీ గాలికి డబ్బు ఎగురుతుందేమో అని వారి భయం, నాంచారయ్య సువ్వితో నీ ప్రేమ వల్ల రాముడు పట్టరాని బాటపట్టాడు. నువ్వు మాదిగ పిల్లవు కాకుంటే నేను మీ ఇద్దరికి వివాహం చేసేవాడిని అన్నాడు, ఈ రోజు నుంచి నువ్వు నా కోడలివి. నీకు భర్త అయిన వాడు నా కొడుకే అని అన్నాడు. అందరి కళ్ళు చెమ్మ గిల్లాయి గతం, ప్రస్తుతం గుర్తుకు వచ్చి వలవల ఏడ్చాడు నాంచారయ్య, సువ్వి చందిరి సంతానంని నేను పెంచు కుంటాను దత్తతతీసుకుంటా, నా యావదాస్తికి వారసుణ్ణి చేస్తా! అని సువ్వికి ధైర్యం చెప్పి కన్నీరు తుడుచుకున్నాడు నాంచారయ్య.

చందిరిని పిలిచి ఒక కోరిక కోరాడు నాకు తల కొరివి నువ్వే పెట్టాలిరా అని చందరి ఏడ్చాడు. చివరగా నాంచా రయ్య "నాకాష్టానికి తలకొరివికి నాకుమారుడు చందిరే వారసుడు" నాకు వయస్సుంది. నా భార్యకు వయస్సుంది మాకు పిల్లలు కలిగితే వాళ్ళ అన్న చందిరి ఆ కలగబోయే పిల్లలకు నా పిత్రార్జితమైన ఆస్తి చెందుతుంది. ఇది స్పష్టం నిస్సందేహంగా వీలునామా రాసి ఉంచా అని నాంచా రయ్య నవ్వాడు.

ఊరిజనం అందరూ నోర్లు యల్లబెట్టి చూస్తున్నారు మాదిగ మనుషుల్ని ముట్టని నాంచారయ్యకు గ్లాసులో నీళ్లు సువ్వి ఇచ్చింది, ముంతలో మజ్జిగ చందిరి ఇచ్చాడు రెండు తాగి గ్లాసు చేతికిచ్చాడు. ఇద్దరు కాళ్ళు మొక్కారు, కళ్లలో నీళ్లు వాళ్లతలలపై పడ్డాయి. ఇద్దరు భుజాలు పట్టిలేపి దగ్గరచేర్చుకున్నాడు.

ఇంటికి వెనుదిరిగాడు నాంచారయ్య, వెంట వస్తున్న మాదిగ పెద్దల్ని ఆగండి ఎవరూ రావద్దు నేను వెళతాను అన్నాడు. మాదిగ పల్లెలో ఆ రాత్రి అద్భుతమైన రాత్రి నాంచారయ్య ప్రేమను పల్లె పొందిన మొదటి రాత్రి.

నేను ఈ శీర్షిక పెట్టడానికి కారణం నాంచారయ్య తీర్పు అంటే బిడ్డను పెంచిన విధానం, ఆ పల్లెలో నాంచారయ్య మాటకు, తీర్పుకు ఎవరూ ఎదురు చెప్పరు, చివరగా ఆస్తిని సువ్వి బిడ్డలకు రాసి ఇస్తున్నట్లు చెప్పిన తీర్పు, నాంచారయ్య మార్పుకు కారణాలు మీ ముందు పెట్టడం నా ఉద్దేశం. అందుకే ఈ శీర్షిక.

ఇలా నాంచారయ్యలో తర్కబద్ధంగా వచ్చిన మార్పును వివరించాను.

తలను మొండాల్ని కలిపి కుట్టించండి అని నాంచా రయ్య చెప్పాడు ఎవరైతే ముట్టుకుంటే నచ్చదో వారిలో నుంచే మాదిగపల్లె నుంచే కాటికాపరి వచ్చి తల మొండాన్ని కలిపాడు. మునుపటి రాముడిలా వంఉ డటాన్ని చూసి నాంచారయ్య ఆనందించి, ఆనందంగా ఏడ్చాడు. రాముడి శరీరాన్ని ఇంటి వద్దకు చేర్చడానికి మాదిగలే నలుగురు వచ్చారు. తన బిడ్డను పట్టుకుని ఎత్తుకుని తీసుకునిపోతుంటే మాదిగ పెద్దలు బలంలాగా కనిపించారు. ఇంటికి శవాన్ని చేర్చారు ఊరందరూ వచ్చి

నిండు నూరెళ్ళు బ్రతకవలసిన వాడు అర్ధాతరంగా చనిపోయాడని ఏడవసాగారు. నాంచారయ్యలో మార్పుకు కారణమైన మరోక అంశం. సువ్వి రాముడిని చూడటానికి రావటంతో నాంచారయ్య గుండె ఇంకా బాధతో ఏడ్చాడు. చంపుతా నని శవథం చేసినవాడు చచ్చిపోతే ఆనందించకపోగా దు:ఖిన్తున్న వీడితురాలిని బాధితురాలిని చూచి వేదన చెందాడు. కోటిని పిలిచి సువ్విని ఇంటికి తీసుకుపో! అన్నాడు. అది కోటికి అద్భుత మనిపించింది. చందిరి రాముడి శివం దగ్గరకు పోయి దండంపెట్టాడు, మాదిగ వాళ్లను దగ్గరకు రావద్దు అని కసురుకునే నాంచారయ్య దగ్గరగా వచ్చి చూడనిస్తున్నాడు. కాళ్ళకు మొక్కనిస్తు న్నాడు.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ జానపద కళలు అస్థిత్వపు మూలాలు - మనుగడ

- డా॥. గడ్డం వెంకన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్, జానపద కళల శాఖ, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలంగాణా సంస్కృతిలో జానపద కళలు అంతర్భాగం. విభిన్న ప్రక్రియలతో అనాదిగా తమకు సంక్రమించిన సాహిత్యం, ప్రదర్శనా నైపుణ్యంతో సమాజంలో మనుగడ సాగిస్తున్నవి. వైవిద్యమైన ఈ మట్టి కళలు తెలంగాణ సంస్కృతిక వైభవానికి, చరిత్రకు ప్రతీకగా నిలుస్తున్నవి. జానపద కళలు ఆశ్రిత, ఆశ్రితేతర కళారూపాలుగా విభజింపబడ్డాయి. నేటి ఆధునిక కాలంలో కూడా తమ మూల సంస్కృతిని పరిరక్షించుకుంటూ మార్పులకను గుణంగా తమ అస్తిత్వాన్ని, ఉనికిని కాపాడుకుంటు న్నాయి. ఆశ్రిత కళారూపాలు కేవలం ఒక ప్రత్యేక కులాన్ని మాత్రమే ఆశ్రయించి, కళా ప్రదర్శనల ద్వారా ప్రతిఫలం పొందడం ఆచారంగా వస్తుంది. కులపురాణాన్ని గాని, గోత్రాలను గాని లేదా ఇంద్రజాల విద్యల్ని గాని ప్రదర్శిస్తూ వంశపారంపర్యంగా సంక్రమించిన హక్కులు కలిగి ఉండటం ఆశ్రిత కులాల ప్రత్యేకత.ఆశ్రితేతర కళారూపాలు ఏ ఒక ప్రత్యేక కులాన్ని ఆశ్రయించకుండా అన్ని కులాలను ఆశ్రయించి కళా ప్రదర్శనల ద్వారా జీవన భృతిని పొందుతాయి.

తెలంగాణ గడ్డ మీద ఆశ్రిత, ఆశ్రితేతర కళల్లో ఆశ్రిత కళలే ఎక్కువగా మనుగడ సాగింస్తుండడం విశేషం. ఇంద్రజాలం, కథాగానం, నాటకం మొదలైన ప్రక్రియల్లో కూడా తెలంగాణా ప్రాంత కళారూపాలదే పై చేయిగా చెప్పవచ్చు. ఆశ్రిత కళారూపాలను పోషించే ఆ యా పోషక కులాలకు ఒక్కటికి మించి ఎక్కువ ఆశ్రిత కళారూపాలు ఉండటాన్ని పరిశీలిస్తే ఈ ప్రాంతంలోని కులాలు ఆయా కళారూపాలకు ఎంతటి ప్రాధాన్యమిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇందుకు ఉదాహరణగా చూస్తే మాదిగ కులానికి డక్కలి, చిందు, బైండ్ల, నులకచందయ్యలు, మాష్టి, ఆసాది మొదలైన కళారూపాలు నాటకం, కథా గానం, ఇంద్రజాలం వంటి ప్రక్రియలతో ప్రదర్శనలిస్తూ తమ సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నవి.

మాల కులానికి గుర్రపు, మాష్టి, పంబాల, మిత్తిలి మొదలైన కళారూపాలు ఆశ్రిత కళారూపాలుగా నియ మింపబడి తరతరాలుగా మాల కులస్థుల సాంస్కృతిక ధారను పరిరక్షిస్తున్నాయి.మాదిగ, మాల ఈ రెండు కులాలు మాత్రమే ఎక్కువగా కళారూపాలను పోషించే సామాజిక, ఆర్థికస్థితిని కలిగి ఉన్నాయి. దీంతో వారికి ఆ యా కళారూపాల పట్ల ఉన్న గౌరవం, ఆదరణ ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. అంతే కాకుండా ఆ యా కళాకారుల ఆవిర్భావ చరిత్రను పరిశీలిస్తే తాము కూడా పోషక కులంలోనే పుట్టి కొన్ని అనివార్య కారణాల చేత వేరుబడి అదే కులానికి ఆశ్రితులుగా నియమించబడినట్లు వారి కుల పురాణాల ద్వారా అవగతమవుతుంది. పోషక కులాలకు, ఆశ్రిత కులాలకు మధ్య ప్రదర్శనకు చెందిన కట్టడి లేదా మిరాశి హక్కులు మాత్రమే కలిగి ఉంటాయి. అయినప్పటికి వీరిరువురి మధ్య కంచం పొత్తు ఉం టుంది. కాని వియ్యం పొత్తు మాత్రం ఉండదు. ఇప్పటికీ ఈ సంస్కృతిని పాటిస్తున్నందునే ఆశ్రిత కళలు మనుగడ సాగిస్తున్నవని అర్థం చేసుకోవచ్చు. ఇక బి.సి కులాలకు కూడా ఆశ్రిత కళారూపాల వ్యవస్థ ఉన్నది. ఇందులో యాదవులకు మందహెచ్చులు, గొల్ల భాగవతులు, ఒగ్గు, కొమ్ము, గోత్రాల, గొల్లసుద్దులు, బైకాని, పాడపాత్రపు, తెరచీరలు మొదలైన కళారూపాలు తమ ప్రదర్శనా కళలతో పోషక కుల వైభవాన్ని, సంస్కృతిని చాటి చెపుతూ నేటికీ సమాజంలో గౌరవప్రదంగా ప్రజ్వరిల్లుతున్నాయి. మిగతా బిసి కులాలతో పోలిస్తే ఎక్కువ ఆశ్రిత కళారూపాలను పోషించే కులం యాదవులే కావడం విశేషం. అయితే యాదవులకు ఆశ్రితులైన కొమ్ము

కళాకారులు రిజర్వేషన్ పరంగా ఎస్.సి జాబితాలో ఉన్న ప్పటికి వంశపారంపర్యంగా సంక్రమించిన కట్టడిని అటు కళాకారులు ఇటు యాదవులు విస్మరించకుండా కొన సాగిస్తున్నారంటే ఇప్పటికీ కులాలు మధ్య ఉన్న సఖ్యత, సయోద్య, అవగాహనలే కారణం.

మిగతా బిసి కులాలైన పద్మశాలి, నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, కాపు, ముదిరాజ్, గౌడ, మేదరి, రజకులు, ఆరె, గొల్ల కుర్మ మొదలైన వారికి కూడా ఆశ్రిత కళారూపాల వ్యవస్థ నిర్మితమై ఉన్నది. ఈ కులాలు ఒకటి లేదా రెండు ఆశ్రిత కళారూపాలు కలిగి తమదైన శైలిలో కళాకారులను అక్కున జేర్చుకుంటూ పోషిస్తూ ఉన్నాయి.

తెలంగాణలోని ఆశ్రిత కళాకారుల్లో పటం ఆధారంగా కథాగానం చేసే కళారూపాలు చాలా అరుదైనవి, ప్రత్యేక మైనవి. ఇందులో కూనపులి, ఏనూటి, గౌడజెట్టి, డక్కలి, గుర్రపు, అద్దపు, కొమ్ము, తెరచీరలు, మందహెచ్చులు, మాసయ్యలు, కాకిపడిగెలు, కొర్రాజులు, పూజరి, పెక్కర్లు తదితర కళారూపాలు ఉన్నాయి. ఈ పటం కళారూపాలు నకాశి కళాకారులతో తాము ప్రదర్శించే కులపురాణ కథాంశాలను పటం మీద చిత్రించుకొని కథాగానం చేస్తాయి. అయితే ఈ పటం కథల్లో కుమ్మరి కులాన్ని ఆశ్రయించి గుండబ్రహ్మయ్య పురాణం చెప్పే పెక్కర్లు తెలంగాణాలో కనిపించకపోయినప్పటికి (ఆంధ్రలోని తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నప్పటికి) వీరి మూలాలు మాత్రం తెలంగాణాలోనే ఉన్నట్లు తెలుస్తున్నది. అంతే కాకుండా పెక్కర్ల కళాకారులకు తెలంగాణాలోనే ఎక్కువగా హక్కు గ్రామాలుండటం కూడా ఈ వాదనకు బలం చేకూరుతుంది. ఇప్పటికి వీరు ప్రదర్శన నిమిత్తం ఈ ప్రాంతంలో సంచరిస్తూ కుమ్మరి కులాన్ని ఆశ్రయిస్తూ పురాణం చెపుతున్నట్లు పలు ఆధారాలున్నాయి.

పటం కథ కళారూపాలు మనుగడ కోసం తమ ప్రదర్శనా రీతిలో పలు మార్పులు చేసుకుంటూ వస్తు న్నాయి. మొదటగా ఈ కళారూపాల్లో కొందరు కళాకారులు పురాణ కాలక్షేపం మాదిరిగా ప్రదర్శనలు ఇచ్చేవారు. తర్వాత కాలంలో ప్రేక్షకున్ని ఆకర్శించటం కోసం పటాన్ని ఆధారం చేసుకొని పటంపై ఉన్న బొమ్మలను చూపూతూ ప్రదర్శనలివ్వడం చేస్తున్నారు. ప్రస్తుతం పటాన్ని ఆధారం చేసుకొని పురాణం చెబుతున్నప్పటికీ ప్రేక్షకులు ప్రదర్శన పట్ల మరింతగా ఆకర్శితులు కాకపోవడంతో పటం ముందు కథాగమనానికి వీలుగా వేషాలు దర్శిస్తూ ప్రదర్శనను రక్తి కట్టిస్తున్నారు. ఈ రకంగా పటం కథలు పరిణామం చెందినా తమ మూల సంస్కృతిని నిలుపు కుంటూ పోషక కులాల మౌఖిక సాహిత్యాన్ని పరిరక్షిస్తూ వస్తున్నాయి. ఆశ్రిత కళారూపాల్లో ఒకటైన మందహెచ్చులు యాదవులను ఆశ్రయించి కాటమరాజు కథను ఒకరు పటం కథారూపంలో, మరి కొందరు బొమ్మల రూపంలో చూపుతూ ఇంకొందరు కథాగాన ప్రక్రియ రూపంలో కాటమరాజు కథను ప్రదర్శిస్తున్నారు. కథాంశం ఒకటే అయినప్పటికి విభిన్న ప్రక్రియల ద్వారా కళాకారులు ప్రదర్శనలు ఇవ్వడం అనేది తెలంగాణా జానపద కళల ఔచిత్యంగా పేర్కొనవచ్చు.

పటం కథల్లో కూనపులి, ఏనూటి, అద్దపు, మాసయ్యలు మొదలైన కళారూపాలు పోషక కులాల ఆదరణ తగ్గి నేడు అవసాన దశలో ఉన్నాయి. కూనపులి కళాకారుడు తెలంగాణా వ్యాప్తంగా ఒక్కడే మిగిలి ఉం డటం దురదృష్టకరం. అలాగే పటం కళాకారుల్లో మాసయ్యలు, అద్దపు, తెర చీరలు, గౌడజెట్టీ, కాకిపడిగెల వారిని ప్రభుత్వాలు గుర్తించలేదు. కాని ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆయా ఆయా కళాకారులను ప్రత్యేకంగా గుర్తించి ఉత్తర్వులు తీసుకరావడం గొప్ప విషయం. గతంలో వీరు తమను పోషించే కులం పేరు మీదనే కులం సర్టిఫికెట్ పొందుతూ జీవిస్తున్నారు. ఉదాహరణకు మాసయ్యలు రజకుల కులంగా గుర్తింప బడి కులదృవీకరణ పత్రాలు స్వీకరిస్తున్నారు. ప్రత్యేక తెలంగాణా ఏర్పడ్డ తర్వాత చాలా మంది కళాకారులను వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చి ప్రోత్సాహించడం అభినందనీయం.

ఇంద్రజాల విద్యలు ప్రదర్శించే ఆశ్రితకళారూపాలు కూడా తెలంగాణ జానపదకళల్లో ప్రత్యేకమైనవే. ఇందులో పద్మశాలి కులాన్ని సాధనాశూరులు, మాదిగ కులాన్ని మాష్టి, గొల్ల కుర్మలను, బీరన్నలు, బ్రాహ్మణులను విప్రవినోదులు ఆశ్రయించి పలు రకాలు ఇంద్రజాల విద్యలు ప్రదర్శిస్తారు. నేటి ఆధునిక సమాజంలో కూడా వీరు తమ కళను పోషించుకుంటూ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు, ఆనందోత్సవాలకు గురిచేయడం గొప్ప విషయం. ఇందులో బ్రాహ్మణులను ఆశ్రయించి విద్యలను ప్రదర్శించే విప్రవినోదులు కాలగర్భంలో కలిసి పోయారు. మిగతా కళారూపాలు కూడా పోషక కులాల దగ్గర ఆదరణ లేక అంతరించిపోయే దశలోనే ఉన్నవి. ఆయా కళారూపాల ప్రదర్శనా నైపుణ్యాన్ని గుర్తించి ఆయా కళాకారులకు బహుళప్రాచుర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత సమాజం మీద ఉంది. తద్వారా వారి సంస్కృతి పరిరక్షణతో పాటు ఆ కళారూపం సమాజంలో నిలువ డానికి ఆస్కారం ఉంది.

ఆశ్రిత కళారూపాల్లో ఒకప్పుడు గొప్పగా వెలుగొంది పోషక కులం ఆదరణ పొంది కనుమరుగైన కళల్లో పనస, బండారి భక్తులు, ఆదికొడుకులు, నులకచందయ్యలు, గంజికూటి, మాష్టి మొదలైన కళలను పేర్కొనవచ్చు. నేడు ప్రాచుర్యం లేక కనీసం సమాజంలో ఏ కులం కిందికి వస్తారో కూడా తెలియని పరిస్థితి ఈ కళాకారులది.గుర్తింపు లేని సమూహంగా జీవనం సాగిస్తూ తమ మూల సంస్కృతిని ప్రతిబింబించే విధంగా తమకు వంశాను గతంగా సంక్రమించిన రాగిశాసనాలను, తాళపత్ర ప్రతులను చూపుతూ తమ ఉనికిని నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా కొన్ని కళా రూపాలకు చెందిన కళాకారులు, జనాభాపరంగా అతికొద్ది మంది ఉండటంతో పోషక కులం పేరునే తమ కులంగా చెప్పుకుంటూ పెళ్లి సంబంధాలు కుదుర్చుకుంటూ మనుగడ సాగిస్తున్నారు. ఈ రకంగా చేయడానికి కారణం వారి వారి కళా సంస్కృతి అంతరించిపోవడమే. ఆశ్రిత, పోషక కులాల మధ్య ఉన్న కంచం పొత్తు కాస్తా మంచం పొత్తుగా మారుతున్న వైనాన్ని కూడా మనం ఇక్కడ చూడవచ్చు.

ఇప్పటికీ చిందు, ఒగ్గు, కాకిపడిగెల, పంబాల, దుబ్బుల, మందహెచ్చు, బీరన్నలు మొదలైన కళలకు సంబంధించి ఆయా పోషక కులాలు ఆర్థికంగా ఉండి ఆదరణ చూపెడుతుండటంతో సంబంధిత కళారూపాలు సజీవంగా ఉన్నాయి. ఇందులో ఒగ్గు, బీరన్నలు పంబాల, దుబ్బుల కళారూపాలు అనుష్ఠాన కళారూపాలు కావడంతో మరింత ఆదరణ కనిపిస్తుంది.మిగతా కళల కంటే గొప్ప స్థితిలో విశ్వబ్రాహ్మణులను ఆశ్రయించి విశ్వకర్మ పురాణాన్ని కథాగానం చేసే రుంజ కళాకారులను తెలంగాణాలో వేళ్ళ మీద లెక్క గట్టవచ్చు. ఒకపుడు రెండు మూడు రోజులు కథాగానం చేసే కళాకారులు నేడు అర్ధగంట, గంట ప్రదర్శించే స్థాయికే పరిమితమయ్యారు. దీనికి గల కారణాలు అనేకం అయినప్పటికీ వారు ఆ స్థితికి రావడానికి గల కారణాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది. అలాగే రెడ్డి, కాపు, మేదరి, బ్రాహ్మణ, వైశ్య, కమ్మ మొదలైన కులాలకు చెందిన పిచ్చుకకుంట్ల, గోత్రాలోళ్లు, విప్రవినోదులు, వీరభద్రీయులు (వీరముష్టి) మొదలైన ఆశ్రిత కళలు కూడా అంతరించిపోయాయి. పిచ్చుకకుంట్ల వారు తెలంగాణాలో మనుగడలో లేకున్నా రాయలసీమ ప్రాంతంలో గౌరవమైన స్థితిలో ఉండి తమ కళారూపాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు.

ఇక తెలంగాణా ప్రాంతంలో మనుగడలో ఉన్న మరికొన్ని ఆశ్రితేతర జానపద కళల్లో కాటిపాపలు, చెక్కబొమ్మలాట, గంగిరెద్దులాట, తోలుబొమ్మలాట, పగటివేషాలు మొదలైనవి ఉన్నాయి. ఈ కళారూపాలకు వంశపారంపర్యంగా సంక్రమించిన కట్టడి గ్రామా లున్నాయి. ఇందులో చెక్కబొమ్మలాట, తోలుబొమ్మలాట అతిప్రాచీనమైన జానపద కళలు అయినప్పటికీ ఆయా బృందాలు తెలంగాణాలో ఒకటి లేదా రెండు బృందాలు

మాత్రమే ప్రదర్శించే స్థాయిలో ఉన్నాయంటే వాటి స్థితి ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణాలోని ఆశ్రిత కళారూపాల మనుగడను పరిశీలిస్తే రాయలసీమ, ఆంధ్రప్రాంతాల కంటే భిన్నంగా ఉంటుంది. రాయలసీమ, ఆంధ్రాలో జరిగే తిరునాళ్లు, దేవతా ఊరేగింపులు, ఉత్సవాలు మొదలైన కార్య క్రమాల్లో పాల్గొనే కళారూపాలే ఎక్కువగా కనిపిస్తాయి. ఆయా కళాకారులకు ఒక ప్రత్యేకమైన కులం అంటూ ఉండకుండా అన్ని కులాలు, వార్గాల వారి భాగ స్వామ్యంతో ఒక బృందంగా ఏర్పడి కళను ప్రదర్శిస్తూ జీవనోపాది పొందుతున్నారు. ఉదాహరణకు కోలాటం, బుట్టబొమ్మలు, కీలుగుర్రాలు, గరిడీ, సెలంబులు, పిల్లాంగట్లు, చెక్కభజన, కోలల భజన మొదలైన కళా బృందాలను చెప్పవచ్చు. అలాగే వీధినాటక కళాకారులను పరిశీలిస్తే అన్ని కులాలకు చెందన వారు బృందంగా ఏర్పడి ప్రదర్శించటం కనిపిస్తుంది. ఆయా కళారూపాలకు వంశపారంగా సంక్రమించిన హక్కు పత్రాలు, రాగి శాసనాలు, మౌఖిక సాహిత్యం కనిపించదు. కేవలం పంబ, గురవయ్యలు, కొమ్ము, ఉరుముల కళారూపాలకు మాత్రమే ఇవి కనిపిస్తాయి.

తెలంగాణాలో మనుగడలో ఉన్న జానపద కళలు ఒక నియమిత ఆచారంతో ఒక ప్రత్యేకమైన ప్రదర్శనా నైపుణ్యం కలిగి విభిన్న ప్రక్రియలతో ఈ ప్రాంతం అస్థిత్వపు మూలాలకు సాంస్కృతిక వైభవానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. వీటిలో కొన్ని అంతరించిపోగా,మరి కొన్ని అంతరించి పోయే దశకు చేరుకున్నాయి. సంస్కృతికి ఆనవాళ్లుగా చెప్పుకునే రాగిశాసనాలు, తాళపత్రప్రతులు, పటాలను కొందరు కళాకారులు విధిలేని పరిస్థితిలో అమ్ముకుంటూ జీవితాలను గడుపుతున్నారు. ఒక కళారూపం అంతరించిపోవడంతో, ఆ సమూహం తమ సామజిక అస్థిత్వాన్ని కోల్పోయి సమాజంలో గుర్తింపు లేకుండా పోతున్నది. కళలు అంతరించటంతో వారి మౌఖిక సాహిత్యం కూడా కాలగర్భంలో కలిసి పోతున్నది. ప్రస్తుతం తెలంగాణా జానపద కళలు ఎక్కువగా వృద్ధుల చేతుల్లోనే కొనసాగుతున్నవి. ఇందులో కేవలం అనుష్టాన కళారూపాలు తప్ప, మిగతా కళలన్నీ అదే రీతిలో ఉన్నవి. దీన్ని క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి ఆయా కళారూపాలకు జవజీవాలు కల్పించవలసిన ఆవశ్యకత ఉంది.

తెలంగాణా ప్రాంతానికే పరిమితమై అనాదిగా జాన పద సమూహాన్ని అలరిస్తూ, ఆనందపరుస్తూ, విజ్ఞానాన్ని పంచుతూ వస్తున్న జానపద కళలు ఈ గడ్డ మీద మరి కొన్ని కాలాలపాటు మనుగడ సాధించాలంటే వారికి సమాజంలో గౌరవమైన స్థానాన్ని కల్పించి వారికి పూర్వ వైభవాన్ని అందించాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఈ కళల్ని జీవించాటానికి అవకాశం ఏర్పడుతుంది. ఆ దిశగా జానపద కళలు మనుగడ సాధించాలంటే కోసం వారి కళానైపుణ్యాన్ని గుర్తించి బహుళ ప్రాచుర్యం కల్పించటం, అంటేగాక వారి సామాజిక ఆర్థిక స్థితిగతుల్ని మెరుగు పరచడం ద్వారా ఆయా కళారూపాల్ని, కళాకారుల కళా మయ జీవితాన్ని విభిన్న కోణాల్లో అధ్యయనం చేయడా నికి అవకాశం కలుగుతుంది. తద్వారా భవిష్యత్‌కు మార్గ దర్శకత్వం ఏర్పడుతుంది. ఈ దశలో ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, పోషక కులాలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు నిలుస్తాయని ఆశిద్దాం.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సుంకోజి దేవేంద్రాచారి కథలు - మానవీయ ధోరణులు

- డా॥. ఎం. హరికృష్ణ , ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వ విద్యాలయం, కుప్పం.

కథ అంటే ఏమిటి? కథలెలా రాయాలి? కథలో కథనం ఎలా వుండాలి? ఇది ప్రతి కొత్త రచయిత మదిలో మెదిలే సందేహం. కథ అంటే జీవితం. జీవితానికి సంక్షిప్త రూపమే కథ. మన జీవితంలో రోజువారీగా ఎదురయ్యే అంశాలను తడిమేదే కథ. కథ శూన్యంలోనుంచీ ఉద్భవించదు. మన, మన చుట్టూ వున్న వారి నిత్య జీవన పోరాటమే కథగా మారుతుంది. అందులో విషాదం వుండవచ్చు. ఆశ్చర్యం వుండవచ్చు. ఆనందం వుండవచ్చు. హాస్యం కూడా వుండవచ్చు. అది ఏదైనా సరే అదే కథ. ఇవి సంక్షిప్త రూపంలో చదవడానికి అనుకూలంగా వుంటాయి కాబట్టే ఇతర సాహితీ ప్రక్రియలకన్నా కథకే ఆదరణ ఎక్కువ.

"కథారచన అనేది అగ్గిపుల్లతో మేడకట్టడం లాంటిది. ఒక దశ వచ్చేసరికి ఒక్కపుల్ల ఎక్కువ అయినా మొత్తం కూలిపోతుంది.అందువల్లే సృజనాత్మక వచన సాహిత్య ప్రక్రియలు అన్నింటిలో కథారచన సంక్లిష్టమైనది."

"వృత్తాంతాలూ, పత్రికా కథనాలు, అదాటున రోడ్డు మీదో, పక్కింట్లోనో జరిగే ఘటనలు - వాటికవి కథా వస్తువులు కాలేవు. వాటి కేంద్రాన్ని, పరిధిని మనం ఆలోచించి పట్టుకోవాలి. మనిషి సొంత బతుక్కి, నలుగురితో కలిసి సాగే సాంఘికమైన బతుక్కి మధ్యన వున్న సంబంధాన్ని అర్థం చేసుకోగలగాలి. ఆ అవగాహన నుంచి కథను కూర్చుకోవాలి. కథ అంటే ఫోటో తీయడం కాదు."

"పారిశ్రామిక నాగరికత ప్రపంచ సంస్కృతికి ఇచ్చిన మహత్తరమైన కానుక కథ."

కథ ఐస్‌బర్గ్ లాంటిది. కథలో మనకు కనిపించాల్సింది కొద్దిభాగం మాత్రమే. కానీ దాన్ని మోస్తూ నీళ్లక్రింద ఒక మహాపర్వతం దాగి ఉంటుంది. అది మనకు కనిపించకూడదు. కనిపించని ఆ భాగంలో రచయిత ఆలోచనలు, అధ్యయనం, ఆ కథకోసం సేకరించుకున్న అనేక విషయాలు, అనంతమైన శ్రమ, జ్ఞానం దాగి వుంటాయి" అంటారు ఆంగ్ల కథకుడు హెమింగ్వే.

సుంకోజి దేవేంద్రాచారిని మంచి కథకుడు అనడం కంటే జీవితాన్ని గ్రంథస్తంచేసే రచయిత అని చెప్పడమే వాస్తవం అవుతుంది. దేవేంద్రాచారి కథలు నేల విడిచి సాముచెయ్యవు. అయన జీవితాన్ని, జీవితంలోని సంఘటనలను విడదీసి చూస్తే ఆయన కథలని ఆయనను ఎరిగిన ప్రతివారికీ తెలిసిన విషయమే. హెమింగ్వే అన్నట్లు సుంకోజి రచనల ఐస్‌బర్గ్ కింద పెద్ద మహా పర్వతమే వుంది. అదే ఆయన చిత్రించని, బయటకు పూర్తిగా కనబరచని ఆయన జీవితం. అందుకే ఆయన కథల్లో జీవన సంఘర్షణ, మానవీయ ధోరణులు, సామాజిక సంబంధాలలోని సంక్లిష్టత, స్పష్టంగా కనిపిస్తాయి.

దేవేంద్రాచారి రచనల్లో "అన్నంగుడ్డ" కథ విమర్శకుల ప్రశంసలను అందుకున్నది. ప్రపంచీకరణ ప్రభావం హస్తకళలను, కార్మికుల జీవితాలను, సామాజిక సంబంధాలను, అనుబంధాలను ఎలా విధ్వంసానికి గురి చేస్తోందో స్పష్టంగా చెప్పిన కథ ఇది. ఈ కథ చదివిన ప్రతిసారీ "ఒక దళారీ పశ్చాత్తాపం"లో రచయిత జాన్‌పెర్కిన్స్ పశ్చాత్తాపమే గుర్తుకు వస్తుంది. ప్రపంచబ్యాంకు రుణాల ఆశచూపి, బహుళ జాతి సంస్థలను ఆయా దేశాల్లోకి ప్రవేశపెట్టి, ఆ దేశాల్లోని ఆర్థిక వ్యవస్థను, సంస్కృతీ, సంప్రదాయాలను, మానవ సంబంధాలను అమెరికా ఏ విధంగా దెబ్బతీస్తోందో క్షుణ్ణంగా చెప్పిన ఆ పుస్తకంలోని ప్రతి అక్షరమూ సత్యమని నిరూపిస్తుంది అన్నంగుడ్డ కథ.

కథలోకి వస్తే ఆచారి, ఆయన కొడుకు సురేంద్ర

రైతులకు అవసరమైన నాగళ్లు, ఇతర వ్యవసాయ, గృహ పనిముట్లను తయారుచేసి ఇచ్చే కార్మికులు. ఇద్దరూ మంచి నైపుణ్యం కలిగిన వారు. ఇతర గ్రామస్తులతో మంచి స్నేహ సంబంధ బాంధవ్యాలను కలిగి వుండేవారు. వారికోసం రైతులు పడిగాపులు కాసేవారు. గ్రామమంతా ఆచారి పనిచేసే చెట్టుకిందకు చేరి కష్టసుఖాలను చెప్పుకుంటూ, కబుర్లాడుకుంటూ పనులు చేయించు కునేవారు. పిల్లల చదువులు, వారి భవిష్యత్తుకోసం ఒకానొక సమయంలో ఆచారి గ్రామం వదిలి టౌన్‌కు వెళ్లిపోవాలనుకున్నాడు. అయితే గ్రామస్తులు ఆయనను వెళ్లనివ్వలేదు. "నీకూ, నీ బిడ్డలకు ఏ లోటూ రాకుండా చూసుకొంటాం గదా" అని బ్రతిమలాడారు. దాంతో ఆచారి అక్కడే ఆగిపోయాడు.

కాలం మారింది. ప్రపంచీకరణ ప్రభావం గ్రామాల్లోకి కూడా ప్రవేశించింది. జీవితం వేగం పుంజుకుంది. ట్రాక్టర్లు వచ్చాయి. కోత మిషన్లు వచ్చాయి. ఆచారి పని దెబ్బ తిన్నది. పూట గడవడం కూడా కష్టంగా మారింది. గతంలో "మీ బాగోగులన్నీ మేమే చూసుకుంటాం. మీకే లోటూ రానివ్వం" అన్న ప్రజలు మొహం చాటేశారు. "ఈ పల్లెను పట్టుకుని ఎందుకు ఏలాడతావు. ఏదన్నా టౌన్ చేర కూడదా" అని సలహాలివ్వడం మొదలెట్టారు. చివరకు పక్కూరుకు చెందిన పెద్ద రెడ్డప్ప తన ఇంట్లో తుండ్లు న్నాయి చెక్కాలి రమ్మన్నాడు. ఆచారికి కాస్తంత భరోసా కలిగింది. సంసారం కొంతకాలం వెతుక్కోకుండా గడుపు కోవచ్చన్న ఆశ కలిగింది. తన కొడుకు సురేంద్రతో కలిసి భార్య అన్నంగుడ్డలో మూటగట్టిచ్చిన అన్నాన్ని తీసుకుని బయల్దేరాడు.

"అన్నం తింటున్నా, భార్య చేస్తున్న పనిని తదేకంగా చూస్తూనే ఉన్నాడు ఆచారి. తమ పెళ్లయి ముప్పయి సంవత్సరాలయింది. పెళ్లయినప్పటి నుంచి ఒక క్యారేజీ తేవాలని, అన్నంగుడ్డకు బదులు పనికి క్యారేజీని తీసుకొనిపోవాలని అనుకొంటున్నాడు. కట్టుకొనే రెండు పంచెల్లో ఒకటి చిరిగిందాకా ఇంకొకటి కొనలేడు. ఆ చిరిగిన పంచె అన్నంగుడ్డగా మారుతోంది. రానురాను తనికి క్యారేజీమీద కోరిక నశించి, అన్నంగుడ్డమీదే మమకారం పెరిగింది."

గతంలో తాను అక్కడ పని చేయడాన్ని, ఆప్పట్లో వారు తనకిచ్చిన గౌరవాన్ని, తన అనుభవాలను కొడుకుకూ పంచాడు. తీరా ఆ ఊరు చేరాక అంతా మారిపోయి వుండడాన్ని చూసి నివ్వెరపోయాడు. తాను పనిచేస్తున్నప్పుడు నీడనిచ్చిన వేపచెట్టు, తియ్యటి మంచినీటిని పంచిన బావీ.. ఏ గురుతులూ లేవు. అన్నీ గతంలోనే కలిసిపోయాయి. ఇక రెడ్డెప్ప ఇంటిని వెతు క్కుంటూ వెళ్లాడు. ఇల్లూ మారిపోయింది మనుషుల మనస్తత్వాలలాగే.. చాలా పనుంటుందని ఎంతో ఆశతో వచ్చిన ఆచారికి నిరాశే మిగిలింది. కోతమిల్లుకు తీసుకు పోతే పర్మిట్ తీసుకోవాల్సి వస్తుందని వుంచిన నాలుగు తుమ్మతుండ్లను కోయమని చూపించాడు రెడ్డెప్ప. ఆచారికి నోటమాట రాలేదు.

చివరికి సాయంత్రానికల్లా పని ముగించుకుని లేచారు తండ్రీ కొడుకులు. రెడ్డెప్పను డబ్బులు అడిగారు. వారు చెప్పిన డబ్బులు ఇవ్వడానికి నిరాకరించాడు రెడ్డెప్ప. కోతమిల్లులో చాలా తక్కువవుతుందన్నాడు. గీసీగీసీ బేరమాడి చివరకు యాభై రూపాయలు చేతిలో పెట్టాడు. మిగిలిన డబ్బులు తర్వాత ఇస్తాను ఇపుడు లేవన్నాడు. ఆయన జేబులో నుండి కనిపిస్తున్న వంద రూపాయల నోట్లు అది అబద్ధమని చెబుతున్నా ఆచారి చేయగలిగిం దేమీ లేదు. అయితే మధ్యాహ్నం అన్నం తిన్నాక పిండి ఆరేసిన అన్నంగుడ్డ కనిపించకపోవడం వారిద్దరికీ ఆవేదనను కలిగించింది. ఇద్దరూ దానికోసం వెతుకు లాడడం మొదలెట్టారు. అది రెడ్డెప్పకు నవ్వులాటగా కనిపించింది.

"ఆ అన్నంగుడ్డే తమ జీవిత సర్వస్వమన్నట్లుగా, అక్కడే ఎక్కడో వుంటుందని తండ్రీ కొడుకులు, అన్నంగుడ్డకోసం వెతుకుతూనే వున్నారు." అంటూ కథ ముగించారు రచయిత.

మారుతున్న కాలంలో మానవీయ సంబంధాలు, ధోరణులు కనుమరుగు అవుతున్నాయన్న విషయాన్ని సూచిస్తుంది ఎగిరిపోయిన అన్నంగుడ్డ.

గతంలో ఆచారితో మంచి అనుబంధం కలిగి, ఇంటి మనుషుల్లా మెలిగిన గ్రామస్తుల ధోరణి, అనుబంధం క్రమేపీ మారిపోయింది. మీ కుటుంబానికి తోడుగా వుంటామన్న వారంతా టౌన్‌కు వెళ్లాల్సిందిగా సలహా లివ్వడం ప్రారంభించారు. పేదరికంతో సతమతమవు తూన్న వారి కష్టం పక్కవారికి నవ్వులాటగా మారింది. ఇంతకన్నా మారిన మానవతా ధోరణికి పెద్ద ఉదాహరణ ఏముంటుంది?

సుంకోజి దేవేంద్రాచారి మరో కథ ''రాబందులు''. ఆయన ఈ కథను 2004లో రాశారు. ఈ కథలో కూడా ఆయన మానవీయ ధోరణులలో మార్పు గురించి ప్రస్తావించారు. రామచంద్ర తాపీ కార్మికుడు. తల్లిదండ్రులను, చెల్లెల్ని పోషించడానికి వున్న ఊరు వదిలి తిరుపతికి వలస వచ్చాడు. తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ మండపం వద్ద ఇరువైపుల వున్న రోడ్డే రామచంద్రలాంటి వారికి ఇల్లుగా మారింది. కరువు కాటకాలకు నెలవైన అనంతపురం, తదితర ప్రాంతాలనుంచీ పొట్టచేత బట్టుకుని వచ్చిన నారాయణప్ప, రామయ్య వంటి అనేక మందికి కూడా ఇదే ఆవాసం.

శనివారం కూలీ తీసుకుని తల్లిదండ్రుల వద్దకు వెళ్లి రావాలన్నది రామచంద్ర ఆలోచన. తమ ఊరివాడే అయిన రమణవచ్చి తనతండ్రి గాయపడ్డాడని చెప్పడంతో వెళ్లితీరాలని రామచంద్ర నిర్ణయించుకున్నాడు. శనివారం పని పూర్తయ్యాక ఎంత ఎదురుచూసినా మేస్త్రి నుంచీ కూలీ అందలేదు. ఇంటిపని ఎంతవరకూ వచ్చిందో చూడ్డానికి వచ్చిన యజమానులు కూలీలకివ్వవలసిన కూలీతో పాటు అదనంగా వెయ్యిరూపాయలు కూడా మేస్త్రి తీసుకున్నాడని, ఊరెళ్లి మరో రెండువారాల పాటు రానని చెప్పాడన్నారు. కూలీలంతా హతాశులయ్యారు. ఎంత బ్రతిమలాడినా తలో వందరూపాయలైనా ఇవ్వడానికి యింటి యజమాని అంగీకరించలేదు.

ఏ పనీచేయని మేస్త్రి తమతో గొడ్డుచాకిరీ చేయించుకుని, తమపై పెత్తనం చెలాయించడంతో పాటు తమకు రావాల్సిన డబ్బులను కూడా తీసుకుని వెళ్లిపోయాడు. తాము ఎంత బ్రతిమలాడుకున్నా వందరూపాయలు కూడా విదిల్చడానికి ఇంటి యజమానులూ అంగీకరించ లేదు. సమాజంలో కొరవడుతున్న మానవీయ ధోరణులను దేవేంద్రాచారి ఇక్కడ ప్రస్తావించాడు.

రామచంద్రకు అమ్మా, నాన్న గుర్తుకొచ్చారు. ఆకలి చచ్చిపోయింది. ఆదివారం ఏదో ఒకపని చేసి కాస్తంత సంపాదించి ఇంటికెళ్లి రావాలని నిర్ణయించుకున్నాడు. కూలీలందరూ పనికోసం గుంపుగూడే నాలుగ్గాళ్ల మండపం దగ్గరికి వెళ్లి నిలబడ్డాడు. తింటే డబ్బులైపోతాయని ముద్ద ముట్టలేదు. కళ్లు తిరుగుతున్నా టిఫిన్‌జోలికి వెళ్ళలేదు. చివరికి రామచంద్రకు సెప్టిక్ ట్యాంకుకు గుంతలోడే పని దొరికింది.

''తను అప్పుడే తమ ఊరికి పోయినంత సంతోషంగా వున్నాడు. పని దొరికింది. సాయంత్రం డబ్బు వస్తుంది. రాత్రికి యింటి దగ్గరవుంటా'' అనుకున్నాడు.

తీరా పని వద్దకు వెళ్లి చూస్తే చేయాల్సింది చాలా వుంది. సాయంత్రానికి పూర్తికాదని అర్థంఅయింది. అయినా ఎలాగైనా ఇంటికి చేరుకోవాలనే ఆశ అతనిని పనిలోకి దింపింది. మధ్యాహ్నం తిండికోసమని ఇచ్చిన పది రూపాయలను కూడా తిండి తినకుండా దాచుకున్నాడు. పని పూర్తయ్యే సరికి రాత్రి పదిగంటలు దాటింది. అంతపనీ చేయించుకుని అతను నలభై రూపాయలు మాత్రమే ఇచ్చాడు. ''నీకివ్వాలని కరెక్ట్‌గా యాబయి రూపాయలు జోబులో పెట్టుకోనున్నే. కావాలంటే జోబీ చూడు. ఖాళీగా వుండాది. మధ్యానం మా భార్య రేపిద్దాంలే కూలి. యాబయి ఈ అవసరం వుంది అనింది. నేనే ఈలా. నువ్వు వూరికి పోవాలన్నావు కదా.

యింగోసారి పనికి వచ్చినపుడు పది రూపాయలు ఎగేసి యిస్తాలే" అన్నాడు.

తాను ఊరికి వెళ్లాలని చెప్పినా కూడా అర్ధరాత్రి వరకూ పని చేయించుకుని, టీ నీళ్లు కూడా ఇవ్వకుండా నామమాత్రపు కూలీని ఇచ్చి సరిపెట్టిన వ్యక్తికి మానవత్వం ఎక్కడున్నదన్నదే రచయిత ప్రశ్న.

నీరసంతో పాటు నిస్సత్తువ వచ్చింది రామచంద్రానికి. రోడ్డు పక్కనే పడుకున్నాడు. నీరసమో, నిద్రో కూడా తెలీలేదు. అంతలో పోలీసులు వచ్చారు. "పుల్‌గా తాగేసి పడుకోనుండాడు నా కొడుకు. ఏసకపోండి జీపులో" అన్నాడొక పోలీసు. పిచ్చికుక్కను ఈడ్చినట్లు ఈడ్చి జీపులో వేశారు.

తిండిలేక పడిపోయాడా.. లేక తాగిపడిపోయాడా అన్న విషయాన్ని కూడా గమనించకుండా రామచంద్రను జీపులో వేసుకెళ్లిన పోలీసులు రక్షకభటులేనా.. అన్నది రచయిత సమాజానికి వేసిన ప్రశ్న. సమాజంలోని అన్ని వర్గాలవారిలో కొరవడిన మానవీయ ధోరణులను కళ్లకు కట్టేలా చేస్తుంది ఈ కథ.

ఇలాంటిదే మరో కథ సానరాయి. సురేంద్ర, సుజాత దంపతులు. సుజాత గర్భవతి. మరో 20 రోజుల్లో ప్రసవం కాబోతోంది. చేతిలో నయాపైసా లేదు. ఇంటద్దె కట్టాల్సిందిగా ఓనర్ వత్తిడి. సురేంద్ర ఆలోచనలు పదేళ్ల వెనక్కి వెళ్లాయి. ఊరికి వచ్చిన తన బంధువు మామ వరసైన చంద్రతో కలిసి పనికోసం తిరుపతికి చేరాడు సురేంద్ర. అతనితో పాటు మొదటిరోజు పనికి బయల్దేరాడు. ఉలి నూరడానికి కనికిరాయి పొడికోసం మామను అడిగాడు.

"కనికిరాయిపొడి యాడుంటాది. సానరాయి ఉండాది నూరు" అన్నాడు చంద్ర. "సానరాయా? రోజుకు పదిసార్లు నూరతాం. అరిగిపోతాండ్లా..." అన్నాడు సురేంద్ర.

కష్టాల్లో కరిగిపోతున్న, కళతప్పిన జీవితానికి ప్రతీక సానరాయి. కాలం మారింది. పదేళ్లు గడిచాయి. పనులు దొరకడం కష్టంగా మారింది. అన్ని చోట్లా మానవీయ విలువలకు బూజుపట్టింది. శ్రమదోపిడీ విపరీతంగా పెరిగి పోయింది. పనులు చేయించుకోవడం... డబ్బులు ఎగ్గొట్టడం ఇదే అనుభవం సురేంద్ర జీవితంలో పదేపదే ఎదురైంది. పనికోసం మేస్త్రీ ఇంటికి వెళ్లాడు. అక్కడ వడ్డీవ్యాపారి మునిస్వామి కనిపించాడు.

"ఏమోయ్ నీతోపాటు పనిచేస్తాన్నేడే రమణ. వాడు యాడికి పోయినాడు. కనబడేదే లేదే." అన్నాడు. "భార్యకు బాగలేదని ఊరుకుపోయినాడు నా." అన్నాడు సురేంద్ర. "అంతా దొంగెత్తు. ఆ మాదిరిగా చేస్తే దుడ్డడగకుండా ఉంటానని. నేను చానా చెడ్డ నా కొడుకును. ఇప్పటికి రెండునెలలైంది వడ్డీ ఇచ్చి. వచ్చి ఈలేదనుకో, పోలీసులను పిల్చుకుని వాళ్ల ఊరికి పోతా" అన్నాడు మునిస్వామి. వాడు అట్లాంటోడు కాదని చెప్పినా మునిస్వామి వినిపించుకోలేదు.

వడ్డీ డబ్బులు పిండుకునే మునిస్వామికి రమణ కష్టం కనిపించలేదు. తన వడ్డీ డబ్బులు రాకపోవడం మాత్రమే కనిపించింది. అతని భార్యకు ఆరోగ్యం బాగలేదని చెప్పినప్పటికీ దానిని నమ్మకపోగా, తన వడ్డీ డబ్బులు ఎగ్గొట్టడానికి వేసిన ఎత్తుగా చెప్పడం అతనిలో లోపించిన మానవత్వాన్ని తెలుపుతుంది.

పనికోసం ఎంత తిరిగినా పని దొరకలేదు సురేంద్రకు. అప్పుడే కనిపించిన మేస్త్రీ బావమరిది నారాయణ సురేంద్రకు అసలు విషయం చెప్పాడు. సురేంద్ర కమిషన్ తీసుకుని, దాంట్లో మేస్త్రీకి కూడా వాటా ఇస్తే పని దొరుకుతుందని బోధించాడు. చిన్నప్పటి నుంచీ తండ్రి ఉగ్గుపాలతో నూరిపోసిన నిజాయితీని వంటబట్టించుకున్న సురేంద్రకు అది నచ్చలేదు.

నేటి సమాజంలో నిజాయితీ అనేది పనికిరాని వస్తువుగా మారిపోయింది. నిజాయితీ కలిగిన వారు చేతగాని వ్యక్తులుగా కనిపించడం మొదలైంది. వారికి విలువ లేకుండా పోయిందన్నది ఈ కథద్వారా తెలుస్తోంది.

మరో కాంట్రాక్టర్ పనికోసం పిలవడంతో అతని వద్దకు వెళ్లాడు సురేంద్ర. ''కొయ్యలు తీస్తే కమిషన్. ఫ్లైవుడ్ షాపులో కమిషన్. ఎంత చిన్న ఇల్లయినా కొయ్యకు లక్ష రూపాయలయినా అయితాది. టెన్ పర్సంట్ కమిషన్ తీస్తారు. గంటసేపు పని. పదివేలు వస్తాది. నెలంతా కష్టపడి ప్లాటమ్మినా మాకు రాదు కదయ్యా అంత ఆదాయం'' అన్నాడు అక్కడ వున్న ఓ ఖరీదైన ఆసామీ సురేంద్రతో. కడుపు కాలుతున్న సురేంద్రకు అతని మాటలు గుండెలను మండించాయి. ఏంచేయాలో తోచని స్థితి. తనను రమ్మన్న కాంట్రాక్టర్ రాడని తెలియడంతో వెనుదిరిగాడు. తోటి కార్మికుడు ప్రసాద్ వద్ద తన బాధను వెళ్లగక్కాడు. తన దగ్గరా డబ్బులు లేవన్నాడు ప్రసాద్. ఎదుటి మనిషి గురించి ఏమీ తెలియకుండానే వ్యాఖ్యానాలు చెయ్యడం, వారిని అవమానించడం లాంటి అమానవీయ లక్షణాల గురించి చూపుతుంది ఈ కథ.

ప్రసాద్‌ను సానరాయి కోసం అడిగాడు సురేంద్ర. అది అరిగి విరిగిపోయిందని, కొత్తది కొనాలంటే నూరు రూపాయలవుతుందని అన్నాడు ప్రసాద్. రూపాయి కోసం వెతుక్కుంటున్న సురేంద్ర వద్ద వందరూపాయలు ఎక్కడుంది. జీవనచక్రంలో అరిగిపోతున్న, విరిగిపోతున్న జీవితాలను చూపింది ఆ సానరాయి.

ఎంత ప్రేమ వున్నా సరే జీవన పోరాటంలో పడి కలుసుకోలేని అక్కా తమ్ముళ్ల కథే ''ఎంతెంత దూరం''. ఈ కథలో లక్ష్మి, సురేంద్ర అక్కా తమ్ముళ్లు. నలుగురు పిల్లల్లో లక్ష్మి పెద్దది. తల్లిదండ్రులు పనికిపోతే తమ్ముళ్ల బాధ్యత అంతా లక్ష్మిదే. లక్ష్మితో సురేంద్రకు విడదీయలేని అనుబంధం. ఆటలూ, పాటలూ, కబుర్లూ, కలబోతలూ అన్నీ అక్కతోనే. అక్క కూడా అంతే.

తల్లిదండ్రులు పనికిపోతూ తన ఖర్చుకోసం ఇచ్చిన రెండు రూపాయలతో అక్కకు పువ్వులు తెచ్చిచ్చాడు సురేంద్ర బాల్యంలో. ఆ పూలను అక్క పెట్టుకోవడమే అతనికి ఆనందం. చదువుకోసం అక్కను హాస్టల్లో చేర్పించారు. ఓ రోజు అరిసెలు చేసి, డబ్బులు ఇచ్చి అక్కకు ఇచ్చి రమ్మన్నారు అమ్మానాన్న. రాత్రంతా నిద్ర పట్టలేదు. అక్కను చూస్తానన్న ఆనందం. అక్క దగ్గరికి వెళ్లాడు. మధ్యాహ్నం వరకూ మాట్లాడుకుంటూ కూర్చున్నారు. ఇంటికి బయలుదేరిన తమ్ముడు కాసేపట్లోనే తిరిగొచ్చాడు. తాను తెచ్చిన పూలూ, పండ్లూ అక్కకిచ్చి వెనుదిరిగాడు. అక్కంటే తమ్ముడికి ప్రేమ. ఆ ప్రేమను ఆమెకు పూలివ్వడం ద్వారా తెలిపాడు తమ్ముడు. అక్కకూ తమ్ముడంటే ప్రేమ. తమ్ముడిచ్చిన పూలను అంతకంటే ప్రేమతో స్వీకరించింది అక్క. కుటుంబ సభ్యుల అనుబంధాలను తెలుపుతోంది ఈ ఘటన. అక్కకు పెళ్లయింది. అత్తారింటికి వెళ్లిపోయింది. తమ్ముడికి చూడాలనిపించింది. తండ్రితో పాటే కొయ్యపనికి పోతున్నాడు సురేంద్ర ఇప్పుడు. పనిచేసి వచ్చిన డబ్బులు తీసుకుని అక్కదగ్గరికి బయల్దేరాడు. రాయచోటిలో బస్సు దిగగానే పూలూ పళ్లు తీసుకున్నాడు అక్కకోసం. ఇక్కడ పూలూ, పండ్ల ఖరీదు తక్కువే కావచ్చు. అది అక్కా తమ్ముళ్ల ప్రేమకు వారి మధ్య వున్న మానవీయ సంబంధాలకు అది ఓ ప్రతీక.

మరింత కాలం గడిచింది. సురేంద్ర పనికోసం తిరుపతికి చేరాడు. అక్కకు పెళ్లినాడు తాము ఇస్తామన్న కమ్మల విషయం అతనికి మనసులో గుచ్చుతోంది. ఆ విషయంలో అత్తామామలు అక్కనేమైనా అంటారేమో నన్నది అతని భయం. తనకు తెలిసిన ముస్తఫాను అడిగి తండల్‌కు డబ్బులు తీసుకుని అక్కకు కమ్మలు కొని తీసుకెళ్లి ఇచ్చాడు. అక్క కళ్లలో మతాబులు. సురేంద్రకు పెళ్లయింది. బాధ్యతలు పెరిగాయి. దానితో పాటే ఖర్చులు కూడా. అక్కావాళ్ల ఊరికి వెళ్లడానికి కూడా డబ్బులు వెతుక్కోవాల్సిన పరిస్థితి. అక్క తమ్ముడ్ని చూడాలని జాబు రాసింది. అక్క బాధపడుతోందని, వెళ్ళొద్దామని అంది భార్య రత్న. అప్పుచేసి పిల్లలకు బట్టలూ, పూలూ, పండ్లూ తీసుకుని బయల్దేరారు. తమ్ముడు తరచూ రాలేదని బాధపడింది. బాధ్యతలు, ఖర్చులు పెరిగాయని రాలేక పోతున్నామని చెప్పుకున్నాడు తమ్ముడు.

సురేంద్ర తండ్రయ్యాడు. పాప బాధ్యతల్తో అలూ మగలకు పొద్దు తెలియడం లేదు. అక్క మనసులో మెదిలినా వెళ్లలేని స్థితి. ఓ రోజు పొద్దున్నే ఎవరో తలుపు తట్టారు తీసి చూస్తే అక్క. తమ్ముడికోసం తానే వచ్చిందామె కొండకు వచ్చిన తన ఊరివాళ్లతో కలిసి. అక్కకు చీరపెట్టడానికి కూడా డబ్బుల్లేవు. వచ్చిన కాస్త కూలీ డబ్బులతో అక్కకోసం చీరకొన్నారు. ఆర్నెల్లకు ఒకసారైనా రమ్మని చెప్పి బయల్దేరింది అక్క.

బొటాబొటీ సంపాదన. చాలీచాలని బతుకులు. అయినా సరే.. అక్కమీది ప్రేమ అన్నిటినీ సర్దుబాటు చేసింది. ఆమెను ఆదరించేలా చేసింది. భారతీయ సమాజంలో కుటుంబాల మధ్య వున్న మానవీయ ధోరణిని ఈ కథ కళ్లకు కట్టేలా చేస్తుంది. సురేంద్ర ఒక ప్రైవేటు కంపెనీలో చేరాడు. బస్సుకోసం ఎదురు చూస్తున్నాడు. అక్కడికో ఆటో వచ్చి ఆగింది. అందులోంచి పాతిక సంవత్సరాల లోపలున్న అమ్మాయి, అబ్బాయి దిగారు. ఇద్దరూ సురేంద్ర పక్కనే కూర్చున్నారు.

"మళ్లా ఎప్పుడొస్తావురా..." అంది అమ్మాయి. "ప్రతి నెలా సెకండ్ సాటర్డే వచ్చేస్తాకా... మధ్యలో ఎప్పుడైనా లీవున్నే వచ్చేస్తా." అన్నాడా అబ్బాయి. "బాగా చదువుకో" అంది అక్క. అక్క గుర్తుకు వచ్చింది. కలిసి మూడేళ్లవు తోంది. వెంటనే అక్కోళ్ల ఊరికి వెళ్లాలనిపించింది. "వచ్చే జీతం చాలక ఏనెలకానెల ఇంకా ఐదారు వందలు అప్పు చేయాల్సిన పరిస్థితి. బడికి పోతున్న కూతురు. ఇంటి అద్దె, వడ్డీలు.. ఆదాయం కన్నా జీవనవ్యయం పెరుగుతున్న కొద్దీ మనుషుల మధ్య బంధాలు పలుచబడటం, దూరాలు పెరగడం సురేంద్ర గమనిస్తూనే వున్నాడు. ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితి. యంత్రంలా కన్పిస్తున్నాడు."

ప్రేమలూ, అనుబంధాలు ఆర్థిక లేమిలో కాలిపోతున్నాయి. మానవతా ధోరణి క్రమంగా మసకబారుతోంది. మన ప్రమేయమేమీ లేకుండా జరిగే ఈ క్రమం మనల్ని రాతిసదృశంగా మారుస్తోంది. ఇదే సుంకోజి దేవేంద్రాచారి తన కథల్లో స్పష్టం చేశారు.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అభ్యుదయ సాహిత్య వాదిగా శ్రీశ్రీ

- పెరుగుపల్లి బలరామ్, తెలుగు అధ్యాపకులు, టి.జె.పి.యస్. కళాశాల, గుంటూరు.

అభ్యుదయం అను పదానికి పురోగమనం, ప్రగతి అని అర్థం.

నిర్వచనం :

మార్క్సిజాన్ని, భౌతిక వాదాన్ని, వాస్తవిక వాదాన్ని దృష్టిలో ఉంచుకొని పీడించబడే వాళ్ళు, పీడించేవాళ్ళు ఉన్న ఈ వర్గ సమాజం పోవాలనుకోవడమే అభ్యుదయ వాదం, అందుకోసం జరిగే పోరాటాన్ని ప్రతిబింబిస్తూ రాసేది అభ్యుదయ సాహిత్యం. అభ్యుదయవాదం విప్లవాత్మకమైనది. ఇతివృత్తంలోనూ, భావనలోనూ, ఛందస్సులోనూ, శిల్పంలోనూ, తాత్వికతలోనూ పూర్తిగా కొత్తదారులు తొక్కింది. "ప్రజలే చరిత్ర నిర్మాతలు" అన్న సిద్ధాంతానికి తాత్విక పునాదే అభ్యుదయం.

అభ్యుదయ సాహిత్యం చైతన్యవంతమైనది. వాస్తవికత, సుందరత తాత్వికతలు దానికి పునాదులు అభ్యుదయ పదాన్ని మొట్టమొదట వాడినవాడు శ్రీశ్రీ.

మానవుడు తన మంచి చెడ్డలకు తానే బాధ్యుడు. ఆకలి, అజ్ఞానం, దారిద్రం ఇలాంటి వాటికి సంఘంలోని ఆర్థిక అసమానతలు, ఉత్పత్తి పంపిణీలోని అసమానతలు మొదలగు వాటిని మార్చివేస్తే మానవుడు విముక్తి పొంది మహోన్నతుడు అవుతాడు.ఈ సంఘంలో తను అనుభవిస్తున్న దుస్థితులను చక్కదిద్దుకునే శక్తి తనకుంది. కాని తగిన చైతన్యం లేదు. ఆ చైతన్యాన్ని అందించటమే అభ్యుదయం చేసే పని.అభ్యుదయ వాద దృక్పథాన్ని ఎప్పటికప్పుడు నిర్ణయించే సైన్సు, ఆర్థిక వ్యవస్థ, రాజకీయ, జాతీయ, అంతర్జాతీయ, సాంఘిక పురోగామి శక్తులకు కూడా ఇది వ్యతిరేకం.

మారేది మార్పించేది
పాడేది పాడించేది
మును ముందుకు నడిపించేది
పెను నిద్దుర వదిలించేది

సమాజాన్ని కదిలించేది మార్పించేది ముందుకు సాగించేది, ప్రజల్లో ఉన్నటువంటి భావాలను తొలగించి చైతన్యవంతం చేసేది అభ్యుదయం. ప్రజానికంలో బహుళ సంఖ్యాకులైన కార్మిక, కర్షకుల శ్రేయస్సాధన, వారి ప్రయోజనాలను కాపాడే సాహిత్యదృష్టి అభ్యుదయ సాహిత్యోద్యమ ధ్యేయం.

లక్షణాలు :

1) భావ కవిత్వంపై తిరుగుబాటు
2) సామాజిక చైతన్యం
3) మార్క్సిజాన్ని పునాదిగా చేసుకొని రచించటం
4) వస్తువు ప్రాధాన్యత గుర్తించటం
5) వాస్తవిక దృక్పథం రచనలలో కనిపించటం
6) మానవతా వాదం రచనలలో కనిపించటం
7) ప్రగతిశీల మార్గం ఆశించటం
8) సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకించడం
9) ఫాసిస్టు దురాక్రమణను సాహిత్యం ద్వారా ప్రతిఘటించటం
10) లౌకిక తత్వాన్ని పెంపొందించే సాహిత్య సృష్టి చేయటం
11) ప్రజల జీవితాలతో పెనవేసుకుపోయిన కళా రూపాలను స్వీకరించటం.

ఇవి అభ్యుదయ లక్షణాలు

మహాప్రస్థానంలో అభ్యుదయ దృక్పథం ?

అభ్యుదయ కవిత్వాన్ని సంపూర్ణంగా ప్రతిబింబించిన కవితా సంపుటి మహాప్రస్థానం. ఇందులో కవితా

ఖండికలు, మహాప్రస్థానం, దేశచరిత్రలు, జగన్నాధుని రథచక్రాలు ఈ మూడు ముఖ్యంగా మహాప్రస్థానంలో సమాజ పరివర్తనను కాంక్షించే విధంగాను ఒక రకమైన ప్రవాహవేగాన్ని సాధించటం కనిపిస్తుంది. ఇందులో అభ్యుదయ శక్తుల సమీకరణ జరిగింది.

మహాప్రస్థానం కవితలో మరో ప్రపంచ స్ఫూర్తి చిత్రింప బడింది.శ్రీశ్రీ మార్క్సిజం దృక్పథంతో చరిత్రను సమీక్షిస్తూ చరిత్ర అంటే ఏమిటి? ఏ ఏ రూపాలు ఎలా తీసు కుంటుందో, ఏది నిజమైన చరిత్ర కాదో చరిత్ర నుంచి ఉద్భవించే శక్తులు సామాజిక ధర్మాన్ని ఏ రీతిగా మారు స్తాయో, ఏ నిజాలు మనం గుర్తించాలో "దేశచరిత్రలు"లో సామాజిక గతి క్రమంలో, చారిత్రక పరిణామ దశలలో మార్క్స్ సిద్ధాంతాలను సమన్వయ పరిచాడు.

"నరజాతి చరిత్ర సమస్తం
దరిద్రులను కాల్చుకు తినటం"

చరిత్ర మొత్తంలో ఏమీలేదని ఉన్న చరిత్ర అంతా దరిద్రులకు భూస్వాములు, పెట్టుబడిదారులు కాల్చుకు తినే చరిత్ర ఉందని చెప్పాడు.

"బలవంతుల దౌర్జన్యాలూ
ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా! ఇకపై చెల్లవు"

ఇన్ని రోజులు జరిగినటువంటి మోసం, బలవంతులు బలహీనులపై చేసే దౌర్జన్యాలు ధనవంతుల పన్నాగాలు ఈ క్షణం నుంచి చెల్లవు, ప్రజలు చైతన్యవంతు లౌతున్నారు కాబట్టి ఇక నుంచి మీ ఆటలు సాగవు అని అంటున్నాడు కవి.

ఏ యుద్ధం ఎందుకు జరిగిందో, ఏ రాజ్యం ఎన్ని సంవత్సరాలు పరిపాలించిందో తారీఖులు, దస్తావేజులు ఇవికాదు చరిత్ర అంటే

"నైలునది నాగరికతలో
సామన్యుని జీవనమెట్టిది?
తాజ్‌మహల్ నిర్మాణానికి
రాళ్ళెత్తిన కులాలెవరు
సామ్రాజ్యపు దండయాత్రలో
సామాన్యుల సాహసమెట్టిది?
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్
అది మోసిన బోయి లెవ్వరు"

ఒక సగటు మనిషి జీవితం ఏ విధంగా ఉంది, తాజ్ మహల్ కట్టించిన వాడుకాదు దానికి రాళ్ళెత్తిన కూలీలు ఎవరు? యుద్ధంలో ఎవరు గెలిచారో అన్నది కాదు అందులో సామన్యుని సాహసం ఎటువంటిది? పల్లకి మోసిన బోయిలు ఎవరు? వీరందరిది చరిత్ర. చరిత్రంటే రాజులు రాజ్యాలు కాదు అని అభ్యుదయంతో ఆలో చించి సగటు మనిషియొక్క జీవితమే చరిత్ర అని చెప్పాడు.

కవిత్వంలోనూ, జీవితంలోనూ సంప్రదాయానికి మార్పుకు మధ్య ఎడతెగని పోరాటం సాగుతూనే ఉంటుంది. సంప్రదాయానికి, మార్పుకోరే విప్లవానికి మధ్య నిరంతరం జరిగే సంఘర్షణను వేగవంతం చేసే కవిత ఆవిష్కృతమైంది.

"మహాప్రస్థానం"లో

"మరో ప్రపంచం మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు పదండి త్రోసుకు
పోదాం పోదాం పై పైకి"

అందర్ని చైతన్యవంతం చేస్తూ మరో ప్రపంచం కొరకు ముందుకు సాగాలని చెప్తున్నాడు కవి. సమాజంలో వయస్సు మళ్ళిన సోదరులను పక్కకునెట్టి, నెత్తురుమండే శక్తులు నిండే సైనికులై కదిలే యువలోకానికి ఎదురయ్యే ఎడారులు, నదీనదాలు, కొండలు, వాటిని అధిగమించి మరో వాడానికి చేరే స్థితి చిత్రమైంది.

శ్రీశ్రీ తన రచనలను పీడిత వర్గాల క్షేమానికి వినియోగిస్తారని ప్రతిజ్ఞ చేస్తాడు. ధనస్వామ్య వ్యవస్థలో పర స్పర వైరుధ్యాలే దాని పతనానికి కారణమవుతాయని

తరువాత అంతకన్నా న్యాయబద్ధమైన, సామ్యసిద్ధమైన వ్యవస్థ ఏర్పడుతుందని చేసిన జోస్యం ఫలోన్ముఖానికి వస్తుందన్న ప్రగాఢ విశ్వాసమే "జగన్నాధుని రథచక్రాలలో" కనిపిస్తుంది.

"భ్రష్టులార!
భ్రష్టులార!
బాధ సర్పదుష్టులార!
ఏడవకండేడవకండి!
వస్తున్నా యొస్తున్నాయి
జగన్నాథ,
జగన్నాథ,
జగన్నాథ రథచక్రాల్"

అని ధైర్యమిస్తూ, ఊరడిస్తూ

"ఈ స్వప్నం నిజమౌతుంది
ఈ స్వర్గం ఋజువవుతుంది"

అని భవిష్యత్తును ప్రకటిస్తాడు. "మానవుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం" అని ఎలుగెత్తి చాటిన కవి శ్రీశ్రీ. అప్పుడే పుట్టిన శిశువు నుండి, ముగ్గు బుట్టవంటి తల 'భిక్షువర్షియసి' వరకు అందరూ కనిపిస్తారు ఆయన కవిత్వంలో.

ఈ శతాబ్దం నాది అని సగర్వంగా ప్రకటించి, తెలుగు సాహిత్యాన్ని భూమార్గం పట్టించి, భూకంపం పుట్టించిన మహాకవి శ్రీశ్రీ.

ఆధారగ్రంథం :

1. మహాప్రస్థానం వచన కవితా సంపుటి

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పత్రిక సాహిత్యంలో వివిధ రూపాలు పరిణామాలు

- డా॥. సుభాష్ చంద్రబోస్

పత్రికా సాహిత్యంలో వచన కవిత్వానిదే అగ్రస్థానం. సమాజంలో యే చిన్న సమస్య తలెత్తినా మొదట స్పందించేవాడు కవే. కవిత్వం బాధకు పర్యాయ పదం కనుక ఆ సమస్యను కవి ఫోకస్ చేయాలనుకుంటాడు. ఒక్కరోజు కాలయాపన లేకుండా అది జనవాక్యంలో వచ్చినా ఇష్టపడతాడు. ప్రతియేట వస్తున్న కవితా సంకలనాలను, సంపుటాలను పరిశీలిస్తే అత్యధికమైన కవితలు దినపత్రికలలో అచ్చవుతున్నవే కనిపిస్తాయి. ప్రతియేట వస్తున్న వార్షిక కవితా సంకలనాలలో యెన్నికవు తున్న కవితలలో తొంభై శాతం కవితలు దిన పత్రికలలో వస్తున్నవే ఉంటున్నాయి. చిన్న చిన్న సాహిత్య పత్రికలలో వందల సంఖ్యలో అచ్చవుతున్నాయి. అవి యువకవులను బాగా పోషిస్తున్నాయి. కవితా శిల్పం తక్కువగా ఉన్నప్పటికీ వస్తు ప్రాధాన్యతను బట్టి ప్రచురిస్తున్నాయి. దిన పత్రికల్లోని కవితల వస్తురూపాలు పదునుగా శక్తివంతంగా ఫోర్సుగా ఉన్న అత్యుత్తమ కవితలు అచ్చవుతున్నాయి బులిటెన్స్, సాహిత్య పత్రికల్లో కూడా దిన పత్రికలకవితల కంటే శక్తివంతమైన కవితలు వస్తున్నాయి. అభ్యుదయ, విప్లవ, స్త్రీవాద, దళితవాద, మైనారిటీ వాద, ప్రాంతీయ వాద కవిత్వాలకు పత్రికలు నీరాజనాలు పట్టాయి. ఉదయం, ఆంధ్రజ్యోతి పత్రికలు స్త్రీవాద కవిత్వానికి పెద్దపీఠం వేశాయి. ఆంధ్రజ్యోతి పత్రికలు స్త్రీవాద కవిత్వానికి పెద్దపీఠం వేశాయి. మన స్త్రీవాద కవితలతోపాటు ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన మంచికవితల అనువాదాలను ప్రచురించి స్త్రీవాద వ్యాప్తికి దోహదం చేశాయి. స్త్రీవాద ఉద్యమం ప్రజలలో రాలేదు కానీ స్త్రీవాద సాహిత్య ఉద్యమం విస్తృతంగానే వచ్చింది. అందుకు పత్రికలు అండగా నిలిచాయి.

అలాగే దళితవాద కవిత్వం. పదునెక్కిన పాట, చిన్నవు తున్న పాట అనే రెండు సంకలనాలలోని అత్యధికమైన కవితలు పత్రికలు ప్రచురించినవే. దళితవాద కవిత్వాన్ని కొన్ని పత్రికలు ఆదరించాయి. మరికొన్ని పత్రికలు నిరాదరించాయి. ఏకలవ్య, మహాబోధి, రచ్చబండవంటి అనేక పత్రికలు పుట్టుకు వచ్చాయి. పెద్ద పత్రికల నిషేధానికి గురైన కవితలు ఈ దళిత పత్రికలలోనే అచ్చయినాయి. దళిత కవిత్వం తెచ్చిన సరళత, సూటిదనం వచన కవిత్వానికి మార్గ నిర్దేశం చేశాయి. మాల మాదిగల విభేదాలు, ఘర్షణలు, సంఘర్షణలు కవితారూపాన్ని మార్చివేశాయి.

బాబ్రీమసీదు విధ్వంసం తరవాత, గుజరాత్ దమన కాండ ముగిసిన తరవాత ఆంధ్రదేశంలో మైనారిటీవాదం ఊపందుకుంది. మైనారిటీ కవులతో ఉద్యమస్ఫూర్తిని పత్రికలు కలిగించాయి. లౌకిక వాద కవులు మతోన్మాదాలను దుయ్యబట్టి మైనారిటీ ప్రజలకు అండగా నిలుస్తూ కవిత్వం రాశారు. మైనారిటీ వాదులు 'ముల్కి' వంటి బులిటన్స్ మైనారిటీ సాహిత్యానికి దోహదపడ్డాయి. అలాగే ప్రత్యేక తెలంగాణ విషయం. తెలంగాణ ఉద్యమాన్ని మనసులో ఉంచుకొని ఇతోధికమైన కవితలు రాశారు. తెలంగాణ భాష సంస్కృతి విముక్తిని ఆధారం చేసుకుని చాలా కవితలు ప్రచురితమయ్యాయి. సోయి, మన తెలంగాణ, ప్రజాతంత్ర వంటి పత్రికలతోపాటు మరికొన్ని బులెటిన్స్ తెలంగాణ కవులకు అండగా నిలిచాయి. పొక్కిలి, మత్తడి సంకలనాలలోని కవితలలో అధికశాతం దినపత్రికలలో ముందుగానే అచ్చయినవి. తెలంగాణ సాహిత్యోద్యమంవల్ల కొత్తకవుల శాతం బాగా పెరిగింది. సంకలనాలు సంపుటాలు వచ్చాయి. పత్రికారచనలవల్ల కవిత్వం ఉద్యమానికి సంపుటాలు వచ్చాయి. పత్రికా రచనలవల్ల కవిత్వం ఉద్యమానికి వెన్నెముకలాగా పని చేసింది.

ఒకప్పుడు గుంటూరు శేషేంద్రశర్మ నాదేశం, నా

ప్రజలు అనే కావ్యంలోని అధికభాగం విశాలాంధ్ర పత్రికలో అచ్చయింది. నగ్నముని 'కొయ్యగుర్రం' అనే దర్జీకవిత ప్రజాతంత్రలో అచ్చయింది. చివరిరోజుల్లో ఆరుద్ర రాసిన సుదీర్ఘ కవితను ఇండియాటుడే అచ్చువేసింది. మరో విషయం మినీ కవిత్వాన్ని పత్రికల స్పేస్ ఫిల్లర్స్ మార్చినప్పటికీ అలిశెట్టి ప్రభాకర్ వంటి మినీ కవుల మినీ కవిత్వానికి ప్రత్యేకించి బొమ్మలువేసి ప్రచురించడంవల్ల మినీ కవులకు మరింత గౌరవం లభించింది. మొదట హైకూ కవిత నిరాదరణకు గురైనా ఇస్మాయిల్ వంటి సుప్రసిద్ధ కవులు చేపట్టడంతో ప్రజాదరణకు నోచుకుంది. కంజిర లాంటి బులిటిన్స్ హైకూలకు పెద్దపీట వేశాయి. హైకు కవిత్వాన్ని పత్రికలు ఆహ్వానిస్తున్న సమయంలోనే నానీల కవిత్వానికి 'వార్త' పత్రిక తెరలేపింది. డా.ఎన్.గోపిని నానీల కవిరాజును చేసేశారు. పెద్ద పత్రికలు నానీల కవిత్వాన్ని తగిన విధంగా ఆదరించలేదు గానీ చిన్న చిన్న సాహిత్య పత్రికలు బహుళ ప్రచారంలోకి తెచ్చాయి. పత్రిక' నానీలను భుజానవేసుకుని నడిపించడంతో యువకవులు నానీల కవులుగా రూపాంతరం చెందారు. ఇలా వచన కవిత్వం విస్తృతమైనంతగా పద్యకవిత్వం కాలేకపోయింది. ఒక విశేషమేమంటే ఆధ్యాత్మిక పత్రికలు, హిందూ భావజాలంగల పత్రికలలో పద్యకవిత్వం బాగా అచ్చవు తుంది. దైవమ్, ధ్యానమాలిక, శైవమత ప్రబోధిని, భక్తి వంటి మరికొన్ని పత్రికలలో పద్యకవిత్వం ప్రచురిత మవుతోంది. పండుగల సందర్భాలలో పెద్ద పత్రికలు ప్రత్యేక అనుబంధాలను ప్రచురిస్తున్నాయి. లబ్ధ ప్రతిష్ట లైన పద్యకవుల పద్యాలను ప్రచురిస్తున్నాయి. పద్య కవిత్వం అంటరానిది కాదనీ అది కూడా ప్రజాదరణకు నోచుకుంటుందనీ మనకు మనమే పద్యకవితా రూపాన్ని కాలరాయడం భావ్యం కాదన్న తలంపుతో అడపాదడవ సాహిత్య పేజీలలో పద్యాలు ప్రచురించబడుతున్నాయి. సుప్రసిద్ధ కవులు, కళాకారులు మరణించినపుడు నివాళి పేరుతో ఎలిజీ పోయిట్రినీ పత్రికలు ప్రచురిస్తూనే ఉన్నాయి. శ్రీ శ్రీ నుంచి కృష్ణమూర్తి యాదవ్ కవి వరకు నివాళి కవిత్వం అచ్చవుతూనే ఉంది. పెద్ద పెద్ద పత్రికలు ఫ్రెంట్ పేజీలలోనే దేవిప్రియ చేత చెల్లె చెల్లెలు, రన్నింగ్ కామెంటరీలను రాయించి అచ్చువేశాయి. తెలుగు కవిత్వా నికి పత్రికల ఆదరణ అపూర్వమైంది. వచన కవిత్వం మీద వివిధ ప్రక్రియల మీద రానన్ని విమర్శనా వ్యాసాలు కవిత్వం మీదనే వచ్చాయి.

అయితే కవిత్వ విమర్శను కవిత్వాన్ని మెచ్చుకునేంత మెచ్చుకోలేం. కవిత్వ విమర్శకులు తక్కువగా ఉంటారు. అచ్చువేయడానికి స్పేస్ తక్కువగా ఉంటుంది. విమర్శకు పాఠకులు తక్కువగా ఉంటారు. విమర్శ కూడా కవిత్వ విమర్శకన్న కవుల కవిత్వం మీద వచ్చే వ్యాసాలే ఎక్కువ. అవార్డులు వచ్చినపుడు, మరణించినపుడు, సుప్రసిద్ధు లను స్మరించుకుంటూ ఎన్నోవందల వ్యాసాలు చిన్నా పెద్ద అనికాదు. అన్ని పత్రికలు సాహిత్య వ్యాసాలను ప్రచురిస్తున్నాయి. ప్రజాసాహితి, అరుణతార, ప్రగతి, మిసిమి, తెలుగు త్రైమాసిక పత్రిక, చినుకు, ఎక్సెరే, వాజ్మయి, ప్రస్థానం, నేత్రం, మన తెలంగాణ వంటి అనేక పత్రికలలో సాహిత్య వ్యాసాలకు కొదవే లేదు. ప్రజా సాహితి, సృజన, అరుణతార వంటి సాహిత్య పత్రికలలో వచ్చిన వ్యాసాలు సాహిత్య విమర్శను నడిపిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. వ్యక్తుల మీద ఎన్నో వ్యాసాలు వచ్చాయి. గురజాడ మొదలుకొని శ్రీశ్రీదాక, పుట్టపర్తి మొదలుకొని బైరాగిదాక, కృష్ణశాస్త్రి మొదలుకొని తిలక్ దాక, దాశరథి మొదలుకొని కాళోజీ దాక వచ్చిన నివాళి వ్యాసాలు ప్రజాదరణ పొందాయి. కవిత్వ ధోరణుల మీద, రూప పరిణామాల మీద ప్రయోగాల మీద రావలసినన్ని సాహిత్య వ్యాసాలు రాలేదు. దిన పత్రికలలో సాహిత్య సంపాదకీయాలు సాహిత్య విమర్శను పరిపుష్టం చేశాయోమో. కవులు మరణించినపుడే కాదు భాష కళలు, సంస్కృతి వంటి అనేక అంశాలపై రాయవలసిన తప్పని సరి పరిస్థితులలో సంపాదకీయాలను అన్ని ప్రతికలు ప్రచురించాయి. ఎ.బి.కె. ప్రసాద్ లాంటి సంపాదకులు వారం వారం సాహిత్య సంపాదకీయాలు రాయడంవల్ల

సాహిత్య విమర్శ ఎనలేని గౌరవం పొందింది. ఎ.బి.కె. సంపాదకీయాలలో కవిత్వం మీద రాసిన సంపాదకీయాలే ఎక్కువగా ఉన్నాయి. అలాగే చేరాగారు ఆంధ్రజ్యోతిలో చేరాతలు' పేరుతో వారం వారం రాయడం అనేది సాహిత్య విమర్శ అదృష్టంగానే భావించాలి. అత్యధికమైన చేరాతలు కవులమీద వాళ్ళ కవిత్వం మీదనే వచ్చాయి. వస్తురూపాలలో రూప పరమైన విమర్శకు శ్రీకారం చుట్టింది చేరాగారే. ఈ మధ్యన ఆంధ్రభూమి దినపత్రిక జింబో చేత, సౌభాగ్యచేత వారం వారం రాయించిన, రాయిస్తున్న వాటిలో ప్రధానంగా కవుల మీదే రావడం ఒక విశేషణమే. చేరాతల వల్ల స్త్రీవాద కవయిత్రుల సుప్రసిద్ధులయ్యారు. దళితకవులు, తెలంగాణ కవులు వెనకబడి పోయారు.

కథా సాహిత్యానికి అన్ని విధాల పత్రికలు తమవంతు కర్తవ్యాన్ని విధిగా చేస్తున్నాయి. కొన్ని వార పత్రికలు వ్యాపారం కోసం కథా ప్రక్రియను దిగజార్చాయి. మాల్ మసాల కథలను, బూతు కథలను ప్రచురించాయి. మరి కొన్ని పత్రికలు వినోదం కోసం, కాలక్షేపం కోసం, వంటింటి కోసం కథల ప్రయోజనాలను పక్కన పెట్టి వండి వడ్డించే పద్ధతులను కథారూపం చేత చేయించారు. మరోపక్కన తెలుగుకథ నిండా నూరేళ్ళు బతకాలని అత్యుత్తమ కథలను ప్రచురిస్తూనే ఉన్నాయి. కథావార్షికల సంకలనాలు వస్తున్నాయి. ముఖ్యంగా వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ ప్రతియేట తెస్తున్న సంకలనాలలోని కథలనూ రాసాని, నరేంద్ర సంపాదకత్వంలోని సంకలనాల్లోని కథలనూ తెలంగాణ కథా వార్షిక సంకలనాలను పరిశీలిస్తే తెలుగుకథ సుసంపన్నతను గుర్తించవచ్చు. చాలా మంచి కథలు వ్యాపార పత్రికలలోనూ ఆదివారం అనుబంధాల లోనూ వస్తున్నాయి. కావాలనుకుంటే కథాసంకలనాలనే చూడండి. విపుల, వార్త, జ్యోతి, భూమి, ప్రభ, ఈనాడు, సుప్రభాతం, మహిళామార్గం, భూమిక, ఆహ్వానం, రచన, ఉదయం, విశాలాంధ్ర, ప్రజాశక్తి, ప్రస్థానం, ఇండియా టుడే, చూపు, వంటి ఎన్నో పత్రికలు కథలకు నీరాజనాలు పడుతున్నాయి. ఇందులో కొన్ని పత్రికలు కనుమరుగై పోయాయి. ఇటీవల మంచి కథకులుగా మహమ్మద్ ఖదీర్ బాబు, గోపిని కరుణాకర్, శాంతి నారాయణ, మధురాంతకం నరేంద్ర, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, అల్లం రాజయ్య, పెద్దింటి అశోక్ కుమార్, ముదిగంటి సుజాతా రెడ్డి, అప్పల్నాయుడు, బి.మురళీధర్, నరేంద్ర, కాసుల ప్రతాపరెడ్డి, జాజులగౌరి, నల్లూరి రుక్మిణి, కూర్మనాథ్, వి.చంద్రశేఖరరావు, స్వామి వంటి అనేకమంది కథకులు వివిధ కథా సంకలనాల వల్ల లబ్ధప్రతిష్టులయ్యారు. 'నవ్య' పత్రిక గోపిని కరుణాకర్, పెద్దింటి అశోక్ కుమార్, జింబోల చేత ఆయా ప్రాంతాల భాషల, సంస్కృతుల, విశ్వాసాల, జీవితాలను ప్రతిబింబించేట్లు వారం వారం కథలను ప్రచురించి ప్రజల మెప్పును పొందారో! ప్రాంతీయ మధుర స్మృతులను తలుచుకునేట్లు చేసింది. తెలుగు కథను సుసంపన్నం చేయడానికి ప్రత్యేకశ్రద్ధ తీసుకుని మన విమర్శకులు వ్యాసాలురాసి కథకు ఒక వజ్రకిరీటాన్ని తొడిగారు. ఎన్. వేణుగోపాల్, కె. శ్రీనివాస్, గుడిపాటి, కాత్యాయని విద్మహే, పాపినేని శివశంకర్, కేతు విశ్వనాథరెడ్డి, సింగమనేని నారాయణ, రాచపాళెం చంద్రశేఖరెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి, ముదిగంటి సుజాతారెడ్డి, కె.పి. అశోక్ కుమార్ వంటి మరికొందరు తెలుగు కథను స్వంత కాళ్ళతో నడిచేట్లు సాహిత్య వ్యాసాలు రాస్తున్నారు. కాళీపట్నం రామారావు 'యజ్ఞం', తుమ్మేటి రఘోత్తమరెడ్డి పనిపిల్ల' వంటి మరికొందరి కథల మీద పత్రికలలో చర్చలు జరిగాయి. దళిత, స్త్రీవాద సాహిత్యాల పై పత్రికలల్లో జరిగిన చర్చను డా.ఎస్వీ సత్య నారాయణ సంకలనాలను తెచ్చారు. ఇలాంటి చర్చలు విస్తృతం కావలసిన అవసరం ఉంది. ఒకప్పుడు ఆంధ్ర జ్యోతిలో కోడూరి శ్రీరామమూర్తి 'అందాల తెలుగు కథ' అంటూ వారం వారం రాసేవారు. అలాంటి వ్యాసాలు ప్రస్తుతం వస్తే బాగుంటుంది. అవార్డులు, రివార్డులు, నివాళులను దృష్టిలో పెట్టుకుని కథకుల మీద వ్యాసాలు వస్తున్నాయి కానీ కథానిర్మాణం మీద, ప్రయోగాల మీద,

వాదాల మీద, వాటి ప్రాంతీయ అస్థిత్వాల మీద, కథా భాషల మీద, సంఘర్షణల మీద, ఎత్తుగడ, ముగింపుల మీద ఎన్నో వ్యాసాలు రావాలి. వచ్చిన కవిత్వం రూప ప్రయోగాలకు ముందుంటే కథలు వస్తు ప్రయోగాలకు ముందుంటున్నాయని మరిచిపోరాదు.

ఒకప్పుడు కవిత, కథను కానిన వాళ్ళు లేరు. నవల కున్నంత ప్రాధాన్యం మరోదానికి లేదు. వ్యాపార నవలల కర్మాగారాలు ఒకప్పుడు పత్రికలనే చెప్పాలి. అ సంఖ్యాక పాఠక దేవుళ్ళు నవలలకే ఉండేవారు. కాలక్షేప నవలా సాహిత్యం టీవి ఛానల్స్ పెరగడంతో తగ్గిపోయింది. ఒకప్పుడు ఉదయం లాంటి పత్రికలు నవల ప్రారంభం కావడానికి ముందు సెవంటి యం.యం. హీరో హీరోయిన్లలాగా రచయితల ఫోటోలు వచ్చేవి. మారు పేర్లతో నవలా రచయిత్రులుగా రచయితలు నవలా సీరియల్స్‌ను కనేవారు. వ్యాపార నవలలు తగ్గిపోయాయి. ఇప్పుడు భూమి, స్వాతి, నవ్య ప్రచురిస్తున్న నవలా సీరియల్స్ కు అప్పటిలాగా ఇప్పుడు వెర్రివ్యామోహాలతో, అత్యుత్సాహాలతో, ఆ నవల ముగింపు ఏమవుతుందోనన్న సెన్సేషనల్ కు లోనయ్యే పాటకులు తగ్గిపోయారు. వ్యాపార సీరియల్ నవలలతోపాటు ఉత్తమనవలలను కూడా సీరియల్స్ ముందూవేసేవారు ప్రస్తుతం వేస్తు ఉన్నారు, ఇప్పుడిప్పుడే ఉత్తమ నవలా సీరియల్స్ పాఠక సంఖ్య పెరుగుతూ ఉంది. డా. కేశవరెడ్డి నవల ఆంధ్ర ప్రభలో మూగవాని పిల్లనగ్రోవి వస్తున్నప్పుడు నవలా పాఠకులు యెక్కువగానే ఆదరించారు. పులుగు శ్రీనివాస్ నవల అన్నలు చాటింపు పత్రికలో వచ్చినప్పుడు అలాగే స్వాతిలో చిలుకూరి దేవ పుత్ర నవల అద్దంలో చందమామ వచ్చినప్పుడు సీరియల్ పాఠకులు చదివారు. ఈ మధ్య వచ్చిన పినాకపాణి - నిప్పులవాగు, బోయ జంగయ్య - జగడం, లోకేశ్వర్ - సలాం హైద్రాబాద్, వేముల ఎల్లయ్య - కక్క, నేరెల్ల శ్రీనివాస్ గౌడ్ - బతుకుతాడు, శ్రీరామ కవచం సాగర్ - మూలుగుతో పాటు మరికొన్ని నవలలు అశేష పాఠక ప్రపంచాన్ని కదిలించాయి. నవలలను ప్రచురించడానికి స్పాన్సర్ షిప్ కంపెనీలు ముందుకు వస్తున్నాయి. నవల సహజత్వాన్ని కోల్పోయి నాసిరకం నవలల్లా, యాంత్రిక నవలలుగా మారే అవకాశం ఉంది. నవలా ప్రచురణకు వ్యాపార పత్రికలు స్పాన్సర్ షిప్ కోసం తహతహలాడుతున్నాయి. ఆశ్చర్యం మేమిటంటే రాచకొండ విశ్వనాథశాస్త్రి - ఇల్లు స్వాతిలో సీరియల్గా వచ్చినప్పుడు ఆ పత్రికే ఒక స్పాన్సర్ షిప్గా మారటంవల్లే అందులో అది సీరియల్ గా రావటమేమిటని సీరియస్ సాహిత్య పాఠకులు అనుకున్నారు తెలుగు నవల సాహిత్య విమర్శ చాపకింద నీరులా వచ్చిందనే చెప్పాలి.

వల్లంపాటి వెంకట సుబ్బయ్య కథాసాహిత్యం మీద చేసినంత శ్రమ నవలా సాహిత్యం మీద చేయక పోవచ్చు కానీ చేసినంతలో గొప్పగానే చేశాడు. నవల జీవితంపై రాసిన విమర్శనా వ్యాసం మంచి వ్యాసం. అలాగే ఉమా మహేశ్వరరావు రాసిన తెలుగు నవలల్లో క్షీణ ధోరణులు, కాత్యాయని రాసిన తెలుగు నవలలపై మహిళా ఉద్యమాల ప్రభావం పడి అనేక మంచి మంచి వ్యాసాలు వచ్చాయి. రంగనాయకమ్మ జానకి విముక్తి మీద ఎన్.వేణుగోపాల్ రాసిన వ్యాసం ఎన్నో ఆలోచనలకు గురిచేసింది. 'తులసిదళం' నవలపై వచ్చిన చర్చలు రంగనాయకమ్మ రాసిన అంశాలు విజ్ఞానాన్ని నింపాయి. హాస్య నవలలమీద కోడూరి శ్రీరామమూర్తి రాసిన వ్యాసం నన్నెంతో ఆకట్టుకుంది. తెలుగు నవలా సాహిత్య విమర్శ ఎక్కువగా ఒక్కో నవలను తీసుకుని రాసిన వ్యాసాలే ఎక్కువగా వచ్చాయి. ఆ తరవాత ఒక్కో నవలా రచయితనో, రచయిత్రినో ఎన్నుకొని రాసిన వ్యాసాలు ఎక్కువగా వచ్చాయి. కవులు, కథకులు మరణించినపుడు, సన్మానాలు, అవార్డులు పొందినపుడు పత్రికలు ఏవిధమైన వ్యాసాలకు ప్రాధాన్యమిచ్చాయో నవలాకారులకు కూడా అదే ప్రాధాన్యమిస్తూ నవలా విమర్శలు చేశారు. వ్యక్తి ప్రాధాన్యం, వ్యక్తుల సృజనాత్మకథలను ప్రధానం చేసి రాయడంకంటే తెలుగులో వస్తున్న వివిధ

ధోరణుల పరిణామాలనూ, వాదాలనూ, పార్శ్వాలనూ, వివిధ ప్రాంతాల ఆర్థిక, రాజకీయ, సామాజిక నేపథ్యాలలో వచ్చిన నవలలను ఒక తాత్విక భూమికలో విశ్లేషించుకుంటే మంచిది. నవలా శిల్పం ఇదివరకటిలా లేదు. నవలా రచయితలు ప్రపంచ నవలలను ఎక్కువగా చదువుతున్నారు. ప్రయోగాలు చేస్తున్నారు. నవలల్లో ప్రయోగాల పరిశీలన చేయాలి. నవలా భాషను, యాసను, ప్రామాణికతను చర్చించుకోవలసిన అవసరం ఉంది.

పత్రికా సాహిత్యంలో కేవలం కథలు, నవలలు, విమర్శలు మాత్రమే ఉండవు. మరెన్నో సాహిత్యరూపాలు ఉంటాయి. పత్రికలలో వస్తున్న అనువాద సాహిత్యం చాలా ప్రాధాన్యం పొందింది. పాశ్చాత్య సాహిత్య ప్రక్రియలు తెలుగులోకి అనువాదం కావడం వల్ల తెలుగు సాహిత్యం మరింత సుసంపన్నమవుతుంది.. అనువాదాల రూపంలో కవిత, కథ, నవలలంత విస్తృతంగా విమర్శ రావటం లేదు. అనువాదాల వల్ల ఏర్పడే సమస్యలు, చేసేప్పుడు వచ్చే సమస్యలు వాటిలోని లోటుపాట్ల గురించి రాయాలి. భారతీయ సాహిత్య పరిణామాలు అనువాదాల ద్వారే తెలుస్తాయి. ముల్క్ రాజ్ ఆనంద్, నజ్రుల్ ఇస్లామ్, ఇక్బాల్ చంద్లనే కాదు మొపాస, నెరూడలనే కాదు, ఆయా దేశాల సాహిత్య పరిణామాలు తెలుసుకునేట్లు చేయాలి. మన పత్రికలు విధిగా నోబుల్ బహుమతులు పొందిన సాహితీవేత్తల మీద, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతల మీద వ్యాసాలు ప్రచురిస్తారు. అవసరమనకుంటే అవార్డు పొందిన వాళ్ల రచనలను అనువదింపజేస్తారు. విపుల పత్రిక అనువాద కథలకు మాతృహృదయాన్ని పంచుతున్నది. మనం ఒకప్పుడు అనువాద సాహిత్యంలో ముందంజలో ఉన్నా కానీ ప్రస్తుతం ఎందుకో లేమనే చెప్పాలి.

పత్రికల్లో బాలసాహిత్యం ఒక ప్రధానస్రవంతిగా విస్తరిస్తూ ఉంది. ఇదివరకు బాలసాహిత్యాన్ని పెద్దలు యెక్కువగా రాసేవారు. ప్రస్తుతం పత్రికలు వాళ్ల చేతే రాయిస్తున్నాయి. వార్త, జ్యోతి, ఈనాడు, ప్రభ ఒకటేమిటి అన్ని దినపత్రికలు, వారపత్రికలు బాల సాహిత్యానికి ప్రోత్సాహాన్నిస్తున్నాయి. సైంటిస్టుల మీద, తత్వవేత్తల మీద, యుగకర్తల మీద ప్రచురిస్తున్న చిన్న చిన్న వ్యాసాలైనా పిల్లల్లో ఒక ఉత్సాహం నింపగలుగుతున్నాయి. పిల్లల కూర్పులలో పంతుళ్ల మీద జోకులు, చదువు కొమ్మని చెప్పే తల్లిదండ్రుల మీద జోకులు యెక్కువగా వస్తున్నాయి. ఇవి మంచివి కావు. తెలుగు భాషా మాధుర్యాన్ని బాలసాహిత్యంలో ప్రవేశ పెట్టాల్సిన అవసరం ఉంది. ఆంగ్ల భాషా వ్యామోహాన్ని పిల్లల్లో తొలగించే పద్ధతుల్ని ప్రవేశ పెట్టాలి.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దేశ భక్త కవి కాళోజీ

– డా॥. వెల్దండి శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్.

కాళోజీ అనగానే ఒక ప్రతిపక్ష కవి, ఒళ్లంతా నోరు జేసుకున్న కవి, ఒక మాటలనది వంటి కవి, నిత్య చైతన్య కవి, ప్రశ్నల కవి, సమకాలీన కవి, రాజకీయ కవి, సమాజ కవి, మానవీయ కవి, ధిక్కార కవి, పౌరహక్కుల కవి, స్వేచ్ఛా కవి, ప్రాపంచిక కవి, సందర్భ కవి, స్థల కాల కవి, రన్నింగ్ కామెంటరీ కవి, అధిక్షేప కవి, మందలింపు కవి, నిత్య వేదన కవి, ఆందోళన కవి, నిరసన కవి, ఉద్యమ కవి, కష్టజీవుల కవి, హృదయావేశ కవి, సరళ కవి, దేశీయ కవి, గాంధేయవాద కవి, అచ్చమైన తెలంగాణ కవి అని ఇలా ఎన్నో విశేషణాలు మన గుండె లోలోపల ఉప్పొంగుతాయి. నిజానికి ఇవన్నీ ఒక జాతీయ కవి, ఒక దేశ భక్త కవి లక్షణాలు. అందుకే కాళోజీలో ఎన్నో పార్శ్వాలతో పాటు ఒక దేశ భక్త కవిని కూడా చూడవచ్చు. తాను బతికినన్ని రోజులు సమస్య ఎక్కడ ఉంటే అక్కడ ప్రత్యక్షమై యుద్ధరావంతో గొంతెత్తి కవిత్వమై పగిలిపోయేవాడు. 'కవులు ఎన్నుకొనబడని ప్రజాప్రతినిధులు' అనే మాటకు అక్షరాలా సరిపోయే నిలువెత్తు ప్రజాకవి కాళోజీ.

తెలంగాణ నేల మీది ప్రజలు, ఉద్యమకారులు ఒకే సమయంలో స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అటు బ్రిటిష్ వాళ్లకు వ్యతిరేకంగా పోరాడాలి. ఇటు అందులో భాగంగానే ఇక్కడి స్థానిక పాలకుడైన నిజాం ప్రభువుకు వ్యతిరేకంగానూ పోరాడాలి. తెలంగాణ స్వతంత్ర భారత దేశంలో విలీనమయ్యేదాకా కాళోజీ నారాయణరావు నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉన్నాడు. ఇదొక పార్శ్వమైతే భారత స్వాతంత్ర్య పోరాటంలో కూడా చాలా చురుగ్గా పాల్గొన్నాడు. దానికి నిదర్శనంగా అనేక సంఘటనలు ఆయన జీవితంలో కనబడుతాయి. తెలంగాణలో గ్రంథాలయోద్యమం స్వాతంత్ర్యోద్యమంలో చాలా కీలక పాత్ర వహించింది. తాను నివసిస్తున్న మడికొండలో కాళోజీ గ్రంథాలయ స్థాపనకు కృషి చేశాడు. నిజాం పాలిస్తున్న ప్రాంతమంతటా ఆర్యసమాజం సత్యాగ్రహోద్యమం నడుస్తున్నప్పుడు వరంగల్లులో ప్రభుత్వం అరెస్టు చేసిన వాళ్లలో కాళోజీ కూడా ఉన్నాడు. కాళోజీ చౌరస్తాలో నిలబడి కరపత్రాలు కూడా పంచాడు. వాటిలో 'క్విట్ ఇండియా' నినాదంతో పాటు 'క్విట్ నిజాం' నినాదం కూడా ఉంది. ఈ చర్య వలన అరెస్టయి కోర్టులో తానే కరపత్రాలు పంచానని ఒప్పుకున్నాడు. 1905లో పి. వి. నరసింహారావు, దాశరథి లాంటి వందేమాతరం ఉద్యమకారులను ఉస్మానియా విశ్వవిద్యాలయం బహిష్కరించినపుడు వాళ్లను ఆంధ్ర, మద్రాసు, బొంబాయి విశ్వవిద్యాలయాలు చేర్చుకోవడానికి నిరాకరిస్తే కాళోజీ తాను స్వయంగా ప్రజల దగ్గర విరాళాలు సేకరించి వందేమాతరం ఉద్యమకారులకు నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేరడానికి ఇతోధికంగా సహకరించాడు. 1937లో హైదరాబాద్‌లో న్యాయవిద్యను అభ్యసిస్తున్నప్పుడు కాళోజీ మిత్రులతో కలిసి జవహర్‌లాల్ నెహ్రూ ప్రసంగాలు వినడానికి షోలాపూర్ లాంటి ప్రాంతాలకు వెళ్లాడు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఆనాటి వివిధ రాజకీయ పక్షాలు అనేక దారుల్లో పయనిస్తుంటే కాళోజీ గాంధీజీ వైపు మొగ్గాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి కాళోజీ జైలు జీవితం గడుపుతున్నాడు.

"అవనిపై జరిగేటి అవకతవకలు చూసి
ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు
పరుల కష్టము జూచి కరిగిపోవును గుండె
మాయ మోసము జూచి మండిపోవును ఒళ్లు"

అంటూ తన నైజాన్ని ప్రకటించుకున్నాడు. అన్యాయాన్ని చూసి నిమ్మకు నీరెత్తినట్లు ఉండలేనితనం నుండి

కాళోజీ అగ్ని పర్వతమై మండిపోతాడు. అందుకే తన మార్గమంతా 'ప్రజల చేత, ప్రజల వలన, ప్రజల కొరకు' అన్నట్లుగా సాగిపోయింది. సామాన్యుల కన్నీటి బిందువు లను, ఆగ్రహాన్నే ఆయుధాలుగా గ్రహించి కాళోజీ కవిత ప్రజా పరం అయింది. "మనకేమని అనరాదు/మనది కానిదేమున్నది/దేశము దేశీయులదే/దేశీయులమన్న మనమే." అనేది కాళోజీ అభిమతం. అందుకే ఆయన కవిత్వం నిండా ప్రజలుంటారు. వారి దు:ఖం ఉంటుంది. వారి పోరాటం ఉంటుంది. బతికినంత కాలం ప్రజల తలలో నాలుకలా మెదిలాడు కాళోజీ. నిరంతరం ప్రజల వైపు నిలబడి ప్రజా క్షేమం కోసమే చివరి రక్తపు బిందువు వరకూ తపించాడు. ఒక వేమన, ఒక గురజాడ లాగా కాళోజీ కూడా ప్రజా ప్రతిధ్వని. ప్రజల మధ్యనే జీవించి, ప్రజల కోసమే శ్వాసించి, ప్రజల కోసమే ఎంతటి వారినైనా ఎదిరించిన సిసలైన ప్రజాకవి కాళోజీ. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా దేశభక్తి ప్రబోదాత్మకమైన గేయాలను ప్రచురించాలనే ఉద్దేశ్యంతో సర్ వాల్టర్ స్కాట్ రాసిన Lay of the last minstrel అనే గేయంలోని

"Breathes there a man, with soul so dead
who has not said unto himself, this is my own native land"

అనే పంక్తుల ఆధారంగా రాసిన 'మాతృదేశము' అనే కవితలో..

"నీరు లేని ఎడారియైనను/వాన వరదల వసతి యైనను
అగ్ని కొండల అవనియైనను/మాతృదేశము మాతృ దేశమే
దేశ దేశము తిరిగి చూడుము/కొంత హాయియె కూర్చు మదికిని
నాల్గు రోజులు నచ్చదేదియు/స్వర్గమే నపవర్గ మేనియు
తల్లి ఏడుపు తండ్రి కోపము/భార్య బిడ్డల ప్రణయ పాశము
ఇంచుకైన గణింపనీయదు/మాతృదేశము మాతృ దేశమె."

'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అనే రామాయణ వాక్య సారాన్ని విప్పి చెప్పే కవిత. ఏ దేశ పౌరునికైనా అతని దేశం అతడికి స్వర్గ భూమి. ఎన్ని కష్టనష్టాలెదురైనా, ఎన్ని ప్రతికూల పరిస్థితులున్నా మాతృ దేశాన్ని మించినది ఈ ప్రపంచంలో ఏదీ లేదంటాడు కాళోజీ. తన ప్రాంతం మీద ఇష్టం, అభిమానం, గౌరవం ప్రతి మనిషికుంటుందని మాతృదేశమంటే ఇష్టం లేదని చెప్పే పరమ నీచుడు ఈ భూస్థలమంతా వెదికినా దొరకడని కాళోజీ ఈ కవితలో చెప్తాడు. తన నేల మీద, దేశం మీద, సమస్త ప్రకృతి మీద ఇష్టం లేని వాడెవ్వడూ ఉండడని, ఉండకూడదని కవి దేశభక్తిని ప్రదర్శిస్తాడు ఈ కవితలో. చివరికి చనిపోయినా తనకు జన్మనిచ్చిన నేల కోసం, ఆ నేల మీదే చనిపోవాలని ప్రతి వ్యక్తి ఆరాటపడి దాని కోసం పోరాడుతాడని కవి అభిప్రాయం. దేశ భక్తిలో మొదట తనకు జన్మనిచ్చిన మాతృభూమి మీద అభిమానం పెంచుకోవడం ముఖ్యమైనది.

దేశ ఔన్నత్యాన్ని వివరిస్తూనే అనమ పాలనను ఈసడించుకుంటాడు.

"అన్నపురాసులు ఒక చోట/ఆకలి మంటలు ఒక చోట
హంస తూలిక లొక చోట/అలసిన దేహా లొకచోట
సంపదలన్నీ యొక చోట/గంపెడు బలగం బొక చోట"

దేశ భక్తి అంటే ఎక్కడో దేశ సరిహద్దుల్లో తుపాకీ చేత పట్టి శత్రు సైన్యాన్ని హతమార్చడమే కాదు. మనతో పాటు ఈ భూమి మీద జీవిస్తున్న సాటి మనిషికి నాలుగు మెతుకులు దొరకాలనే సమ సమాజ భావన కూడా దేశ భక్తే. కాళోజీ ఈ కవితలో అదే ధ్వనింపజేస్తాడు. పేదరికం ఒక చోట ఉంటే సంపదలన్నీ ఇంకెక్కడో పోగుబడి ఉండడాన్ని ప్రశ్నిస్తాడు. తన అవసరానికి మించి డబ్బు కూడబెట్టే ప్రతివాడు దేశ ద్రోహే. అలాంటప్పుడు కాళోజీ

లాంటి ప్రజా కవులు తప్పకుండా వ్యవస్థ తీరును ప్రశ్నించకుండా ఉండలేరు. కష్ట పడేదొకడు. సుఖపడే వాడొకడు. ఈ అన్యాయమేమిటని కవి ప్రశ్న. ఈ అసమానతలు తొలిగిపోయినప్పుడే దేశం అభివృద్ధి చెందినట్లని భావిస్తాడు కాళోజీ. పేదవాడికి బుక్కెడు బువ్వ దొరకనప్పుడు మనం శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంత ముందడుగు వేస్తే ఏముంది? ఎన్ని రాకెట్లు అంతరిక్షంలోకి పంపిస్తే ఏముంది? ఇంకా ఆకలి చావులున్నప్పుడు దేశం ఎటుపోతుందని ప్రశ్నిస్తాడు కాళోజీ.

"రాణి వాసములోన రంజిల్లు రాజా
రైతు బాధలన్నీ దీర్చి రక్షింప లేవా!
పట్టణపు సొగసుకై పాటుబడు రాజా
పల్లెకందము గూర్చు ప్రతిభయే లేదా!
భూములన్నియు నీకు భుక్తమైనట్లు
పల్లె బీదలబాది పన్ను లాగెదవా!"

ఈ నాటి పాలకులకు కూడా వర్తించే కవిత ఇది. ఒక్కసారి సింహాసనాన్ని అధిరోహించగానే ఏదో చెప్పరాని అధికారం ఒళ్లంతా ఆవహించి విర్రవీగుతుంటారు. పల్లెలను నిర్లక్ష్యం చేసి పట్టణాల పైపై సొగసులు చూసి ఇదే నిజమైన పురోభివృద్ధి అనుకుంటారు. అలాగే నమ్మిస్తారు. కాని పల్లెలు బాగున్నప్పుడే దేశం బాగుంటుందనే 'సోయి' ఉండాలని అంటాడు కాళోజీ. ప్రజలను హింసించు వాళ్లు, బీదల మీద పన్నులు వేసి విలాసాలు అనుభవించే వాళ్లు దేశ ద్రోహులని కవి భావన.

"ఓటిచ్చు అధికార మున్నట్టి వారు
ఎన్నికల సమయమున తిన్నగా వినుడు
మట్టి బానలు కొనిన కొట్టి చూచెదము
సరుకుకొన వీధెల్ల తిరిగి చూచెదము
పండు పండెనో లేదో పట్టి చూచెదము
.....
ఓటిచ్చునప్పుడే ఉండాలె బుద్ధి
ఎన్నుకొని తలబాదుకొన్న ఏమగును?
తర్వాత ఏడ్చినను తప్పదనుభవము"

ఏ దేశానికైనా ఓటు హక్కే ప్రాణ తుల్యము. అటువంటి ఓటు ఏ నాయకుని వేస్తున్నామనేది చాలా కీలకమని కాళోజీ దేశ పౌరులను హెచ్చరిస్తున్నాడు. ఒక స్పృహతో, ఎంతో ఆలోచించి ఓటు వేయాలని కాళోజీ పిలుపునిస్తున్నాడు. అప్పుడే బాధ్యతగల నాయకులు పాలకులుగా ఎన్నికై దేశం ప్రగతి పథంలో నడుస్తుం దంటాడు. నాయకులు చేసే వాగ్దానాలు విని మోసపోయి ఓటును దుర్వినియోగ పర్చవద్దని, దుష్టులెవరో, మంచివారెవరో తెలుసుకొని ఓటు హక్కు వినియోగిం చాలని కాళోజీ దేశ పౌరులకు ముందస్తు జాగ్రత్తలు చెప్తాడు ఈ కవితలో. ప్రజాస్వామ్యం పట్ల కాళోజీకి అపారమైన గౌరవం. అందుకే ఓటు విలువ ప్రతి పౌరుడు తెలుసుకోవాలని సూచించాడు. కుండ కొంటున్నప్పుడే ఎంతో జాగ్రత్త వహించే మనం ఐదేళ్ల పాటు మనల్ని పాలించే పాలకుడిని ఎన్నుకుంటున్నప్పుడు మాత్రం ఎందుకు జాగ్రత్తగా ఉండలేకపోతున్నాం. ఒక సారా పాట్లానికో, ఒక పచ్చనోటుకో మనల్ని మనం అమ్ము కుంటున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎలా బతికి బట్టకడు తుందని నిలదీస్తాడు కాళోజీ. దేశం సుభిక్షంగా ఉండా లంటే ప్రకృతితో పాటు మనం ఎన్నుకునే నాయకులు కూడా సహకరించాలని అప్పుడే దేశం గౌరవంగా ఇతర దేశాల ముందు తలెత్తుకు నిలబడుతుందనే భావన కాళోజీ కవితల నిండా పర్చుకొని ఉంటుంది.

"ఎవరనుకొన్నారు? ఇట్లౌనని ఎవరనుకొన్నారు?
.....
త్రివర్ణ పతాకచ్ఛాయలో త్రిశంకు స్వర్గం గలదని
అరచేతిలో స్వర్గం జూస్తూ నరకంలో పడతామని
ఎవరనుకొన్నారు? ఇట్లౌనని ఎవరనుకొన్నారు?
.....
స్వాతంత్ర్య దినోత్సవమ్ము శ్రద్ధలేని తద్దినమని
తెల్ల ఖాది తెరచాటున నల్లబజారు నాటకమని
దేశోద్ధారణమంతయు వేషాలని, మోసాలని
ఎవరనుకొన్నారు? ఇట్లౌనని ఎవరనుకొన్నారు?"

ఆంగ్లేయుల నుండి స్వాతంత్ర్యం పొందడమనేది సర్వరోగ నివారిణి అని అనుకున్నారు. కాని ఆచరణలో విషఫలితాలు రావడంతో కాళోజీ 'ఎవరనుకొన్నారు ఇట్లౌ నని ఎవరనుకొన్నారు?' అని ప్రశ్నించాడు. చేతల్లో చీమకు, ఏనుగుకు ఉన్నంత తేడా ఉందని ఆవేదన చెందాడు. ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న స్వాతంత్ర్యం మేడి పండులాగా మారిపోయిందని కుమిలిపోయాడు. పేదలు మరింత పేదలవుతారని, ధనవంతులు మరింత ధన వంతులవుతారని ఎవరనుకున్నారని స్వదేశీ పాలనను నిరసించాడు. ఈ కవిత ఇప్పటికీ ప్రాసంగికత కోల్పో లేదంటే అతిశయోక్తి కాదు.

"విదేశీ ప్రభుత్వానికి 1 సంపూర్ణ అసహకారం
2 విదేశీ వస్తు బహిష్కరణ 3 అహింసాయుత సంఘర్షణ
బాహాటంగానే తిరుగుబాటు సాగిస్తున్నాడు
లౌకిక మెరుగని అర్ధదిగంబరి మోహన్‌దాస్ కరంచంద్
ఆనాటి మా బాపు మహాత్మాగాంధి
తర్వాత 1 హిందూ ముస్లిం ఏకత
2 అస్పృశ్యతా నివారణ
3 ఖాధీధారణ 4 కుటీర పరిశ్రమ
ఇవి ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుని
క్రమశిక్షణ జీవన విధానం"

దుర్మతి ఉగాదినాడు దేశం ఎలా ఉందో బాధ పడుతూ సుదీర్ఘ కవిత రాశాడు కాళోజీ. ఎంతో నిబద్ధతతో ఉద్యమించి భారతీయులకు స్వాతంత్ర్యం సముపార్జించి పెట్టిన గాంధీజీ కలలగన్న దేశంలో ఇప్పుడు 'దేశాభిమానం, దేశభక్తి, ప్రజాస్వామ్యం, సర్వసత్తాక గణరాజ్యం అంతా కల్తీ'మయమేనని దేశ దౌర్భాగ్యానికి చింతించాడు. ఎన్నో అవవతవకలు రాజ్యమేలుతున్న కాలంలో సామాన్యుడు బతకడం గగనమై పోయిందని వాపోయాడు. గాంధీజీ లాంటి నిస్వార్థ నాయకులు పోయి ప్రజల జీవితాల్లో బొగ్గులు అలికే నాయకులు వచ్చారని ఇలాంటి కాలంలో ప్రజలు మరింత జాగరూకత వహించాలని కాళోజీ ఎప్పటికప్పుడు ప్రజల్ని హెచ్చరించేవాడు.

"స్వాతంత్ర్యంబన సఖుడా/స్వైర విహారంబుగాదు
స్వైర విహారుల కెపుడు/స్వాతంత్ర్యంబచ్చిరాదు
బాధ్యత ఎరుగని స్వేచ్ఛ/బానిసత్వ లక్షణము
బాధ్యత యెరిగిన స్వేచ్ఛ/స్వాతంత్ర్యపు రక్షణము
విచ్చల విడి వర్తనమే/స్వేచ్ఛా స్వాతంత్ర్యంబని
భావించెడి వారెవ్వరు/బాధ్యతగల పౌరులవరు"

ఒక వైపు పాలకులను దుమ్మెత్తి పోస్తూనే దేశ పౌరులకు ప్రవర్తనా నియమావళి రాశాడు కాళోజీ. విచ్చల విడితనం, విశృంఖలత్వం సంఘ జీవితానికి ఎప్పుడూ చేటే కలిగిస్తుం దని హెచ్చరించాడు, స్వాతంత్ర్యమంటే అవధులు లేని స్వేచ్ఛకాదని, పరిమితులు లేని స్వేచ్ఛ సంఘ జీవితాన్ని సంక్షోభంలో పడేస్తుందని అన్నాడు. ఆయన భావించి నట్లుగానే అపరిమితమైన స్వేచ్ఛ వలన ఎన్ని దుర్మార్గాలు జరుగుతున్నాయో మనం రోజు వారి జీవితంలో రుచి చూస్తూనే ఉన్నాం.

"మనమెవరము - మనమెవరము
ప్రజాస్వామ్య - రాజ్యాంగము
పరిపాలగల - భారత పౌరులమా?
లేక మనం ఆకతాయి - ఆగడాల
దైనందిన చర్యలకు - జడసి జడసి
దేబెల వలె బ్రతుకుచున్న పురుగులమా?"

సామాన్యుల జీవితం ఎంతో కిందికి దిగజారి పోయింది. పట్టపగలే జరగరాని అకృత్యాలెన్నో యధేచ్ఛగా జరుగుతున్నాయి. అయినా మనం మన్నుతిన్న పాములా జీవిస్తూనే ఉన్నాం. చీము నెత్తురు చచ్చిపోయి ఏ మాత్రం పౌరుషం లేకుండా బతుకులీడుస్తుంటే కాళోజీ మనం మనుషులమేనా లేక పురుగులమా? అని ప్రశ్నించి చేవ చచ్చిన జాతిని మేల్కొల్పుతున్నాడు. 'దేశపుగోడు' (1944), 'కోటగోడలు నేల కూలుతున్నాయి' (1945) లాంటి కవితల్లో కూడా కాళోజీ బ్రిటీష్ వారు ప్రదర్శించిన వివక్షను, అసమానతను ఎండగట్టాడు.

కాళోజీ రాసిన ప్రతి అక్షరం మెరుగైన సమాజం కోసం, ఆదర్శవంతమైన దేశం కోసమేనంటే అతిశయోక్తి కాదు. పాల్కురికి సోమనాథుని ద్విపదలాగా కాళోజీ కవిత కూడా సామాన్య ప్రజల హృదయాన్ని తాకుతూ సరసరా ముందుకు సాగిపోతూనే ఉంటుంది. కాళోజీ జీవించి నంత కాలం ప్రజల గొడవనే 'నా గొడవ'గా వినిపించాడు. ఆయన గొడవంతా ప్రజల కోసం, దేశం కోసం, సమాజం కోసం. రాసిన ప్రతి అక్షరం కవితామయమే. అయితే సోకాల్డ్ కవులు, విమర్శకులు చెప్పుకునే భావం, శిల్పం, భాష, అలంకారాలు, ధ్వని ఇత్యాది వాటి గురించి పట్టించుకోకుండా తాను చెప్పదల్చుకున్నది కుండబద్దలు కొట్టినట్టు చెప్పడమే కాళోజీ కవిత్వపు మర్యాద. ఆయన ఎజెండా కేవలం ప్రజలు. వాళ్లకు ఏమాత్రం అగౌరవం కలిగినా, వాళ్లకు ఏ మాత్రం ఇబ్బంది కలిగినా వెంటనే కవిత్వమై పోరాటం మొదలుపెడుతాడు. ఆవలి వైపు ఎంత పెద్ద నాయకుడున్నా, ఆత్మీయ మిత్రుడున్నా, సిరిగలవాడున్నా, సాక్షాత్తు ఆ దేవుడే ఉన్నా కాళోజీ ఎదిరించి తీరుతాడు. ఈ లక్షణమే కాళోజీని ప్రజా కవిగా, దేశీయ కవిగా, దేశభక్త కవిగా నిలబెట్టింది.

రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ అనే పూర్తిపేరు గల కాళోజీ నారాయణరావు 9 సెప్టెంబర్ 1914లో రమాబాయమ్మ, రంగారావులకు జన్మించాడు. భార్య రుక్మిణిబాయి. నిజాం ప్రభువు దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచకత్వానికి, చీకటి పాలనకు వ్యతిరేకంగా కలం ఎత్తిన కలం యోధుడు కాళోజీ. బహు భాషా కోవిదుడైన కాళోజీ సమకాలీన సామాజిక సమస్య లపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించిన జనబాహుళ్య కవి. ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం కాళోజీ కవిత్వం నిండా నిండుగా ఉంటాయి. సామాన్యుడే నా దేవుడు అని అని ప్రకటించిన కాళోజీ 13 నవంబర్ 2002లో వరంగల్‌లో మరణించాడు. వీరిని భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారంతో గౌరవించింది. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ మరణించినప్పుడు కాళోజీ నారాయణ రావు

"పుటుక నీది
చావు నీది
బ్రతుకంతా దేశానిది"

అని రాశారు. సరిగ్గా ఈ కవితా పంక్తులు కాళోజీకి కూడా వర్తిస్తాయి.



BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మూలమలుపు - ఒక ప్రతీకాత్మక దృశ్యమానం

- డా॥. వి. త్రివేణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

"Symbolism"కు సమానార్థకంగా తెలుగులో 'ప్రతీకాత్మకత' అనే వ్యవహారనామం ఉంది. పాశ్చాత్య సాహిత్యంలో దీని ప్రాధాన్యత అత్యధికం. తెలుగులో కూడా ఆధునిక సాహిత్య విమర్శా పద్ధతుల్లో నేడు ప్రతీకవాదం స్థానం కల్పించుకుంది. కవిత్వంలో వీటి ప్రయోగం అనివార్యమవుతుంది. కవిత్వ ప్రయోజనాన్ని చేకూర్చడానికి కవులు ప్రతీకలను అనునంధానం చేస్తున్నారు. అందులో భాగంగానే సామాజిక ప్రతీకలు, వ్యష్టి ప్రతీకలు విభజింపబడ్డాయి. వెలుతురు - జ్ఞానానికి, చీకటి - అజ్ఞానానికి, వసంతం - జన్మకు, శిశిరం - మృత్యువుకు, అఖండజ్యోతి - ఆదర్శానికి ప్రతీకలుగా చెప్పబడుతున్నాయి. తాత్విక దృక్పథంతో పురాతన కాలం నుండి సాహిత్యంలో ఇవి చోటుచేసుకుంటు వస్తున్నాయి. నీలం - కార్మిక శక్తికి, ఎరుపు - విప్లవ భావానికి, ఆకుపచ్చ - మేధావి తనానికి ప్రతీకలుగా సైద్ధాంతిక నేపథ్యంలో ఏర్పడ్డాయి. ఇనుము - ధనిక వర్గానికి, రాగి - మధ్య తరగతికి, తుత్తునాగం - శ్రామిక వర్గానికి విప్లవ సంకేతాలుగా వ్యవహరింపబడ్డాయి. ఇవన్నీ సామజిక, వ్యష్టి ప్రయోజన నేపథ్యంలో కవిత్వ గాఢతకు తార్కాణంగా నిలుస్తున్నాయి. ఈ ప్రతీకలు మూడు విధాలుగా కవిత్వంలో ప్రయోగింపబడుతున్నాయి. 1. పదాలు, పద బంధాలకు ప్రతీకలను ఎన్నుకోవడం, 2. కవితా శీర్షికకు, కవితా సందేశానికి ప్రతీకలను ఎన్నుకోవడం, 3. దీర్ఘ కవితా శీర్షికకు, దీర్ఘ కవిత సూచించే సందేశానికి ప్రతీకలను సమూహంగా ఎన్నుకోవడం. అదేవిధంగా వస్తు ప్రాధాన్యతను బట్టి పురాగాధా, చారిత్రక సాంస్కృతిక సామాజిక ప్రతీకలు కవిత్వంతో కూడి వస్తున్నాయి. భావాత్మక పరవశంలో కవి ప్రకృతి ప్రతీకలకు ఆకర్షితుడవుతున్నాడు.

As commonly used in discussing Literature, symbol is applied only to a word or set of words that signifies an object or event which it self signifies something else, that is the words refer to something which suggests a range of reference beyond it self.

- A Glossary of literature Terms - MH Abrams.

ఏదైనా ఒక వస్తువునుగాని, భావాన్ని గాని సూచించే మరో వస్తువు గాని, భావం గాని ప్రతీక అనుకోవచ్చు. ఈ దృష్టితో చూస్తే శబ్దాలు అన్నీ ప్రతీకలే. ప్రతీకలతోనే ఆలోచనను సాగించవచ్చు. ఉదాహరణకు బీజగణితంలో వట్టి అక్షరాలనే ఉపయోగించి ఆలోచనను సాగిస్తాం. అందుకే బీజ గణితాన్ని 'ప్రతీకాత్మక తర్కం' అనవచ్చు. సాహిత్యంలో ప్రతీకకు మౌలికంగా ఉన్న అర్థం ఇక్కడ నుంచే ప్రారంభమవుతుంది. ఒక శబ్దం కాని, శబ్ద సముదాయం గాని, ఒక వస్తువునో, క్రియనో, సంఘటననో సూచిస్తూ, అది తిరిగి వేరొక అంశాన్ని సూచించినప్పుడు అది ప్రతీక అవుతుంది. ఆ శబ్దాలు ఏ సాధారణార్థాన్ని సూచిస్తాయో ఆ ఆవరణను దాటి ఉన్న అంశాలను అది ధ్వనింపజేస్తుంది.

పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర - సిద్ధాంతాలు : వడలి మందేశ్వరరావు

తెలుగులో మొదట ఈ ప్రతీకవాదం శ్రీశ్రీ, ఆరుద్ర, నారాయణ బాబు కవిత్వంలో తాత్విక నేపథ్యంలోనే ప్రదర్శింపబడింది. అనంతరం గుంటూరు శేషేంద్ర శర్మ, ఆర్.ఎస్.సుదర్శనం, జి.వి.సుబ్రహ్మణ్యం, ముదిగొండ వీరభద్రయ్య కవిత్వంలో కళాత్మకతను సంతరించుకుంది. తెలంగాణలో తొలితరంలో పాట్లపల్లి రామారావు, మలితరంలో సినారె కవిత్వంలో ఆయా దేశ కాల సామాజిక గతి తర్కానికి అనుకూలంగా నిలిచింది. ప్రశ్నిస్తి

పొందిన ఆధునిక కవులనెందరినో ఈ ప్రతీకాత్మకత ప్రభావితం చేసింది. ఆ వరుసలోనే డా॥ ఏనుగు నరసింహా రెడ్డి రచించిన 'మూల మలుపు' కవితా సంపుటిని ప్రతీకల దృశ్యమానంగా పరిశీలించవచ్చా! అనే ఆలోచన, సందేహం, సంశయం కలిగింది. ఆలోచన ఎందుకంటే మూలమలుపు - చదువుతుంటే అపారంగా కనిపించిన పద భావ చిత్రికలు. వాస్తవిక, అధివాస్తవిక కలిగిన ఆయన కవిత్వంలో ప్రతీకల స్థానం సందేహ స్థితిలో ఉంటుందని. ఇక సంశయం అసలు పరిశీలిస్తే కదా! ప్రతీకల విలువ లను తూచ గలిగేది. ఈ రీతిగానే తలపోస్తూ 'మూల మలుపు'ను విమర్శనాత్మక దృష్టితో అధ్యయనం చేశాను.

నరసింహారెడ్డి కవితా సాంద్రత తెలిసినవారు. కవిత్వం, విమర్శ, సమీక్ష, సంపాదకత్వం, పరిష్కరణ, పరిశోధన, ప్రచురణ వంటి సాహిత్య రచనా వ్యాసంగ బాధ్యతలను మోస్తూనే ప్రభుత్వాధికారిగా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు. తెలంగాణ 'మట్టి పాట'తో పల్లె సిరులను అందించారు. శ్రమ సౌందర్యాన్ని నివేదించారు. 'కొత్తపలక' తెలంగాణ అస్తిత్వ మూలాల నుండి పుట్టుకొచ్చింది. తెలంగాణ భాష, భావం, సొంపు, వ్యవహారం, జీవన కదలికలకు తెలంగాణ రుబాయిలు తెలిపి ప్రత్యేక ఒరవడిని చేకూర్చాయి. 'మట్టి పాట', 'కొత్త పలక' నోస్టాలజీ స్మృతులతో అలరించాయి. 'సమాంతర స్వప్నం', 'నేనే' వైయక్తిక భావ సరణి నుండి ఉద్భవించాయి. ఏది ఏమైనా కవిత్వానికి కామన్ అడ్రస్‌గా డా॥ ఏనుగు నరసింహారెడ్డి నిలవడం అని వార్యమే. అది తెలుగు కవితా శాఖకు పుష్టిని కలిగిస్తుంది. నూతన కవిత్వ ధోరణులకు ఆయువు పట్టుగా నిలు స్తుంది.

'మూల మలుపు' తెలంగాణ ఆత్మీయతలను పలకరిం చింది. 'మలుపు' అంటే మార్పు. మనిషి జీవితంలో మార్పును కోరుకోవడం సహజం. మార్పు మంచిదే, కష్టాల నుంచి సుఖానికి, బాధల నుండి ఆనందానికి, కాలే కడుపు నుండి నాలుగు మెతుకులకు, ఎడారి బతుకుల నుండి తడారిన సంతోషాల కోసం మార్పు పొందాల్సిందే. సమాజం కోరుకునేది ఇదే. 'మూలం' ఒక ఆధారం. మూలం లేని వస్తు రూపాలు నిలువలేవు. మూలాధారం లేని ప్రాణి జీవించలేదు. ఈ పదాల కూర్పులో ఉన్న నిసర్గ, సంసర్గ అర్థయుక్తి సమస్త జీవకోటికి ఆధారంగా నిలిచింది. 'మూల మలుపు' ఒక సామాన్య వ్యవహార నామమైనా; నిగూఢార్థంలో బేధం ఉంది. నరసింహారెడ్డి నడిచిన బాటలో ఎన్నో జ్ఞాపకాలు, మరెన్నో బంధనాలు. అడుగు అడుగులో ఒప్పారిన బాంధవ్యాలను నెమరేసు కుంటూ సాగిపోయిన మలుపు ఇది. ఒక జీవితకాల గమనానికి స్థిర పరిచిన మూలం ఇది. సమాంతర మానవ సమూహాల సంకేతంగా ఎవరికి వారు ఈ వలయంలో నిలువరించవచ్చు. అంతేకాదు తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని మూల మూలన నిగ్రహింపవచ్చు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించడానికి ముందు, అనంతర కాలాల బేరీజును స్పష్టంగా పరిగణించవచ్చు. అందుకే ఈ 'మూల మలుపు' ఒక వ్యక్తికే కాదు; ఒక సమూహ మనుగడకు, ప్రాంతీయ ఒరవడికి నిర్దేశించబడింది.

పేదల పట్ల పక్షపాతం కలవారు, శ్రమ శక్తిని తెలిసిన వారు, అన్యాయాన్ని, అక్రమాన్ని ఎదిరించినవారు కవి నరసింహారెడ్డి. వీరి కవిత్వం నిండా అణచబడిన సమాజంపై చూపబడుతున్న అధికార వాంఛ పట్ల నిరసన క్రూర స్వార్థపు రాజకీయ ధోరణి మీద ఖండన ప్రదర్శింప బడింది. అందుకోసం ప్రక్షాళన దిశగా ఎంచుకున్న కవితలన్నింటిలో ప్రతీకల ప్రయోగం చైతన్యాన్ని, స్ఫూర్తిని కలిగించాయి. 'ఒకర్నొకరం తప్పిపోతూ' కవితలో నగర స్వరూపం తెలిపారు. మానవత్వం లేని పరుగుల మయంతో కూడిన జీవన గమనాన్ని కవి బాహాటంగానే ఖండించారు. నగరంలో నూతనత్వం వికృతత్వంతో, నునుపుదనం సంరంభంలో ఎంతకీ అంతుపట్టకుందని అంటారు. 'కుబుసం', 'నగ్నం', 'పూనకం' వంటి ప్రతీకలు ప్రయోగించి నగరంలోని రోడ్లు, రాత్రులు, కూడళ్ళ నిజ స్వరూపాలను బట్టబయలు చేశారు. నగరం అధునాతన మైంది. ప్రపంచీకరణ ప్రభావంతో మార్కెట్ మాయా

జాలాన్ని, యాంత్రిక ఉగ్ర కోరల్ని పులుముకుంది. ఆకాశ హర్మ్యాలతో, బహుళ అంతస్తులతో పునాదిని చూడలేని సౌధాల స్థితిని ఆయన అత్యంత వేదనా భరితంగా వ్యక్తపరిచారు. మార్కెట్ ప్రపంచంలో లోకం వచ్చిన దారిని మర్చిపోతూ, మనుషులందరూ మాల్స్‌లో చిక్కుకు పోతూ ఉండే వైనాన్ని తెలిపారు.

'ప్రాచీలోకంలోకి తొంగి చూసి
వ్యత్యాసాల వేదనని తట్టుకోలేక
వర్తమానంలోకి దూకేస్తుంటారు
ఉక్కు కవచాన్ని ధరించామని భ్రమిస్తూ
మాయా వాయువుల్ని
మజా చేస్తుంటారు' (పుట.24)

నగరం ఒక విష వలయం. అది ఎరుగని పట్టణ వాసులు ధనం, దర్పం, ఆడంబరం, అధికారం ప్రదర్శిస్తుంటారు. వీటినే ఉక్కు కవచాలుగా భ్రమిస్తారు. కాని కాలుష్య ప్రపంచంలో ఉన్న సంగతి మరిచి విలాసాలకు బానిస అవుతారు. కవి ప్రయోగించిన 'ఉక్కు కవచం', 'మాయా వాయువులు' ప్రతీకలు పట్టణ భ్రాంతిని మాయం చేస్తుంది. 'ప్రాచీన లోకం', 'వర్తమానం' ప్రతీకలు మానవ అంతరంగ స్పృహను కలిగిస్తుంది. ఆప్యాయతాను రాగాలు గల 'ప్రాచీ లోకం' ప్రేమ పాశానికి నిదర్శనం. 'వర్తమానం' మమతను మరిచిన వైయక్తిక ప్రలోభానికి తార్కాణం. ఇవి రెండు పల్లె - పట్టణాలకు ప్రతీకలుగా కవి నర్సింహారెడ్డి భాసింప జేయడం సముచితంగా ఉంది. చౌరస్తాలు, బ్యాంకులు, ఏటిఎంలు, కమర్షియల్ కాంప్లెక్సులు, కాలేజీలు కొండ గుర్తులుగా పెట్టుకున్న నగరమంతా ఒక్క తీరుగానే ఉంటుందంటారు కవి.

ఆనవాళ్ళ ఆత్మ ఎక్కడా కనిపించదు
కదిలించే ప్రేమ వాక్యం
ఎక్కడా పలకరించదు
కనుమరుగైన ఊరి గురుతులు
ఎంతకీ అంతు పట్టవు
అంతా సిమెంటు కీకారణ్యం
డబ్బు జెండాలెత్తిన
నిలువు బంగళాలు
ఎన్ని సంకేతాలు చెప్పినా
ఇప్పుడు పోల్చుకోవడం
తరం కాదు. (పుట.24)

'సిమెంటు కీకారణ్యం', 'డబ్బు జెండాలు' మానవత్వం గడ్డ కట్టుకుపోయిన జనారణ్యానికి, ధనాహంకారాన్ని ఎగరేస్తున్న బంగళాలకు ప్రతీకలుగా ప్రయోగించడంలో ఆయన సమాజ రచనా శైలికి దర్పణం పడుతుంది. నగర జీవితంలో అనుబంధాలను తప్పిపోయే స్థితిని ఈ కవిత మొత్తంలో ప్రకటించారు.

'మనం లేపిన గోడల నీడలు ఎంత కురుచవి!' అంటూ అధికార ప్రతీకలతో నరసింహారెడ్డి 'సరిహద్దుల్ని ధిక్కరిస్తూ' అనే కవిత రచించారు. దేశాల మధ్య అంతర్యుద్ధం అనివార్యమవుతుంది. దేశ సమగ్రతను కాపాడుకోవడంలో మతాన్ని ప్రపంచ పుటంపై పరివ్యాప్తం చేయడంలో, శక్తియుక్తుల ప్రాబల్యంతో ఆధిపత్యాన్ని ప్రదర్శించడంలో, అణు విస్ఫోటనాల ప్రకల్పనలతో భయోత్పాతాన్ని కలిగించడంలో రాజ్యాలు పోటీపడుతున్నాయి. వాయువు, ఊపిరి, శ్వాస ప్రపంచ మానవ మనుగడకు ఒకటే అయినప్పుడు ఈ అంతరాలు నశించాలనే వాంఛ ఆయన ఈ కవితలో వ్యక్తపరిచారు.

సరిహద్దులను ధిక్కరిస్తూ
శీతవాయువు విస్తరిస్తుంది
ఆవరణాన్ని దాటుకుంటూ
వెలుగురేఖ పుడమిని చేరుతుంది
మైదానాన్ని, కొండల గుంపునూ
సాగర తీరాన్ని, కీకారణ్యాన్ని
ఏకం చేస్తుంది జడివాన (పుట.74)

'శీతవాయువు', 'వెలుగురేఖ', 'జడివాన' ప్రతీకలతో జగతినంతటిని సమైక్య పరిచారు కవి. ఈ ప్రతీకలన్నీ సరిహద్దులను ధిక్కరించే గుణాన్ని కలిగి ఉన్నాయి.

మానవత్వం, అభ్యుదయం, చైతన్యం వంటివి ఆయా ప్రతీకలకు అర్థాలుగా పేర్కొనవచ్చు.

'చివరి భోజనం' కవితలో అగ్రరాజ్య ఆధిపత్య క్రౌర్యాన్ని, శౌర్యాన్ని కవి చీల్చి చెండాడారు. అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో ఏక ఛత్రాధిపత్యం, సామ్రాజ్య భావజాలం రాజ్యాల్లో చోటు చేసుకుంటుంది. ప్రపంచం అంతా తమ కబంధ హస్తాల్లోకి మార్చుకుంటుంది. ఆ జన్మ బందీలుగా సమస్త దేశాలు మారిపోతాయి. దేశీయ నైపుణ్యాలకు ఆదరణ కరువవుతుంది. విదేశీ మారకం చెలామణిలోకి వస్తుంది. అగ్రరాజ్యం తమ ఉక్కు పిడికిళ్ళలో ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకుంటుంది. మానవ సమూహం జీవన్మరణ సమస్యలో పడిపోతుంది. కవి నరసింహారెడ్డి నిఖిల లోకాల విద్వేషాలకు, విధ్వంసాలకు కారణమయ్యే బూర్జువా రాజ్యాధికార సిద్ధాంతాలు ఏవిధంగా ఉంటాయో ఈ కవితలో తెలిపారు. 'నరాల దిరిసెన తీగలు', 'రక్త దాహపు రాచక్రీడ' వంటి ప్రతీకలు మరణశిక్ష పడిన వ్యక్తి ఆత్మఘోషను తెలుపుతాయి. జీవన వేదనలన్నీ సంవేదన మరణంతో కలిసి అంతర్ధానమవుతాయి. ప్రకటించినప్పటినుండే ఆ వ్యక్తికి నరకం ప్రారంభమవుతుందని, అదే అత్యున్నత శిక్ష అని కవి అంటారు. ఈ సందర్భంలోనే 'జారిపోయిన బండి ఇరుసులు', 'చెదిరిపోయిన జ్ఞాపక శకలాలు', 'పరుచుకున్న తల్లి ఒడి', 'తుడిచే ప్రియురాలి స్పర్శ', 'ఊయల లూపిన కుక్కి మంచం' ఎప్పటికి దరిచేరవని కవి హార్ద్రంగా స్ఫురింపజేశారు. వీటన్నింటికి ప్రతీకగా 'ఒంటరి దు:ఖం' ప్రయోగించారు. సమస్తం కోల్పోయి జీవచ్ఛవమైన అమాయకత్వం శిక్షకు సిద్ధమవుతుంది. అక్కడ బందీ అయింది వ్యక్తి కాదు. శిక్ష అమలయింది వ్యక్తికి కాదు. వ్యక్తిగల జాతికి. జాతి గల దేశానికి...

దు:ఖం
ఒంటరి దు:ఖం
పంచుకోలేని నిర్వచించుకోలేని దు:ఖం
నలువైపులా ఆవరించుకున్న
నల్లని రాతి గోడలకు అలవికాని దు:ఖం
preplanned cruel murder
Resulted in capital punishment (పుట.28)

నల్లని రాతి గోడలను విషాద ఛాయలకు, అంధకార బంధురానికి, జీవితపు చివరి ఊనికికి ప్రతీకగా కవి ప్రయోగించారు. దైవం విధించవలసిన శిక్ష రాజ్యం శాసించడాన్ని కవి ధిక్కరించారు. మరణ శిక్షను రాజ్యం దించే 'ప్రకటిత గునపం'గా, మధ్యయుగాల 'రాక్షస దాహం'గా పేర్కొంటూ రాజకీయ ప్రతీకలను అనుసంధానించారు.

సామాన్యులకు రాజ్యం కైవసం అయితే ఎలా ఉంటుందో కేజ్రీపూల పరిమళం ప్రబోధిస్తుంది. కవి నిరాడంబరతకు, స్వచ్ఛతకు, స్వేచ్ఛకు పట్టం గట్టిన గెలుపుగా కేజ్రీవాల్ విజయాన్ని అభివర్ణించారు. కాని అప్పటి స్వార్థపు రాజకీయ పార్టీలను, అవినీతిని మోస్తున్న నాయకులను నిరాఘాటంగా ఖండించారు. వారిని కరెంటు తీగల మీద చిరిగి కొట్టుకుంటున్న గాలిపటాలుగా, వాడి పారేసిన దూది ముద్దల్లా రెపరెపలాడుతున్న ప్లాస్టిక్ కవరులుగా అభివర్ణించారు. 'గాలిపటాలు', 'ప్లాస్టిక్ కవరులు' ఇందులోని ప్రతీకలు. ఆశలు, కోరికలకు 'గాలిపటాలు', ఆకర్షణ, ప్రలోభాలకు 'ప్లాస్టిక్ కవరులు' ప్రతీకలుగా నిలుస్తున్నాయి. ఇవి రాజకీయ పార్టీలు పొడసూపుతున్న ఎరలు. వీటి మాయలో పడి కొట్టుకుంటున్న జనం. ప్రజలకు కవి 'గొర్రె పిల్లలను' ప్రతీకగా నిలిపారు. 'ఆకుపచ్చని దర్వాజ', 'కషాయం ఖంగుతిన్నది' ఇవన్నీ రాజకీయ ప్రతీకలుగా గుర్తింపబడతాయి. 'నిజాయితీ నిప్పు' చైతన్య ప్రగతి వాద ప్రతీక. సామాన్యుడైన కేజ్రీ గెలుపుకిది ఊతం.

అధికార ప్రతీకలను నరసింహారెడ్డి ప్రయోగించి రాజస గర్వాన్ని నిరసించారు. 'నటన దాని నైజం' కవితలో సామాన్యులను అత్యంత సులువుగా మోసం చేసే అధికారుల అసలు స్వరూపాలను వెలువరించారు. పేదల కోసం ప్రవేశపెట్టే పథకాలు, సంక్షేమాలు స్వార్థపు ప్రయోజనాల లబ్ధిలో కూరుకుపోతున్నాయి. ప్రజలకు దరిచేర

నంత దూరంలోనే వాటి కాలం చెల్లిపోతుంది. నిజం మాట్లాడే స్వేచ్ఛ సామాన్యుడికి లేదు. సామాన్యుడు ఎప్పుడూ గొప్పవాడు కాడు. గొప్పవాడు అధికార పీఠం ఎక్కినంత మాత్రాన అధముడే. సంస్కారం, మంచితనం ఉన్నత భావాలు. అవిలేని నేటి రాజకీయ స్థితిని ఆయన వ్యతిరేకించారు. 'కుర్చీలు నగిషీలు పొదిగిన మణులు / మకుటాల మెరుపుల్ని ద్విగుణీకృతం చేసే కెంపులు / దూరం పెరిగినందున ప్రతిఫలించే నునుపు / మేలిమిగా మెరుస్తుంటాయి / నిజానికి / గొప్పదేదీ పైన ఉండదు' (పుట. 42)

దేశంలో ఇటీవల నోట్ల రద్దు జరిగింది. దీని ద్వారా భారత ఆర్థిక వ్యవస్థలో ఒక సమూల మార్పును సామాన్య ప్రజానీకం ఆశించింది. రిజర్వు బ్యాంక్ సారథ్యంలో భారత ప్రభుత్వం తీసుకున్న అతిపెద్ద నిర్ణయం ఇది. కాని అవినీతి పరులను, అక్రమంగా ధనం సంపాదించిన వారిని, బ్లాక్ మనీగా విదేశ బ్యాంకుల్లో డబ్బు దాచిన వారిని ఈ పెద్ద నోట్ల రద్దు ఏమి చేయలేకపోయింది. భారత ఆర్థిక భాండాగారాన్ని పునర్వ్యవస్థీకరించడానికి ఇటువంటి విధానాలు నిష్ఫలమే అయ్యాయని ఆర్థిక నిపుణులు సూచించారు. సంపన్న కుటుంబాలలో నిలిచి పోయిన నల్ల ధనాన్ని వెలికితీయడానికి అనుసరించిన ఈ విధానం హాస్యాస్పదం కావడం పట్ల కవులు ప్రతి కూలంగా స్పందించారు. కార్పొరేట్ సంస్థలు టాటా, బిర్లా, రిలయన్స్ కంపెనీలలో పేరుకుపోయిన వ్యాపార సంస్కృతికి భిన్నంగా ఈ విధానం ఒక నూతనత్వాన్ని సంతరించుకొని ఉంటే బాగుండేదని కవి ఆలోచన

అడ్డూ అదుపూ లేని
ఆర్యావర్తపు బాహుబలి
మంత్రాల వల విసిరిండు
ఏ తిమింగలమూ పట్టుబడలే
రోజువారీ బాణాలు గురిపెట్టిండు
ఒక్క పెద్ద పులీ రక్తమోడలే
హనుమంతుడనుకున్నాం కానీ
ఏ లంకనూ కాలబెట్టలే
చిటికె వేసి చిదంబర రహస్యాలన్నీ
విప్ప బోయిండు
చిత్రంగా
బేతాళుడు మళ్ళీ చెట్టెక్కి కూసుండు (పుట.101)

ఈ పంక్తులు 'రద్దు కాయిదం' కవితలోనివి. ఇందులో పౌరాణిక జంతు ప్రతీకలు అనేకం ఉన్నాయి. 'బాహుబలి', 'హనుమంతుడు' ఈ ప్రతీకలు ప్రధానికి వర్తిస్తాయి. 'తిమింగలం', 'పెద్దపులి', 'లంక' వంటి ప్రతీకలు ధన దాహంతో విపరీతంగా సంపాదిస్తున్న బడాబాబులకు వ్యవహరింపబడ్డాయి. 'బేతాళుడు' అంటే రిజర్వు బ్యాంక్. రద్దు కాయిదంలో ఏమాత్రం లాభాల సరణి సూచి కిందికి రాని కమర్షియల్ మార్కెట్ సంస్థలను, వ్యక్తులను కవి ప్రతీకలతోనే ప్రతిఘటించారు.

మరొక కవిత 'అతడు, బోరు, పాప' విషాద ఛాయ లను అలుముకుంది. బోరుబావిలో పడిన పాప మరణిం చిన సన్నివేశాన్ని కవితాత్మకంగా హృదయ సంవేదనతో నరసింహారెడ్డి ఆవిష్కరించారు. చుక్కనీరు పడక బోర్లు నోర్లు తెరుచుకొని భయానక కుహరాన్ని తలపిస్తుంది. ఇది వ్యక్తి తప్పిదమా? రాజ్యం తప్పిదమా? ఆకలి కష్టాల వేటలో రైతులకు ఎల్లవేళలా చుక్కెదురవుతున్న తీరు కన్నీటిని తెప్పిస్తుంది. ఈ కవితా పంక్తుల్లో కూడా పౌరాణిక ప్రతీకలు ఉన్నాయి.

పచ్చదనం మీద
పిచ్చి వట్టిన అతడు
జల తపస్సు చేసినట్టు
కలలో కొచ్చిన
బేతాళుడి అప్ప మీద
మరొక బోరు బొమ్మ గీసుకుండు
తాపసి గమ్యం చేర్చే
ఏ శివుడూ రాలే (పుట. 114)

ఇక్కడ 'తాపసి' రైతుకు ప్రతీక. 'జలతపస్సు' అంటే

నీటి కోసం బావిని తవ్వడం. 'బేతాళుడు' రైతును కష్టాల ఊబిలో దించే అప్పులవారు. ఇంతా చేసి బోరు వేసిన బావిలో ఒక్క చుక్కనీరు ఊరలేదు. అందుకే కవి ఏ శివుడూ రాలేదంటాడు. శివుడు గంగను తన జటా జూటంలో బంధించి నేలకు విడిచే దయను కనికరించ లేదని భావం.

'మెమెంటో' కవిత జ్ఞాపకాల పూదోటలో జ్ఞాపికలను ఏరుకుంటున్నట్టుగా ఉంది. ఆయన రచనా నేర్పుకు అద్దం పడుతుంది. అనేక జ్ఞాపకాలతో పొదిగిన జ్ఞాపికలు గుర్తుకు వస్తాయి. బాతిక్ బొమ్మ, మాడరన్ ఆర్ట్, కవి జాషువా, సంగీతకారుడు మంగళంపల్లి, ఆర్టిస్టు రాజయ్య, బార్ కౌన్సిల్, పాంచ్‌తరా భవన్, సత్య దేవత వంటి కళా సారథుల జ్ఞాపికలు ఈ కవితలో తారసపడతాయి.

జైత్రయాత్రకు అంటిన నెత్తుటి మరకల్లా
అక్కడ ఖరీదైన మెమెంటోలు
లోగిలి నిండా పటాటోపాల్ని
ప్రదర్శించే వింత రంగుల ప్రేములు
వీర భక్తికి దొరికిన లైసెన్సుల్లా
తాపడం చేసిన విగ్రహాలు
పదవులకు చెక్కిన నగిషీలలా
చిత్రవిచిత్రమైన షీల్డులు (పుట.44)

'జ్ఞాపిక' అధికార దర్పాన్ని ప్రదర్శిస్తుంది. కవి వీటిని 'వీర భక్తికి దొరికిన లైసెన్సులు', 'పదవులకు చెక్కిన నగిషీలు'గా అభివర్ణించారు. ఖరీదైన మెమెంటోకు 'నెత్తుటి మరక' అనే ప్రతీకను చేర్చడం రక్త దాహాన్ని స్ఫురింప జేస్తుంది. అందుకే ఆయన ఈ కవితలోనే జ్ఞాపిక అంటే కాలం వెనక్కి తిరిగి ప్రేమాత్మకంగా చేసే ముప్పల శబ్దంగా ఉండాలంటారు.

'జూన్ 2' కవితలో కవి అభినివేశం ప్రతీయమానంగా నిలుస్తుంది. సుదీర్ఘ పోరాటం తరువాత తెలంగాణ స్వేచ్ఛా వాయువులను పీల్చుకుంది. నిరంతర దు:ఖం నుండి విముక్తి దొరికింది. నీళ్ళు, నిధులు, నియామకాలు, పంటలు, గనులు, సిరులు, కాలువలు, చదువులు, కరెంట్ మనకోసమే నిలిచాయి. ఉద్యమాల పురిటి గడ్డగా తెలంగాణ పిడికిలి బిగించి ప్రత్యేక రాష్ట్రాన్ని జూన్ 2న సాధించింది. వలస ఆధిపత్యం అంతరించిపోయింది. ప్రగతి పథాన్ని, అభ్యుదయ వాదాన్ని నిలుపుకున్న కవిత ఇది.

భళ్ళున తెల్లవారుతున్నట్లున్నది
నల్లని కాళరాత్రి
నూతన వెలుగురేఖల ముందు
తెల్ల బోతున్నట్లున్నది
ఊపిరి బిగబట్టిన గాలి
మలయ మారుతమై వీస్తున్నట్లున్నది (పుట. 89)

'తెల్లవారడం' అంటే రాష్ట్రం అవతరించడం. 'వెలుగు రేఖలు' అంటే ప్రజలందరిలో సంతోషాలు ప్రసరించడం. 'నల్లని కాళరాత్రి' అంటే గాఢాంధకార బానిస సంకెళ్ళ జీవనం. 'మలయ మారుతం' అంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సాధించడం. ఇవన్నీ చైతన్య ప్రతీకలు. వీటితో కవితను శక్తివంతం చేశారు కవి. ఇదే కవితలో నాడు తెలంగాణను వ్యతిరేకించే రాజకీయ నాయకుల స్వార్థపు బుద్ధిని ఖండించారు. 'మెదళ్ళు తిరగేసుకున్న గబ్బిలాలు', 'కళ్ళుండి చూడలేని గుడ్ల గూబలు' అనే పంక్తుల్లో పక్షి ప్రతీకలను నిలిపి వారి అసలు స్వరూపాన్ని వ్యక్తపరిచారు. కవి ఈ నవ తెలంగాణను 'కాలం యవనిక మీద సప్త వర్ణాల అద్దకం దిద్దినట్లున్నది' అని కీర్తించారు.

తెలుగు భాష మీద రాసిన కవిత 'తెలుగుపూలు'. ప్రపంచ తెలుగు మహాసభలు ప్రపంచ దేశాలలో భావ ప్రాప్తిని కలిగించాయి. తెలుగు భాషా గౌరవాన్ని నిల బెట్టాయి. తెలంగాణ అస్తిత్వంలో తెలుగు భాషా ప్రాధాన్యాన్ని కొనియాడాయి.

కాంక్రీటు జంగల్ మీద
భయం భయంగా
ద్రవిస్తున్న నింగి
గ్లోబల్ ఖడ్గం నరుక్కొస్తుంటే

కంఠాలర్పిస్తున్న బలహీన భారతుల దృశ్యం మీదుగా
ఒక చిరురక్షణ కవచం పరుచుకుంటోంది.
(పుట.128)

'కాంక్రీటు జంగల్', 'గ్లోబల్ ఖడ్గం' అత్యాధునిక మార్కెట్ యుగానికి ప్రతీకలు. ప్రపంచీకరణ నేపథ్యంలో భాషా సంస్కృతులు కోల్పోతున్న తరుణంలో ఇటువంటి మహాసభలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'బలహీన భారతులు' అంటే అణిచివేయబడుతున్న భారతీయ భాషలు. వాటికి 'రక్షణ కవచమే' ప్రపంచ తెలుగు మహా సభలు.

జీవితం నిరంతర గాయాల సుడిగుండం. ఒడుపు, జాగ్రత్తను పాటించినా గాయాలు ఎదురవుతూనే ఉంటాయి. కవి గాయాల మాటున నిలిచి 'గాయపడ్డాకే' కవిత రచించారు. 'కనిపించని బాణాలు', 'మాటల తూటాలు' ఇందులోని ప్రతీకలు. ఇవి మనసును నిలువెల్లా గాయం చేస్తుంటాయి. 'పెద్ద పెద్ద అభాండాల జడివాన / అమాంతంగా మీద కురిసిపోతుంది / తేరుకోక ముందే / తేనె పట్టునుండి కందిరీగలు లేచినట్లు' ఈ కవితా పంక్తుల్లో 'అభాండాల జడివాన' అనే ప్రతీక అబద్ధాల ప్రపంచాన్ని మోసుకొస్తుంది. 'కందిరీగలు' సమస్యల ముసురును తలపిస్తాయి. 'కనిపించని పాగలు', 'వెక్కిరించే నొసళ్ళు' అణిచివేతకు ఊతంగా ఉన్నాయి. ఇందులోనే యుద్ధ ప్రతీకలు ప్రయోగించారు. 'యుద్ధ రంగం', 'బాంబుల మోత', 'ఆయుధాలు', 'ఎజెండాలు', 'చురకత్తులు' పొంచి ఉన్నాయి. గాయం కాకుండా తప్పించుకోలేరనే భావనను నరసింహారెడ్డి కలిగించారు.

'అవతలి తీరం'లో స్థల మాత్రుకను గమనించవచ్చు. నడిచొచ్చిన జీవితంలోకి మరల తరచి చూచుకోవడమే ఈ కవిత ప్రధాన ధ్యేయం.

నడిచొచ్చిన నేలలో
తిరగాడు తున్నాను
పాట జారిపోయిన వేదిక మీద
స్వరాల్ని ఏరుకుంటున్నాను
రెప్ప దాటిన కలల మీద
మెరుపుల్ని చిత్రిక పడుతున్నాను
అప్పుడు ఆగిపోయిన గుసగుసల్ని
ఇప్పుడు పదాల మాల కడుతున్నాను (పుట.21)

'నేల' స్థల మాత్రుక. ప్రకృతి ప్రతీకల పరవశంగా కవి ఈ కవితను ధ్వనింపజేశారు. జీవన జ్ఞాపకాల పూదోటలోకి అనేక ప్రతీకలను ఏరుకొచ్చారు. 'వేదికమీద స్వరాలు', 'మెరుపు చిత్రికలు', 'పదాల మాల' అనేవి గతించిన స్మృతుల అవలోకన స్థితిని తెలుపుతాయి. జీవితం కష్ట సుఖాల కలవరం. కవి 'మెరుపురాయి' అనే ప్రతీకను ప్రయోగించి, దాని వెనుక ఉన్న శ్రమశక్తికి గుర్తుచేశారు. పలుగురాళ్ళు పరుచుకున్న బాటమీద మండుటెండల మధ్య మెరుపురాయిగా మెరుస్తుంటాడు కవి. ఆత్మాశ్రయ ధోరణిలో భావ గర్భితమైన పద ప్రయోగాలు ఈ కవితలో కనిపిస్తాయి.

'గూట్లో దీపం' కవిత ప్రతీకలమయం. మరణాన్ని ఆస్వాదించే తీరు ప్రతీకాత్మకంగా వర్ణింపబడింది. జీవితం మొత్తం ఒడికట్టి ధారపోసిన భారం, బాధ, కష్టం, కడగండ్లు వృద్ధాప్యంలో ఎవరూ బేరీజు వేయరు. వాటి ప్రతిఫలంగా వచ్చిన ఆస్తి, అంతస్తు, లాభం, ధనం వంటివి మాత్రమే గణనలోకి వస్తాయి. అవి కూడా పాలు పంచుకోవడంలోనే గాని; మురిపాలను పంచుకోవడంలోకి రావు. మానవీయత మంట గలిసిపోయిన బాంధవ్యాల తీరును కవి అత్యంత అర్థయుక్తితో ప్రదర్శించారు. వయసుడిగిన తర్వాత కీళ్ళ నొప్పులు, గుండెపోటు వస్తాయి సహజమే కాని వాటికి మించిన 'గాయాల మాటలు', 'గునపాలు' గొంతుల్లో దిగుతాయనడం నేటి కుటుంబ మానవ సంబంధాల లేమికి అద్దం పడుతుంది. అందుకే కవి అంటాడు -

పొద్దు గూకక ముందే
గూట్లో దీపం పెట్టడం మంచిది

హుషారుగా ఉన్నప్పుడే
పిట్ట ఎగిరిపోవడం ఉత్తమం (పుట.58)

'జలదృశ్యం' కవితలో అద్భుతమైన ప్రతీక ప్రయోగింప బడింది. 'ఇక్కడొక నాకలోకపు నఖలుండేది', 'నాకలోకం' చెరువుకు, ఉప్పొంగిన అలుగుకు ప్రతీక. దేవలోకం దిగివచ్చిన పరవశం ఊరిలో నర్తించేవి. నిండుకుండలా ఉన్న నాటి జలదృశ్యం నాకలోకాన్ని తలపించేది. కవి ప్రయోగించిన దైవ ప్రతీక ఆ కవితను మొత్తం సుందర మయం చేసింది. పద భావ చిత్రికను ప్రదర్శించింది.

నీటి అద్దం మీద కొంగలు
సింగారించుకునే దృశ్యం
శత సహస్రాలుగా విస్తరించే
జీవరాశి పరిమళం
తీతువు పిట్టలకు
చాకిరీ చేసే తుమ్మ కొమ్మలు
లంగరేసిన ఒక జెండాలా
గాలికి ఎదురీదే చెట్ల సమూహం
దీపం చుట్టూ మెరిసే వెలుగు రేఖల్లా
జారుతున్న పంట కాలువ గట్ల మీద
పూల తీగల పులకరింతలు
తల్లి ఒడిలో ఖుషీ చేసే పిల్లవాడిలా
జలదృశ్యం ముంగిట ఊరు (పుట. 41)

'ఆకుపచ్చ తివాచీ', 'నీటి అద్దం' వంటి ప్రతీకల ప్రయోగం కవితకు సౌందర్యాన్ని కలిగించింది. కాని నేడు వాటి గుర్తులు చెరిగిపోయిన దౌర్జన్య రూపం పట్ల కవి ఆవేదన ప్రకటించారు. పునర్నిర్మాణం కోసం పరితపిం చారు.

పసివాడి 'నిద్ర నవ్వు'ను కవి అత్యంత సుందరంగా చిత్రించారు. వాడు మేలుకుంటే వెలుగు, నిద్రిస్తే వెన్నెల అంటూ కవి ప్రతీకల వర్షం కురిపించారు. వెలుగు-వెన్నెల జీవితపు ఆనంద సంతోష సన్నివేశాలను తెలుపుతాయి. ఇవి రెండు లేకపోతే 'ఇంటిలోకమంతా చీకటి' అని కవి నిర్లిప్తతను ప్రకటించారు. ఇంటిలో పసిపిల్లల బోసి నవ్వులు ఎంత ఆహ్లాదాన్ని కలిగిస్తాయో కవి పేర్కొన్నారు. సంతానం లేని ఇల్లు అంధకారమయమవుతుంది. 'చీకటి'ని విషాదానికి ప్రతీకగా కవి నిర్వచించారు. నిద్ర నవ్వు రహస్యాన్ని కవి ఛేదించారు. 'నిద్ర నది', 'జాగరూకపు గట్టు' అనే ప్రతీకలు పసివాడి ఆంతరంగిక స్పర్శను తెలుపుతాయి. అందులోనే కలవరపడి కదలినప్పుడు బయటి ప్రపంచమంతా ఉలిక్కిపడుతుందంటారు కవి. నిద్రాణమైన లోకానికి అతని కలవరం ఒక చరుపుగా కవి భాసింపజేశారు. ప్రకృతి ప్రతీకల ప్రయోగంలో సిద్ధహస్తుడైన కవి పౌరాణిక ప్రతీకల కల్పన కలిగిన పంక్తులను ఈ కవితలోనే ప్రదర్శించారు.

అభ్యాసం లేని యోగం అతడి నిద్ర
తటాల్ని రెప్ప వేయడమూ
చిత్రంగా కన్ను తెరవడమూ
పుట్టగానే నేర్చిన ఏకలవ్యుడు (పుట. 31)

ఏకలవ్యుడికి గురువు లేడు. శిశువుకు కూడా. కాని అభ్యాసం లేని యోగం నేర్చాడు. అతని ధ్యాన ముద్రిక లకు కూడా సాధన లేదు. ఈ కవితలో కవి కాల మాత్రుకను ప్రయోగించాడు. 'కాలం గీసిన తొలిగీత'. కాలం ఆకాశానికి సూచిక. నక్షత్రాలు, రాశులు, గతులు ఆకాశ సందేశాన్ని బట్టి చరిస్తుంటాయి. పుట్టుక కాలం నిర్ణయిస్తుంది. జీవనం స్థలం నిర్ణయిస్తుంది. స్థలం భూమికి సూచిక. కవిత్వంలో కాల మాత్రుకలు అప్రయత్నంగానే సిద్ధిస్తుంటాయి.

'నాన్న' కవిత ఔదార్యాన్ని చూపుతుంది. పిల్లలకు నాన్న భరోసా ఎంతగా ఉంటుందో కవి తెలిపారు. అమ్మ ఆత్మను అందిస్తే నాన్న రూపం కలిగిస్తారు. ఆత్మస్థైర్యం, గుండె నిబ్బరం నాన్న నేర్పిన జీవిత పాఠాలు. శరీరంలోని సమస్త శక్తులకు నాన్న ఒక ఆధారం. నిరంతర కాలగమనంలో ఎదురయ్యే 'ఇజాల' భావజాలపు గుర్తులను విడమరిచి చెప్పేవారే నాన్న. అందుకే కవి 'ఆత్మ చుట్టూ అల్లుకుపోయే ప్రాకృతిక ప్రేమ కవచం నాన్న' 'భావ జాలపు ఇనుప గుగ్గిళ్ళను ద్రాక్ష పండ్లలా

అలవాటు చేస్తాడు' అంటాడు. 'ఇనుప గుగ్గిళ్ళు' కఠినమైన బంధనాలకు, సంకెళ్ళకు ప్రతీక. వాదాలు, ఉద్యమాలు, ధోరణుల భావజాలపు విష వలయాలు 'ఇనుప గుగ్గిళ్లు'గా ప్రతీకమానమవుతాయి.

'పాలపిట్ట' ప్రతీకలో నందిని సిధారెడ్డిని వర్ణించారు కవి నరసింహారెడ్డి. సిధారెడ్డి స్వరూపం, స్వభావం, స్వచ్ఛత, నిబద్ధతలకు ఆలంబనగా ఈ కవిత రచించారు. కవితా వస్తువుతోనే శీర్షిక నిర్వచించబడింది. మాటకు, మనుగడకు, కవిత్వానికి, జీవితానికి; ప్రేమకు, కోపానికి వ్యత్యాసాలు చూపని వ్యక్తి నిరాడంబరత, స్వేచ్ఛకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. 'మార్క్సిజం గీటురాయి', 'తెలంగాణ ఆచరణ సోయి'గా కవి ప్రకటించడంలో సిధారెడ్డి నైజం తారసపడుతుంది. పల్లె తల్లిని, శ్రమజీవులను ప్రేమిస్తారు. కర్తవ్య దీక్షలో కంకణబద్ధుడవుతాడు. ఆడిన మాట తప్పక ఆచరిస్తారు. అటువంటి సిధారెడ్డి వ్యక్తిత్వ నిర్మాణంలో కూడా కవి ప్రతీకలు ప్రయోగించారు.

కాలంగాని కాలంలో
రానేరని గాలిని నమ్మి
తూర్పార బట్ట గూడదని
క్రాంత దర్శనం చేస్తాడు (పుట.66)

'వాయుముద్ర'ను ఒక నిస్తంత్రీ స్పర్శ (మొబైల్)గా అభివర్ణించారు. కవి భావ పటిమకు తార్కాణం. పంచ భూతాలలో 'వాయువు' వేసే ముద్ర అధికం. వాయువు ప్రాణనాడి. అనంత ఘోషకు ఆయువుపట్టు. అగ్ని, ఆకాశం, జలం, పృథివి వాయువులో సంకలితమవుతాయి. ప్రియురాలి నిసర్గ స్వరం కూడా.

ఆ స్వరం కర్ణభేరి ద్వారా హృదయాన్ని హత్తు కుంటుంది
దుమ్ము పట్టిన వీణ తీగను అదే పనిగా మీటి పోతుంది
జ్ఞాపకాల సీమ సరిహద్దుల్ని తట్టిలేపి
ప్రమత్తపు లోక పరిమళంలో వింత అలజడి చెల రేగుతుంది
ఇక ఎప్పుడూ ఆ వాయు ముద్ర కోసమే
మనసు సూదంటురాయై ఎదురు చూస్తుంది (పుట.51)

'సూదంటురాయి' ప్రకృతి ప్రతీక. మనసు పరవశాన్ని తూచ గలిగేది. వాయు సందోహంలో ప్రకృతిని మనముందు పెట్టారు కవి. పక్షులు, లేళ్ళు, అశ్వాల విన్యాస ప్రతీకలను వాయు ముద్రలో ప్రదర్శించి ప్రియురాలి పిలుపు కోసం కోరికలతో కూడిన మనసు వేగాన్ని అభివర్ణించారు.

'హార్ట్ టు డీలిట్' నేటి తాత్కాలిక ప్రేమానుబంధాలకు తార్కాణంగా నిలిచిన కవిత. చెదిరిపోతున్న ఊహలకు దృశ్యమానమైన అనేక సంకేతాలు ఇందులో ఉన్నాయి. అత్యాధునిక నానో యుగాన్ని తలపిస్తున్న సాంకేతిక ప్రతీకల వాడకం అధికంగానే చేశారు ఆయన. మెసేజ్‌లు డిలీట్ చేసినా, వాట్సాప్‌ను డిస్‌కార్డ్ చేసినా, ఫేస్‌బుక్ నుండి ఎగ్జిట్ అయినా, మొబైల్ డేటాను వదిలించుకొన్నా, వైఫై నుండి దూరంగా జరిగినా... అవన్నీ తాత్కాలికమే అంటాడు కవి.

గ్రావిటిలో భాగమైన
జ్ఞాపకాన్ని ఏం చేద్దాం!
మెమోరీని కూడా డిలీట్ చేయదగ్గ
ఒక యాప్ ఉంటే ఎంత బాగుండు (పుట. 86)

'గ్రావిటీ', 'మెమోరీ' సాంకేతిక ప్రతీకలు. కాని అవి మనసు అర్రలో భద్రంగా ఉన్నాయి. వేగవంతమైన జీవితంలో ఆనందాలు, సంతోషాలు యాంత్రికతలో కూరుకు పోయాయి. కాని భగ్న ప్రేమికుల అంతరంగంలో వలపు రాగాల హృదయ పరిమళం శ్వాసిస్తూనే ఉంది.

నాటి జ్ఞాపకాలతో నేడు చెదిరిపోయిన ప్రేమ ఆనవాళ్ళ కోసం కవి అన్వేషిస్తున్నారు. సాంస్కృతిక ప్రతీకలు నిండిన కవిత ఇది మచ్చుకు...

ఎంతకి అందని
సింధూ నాగరికతలో

చిత్రలిపిలా నువ్వు
పాఠకుల్ని చేరని నేను మహా కావ్యంలా
సమాంతరంగా (పుట. 86)

'తైలం' అనే వస్తు ప్రతీకను స్త్రీకి, 'అమీబా' అనే జీవ ప్రతీకను శత్రువుకు ప్రయోగించారు. జీవజాలంలో దైవ ప్రకతీకలు శుక్రుడు, స్వర్గం వంటివి అభివర్ణించారు.

'కవిత్వం! ఎలా ఉండాలనే దానికి కవులు అనేక రకాలుగా సిద్ధాంతీకరణ చేశారు. కవిత్వ నిర్మాణ పద్ధతులను విడమరిచి చెప్పారు. అందులో కవి డా॥ ఏనుగు నరసింహారెడ్డి చెప్పిన 'చెక్కడం' కవిత రచనా శైలిని తెలుపుతుంది. లలిత కళలలో శిల్పం, చిత్రలేఖనం కంటే విభిన్నమైన నైపుణ్యం కలదిగా వర్ణించారు. వాక్యాలను పదాలుగా, పదాలను అక్షరాలుగా, అక్షరాలను స్వరాలుగా ప్రాణప్రతిష్ట చేయదగ్గ విన్యాసమొకటుందని కవి పేర్కొవడం ప్రత్యేకతను సంతరించుకుంది. 'కర్రసాములో జైత్రయాత్ర చేసినట్లు / అక్షరాలలో ఆనందభైరవి ఆలాపించినట్లు' కవిత్వం ఉండాలనడంలో కవి క్రీడా, సంగీత ప్రతీకలకు స్థానం కల్పించారు. 'కర్రసాము' ఎంత చాకచక్యంగా ప్రదర్శింపబడుతుందో; 'ఆనంద భైరవి' రాగం ఎంత పరవశ హృదయం గావిస్తుందో కవిత్వం అలా ఉండాలంటారు. తిలక్‌ను తలపింపజేశారు.

'మలుపుల దగ్గరి దు:ఖం' కవిత కూడా జీవితం కష్టాలబాటను ఏవిధంగా దాటుకుంటూ వస్తుందో ఆట ప్రతీకల ద్వారా అయన వివరించారు. 'మొదలు నిచ్చెన్లు బాగనే ఎగరేస్తయి గని / పరమ పదం / చాలా దూరమెళ్ళి పోతుంది / పాములు మింగడానికి నోళ్ళు తెరుచుకొని కాచుకుంటయ్' (పుట. 123). కాని మనిషి సుఖాలనే కోరుకుంటాడని కవి అంటారు. జీవితంతో ఎదురయ్యే ఎండమావులను తలపోయడని అంటారు. 'నిచ్చెన్లు', 'పరమపదం', 'పాములు' ఆటల్లోని పావులు. ఈ ప్రతీకల మధ్య ఎన్నో మలుపులుంటాయని; ఆ మలుపుల దగ్గరి దు:ఖం దింపుకోవడం గుండెకోతను కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కవితా సంపుటి శీర్షిక 'మూల మలుపు'. ఈ కవితలో కూడా నరసింహారెడ్డి ప్రతీకల వర్షం కురిపించారు. ఇది వ్యక్తి శరీరం, ఆరోగ్యం, వ్యాధి సమస్యల నుండి బయట పడడానికి ఆశావహ దృక్పథంలో రచించినది. ఈ మలుపును ఛేదించడమే మనిషి లక్ష్యం. మలుపు అనంతర బాటలో పయనించాలి. దానికెంతో ఆత్మ నిబ్బరం కావాలి. శరీరంలో సత్తువ కావాలి. అందుకే కవి అంటారు 'ఎంతో యుద్ధం నడిచిన కారుణ్య భూమి కదా!' అని. 'యుద్ధం' సంఘర్షణ జీవితానికి ప్రతీక. 'కారుణ్య భూమి' స్రుక్కిన దేహానికి ప్రతీక. 'చీకటి ముసుగు మీద' వెలుగురేఖ విరబూస్తుందా' చీకటి వెలుగులు ఎన్నింటికో ప్రతీకలుగా చెప్పబడ్డాయి. ఈ కవితలో 'చీకటి' నిస్తేజ అవయవాలకు ప్రతీక 'వెలుగు' పరీక్షల్లో నెగ్గిన ఉత్తేజిత అవయవాలకు ప్రతీక. జీవితం ఆనందమయం చేసుకోవాలనే ఆకాంక్ష కవిది.

'మూలమలుపు'లో మరికొన్ని ప్రతీకలు :

- శిలా సదృశ చిక్కుముళ్ళను గోరంతైనా చిత్రిక పట్టలేని కలాలకు కొత్త దృక్కులుంటే ఎంత బాగుండేది. (పుట.32)
- లోక సంద్రంలో మునకేసి తడిసి తుడుచుకోరాని నెమలి పిల్లలా నిలబడుతుంది (పుట. 37)
- విమానం ఎక్కిన ప్రతిసారి ఎన్నడూ పనికిరాని లైఫ్‌జాకెట్ పాఠం శ్రద్ధగా వింటాం (పుట.38)
- మునిగిన కొద్దీ మణి దీపాల వెలుగులో నివ్వెర పోయే సముద్రం లాంటి ప్రపంచం (పుట.50)
- పెనుమర్రి లాంటి భావ లోకంలో సరిహద్దుల్ని తుత్తునియలు చేసే వింత ప్రపంచం (పుట.50)
- గోడకేసిన సున్నంలా కవి మాట ఇలా అంటుకు పోవలసిందేనా! (పుట.59)
- ప్రజా కేతనం రెపరెపలకేనా కాలం లిట్మస్ పేపర్ తెరచి చూడనుంది (పుట.63)
- శిలమీద చెక్కిన చిత్తరువులా బహు భాషల లుప్త వాక్కుల మహాతపో దీక్షలో మునిగింది (పుట.64)

- వేదికల మీద ప్రణాళికలు పరిచిన హార్ట్‌లెస్ శాస్త్రీయ క్రీడ (పుట.80)
- కళ్ళతో కరచాలనం చేసి అపార్థాల చిత్తరువు మీద ఎప్పుడైనా నీరొంపుదామా (పుట.87)
- కురుస్తున్న జడివాన మీద అదనపు వడగళ్ళ రాయిలా (పుట.93)
- కార్యాలయం కదలదు. జనం రాక మానదు. కీలుగుర్రం నర్తిస్తూనే ఉంటుంది. (పుట.95)
- పీఠభూమి సింహాసనం మీదికి సాలభంజికను మెప్పించి వేసిన అడుగు (పుట.96)
- కొయ్యగుర్రం ఉన్న చోటనే పరుగెత్తీ పరుగెత్తీ అలసిపోతది (పుట.129)
- వసుదైక కుటుంబం ఏకధృవ ప్రపంచానికి సాగిల పడుతున్న అనూహ్య స్వప్నం (పుట.135)

డా॥ ఏనుగు నరసింహారెడ్డి ప్రతి కవితలోను ఒక మలుపును ఆశించారు. మార్పు అనంతర కాలాన్ని ఆహ్వానించారు. అది వ్యక్తిగత జీవితం కావచ్చు. ఉద్యోగ జీవితం కావచ్చు. స్నేహం, ఆత్మీయులు కావచ్చు. సంబంధ బాంధవ్యాలు కావచ్చు. ఊరు, చెరువు కావచ్చు. దేశ పరిస్థితులు, అంతర్జాతీయ వైపరీత్యాలు కావచ్చు. కుట్రలు, కుతంత్రాలు కావచ్చు. అగ్రరాజ్యాల అధికార దాహం కావచ్చు. వికృత సమాజంలో జరుగుతున్న నేరాలు, ఘోరాలు, అత్యాచారాలు కావచ్చు. ఈ 62 కవితల్లో వైవిధ్యమైన వస్తు శిల్పాదులను ప్రదర్శించారు. అంది వచ్చిన ప్రతీకలెన్నింటికో ప్రాధాన్యం కల్పించారు. పౌరాణిక, చారిత్రక, సాంస్కృతిక, సామాజిక ప్రతీకలతో పాటుగా స్థలకాల మాత్రుకలు, ప్రకృతి, యుద్ధ, దైవ, సాంకేతిక వస్తు, అధికార ప్రతీకలను సందర్భానుసారంగా ప్రయోగించారు. సామూహిక ప్రయోజనాన్ని చేకూర్చారు.

ఆధారగ్రంథాలు :

1. నరసింహారెడ్డి.ఏనుగు, 2018,మూలమలుపు- కవిత్వం, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.
2. నరసింహారెడ్డి.ఏనుగు, డా॥,2018,అంతరంగం- ఆధునిక కవిత్వ విమర్శ,పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.
3. నారాయణరెడ్డి.సి.డా॥, నవంబర్ 2011, ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు -ప్రయోగాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
4. మందేశ్వరరావు, వడలి.,1994, పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర - సిద్ధాంతాలు, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
5. లక్ష్మణచక్రవర్తి. సిహెచ్ (సం)., 2004, ఆధునిక సాహిత్య విమర్శ రీతులు, ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగుశాఖ, హైదరాబాద్.
6. వెంకటేశ్వరరెడ్డి. కొండ్రెడ్డి, జూన్ 2019, ఏనుగు నరసింహారెడ్డి సాహిత్యాంతరంగం, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మానవి నవలలో స్త్రీమూర్తులు

- కె. వీరేశ్వరరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

కథను ముందుకు నడిపించేవి పాత్రలు. అక్షర రూపంలో జీవించే వ్యక్తిత్వ రూపాలే నవలల్లోని పాత్రలు. ఏ వ్యక్తిని అయినా ఎటువంటి జీవితం గడిపే వారినైనా మంచి చెడ్డల ప్రసక్తి లేకుండా నవలలో పాత్రలుగా స్వీకరించవచ్చు.

జీవితం గురించి ఎంతో పరిశీలనతో ఎన్నిక చేసి నిర్మించిన అనేక విషయాల సంకలన రూపమే పాత్ర. రచయిత మొదటి నుంచి చివరి దాకా ఆయా పాత్రలను ఎలా మలిచాడు? పాత్ర పోషణ ద్వారా ఏ పరమార్థాన్ని బోధించాలని ఆశించాడు? అందులో కృతకృత్యుడయ్యాడా? లేదా? అనేది సాహితీ వాస్తవికతకు గీటు రాయి.

పాత్రలు సజీవంగా వుండాలని విమర్శకుల అభిప్రాయం. నవల చదివిన తరువాత పాత్రస్మృతి పదంలో నిలవాలి. నవలలో పాత్రల సంభాషణ, వాటి ప్రవర్తన ఇత్యాది విషయాలన్నీ పాఠకులను ఆలోచింపజేయాలి. అలా చేయలేని, బలమైన అనుభూతిని కలిగించలేని పాత్రలుగల నవలలు కూడా వున్నాయి. కాని వీటిని వినోద ప్రధానమైన ద్వితీయ శ్రేణి సాహిత్యంగా మాత్రమే భావించాలి. సజీవమైన పాత్రల వల్ల నవలలో సమాజం సందర్శనీయమౌతుంది. సజీవమైన పాత్రలను సృష్టించ గలగడం రచయిత ప్రతిభకు నిదర్శనం. అందుకే 'ఈ నాటి నవలలో అన్నీ వున్నాయి, మానవ పాత్ర తప్ప' అని రాల్ఫ్ ఫాక్స్ వాపోయాడు.

ఓల్గా స్త్రీవాద రచనలకు తిరుగులేదు. విమర్శలు జడివానలా కురిసినా వెనకడుగువేయని నైజం ఆమెది. చిన్నప్పటి నుంచి అంతే. ఎందుకంటే పెరిగిన నేపథ్యం, చుట్టూ ఉన్న సాన్నిహిత్యం, చదువుకున్న సాహిత్యం - అన్నీ గళమెత్తి గర్జించేలా చేశాయి. ఇదే నైజం ఆమె రాసిన నవలల్లోని పాత్రల్లో కన్పిస్తుంది. ఈ వ్యాసంలో 'మానవి' నవలలోని స్త్రీమూర్తులు ఐన వసంత, రోహిణి, శాంత, నవత, లావణ్య, వీణా, సుందరి, రాజ్యలక్ష్మి మొదలయిన పాత్రలగురించి క్లుణ్ణంగా చర్చించడమైనది.

వసంత :

వసంత ఆదర్శ గృహిణిగా, భర్త, పిల్లలే తన సర్వస్వం. భర్త సురేష్ డాక్టర్. లావణ్య, నవతలు వీరి పిల్లలు. భర్తకు పిల్లలకు ఏ లోటు రాకుండా కంటికి రెప్పలా చూసుకుంటుంది వసంత. భర్తకు జేబులో కర్చీఫ్‌తో సహా సమయానికి అన్ని సిద్ధవం చేసే గృహిణి.

వసంత స్నేహితురాళ్ళు రోహిణి, శాంతలు. రోహిణి డాక్టర్. శాంత కాలేజీ ప్రిన్సిపాల్. వీరు తమ తమ వృత్తులలో బిజీగా ఉంటూ కొంత ఆదర్శభావాలు కల్గిన వారు. వసంత ఆలోచనలు పరిమిత స్థాయిలో ఉండి శాంత యొక్క సహజీవనాన్ని కించపరస్తూ 'వివాహితునికి ఉంపుడు గత్తెగా ఉండటం' పరాయిస్త్రీ ఉసురు పోసుకోవడం సమంజసంగా ఉందా? అంటూ స్నేహితురాలిని కించపరుస్తుంది. అలాగే సురేష్, విషయం ఆలస్యంగా తెల్సుకొని నిస్సహాయురాలై కాళ్ళకింద భూమి క్రుంగి పోయి అధోపాతాళానికి విసిరివేయబడినట్లు భావించింది. స్నేహితురాళ్ళతో, అన్నావదినలతో చెప్పుకొని, లావణ్య ద్వారా తన భర్తను మరల మార్చుకొని తనతో, తన పిల్లలతో కల్సి జీవించాలని కోరుకుంటుంది. ''స్త్రీ జీవితం పురుషుడితోనే'' అనే సంకుచిత భావాలను, అలాగే వివాహ వ్యవస్థకు దాంపత్య జీవితానికి అత్యధిక విలువ ఇవ్వరాదని, బలవంతగా రాజీపడి సంసారాలు చేస్తున్నారని రోహిణి, శాంత, నవతల ద్వారా చైతన్యకరమైన మాటలు వసంతలో ఆలోచనలు రేకిత్తిస్తాయి. లావణ్య తన తల్లి సమస్యను అర్థం చేసుకోకపోగా తన పరువు

ప్రతిష్టలకు భంగం కల్గుతుందని, ఆస్థిలో వాటా తీసుకొని తన తల్లిని నిస్సహాయంగా వదిలిపోతుంది.

"నువ్వు వ్యక్తిగా బాగుపడే రోజులొచ్చాయి. హామిగా నీకిష్టమైన పనులు నువ్వు చేసుకో, భర్తలేకపోతే జీవితమే లేదనుకోకు, ఇప్పుడు మొదలు పెట్టడం కొంచెం కష్టం కావచ్చుగానీ మొదలు పెడతావుగా అందుకే ఆడవాళ్ళు పెళ్ళితోనే జీవితం అనుకోకూడదు. మన జీవితం, మనపని, మన స్థానం మనకు ప్రత్యేకంగా ఉండాలి" అని రోహిణి, శాంతలు వసంతకు నచ్చ చెప్పి నవతతో వైజాగ్ పంపిస్తారు.

వైజాగ్‌లో నవత ఇంజనీరింగ్ చేస్తూ విద్యార్థి సంఘంలో పనిచేస్తుంది. నవత స్నేహితులు వీణ, రాజ్య లక్ష్మి, రామ్మూర్తి, రమణమూర్తి, సుందరి వీరందరి ద్వారా వసంత కొత్త ప్రపంచాన్ని చూస్తూ తన ఆలోచనల నుండి సంకుచిత, స్వార్థభావాలు ద్రోసివేసి విశాల దృక్పథం వైపు అడుగువేస్తుంది.

రాజ్యలక్ష్మికి, నవీన్‌కు మధ్య జరిగిన సంఘటనల పట్ల నవత ఆలోచించిన తీరు నచ్చుతుంది. అలాగే రామ్మూర్తికి అనారోగ్యం ఏర్పడినప్పుడు చావు బతుకుల మధ్య ఊగిసలాడుతున్న అతని ప్రాణాన్ని రెండు చేతులా గట్టిగా పట్టుకొని నిలబడుతుంది. "మీరే బతికించారు నన్ను. మీరు లేకపోతే చచ్చిపోయేవాడిని" అని రామూర్తి అన్న రోజు వసంతకు ఒళ్ళు పులకరిస్తుంది. తన బతుకు వ్యర్థం కాదు. తన దగ్గర ఎంతో శక్తి వుంది. ఎంతంటే ఒక మనిషికి ప్రాణం పోయగలిగినంత. తన జీవితాని కప్పుడు అర్థం ఉంది. తను లేకపోతే కొన్ని పనులు జరగవు. కొన్ని పనులు తాను చాలా బాగా చేయగలుగుతుంది. ఆ పనుల వల్ల ఎంతో ప్రయోజనం ఉంది. రామ్మూర్తి బతికితే ప్రజలకెంతో మేలు చేస్తాడు. ఆ రామ్మూర్తిని తను బతికించింది. దీంతో వసంతకు తన మీద తనకు నమ్మకం, గౌరవం కలిగాయి. సర్వ ప్రపంచాన్నీ ప్రేమించాలనే గాఢమైన కోరిక కలిగింది.

తన బతుకు వ్యర్థం కాదు 'ప్రపంచంలో అందరి కష్టాలు, అన్ని అనారోగ్యాలు, అశాంతులూ తుడిచెయ్యగల శక్తికోసం ఆమె మనసు ఆరాటపడుతుంది.'

'సురేష్‌కి వసంత భార్యలా లేదు. ఆడదానిలా లేదు. సాటిమనిషిలా ఉంది. నవ్వటంలో మాట్లాడటంలో ఏ బెరకూ, ఏ బిడియం లేని ఒక అవ్యక్తమైన స్వేచ్ఛ ఆమెను నడిపిస్తున్నట్లు ఉంది. ఒడిలో బిడ్డతో ఆమె 'మానవి'లా ఉంది.' అని ఓల్గా గారు పురుష పాత్రద్వారా వసంతను తెలుపుతుంది.

లావణ్య గర్భిని యని తనను రమ్మని రాసిన ఉత్తరానికి బదులిస్తూ "నవత స్నేహితురాలు సుందరి కాన్పు అయింది. ఆ బిడ్డతోనే తనకు సరిపోతుందని తానిక్కడ మనిషిగా మారానంటూ....పరువు ప్రతిష్టలంటూ ఒక తల్లిగా, భార్యగా కూపస్థమండూకంలా నేనిన్నాళ్ళు జీవించాను. ఇక నానోరు మాట్లాడుతుంది. నా కళ్ళు చూస్తున్నాయి. నేను ఒక మనిషిగా జీవిస్తూ బ్రతకగలనని నీవు కూడా ఇసుక పునాదులపై నిర్మింపబడ్డ వివాహ వ్యవస్థను నమ్ముకోక నీకై నీవు జీవించమని కోరుచూ వ్యక్తిత్వం నిండిన మనిషిగా ఉండగలవని" ఆత్మగౌరవాన్ని నింపేలా ఓల్గాగారు వసంత పాత్రను మలచిన తీరు అమోఘమైనది.

రోహిణి :

వసంత స్నేహితురాలు గుంటూరులో డాక్టరుగా పనిచేస్తూ తనకు సమాజంలో ఒక గుర్తింపును కల్గిన వ్యక్తి. తనలాగే వసంత కూడా సొంత అభిరుచులు, అభిప్రాయాలు లేకుండా "కూపస్థ మాండుకంలా" ఉండడం నచ్చదు. రోహిణికి అందుకే ఇలా అంటుంది. "ఆడవాళ్ళని భర్తల హోదాతో గుర్తించడం మానేదాక ఆడవాళ్ళకు విముక్తి లేదంటుంది." రోహిణి పాత్ర ద్వారా స్త్రీ లోకానికి తనదైన వ్యక్తిత్వాన్ని ఓల్గాగారు ప్రబోధించారు.

వసంత భర్త వేరే స్త్రీని ప్రేమిస్తున్నాడని తెలిసినా తన భర్త తనుకు కావాలని బాధపడుతున్న వసంతతో 'నీకెంత

ఆత్మగౌరవం లేకపోతే, అలా ఆ భర్తను భరిస్తున్నావు' అంటుంది. 'ఇసుక పునాదులపై నిర్మించబడిన వివాహ బంధానికి విలువ ఉండదు. అది ఎప్పుడో కూలిపోతుంది. అభిరుచులు, ఆసక్తులు కలిసి క్రమంగా పెరిగిన స్నేహమే విలువైంది.' వసంతతో అంది రోహిణి.

ఇంకా ఇలా అంది. 'ఇప్పుడు నీ పరిస్థితికేమైంది. వ్యక్తిగా నీకు బాగుపడే రోజులొచ్చాయి. హాయిగా నీ కిష్ట మైన పనులు చెయ్యి. భర్త లేకపోతే జీవితమే లేదనుకోకు మన జీవితం మన చేతుల్లోనే ఉంది. మనవని, మనస్థానము మనకు ప్రత్యేకంగా ఉండాలి.'

రోహిణి వసంతలో విశాలమైన భావాలు కల్గించేందుకు "భర్త వదిలివేసిన స్త్రీని, మొగున్ని వదిలివేసిన స్త్రీని చులకనగా చూడకు ఆడవాళ్ళను భర్తల హోదాతో గుర్తిం చటం మానమని, అలా చేస్తేనే విముక్తి" అంటూ నేటి స్త్రీ దుస్థితికి మూలాలను, వాటి నెదుర్కోవడంలో గల ధైర్యాన్ని మనల్ని మనలకు గుర్తించుకోవాలని, తన ఆత్మగౌరవానికి భంగం కలగకుండా స్త్రీ యొక్క సామాజిక అభివృద్ధిలో తనవంతు కృషి సల్పుతూ ఆత్మ సంతృప్తి ఆత్మ విశ్వాసాలతో జీవించే పాత్రగా రోహిణి ఓల్గాగారు చక్కగా వర్ణించారు.

శాంత :

వసంత స్నేహితురాలు. గుంటూరులో కాలేజీ ప్రిన్సి పాల్‌గా పనిచేస్తుంది. శాంత చదువయ్యే సరికి నాన్న చనిపోతారు. వాళ్ళ అన్న పట్టించుకోడు శాంత ఉద్యోగం సంపాదించి, తమ్ముడిని, చెల్లిని చదివించి వాళ్ళకు పెళ్ళిళ్ళు చేస్తుంది. అప్పుడు శాంతకు పెళ్ళి వయసు దాటుతుంది. పెళ్ళి చేసుకోవడానికి కారణం డబ్బు, వయసు కావాలి. కానీ శాంతకు వయస్సు, అందం ఇప్పుడులేవు. అయితే తనలో ప్రేమ చావలేదు. తనతో పాటు పనిచేస్తున్న 'రాధాకృష్ణ' అనే వివాహితునితో 'సహజీవనం' చేస్తుంది. వసంత గుంటూరు వచ్చి శాంతి భర్త, పిల్లలు లేకున్నా తన జీవితాన్ని హాయిగా, ఆనం దంగా తన అభిరుచులు కోరికలుకు ఏ మాత్రం ఆటంకం లేకుండా గడపడం చూసి ఆశ్చర్యపోతుంది. అతనికి నీ పట్ల ప్రేమ ఉంటే భార్యకు విడాకులిచ్చి నిన్ను పెళ్ళి చేసికోవచ్చుకదా అంటే శాంత అంటుంది. ఆమె ఇద్దరు పిల్లలకు తల్లి భర్త వదిలివేస్తే జీవితం దుర్భరమవుతుంది. వేరెవరు పెళ్ళి చేసికోరు. అలాగే నాకు పెళ్ళి అక్కరలేదు. గుర్తింపు వద్దు. హక్కులు అక్కరలేదు. అతని ప్రేమ కావాలి. అతనికి నా ప్రేమ కావాలి. దీని వల్ల అతడి భార్యకు నష్టం లేదు" అంటుంది శాంత.

వసంత తన పరిమిత జ్ఞానంతో "అతడికి నీపై ప్రేమ తగ్గి వేరొకరిని ప్రేమిస్తే" అని అంటే శాంత అప్పుడు అంటుంది. "లేని దానికోసం ఏడ్చేంత హీనస్థితికి, నా లేమికి ఇతరులు కారణమని ద్వేషించను. నా ప్రేమకు అతడు అనర్హుడని భావించినప్పుడ అతనికి నాప్రేమ దొరకదు. నా ప్రేమకు చాలా విలువ వుంది. మా సంబం ధం ఆస్తులకు వంశాలకు పరువు ప్రతిష్టలకు పరిమిత మైంది కాదు." వసంత వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా విశ్లేషించి చెప్పడంలో అలాగే స్త్రీని కుటుంబ వ్యవస్థ నిర్వీర్యురాలుగాను, యాంత్రికంగానూ తయారు చేస్తుం దని, అదే విధంగా అవసరమైతే వివాహ చట్రం నుండి బయటపడి మన అభిప్రాయాలు కోరిక లకు అణుగుణ మైన జీవితం గడుపుతూ మన భావాలు గౌరవించబడే వ్యక్తితో కలిసి సహజీవనం కొనసాగించడం తప్పులేదని దృఢంగా శాంతపాత్ర ద్వారా ఓల్గా గారు ఉద్ఘాటించారు.

నవత :

నవత వసంత రెండో కూతురు. వైజాగ్‌లో ఇంజనీరింగ్ చేస్తుంది. చదువు, సామాజిక బాధ్యతను బ్యాలెన్స్ చేసుకొని నవలోకానికి బాటలు వేసే పాత్రగా 'నవత'ను ఓల్గా గారు చక్కగా చిత్రీకరించారు.

ప్రతి స్త్రీ సాంఘిక జీవితం గడపడం వల్ల, ఆత్మ గౌరవం తమకో ఉనికి, గుర్తింపు వ్యక్తిత్వం ఏర్పడు తాయని ఓల్గా గారి ఉద్ధేశ్యాన్ని ఒక కర్తవ్యంగా నవత పాత్రద్వారా ఉపదేశిస్తారు.

నవత తల్లితో అంటుంది. ''చదువు వుంది. నా శక్తి సామార్థ్యాలను కుటుంబ సభ్యుల పనులు చేయడానికి కేటాయించి అందరినీ సోమరులుగా చేయవద్దు. నీవు ఏదైనా ఉద్యోగం చెయ్యమని చెపుతుంది.'' సురేష్ నీలిమల ప్రేమను అర్థం చేసుకొంటుంది. భార్యభర్తలు రాజీపడి యాంత్రికంగా గడిపే దాంపత్య జీవితం అర్థం లేనిదంటుంది.

నవత తన తల్లి పడే అంతర్గత సంఘర్షణను అర్థం చేసుకొని తనతో పాటు తీసికెళ్ళి తన స్నేహితుల ద్వారా కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది. అలాగే నవత రాజకీయాలను, సంఘ కార్యకలాపాలను, సమ్మెలు, చర్చల ద్వారా తల్లిలో విశాల భావాలు కల్గడానికి, సమాజ కార్యకలాపాల్లో ఆమెను భాగస్వామిని చేసి ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవడానికి దోహదం చేసే పాత్ర.

రాజ్యలక్ష్మి, నవీన్‌ల మధ్య జరిగిన సంఘటనల పట్ల నవత స్పందించిన తీరు, అలాగే మచ్చ, కన్యశీలం అనే భావజాలాన్ని అసహ్యించుకోవడం దాన్ని చాలా చిన్న విషయంగా భావించడం నవీనకాలానికి ప్రతీక ఈ పాత్ర.

వీణ, నవతలు విడిపోయినప్పుడు వారి ఆలోచనల లోపాలు గ్రహిస్తుంది. పెత్తనాల కోసం కాదు. పేదవారి కోసం, పీడితుల పక్షాన పోరాడాలని కోరుతుంది. అందరూ స్నేహంగా ఉంటూ సమాజంలో మార్పుకోసం నిత్యం పరితపించే పాత్ర నవత. తల్లిని విశాల దృక్పథంతో మార్చడం. స్త్రీ సమస్యకు మూలాలు ఏమిటో తెలిపే, పరిష్కారం కూడా చెప్పగల నవీనకాలానికి 'నవత' ఒక మార్గదర్శకంగా ఓల్గా గారు నవతను సృష్టించి సఫలీకృతులైనారు.

ఓల్గాగారు ఆశించిన మార్పులన్నీ కల్గిన స్త్రీ మూర్తి. ఈ నవత ఆదర్శ నవ యువతి. నవతను ఆత్మ విశ్వాసంతో ఆత్మగౌరవం గల నిండైన మూర్తిమత్వం గల 'మానవి'గా మనం ఓల్గా గారిని ఈ పాత్రలో చూడవచ్చు.

లావణ్య :

వసంత, సురేష్‌ల మొదటి కూతురు. వసంతకు లావణ్య మీద ప్రేమ, వాత్సల్యం ఉన్నాయి. లావణ్యను ఏ సమస్య లేకుండా, అన్ని కోర్కెలు తీర్చి పెంచి పెద్ద చేసి, పెళ్ళి చేసి పంపడమే జీవిత ధ్యేయంగా వసంత భావించి కూతుర్ని అత్తవారింటికి పంపుతుంది.

సురేష్ నీలిమల వ్యవహారం తెలిసి వసంత బాధ పడుతూ మానసిక బాధతో తను ఒంటరియై లావణ్యను చేరుతుంది. లావణ్య తల్లి రాకకు సంతోషపడుతుంది. కారణం లావణ్య అత్త ఆడబిడ్డ ఊరి నుండి రాబోతున్నా రని వారిని సంతృప్తి పరచాలంటే ఇల్లు సర్ది, పిండివంటలు చేయడానికి తనతల్లి ద్వారా చేయించు కోవచ్చని, కానీ తల్లి సమస్యతో వచ్చిందని తెలిసి 'బాగుంది మేళం' ఈ విషయాలు భర్తకు అత్త ఆడబిడ్డలకు తెలిస్తే 'పరువు పోతుందని' వాపోతుంది.

వసంత ఆత్మహత్య ప్రయత్నం చేసినప్పుడు లావణ్యను ''మీ అమ్మను తీసికొని వెళ్ళమ్మా'' అంటే 'అమ్మో నాకు భయం. మా ఇంట్లో ఇలాంటివి జరగటం మనోహర్‌కు ఇష్టముండదని' తన పరిపక్వతలేని మనస్సును అలానే పరువు ప్రతిష్టలకోసం వెంపర్లాడే సామాన్య మహిళగా ఓల్గాగారు లావణ్యను చూపారు.

'తాను గర్భిణి యని, అలాగే కాన్పు అయ్యాక బిడ్డను చూసుకోవడం లావణ్యకు రాదని, మీ అమ్మ అయితే బాగా చూసుకుంటుందని, వైజాగ్‌లో మీ అమ్మకు బోర్‌గా ఉంటుంది. ఇంక ఇక్కడే ఉండొచ్చు రమ్మని ''మనోహర్ చెప్పినట్లు' ఉత్తరం వ్రాస్తుంది.

లావణ్య తల్లి కేవలం సేవలు చేసే వ్యక్తిగానే తప్ప కనీసం ఆమె పుట్టెడు దుఃఖంతో ఉన్నప్పుడు ఓదార్పును ఇవ్వడానికి కూడా ధైర్యం చేయక పరువు ప్రతిష్టల కోసం ప్రాకులాడే గృహిణిగా లావణ్యను ఇందులో చూడవచ్చు. అమ్మగా, సాటిస్త్రీగా కూడా చూడటానికి లావణ్యకు ధైర్యంలేదు. అత్మగౌరవం లేని వ్యక్తిగా ఓల్గాగారు లావణ్యను చూపారు. ప్రతిస్త్రీ తన పిల్లలకోసం శాయ

శక్తులా కృషి చేస్తూ కష్టాల్లో ఓదార్పును, ఊరటను కోరుకుంటారు. కానీ ఇలాంటి వ్యక్తిత్వాలు లేని వారి వల్ల స్వార్థంకే పెద్దపీట వేయడం జరుగుతుంది.

వీణ :

వీణ 'మానవి' నవలలో ఆత్మగౌరవం కలిగి సమాజంలో మార్పుకై ప్రయత్నించే పాత్ర. ఆధునిక భావాలు కలది. మన సమాజపు పాత భావాలను నిరసించే పాత్ర. రాజ్యలక్ష్మి విషయం రమణమూర్తి స్వీకరించిన విధానాన్ని తప్పపడుతూ అతనిలోని పురుషాహంకారాన్ని ఎత్తి చూపడంలో ఎటువంటి జంకు చూపక 'మనతో కలిసి పనిచేస్తున్న వీళ్ళను గొప్పవాళ్ళు అనుకోవటం మన పొరపాటు. మిగిలిన విషయాలేమోగానీ ఆడవాళ్ళ గురించి ఆలోచించడంలో వీరి సంకుచితత్వం బయట పడిందని'' నవతతో అంటుంది.

సుందరి, రాజ్యలక్ష్మిలు :

ఎటువంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైన తమ ఆత్మ గౌరవాలకు భంగం కల్గకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు అడుగిడే పాత్రలు. నవలల్లో పాత్రలు స్త్రీలు, పురుషులు ఉన్నా నవలకు అందాన్ని సమకూర్చేవి స్త్రీపాత్రలే. ఎందుకంటే దు:ఖాన్నైనా సు:ఖాన్నైనా సమానంగా భావించే మాతృమూర్తులు స్త్రీలు. కొన్ని ట్టాలలో స్త్రీలు ఒంటరి పోరాటం చేయడం కూడా మనం గమనించవచ్చు. అందువల్ల He సృష్టించేది She. She లేకపోతే He ఉండదు. కానీ ఈ నాటి పురషాధిక్య సమాజంలో పురుషునికి ప్రథమస్థానం. అన్ని కష్టాలు బరించి సమాజానికి సౌందర్యవతిగా ఉన్న స్త్రీకి రెండవ స్థానం ఇవ్వడం జరుగుతుంది. మానవి నవలలోని స్త్రీల పాత్రలు ఎల్లప్పుడూ నూతన మార్గాన్ని తెలిపేవిగా ఉన్నాయి.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ సంస్కృతిలో పండుగల విశిష్టత

- కళ్యాణం అన్నపూర్ణ

సంస్కృతి అంటే ఆ జాతి నమ్మకాలు, విశ్వాసాలు, మతాచారాలు, సాంఘికాచారాలు, కుటుంబ వ్యవస్థ, వాళ్ళు మాతృభాష ఆ తరువాత వాళ్ల సాహిత్య, కట్టు - బొట్టు. ఇవన్నీ అయిన తరువాత, వాళ్ల లలిత కళలు, ఇవన్నీ కలిపితే సంస్కృతి, ఇన్నింటిలోనూ కూడా ప్రజా జాతికి ఒక ప్రత్యేకత ఉంటుంది. ఈ సంస్కృతి పేరుగల ఇన్ని విషయాలలో ఆ జాతి చరిత్ర ప్రతిబింబిస్తుంది. ఆ జాతి చరిత్ర అంటే వాళ్లు నమ్మి ఆరాధించే దేవతల కథలతో మొదలుపెట్టి, వాళ్ళ చరిత్రలో వాళ్ళు అనుభ వించిన శత్రుభయాలు, జయాపజయాలు, యుద్ధాలు, వారిజాతి నాయకుల గాథలు, వారి మంచి చెడ్డలు ఇవన్నీ ఆ జాతి వర్తమాన కాలంలో గుర్తు చేసుకుంటూ ఉం డడమే ఒక సంస్కృతి.

మన ప్రాచీనులు పరిసరాలతో సహజీవనం చేశారు. ప్రకృతితో మమేకమయ్యారు. సంప్రదాయాలను ఏర్పరచు కున్నారు. ఈ సంస్కృతి, సంప్రదాయాలు తర్వాతి కాలములో అధ్యాత్మికతలో కలిసిపోయి, వేల సంవత్స రాలుగా జంతు, వృక్షాదులను దైవ స్వరూపాలుగా ఆరాధిస్తున్నారు. పండుగల సందర్భంలో వివిధ రకాల ఆహారపానీయాలు, వినోదం, ఆహ్లాదం, ఆచారాలు కన్పిస్తాయి. ప్రాచీన కాలంలో సంవత్సరంలో ఎక్కువ పండుగలకే ప్రాధాన్యం ఇచ్చేవారు. తనకు మేలు చేసిన ప్రతి వస్తువును కృతజ్ఞతాభావంతో ఆరాధిస్తారు. వాటిని దేవతలుగా భావిస్తారు. ఆ కారణంగానే ఆదిమ మాన వుడు వృక్షపూజ చేయడం ప్రారంభిస్తారు. ఆదిమ మాన వుడు ప్రారంభించిన ఆ వృక్షపూజా విధానం నేటికిని గ్రామల్లో జానపదులు ఆచరిస్తూ ఉన్నారు. తెలంగాణ లోని అన్ని జిల్లాలోను ఈ ఆచారం సజీవంగా ఉంది. ఈ వృక్షపూజలో వేపచెట్లు, రావిచెట్లు, తులసి చెట్లు, జమ్మిచెట్లు, మర్రి చెట్లు, మారెడు చెట్లు, మొలకలు ప్రముఖంగా పూజింపబడతాయి. సృష్టిలో తల్లియే పూజనీయురాలు. సర్వాధికారి. బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు కూడా జన్మించుటకు కారణభూతురాలు స్త్రీ అనీ, ఆమెయే ఓంకార స్వరూపిణి అనీ, మహాశక్తి అనీ, జానపదుల విశ్వాసం. అందుకే గ్రామ రక్షణ శక్తిగా భావించి ఆమెను జానపదులు కొలుస్తారు.

ఇక తెలంగాణ పండుగలను పరిశీలించినట్లైతే, బతుకమ్మ దసరా, దీపావళి, ఉగాది, హోలీ, సంక్రాంతి మొదలగు పండుగలను లంబాడీలు అత్యంతోత్సాహాలతో జరుపుకొంటారు. గిరిజనులు హోలి పండుగంటే గిరిజను లకు చాలా ఇష్టం. అందుకే హోలి వచ్చిందంటే చాలు! వారిలో ఉత్సాహం ఉరకలేస్తుంది. బీద, గొప్ప, చిన్న, అసలు వాయి వరసలు భేదం లేకుండా ఈ పండుగను జరుపుకోవడం విశేషం. నెల రోజుల ముందు నుండే ఆటపాటు ఆరంభమౌతాయి. రంగరంగుల బట్టలు వేసుకుంటారు. ఊరూరు, వాడవాడ తిరిగి ఆడిపాడి వారిచ్చే కానుకల్ని తీసుకొని ఆశీర్వచనాలు పలుకుతారు.

వినాయక చవితి :

శ్రీ గణేశాయమనమ: అంటూ ఉత్సాహంతో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటాము. లోకమాన్య తిలక్ కంటే పూర్వం నుండే గణపతి పూజ దేశంలో ఉన్నా దీనికొక సామాజిక చారిత్రక ప్రాధాన్యం మాత్రం అయన వల్లనే కలిగింది. గణపతి సర్వజీన గణములకు పతి కాని ఆ భగవానుణ్ణి భారతీయ జనగణపతిగా తీర్చిదిద్దిన వారు లోకమాన్యులు.

ఈ విదేశీయులు హిందువులనూ, హిందుత్వాన్ని, హిందూ ధర్మాన్ని, హిందూ సంస్కృతిని, హిందువుల ఆచార వ్యవహారాల్ని సంరక్షించాలనే దృక్పథంతో లేరు.

దీనిని అణగద్రొక్కాలనే వారి ఉద్దేశ్యం. అందుకే వారు స్వాతంత్ర్య సమర వీరుల్ని, దేశభక్తుల్ని అణగద్రొక్కి వేస్తున్నారు. అటువంటి విదేశీయులను ఇక్కడి నుండి సాగనంపితేనే సర్వ విఘ్నాలుపోతాయి. ఇందుకొరకే గణపతి నవరాత్రి ఉత్సవాలను ఉపయోగించుకొన్నారు లోకమాన్యులు. ఇవాళ కూడా దేశంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. విఘ్నాలు కలిగించేవారిని గురించి స్వతంత్ర భారత పౌరులూ ఆలోచించవలసి ఉంది.

బతుకమ్మ:

తెలంగాణ పేరు చెప్పగానే గుర్తుకువచ్చే పండుగ బతుకమ్మ. ఇది పూలజాతర. సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలోవచ్చే ఆశ్వయుజశుద్ధ పాడ్యమి మొదలుకొని తొమ్మది రోజుల వరకు రోజుకో తీరున బతుకమ్మను పూలతో పేరుస్తూ జరిపే పండుగ. ఇది తెలంగాణకు మాత్రమే సంబంధించిన పండుగ. బతుకమ్మ ఒక పూల గోపురం.ఈ గోపురం చుట్టూ స్త్రీలు వర్తులాకారంగా నిలబడి ఉయ్యాలో, వలలో గౌరవమ్మ, కోల్, చందమామ అనే ఆవృత పదాలున్న పాటల్ని పాడుతుంటారు. ప్రతి ఆవృత పదం దగ్గర ఒకసారి వంగి చప్పట్లు కొట్టడం జరుగుతుంది. కొని జిల్లాల్లో రెండు పర్యాయాలు చప్పట్లు కొట్టే పద్ధతి ఉంది. బతుకమ్మ పుట్టపూర్వోత్తరాలకు సంబంధించి బహుళ ప్రచారంలో ఉన్న ఒక పాట ఉంది. ఆ పాటలోని కథ ఇలా ఉంది.

ఇలా బతుకమ్మ శ్రీలక్ష్మి అవతారం అనేది ప్రసిద్ధమే అయినా 'గెరమ్మా' అనే ఆ వృత్తిలో పాడుకొనే బతుకమ్మ పాటల్లో ఆ తల్లి లక్ష్మి పార్వతీ సరస్వతుల సమాహార స్వరూపంగా కనిపిస్తుంది. ఇక బతుకమ్మ తయారీకి ప్రతి వస్తువు ప్రకృతే అందిస్తుంది. వివిధ విధాల పుష్పాలు ప్రయోగించి బతుకమ్మను తయారు చేస్తారు. ముఖ్యంగా తంగేడు, గడ్డి, గునుగు, బీర, కట్ల మొదలైన పూలెన్నో ఉపయోగిస్తారు. దాదాపు గోపురాకారంగా పేర్చే బతుకమ్మ నిర్మాణంలో ఇంటిల్లిపాది చేయి వేసి తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. బతుకమ్మను పేర్చడానికి పెద్ద తాంబూలాన్ని లేదా పెద్ద పళ్లాన్ని ఉపయోగిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా ఇప్పటికే గుర్తించారు. జాతీయ పండుగగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రాన్ని కోరినది. బతుకమ్మ ప్రకృతి నుండి వచ్చింది. చివరకు ప్రక ృతిలోనే లీనమైపోయింది. ఇదో జీవన సత్యం. బతుకమ్మ ఆట తెలంగాణా సాంప్రదాయిక నృత్యం. నిజాంల కాలం నుండి నేటి దాకా ఈ నృత్యం - నిలిపిన సాంస్కృతిక పటిష్ఠతమ గూర్చి నైతిక మూల్యాల నిర్మాణం గూర్చి ప్రజా చైతన్యావిష్కరణ గూర్చి ప్రత్యేకంగా పరిశీలించవలసిన అవసరముంది.

దీపావళి :

తెలంగాణ సంస్కృతిలో చీకటివెలుగులు పండుగ దీపావళి. దీపావళి పండుగ సత్యభామ నరకాసురుణ్ణి చంపిన సందర్భంగా వస్తుంది. దీపావళి పండుగను తెలంగాణలో లంబాడీలు 'దవాళి' లేదా 'కాళీ' అమాస్ అని పిలుస్తారు. భారతదేశమంతటా దీపావళి పండుగను రెండురోజులు వాకిట్లో సానిపి చల్లి గొబ్బెమ్మలను పెడతారు. దీపావళి ముందురోజు బంజారాలు పశుసంరక్షణ కోసం గోలక్ష్మిని పూజిస్తారు. పశువుల కొమ్ములకు, ఇసుర్రాయికి, స్త్రీల పురుషులు గేరు (జాజురంగు) పూస్తారు. పశువుల కాళ్ళకు గజ్జలను మెడకు గంటలను కడతారు. యువకులు అడవినుండి ముందుగా కట్టెలను సేకరించి 'కోలా' (కట్టెలను పేర్చి తయారుచేసినకాగడా) లను తయారు చేసుకుంటారు. బాలబాలికలు అడవి నుండి పక్షిగూళ్ళను సేకరిస్తారు. కోలాలకు నిప్పును అంటించి కేరింతుల కొడుతూ ఆడుకుంటారు.

బియ్యాన్ని నానబెట్టి, ఆరబోసి, ఇసుర్రాయితో పిండిని పట్టి, నెయ్యి, బెల్లంతో 'లాప్సి" (పాయసం తాయారు చేస్తారు. పాయసాన్ని పిత ృదేవతల పేరున మూడుసార్లు పొయ్యిలో నిప్పులు మీద వేస్తారు. ఆ తరువాత చెంబులో ఉన్న నీళ్లను ఎడమపక్క కుడిపక్క మూడుసార్లు పోస్తారు (ప్రార్ధన) చేస్తారు. వారిని తమను చల్లగా చూడమని కోరుకుంటారు. భోజనాలు అయిన తరువాత పెద్ద

వాళ్ళు యువతి యువకులు కలిసి, పాటలు పాడుకుంటూ నృత్యం చేసుకుంటే దీపావళి పాటలు, దేవతల పాటలు పాడుకుంటూ సంతోషిస్తారు. ఇంతటితో పండుగ ముగుస్తుంది.

వరలక్ష్మి వ్రతం :

శ్రావణానికి పూర్వమే వర్షాలు పడతాయి. దాదాపు రెండు మాసాల పంట భూమ్మీద ఉంటుంది. ఎటు చూచినా భూమి పచ్చగా ఉంటుంది. జీవితంలో వైభవం ప్రకృతిలో పచ్చదనం. పంటవల్లనే వైభవం. అలాంటి పంటకు మూలం భూమి. ఆ భూమి పచ్చగా ఉండడమే శుభం, శివం, మంగళం, వైభవం. శ్రావణమాసంలో ఎన్నో వ్రతాలు పాటిస్తారు. మాస ప్రారంభంలోనే పాయస పరమాన్నాలు చేసుకుంటారు. పున్నమికి ముందున్న శుక్రవారం నాడు వరలక్ష్మి వ్రతం చేస్తారు. ఇది సర్వ సాధారణంగా రెండో శుక్రవారమే అవుతుంది. అయితే మూడో శుక్రవారం కూడా జరుపుకొనే ఆచారముంది. శ్రావణంలో ప్రతి శుక్రవారం వ్రతాలు చేస్తారు. ఎన్నో వ్రతాలు ఈ మాసంలో స్త్రీలు ప్రారంభిస్తారు.

రాఖీ పౌర్ణమి :

శ్రావణ పౌర్ణమి నాడు ఉత్తరభారతంలో రక్షాబంధన కార్యక్రమం జరుగుతుంది. రాష్ట్రీయ స్వయం సేవక సంఘం నిర్వహించే ఈ ఉత్సవం దేశవ్యాప్త సామాజిక ఉత్సవమయింది. ఎవరికి ఎవరైనా రక్ష ధరింప చేయవచ్చు. పురోహితుడు ఆలయానికి వచ్చిన వారందరికీ రక్ష కడతాడు. ప్రతి గృహానికి వెళ్ళి రక్ష కట్టవచ్చు. పూర్వ కాలం (భవిష్యపురాణం) కథ ప్రకారంగా శచీదేవి బృహస్పతి ప్రేరణతో ఇంద్రునికి రక్ష కట్టి విజయేంద్రుడయ్యేట్లు చేయగలిగింది. కాని రాను రాను ఇది అన్నా చెల్లెళ్ళ పండగయింది. సంఘం కారణంగా 'నాకు నీవు రక్ష-నేను నీకు రక్ష, మనమిరువురం మన దేశానికి రక్ష' అంటూ రక్ష ధరించే సంప్రదాయం స్థిరపడింది.

గౌరీ వ్రతం :

శ్రావణమాసంలోని మొదటి మంగళవారం నాడే శ్రావణ మంగళ గౌరీవ్రతం నిర్వహించే సంప్రదాయ మున్నది. మంగళవారం నాడు గౌరీదేవిని పూజించటం వల్ల జీవితం సౌభాగ్యమయమవుతుందని విశ్వాసం. ముత్తయిదువులకు ఇది ఎంతో శుభదాయకం.

జంధ్యాల పున్నమి :

దక్షిణ భారతంలో శ్రావణ పౌర్ణమినాడే జంధ్యాలు ధరిస్తారు. ఋగ్వేద ఉపాకర్మగా దీనిని నిర్వహించేవారు ఒకరోజు ముందునుండే నూతన యజ్ఞోపవీతాలు ధరిస్తారు. ఈ పౌర్ణమిని నూలుపున్నమి అనీ, జంధ్యాల పున్నమి అనీ పిలుస్తారు. పట్టు లేదా నూలు వస్త్రధారణం ప్రతదీక్షకు గుర్తు.

శ్రీకృష్ణాష్టమి :

ఈ మాసంలోనే బహుళ అష్టమినాడు శ్రీకృష్ణ జయంతి నిర్వహిస్తారు. ఈ రోజునే కృష్ణాష్టమి అంటారు. అనేక ప్రదేశాలలో బాలబాలికలకు కృష్ణుని వేషం వేసి బాల గోకులం నిర్వహిస్తారు. శ్రావణ బహుళ చతుర్దశి నాడు కూడా వ్రతాలు చేస్తారు.

నాగుల పంచమి :

శ్రావణమాసంలో శుక్లపంచమినాడు నాగులపంచమి నిర్వహిస్తారు. కొందరు అంతకు పూర్వమే చవితి నిర్వహిస్తారు. నాగులను పూజిస్తారు. పాము పుట్టల్లో పాలు పోస్తారు. నాగులను ఆరాధించే పద్ధతి అనాదిగా ఈ దేశంలో కొనసాగుతున్నది. విషాన్ని కూడా అమృతంగా మార్చుకోవాలనే సందేశమే ఈ పండగ ద్వారా అందుతోంది. ఆషాడంలో బోనాలు తీసి అమ్మవారిని ఉపాసించి, శక్తి సముపార్జన చేయడం సంప్రదాయం. ఆషాడం తర్వాత ఈ శావణంలో జీవితాన్ని అలంకారమయం, సౌందర్యమయం, సౌభాగ్యమయం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అందుకే లక్ష్మీదేవిని ఆహ్వానించి పూజిస్తారు. స్త్రీలు నిత్య కుంకుమా శోభితలవుతారు.

బోనాలు :

తెలంగాణలోని భిన్న ప్రాంతాలలో ఆషాడ, శ్రావణ

మాసాలలో ఎన్నో ఉత్సవాలు జరిగాయి. ఆషాడంలో బోనాలు తీశారు. ఇది సమష్టిపండగ. బోనం (దీపం ఉన్న కుండ) ఒక ఇంటిలో చేసేదైనా పదిండ్లవారు కలిసి పోతురాజు ముందు నడుస్తుండగా, స్త్రీలు బోనం కుండ నెత్తిన ధరించి ఊరేగింపుగా వెళ్లే పండుగ. డప్పులు కొట్టేవారు, బూరాలు-కొమ్ములు ఊదేవారు, అంగళ్లలో రకరకాల పదార్థాలు అమ్మేవారు, విచిత్ర వేషధారణతో చిందులు తొక్కేవారు, వీరంగాలు వేసేవారు ఒక్కరేమిటి వందల వేలమంది ఆషాఢం బోనాలలో పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జయంతి తదితర పర్వదినాలలో బాలబాలికల నిమిత్తం లీలలకు క్రీడలకు ప్రాధాన్యమిచ్చినా, తత్త్వం మాత్రం చెక్కుచెదరరాదు. కోలాటం ద్వారా రాసక్రీడను చూపించినా, కృష్ణతాండవం కాళీయమర్దనం ద్వారా ప్రదర్శించినా, గోపాలుర చల్దులు కుడవడం దర్శింప జేసినా, కృష్ణ కుచేలుర మైత్రి చెప్పినా తత్వాన్ని అందిస్తూనే ఉండాలి. కష్టాల్ని ఎదుర్కొంటూ సుఖాలు పంచుకొంటూ సాగే మానవ జీవితమే ఒక లీలా విభూతి కేంద్రంగా కొనసాగుతుందన్న సందేశమందాలి. ఆసురీశక్తుల విజృంభణాన్ని ఆపే ధర్మాతక చైతన్య దిశగా మనల్ని ఈ పండుగలు నడిపించాలి. భారతదేశంలో హిందువులే కాక హైందవేతర మతస్థులెందరో ఉన్నారు. భిన్నత్వంలో ఏకత్వం గల ఈ దేశంలో హిందువులు, క్రైస్తవులు, మహ్మదీయులు, జైనులు, బౌద్ధులు అన్యోన్య సహకార సానుభూతులతో సహజీవనం కొనసాగిస్తున్నారు.

మొహర్రం :

మొహర్రం అనేది అరబ్బీ క్యాలెండర్ యొక్క మొదటి నెల పేరు. ఇస్లాం నూతన సంవత్సరం ఈ నెలతోనే మొదలవుతుంది. ఈ నెలలో చంద్రుడు కనిపించిన ఐదవరోజు నుంచి మొహర్రం పండుగ మొదలౌతుంది. దీనినే పీరీల పండుగ అంటారు. పీర్ అంటే మహాత్ముడు, ధర్మ నిర్దేశకులని అర్థం. ఇమామ్ హసన్, ఇమామ్ హుస్సేన్ అని ఇద్దరు అన్నదమ్ములు. వీరు మహమ్మద్ ప్రవక్త మనుమలు. ఇరాక్ లోని కర్బలా ప్రాంతంలో జరిగిన ఓ శాంతియుద్ధంలో వీరు చంపబడ్డారు. ఈ ఇద్దరి స్మృతిలో 10 రోజులు సంతాప దినాలుగా పాటించే పండుగనే మొహర్రం పండుగ.

తెలంగాణలో పీరీల పండుగ మత సామరస్యానికి ఒక ప్రతీక. హిందూ ముస్లింలు భక్తి శ్రద్ధలతో చేసుకునే పండుగ ఇది. ఈ విధంగా మన పండుగలన్నీ ప్రజల్లో ఐకమత్య భావననే పెంచుతాయి. సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయి

పీర్ల పండుగ నిజానికి ముస్లింల పండుగ కానీ తెలంగాణలో హిందువులు జరుపుతారు. పిరీలకు తెలంగాణ హిందువులు జరుపుతారు. పీరీలకు తెలంగాణ గ్రామాలోని కులాల పేర్లుంటాయి. ప్రత్యేకంగా హిందువులే ఎత్తుకొని ఆడుతారు. పీర్ల స్థావరం ముందు "అలావా" ఉంటుంది. నిప్పుగుండం దాని చుట్టు పాటలు పాడుతూ గుంపులుగా ఆడతారు. తెలంగాణలో మహమ్మదీయులు "మొహర్రం" పండుగ జరుపుకుంటారు దీనినే "పీర్ల పండుగ" కూడా అంటారు. పీర్ అంటే "మహత్ములు, ధర్మ నిర్దేశకులని" అర్థం. తెలంగాణలో పీర్ల పండుగ మత సామరస్యానికి ఒక ప్రతీతి. హిందు ముస్లిములు భక్తి శ్రద్ధలతో చేసుకొనే పండుగ ఇది. పీర్ల ఉత్సవంలో భాగమై సంస్కృతి వైభావాన్ని చాటినవి.

రంజాన్ :

ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొనే పండుగ రంజాన్ షవ్వాల్ మాసంలోని మొదటిరోజు జరుపుకొనే పండుగనే "ఈద్-ఉల్-ఫితర్". ఈ పండుగను నెలవంకను చూసి జరుపుకుంటారు. ముస్లింలు అతి పవిత్రమైన మాసం రంజాన్. "దివ్యఖురాన్" గ్రంథం దివి నుండి భువికి ఈ మాసంలోనే వచ్చింది. రంజాన్ మాసంలో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తారు. ముస్లింల సంస్కృతి, చరిత్రలకెదురుగా నిల్చిన దర్పణమే ఈ రంజాన్ పండుగ. ఈ పండుగ తర్వాత మరో 6 రోజుల పాటు షవ్వాల్ దీక్షలను పాటించడం జరుగుతుంది. రంజాన్ మాసంలో ఇస్లాం నిర్దేశించిన సిద్ధాంతాలల్లో

"జకాత్" నాలుగవది. జకాత్ అనగా దానం. ప్రతి ఒక్కరు తమకు ఉన్నదానిలోనే అవసరమున్న వారికి ఇంత ఇచ్చి ఆదుకోవాలి. తమ వద్దనున్న బంగారం, వెండి, పంట, వ్యాపారం కోసం నిర్దేశించబడి ఉన్న సరుకులు ఇవ్వాల్సి ఉంటుంది. నిరుపేదలు సైతం ఆనందోత్సహాల మధ్య పండుగ జరుపుకోవాలనేదే జకాత్, ఫిత్రాల ముఖ్య ఉద్దేశ్యం. ఈ మాసం వల్ల అనేక విషయాలు అవగతమవుతాయి.

బక్రీద్ పండుగ :

త్యాగనిరతిని చాటి చెప్పే బక్రీద్ పండుగ (ఈద్-ఉల్-జుహను ముస్లింలు జరుపుకొంటారు. ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొనే రంజాన్ పండుగ తర్వాత బక్రీద్ ను రెండో ప్రాధాన్యతను ఇస్తారు. అప్పటి నుంచి ముస్లింలు ప్రతీ ఏడాది అదే బక్రీద్ రోజు పొట్టేలు, మేకలను అల్లాహ్ కోసం ఖుర్బాన్ (త్యాగం) చేస్తారు. పండుగ రోజున ఈద్‌గామ్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు చెప్పుకొంటారు. పొట్టేలు, మేకల మాంసాన్ని పేదలకు పంచి, ధనికులు, పేదలు అనే తారతమ్యలు లేకుండా సమాజంలో అందరూ ఒకే విధమైన దినచర్యను పాటిస్తారు.

క్రిస్మస్ పండుగ :

యేసుక్రీస్తు పుట్టిన రోజు డిసెంబరు 25న ప్రపంచ మంతా క్రైస్తవులంతా వేడుకలు చేసుకుంటారు. మానవుడుగా పుట్టిన యేసు క్రీస్తు క్రైస్తవులకు ఆరాధ్యుడు. బెత్లెహేములో మేరీమాతకు జన్మించిన లోక రక్షకుడు యేసుక్రీస్తూ. క్రిస్మస్ పండుగ రోజున క్రైస్తవ సోదరులందరు కొత్త బట్టలు ధరించి చర్చికి వెళ్ళి ప్రార్థనలు చేస్తారు. చర్చిఫాదర్ దేవదూత రక్షకుడిజననం గురించి తెలుపుతూ, క్రీస్తు ఎవరో, క్రైస్తవం ఏమిటీ, క్రైస్తవులు ఎం చేయాలో, ఎలా జీవించాలో మొదలైన విషయాలను విశదీకరిస్తాడు. పిల్లలంతా క్రిస్మస్ చెట్టు చుట్టూ ఆనందంలో గడుపుతారు. క్రిస్మస్ తాత చర్చికి వచ్చిన వారందరికి చాక్లెట్లు పంచి అందర్ని ఆనందపరుస్తారు.

ప్రజలలో ఆధ్యాత్మిక స్ఫూర్తిని పెంపొందించడానికి, రచయితలు భక్తి సాహిత్యాన్ని రచించారు. ఆధ్యాత్మిక చింతన వల్లనే మానవుని జీవితం సార్థకమవుతుంది. మనిషి అరిషడ్వర్గాలను జయించి సద్వర్తనుడుగా రూపొందడానికి ఆధ్యాత్మిక పథమే రాజమార్గం, దైవ ధ్యానం, ఆరాధన, దర్శనం ఆధ్యాత్మిక దృష్టిని దృఢతరం చేస్తాయి.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రాచీన భారతంలో ఆదిమ తెగలు సామాజిక జీవనం

- కిరణ్మయి

'విపులాచపృథ్వీ' అని ఋగ్వేదంలో చెప్పబడింది. విశాలమైన ఈ ప్రపంచంలో వైవిధ్యం లేకపోవడమేమిటి? అలా లేకపోతేనే ఆశ్చర్యపడవలసి వుంటుంది. ప్రకృతిలో వైవిధ్యంతోపాటు, వైరుధ్యంకూడా నిబిడీకృతమైవుంది. దీనినే 'గతితర్కం' అని అంటారు. దీని ప్రకారం మాతృ స్వామిక వ్యవస్థ తదనంతరం ప్రపంచవ్యాప్తంగా సామాజిక రంగంలో అనేక వ్యవస్థలు పరిణామం చెందాయి. అయితే యింత మార్పు జరిగాక కూడా, మాతృస్వామిక వ్యవస్థ అవశేషాలుగా వున్న మానవతెగలు నేటికీ నిలిచివున్నాయి. ఇవే ఆదిమతెగలుగా నేటికీ పిలువబడుతున్నాయి. అందువల్లే యీ ఆదిమతెగల్ని మానవజాతి పూర్వీకులని చెప్పడం జరిగింది. ఇదే ఆదిమతెగల విశిష్టత కూడా !

గతంలోంచి వర్తమానం పుడుతుంది. భవిష్యత్తు కూడా వర్తమానంలోంచే ఎదుగుతూ వుంటుంది. అందు వల్ల గతకాలపు అవశేషాలు చరిత్రలో మిగిలి పోతూనే వుంటాయి. ఆఫ్రికా కలహారి ఎడారిలోని బుష్‌మన్‌లు, దక్షిణ ఫిలిప్పీన్స్‌లోని టాసాడ్‌లు, ఆస్ట్రేలియాలోని ఆస్ట్రలాయిడ్స్, హంగేరీలోని జిప్సీలు, అమెరికాలోని రెడ్ ఇండియన్లు, శ్రీలంకలోని వెడ్డాలు, ఇండోనేషియాలోని పిగ్మీలు, అండమాన్ నికోబార్ దీవుల్లోని ఓల్చాలు మన పూర్వీకులే.

వేదకాలానికి ముందు ప్రాచీన భరతఖండంలో చరిత్రకు మూలకారకులైన ద్రావిడులు, నాగులు, కిరాతులు, నిషాదులు, ఫణులు, శబరులు, బోయలు, ముండారీలు, సంతాలులు, గోండులు ఆధునిక భారతీయ సంతతి పూర్వీకులుగా చరిత్రకారులు తెలియచెబుతున్నారు. చారిత్రక పరిణామక్రమంలో అనేక సంఘటనలు దొర్లిపోయాయి. కన్ను, ముక్కుతీరు, రంగు, బాహ్య లక్షణాల ననుసరించి మానవ తెగల మధ్య గల వైవిధ్యాన్ని మానవ శాస్త్రజ్ఞులు విశ్లేషించారు. ఇవి పుట్టుకతో మానవ తెగలకు సంక్రమించిన ప్రకృతి లక్షణాలు, అయితే యీ లక్షణాలే మానవతెగల మధ్య విభజనకు, అంతరాలకు దారితీశాయి. మానవ కల్పిత మైన వర్ణ విభజనకూ, తేడాలకూ కారణమయ్యాయి. ఇవే తదుపరికాలాల్లో వర్ణవ్యవస్థకు దారితీశాయి. భారత దేశంలోని ఆదిమతెగలు ఆస్ట్రలాయిడ్ జాతికి చెందినట్లు చెప్పబడింది. నీగ్రోటీస్, ఆస్ట్రలాయిడ్ జాతులకు దగ్గర సంబంధం వుంది. ఆస్ట్రలాయిడ్స్ ద్రావిడ జాతులు. ఆర్యులు సింధు నదీతీరాలలో ప్రథమంగా వీరిని చూసినప్పుడు ఆదిమ తెగలని దస్యులని, నిషాదులని వ్యవహరించారు. దస్యులకు పర్యాయపదంగా అసురులని కూడా సంబోధించారు. ఈ ద్రావిడ తెగల మధ్య ఆచార వ్యవహారాల్లో, జీవన విధానంలో ఒకే పోలికలు కనిపిస్తాయి. ఆర్య-అనార్య తెగల మధ్య యుద్ధాలు, సంబంధ బాంధవ్యాలు, ఏర్పడక పూర్వం కొండలోయల్లో కిరాతులు నివసిస్తూ వుండేవారు. హిమాచలప్రదేశ్, కాశ్మీరు, ఉత్తరాఖండ్, నేపాల్ ప్రాంతాల్లో కిరాత తెగ వ్యాపించి వుండేది. కులు, కాంగ్రా లోయల్లో, అసురులు వుండేవారు. వింధ్య, దండకారణ్య ప్రాంతాల్లోని అరణ్యాలలో ముండాలు, నిషాదులు, గోండులు, సవరలు, భిల్లులు తదితర ఆదివాసీ తెగలు సంచరించేవి. నదీ తీరాల్లో, వ్యావసాయిక ప్రాంతాల్లో ద్రావిడులు, నాగులు, ఫణులు నివసిస్తూ వ్యాపారం, గ్రామ జీవితం, వ్యవసాయం కొనసాగిస్తూ వుండేవారు.

ఆదివాసులకు వేట ప్రధాన వృత్తిగా వుండేది. కొండ దేవతలను, వృక్షాలను పూజించేవారు. జాతరలు, నరబలులు, నిత్యకృత్యంగా వుండేవి. వీరు నివసించే పర్వత, అరణ్య ప్రాంతాల పరిధిలో వీరే సర్వాధికారాన్ని

చెలాయిస్తూ వుండేవారు. ఒక తెగ పరిధిలో తెగనాయకునిదే తుది నిర్ణయంగా వుంటుంది. క్రీస్తుకు పూర్వం అయిదువేల సంవత్సరాల నాటికి ఆదిమవాసులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకొన్నారు. వ్యవసాయం అమలులోకి వచ్చింది. అప్పటిదాకా ఆదిమవాసుల జీవన విధానంలో మాతృస్వామిక వ్యవస్థ సాగుతూ వుండేది. ఆదిమవాసులు గుంపులు గుంపులుగా అడవుల్లో, పర్వత ప్రాంతాల్లో నివసించేప్పుడు వావివరుసలుండేవి కావు. ఒక గుంపులోని ఆడవాళ్ళందరూ, ఆ గుంపులోని మగవాళ్ళందరితో సంగమం వుండేది. తల్లి కుమారునితో, తండ్రి కూతురితో, అన్న చెల్లెలితో శారీరక సంపర్కం కొనసాగేది. పుట్టిన బిడ్డకు తల్లి మాత్రమే గుర్తుండేది. తల్లి మాత్రమే బిడ్డ సంరక్షణ బాధ్యత వహించేది. అప్పటి తెగలలో స్త్రీ సర్వాధికారిగా వుండేది. తండ్రెవరో తెలీని దశలో సంతతికి తల్లి మాత్రమే అన్ని విషయాల్లో ఏడుగడగా ఉండేది. అందువల్ల స్త్రీకి తెగలో గౌరవ భావం నెలకొని ఉండేది. వేటాడితెచ్చిన జంతుమాంసం తెగలోని వారికి పంపిణీ చేయడం, పసి పిల్లలకు ఆహారాన్ని తినిపించడం, వాతావరణ పరిస్థితుల నుంచి బిడ్డను కాపాడడం, యుక్తవయస్సు వచ్చిందాకా పిల్లల్ని పెంచి పెద్ద చేయడం తల్లి మాత్రమే చేసేది. కనుక గుంపులోని వారందరికీ తల్లి ముఖ్యమైందిగా పరిగణించబడేది.

క్రీస్తుకు పూర్వం అయిదువేల సంవత్సరాల వరకు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సమాజంలోనూ, తెగలోనూ స్త్రీ మాత్రమే ప్రధాన పాత్ర వహిస్తూ, గణాధిపత్యం వహిస్తూ వుండేది. ఈ వ్యవస్థను మాతృస్వామిక వ్యవస్థగా పిలువ బడడం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా యీ వ్యవస్థ ఒక దశవరకు అమలులో వుంటూ వచ్చింది. తరువాత కొంత కాలానికి ఒక తెగలోని స్త్రీ పురుషులు మధ్య సంగమం నిషేధింపబడింది. ఒక తెగ మరొక తెగతో మాత్రమే శారీరక సంబంధాలు జరిగేటట్లు నిర్ణయించబడినవి. మాతృ స్వామిక వ్యవస్థలో స్త్రీకి గౌరవస్థానం ఏర్పడినందున స్త్రీ సర్వాధికారాలను కలిగివుంది. గర్భం ధరించడం, బిడ్డనుకనడం అద్భుతంగా అప్పట్లో భావించేవారు. ప్రకృతిపరమైన యీ చర్య స్త్రీకి గౌరవాన్ని తెచ్చి పెట్టింది. వావి వరుసలు లేనిరోజుల్లో తల్లి మాత్రమే తెలిసి, బిడ్డకు తండ్రెవరో తెలియనందున అప్పటి సంతతికి తల్లి పూజనీయురాలుగా భావించబడింది.

అప్పట్లో ప్రకృతిని కూడా స్త్రీమూర్తిగా భావించేవారు. చెట్టు, కొండవంటి తమకు ఆశ్రయం కల్పించే వాటిని కూడా స్త్రీమూర్తిగా భావించి, వాటి పట్ల ఆరాధనాభావం ఏర్పడింది. అందువల్ల మానవ సమాజంలో తొలిసారిగా స్త్రీ దేవతలు వెలిసి, పూజలందుకోవడం జరిగింది. అడవి తల్లి వంటిది. కనుక ఆడది ఒక దేవత, కొండ ఒక దేవత, వృక్షం మరొక దేవత. ఆ విధంగా తల్లిపట్ల చూపించే ఆరాధనా భావమే ప్రకృతి శక్తులకు గూడా అన్వయించి, 'మాతృదేవత'లు ఏర్పడడం జరిగింది.

క్రీ.పూ. అయిదువేల సంవత్సరాల నాటికి స్థిరజీవనం ఏర్పడింది. వ్యవసాయం అమల్లోకి వచ్చింది. భూమి, పశుసంతతి, ధాన్యం తదితర ఆస్తి ఏర్పడిన తరువాత ఆస్తిమీద పెత్తనం పురుషుడికి సంక్రమించింది. పిల్లలను కనడం, పెంచడం, గృహకృత్యాలు నెరవేర్చడం స్త్రీల కర్తవ్యాలలోకి వచ్చింది. ఈ దశ పితృస్వామిక వ్యవస్థగా రూపొందింది. క్రమక్రమంగా సమాజంలో విజ్ఞానం పెరుగుతూ, గ్రామాలు, పట్టణాలుగా విస్తరించాయి. క్రీ.పూ. 3000 నాటి సింధు నాగరికత యీ నిజాన్ని తెలియచెబుతుంది. సుమేరియా, బాబిలోనియా ప్రాంతాలలో ఇలాంటి నాగరికత వికసించింది. భారతదేశంలోని సింధు నాగరికతకూ, సుమేరియా, మెసపొటోమియా నాగరికతకూ దగ్గరి సంబంధాలు పొలికలు వున్నాయి. దీనిని ద్రావిడ నాగరికతగా చెప్పడం జరిగింది. స్థిరజీవనంలో ద్రావిడులు, నాగులు, యక్షులు ముందంజవేసి, పితృస్వామిక వ్యవస్థలో గొప్ప నాగరికతను, సామాజికాభివృద్ధిని సాధించడం జరిగింది.

పితృస్వామిక వ్యవస్థలో పట్టణాలు, నగరాలు వెలిసాయి. వ్యాపార, వాణిజ్యాలు పెంపొందాయి. గ్రామ,

నగర పరిపాలన ఆరంభమైంది. వృత్తులు విభజింప బడినవి. ఆర్యులు సింధు నదీ తీరాల్లో ప్రవేశించేనాటికి, అక్కడ ప్రజల జీవనం, నాగరికత వైభవోపేతంగా వికసించి వుంది. వ్యాపారం, వాణిజ్యం, వ్యవసాయం ప్రజల జీవన విధానంలో నూతన మార్పుల్ని, విలువల్ని సంతరించి పెట్టాయి. గ్రామ జీవితం స్థానే నగర జీవితం వ్యాపించింది. వర్ణవ్యవస్థలో ఆటవిక తెగలు మిశ్రమం కాలేదు. ఆర్యుల నెదిరించి, కొండల్లో, అరణ్యాల్లో నివాసం ఏర్పాటు చేసుకొని తమ ప్రత్యేకమైన ఆచార, సాంప్రదాయాలను కలిగి ఉన్నారు. 1.సుదాసు, శంబర యుద్ధం, 2.రామాయణ కాలంలో బోయ వాల్మీకి, గుహుడు, శబరి, 3.మహాభారత కాలంనాటికి భారతదేశం అంతా ఒకే పరిధిలోకి రావడం. యీ దశలో కూడా ఆదివాసుల ప్రత్యేకత 1.హిడింబ, 2.ఏకలవ్యుడు. ఆర్య ద్రావిడుల తదితర అనార్య తెగలమధ్య జరిగిన యుద్ధాలలో ఆర్యులే విజేతులుగా వుంటూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో అనార్య తెగలు తాత్కాలికంగా వెనక్కు తగ్గినప్పటికీ అదనుచూసి, తిరిగి ఆర్యుల్ని చీకాకు పరుస్తూ వుండేవారు. కొంత కాలానికి ఆర్యులు, ఓడిపోయిన అనార్య తెగల్ని పూర్తిగా దూరం చేసుకోకుండా, తమ చెప్పు చేతల్లో జీవించే పరిస్థితుల్ని కల్పించి, సమాజంలో వారికి తృతీయ స్థానాన్ని కల్పించి పెట్టారు. మరికొన్ని సందర్భాల్లో అనార్య తెగలతో వివాహ సంబంధాలను కూడా ఏర్పరచుకున్నారు. తమ దాస, దాసీజనంతో అక్రమ సంబంధాలను కలిగిన ఆర్య ప్రముఖులు కూడా చరిత్రలో కనిపిస్తారు.

వశిష్టుడు మాతంగకన్యయైన అరుంధతిని వివాహం చేసుకోవడం, శంతనుడు బెస్తకన్య సత్యవతిని వివాహం చేసుకోవడం, విశ్వావసుబ్రహ్మ రాక్షసస్త్రీ అయిన కైకసిని వివాహమాడడం, వంటి సంఘటనలెన్నో జరిగాయి. ఈ పరిస్థితుల్లో అనార్య తెగలైన ద్రావిడ, యక్ష, నాగ, ఫణి తదితర తెగలు ఆర్యులతో సంబంధాలు పెట్టుకొని, వారి కట్టుబాట్లు, ఆంక్షలకు లొంగి ఆనాటి ఆర్య సమాజంలో భాగస్వాములయినారు.

క్రీ.పూ.5000 నాటికి పితృస్వామిక వ్యవస్థ కుదుట పడింది. ఆర్య అనార్య తెగల సమన్వయం జరిగింది. బ్రాహ్మణ వ్యవస్థ ఏర్పాటైంది. అప్పటి ఋషి వర్గం వేదాలు, పురాణాల పేరిట సామాజిక విభజన జరిపి, వర్ణ వ్యవస్థను ఏర్పరచడం జరిగింది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలతో పాటు వీరికి దూరంగా పంచమ వర్ణాన్ని కూడా ఏర్పరచి పెట్టింది. ఆర్యుల పెత్తనం క్రింద అనార్య తెగలు లొంగి, వర్ణవ్యవస్థలో తమకు కేటాయించిన స్థానాల్లో ఒదిగి, యిమిడిపోయాయి.

ఈ చారిత్రక పరిణామక్రమం, అనూహ్యంగా, అనివార్యంగా జరిగిపోయింది. అయితే యిదే పరిస్థితుల్లో ఆర్యుల అంక్షలకు లొంగకుండా కొన్ని అనార్య తెగలు దూరంగా వుండిపోయాయి. ఇవే నేటి ఆదిమ వాసులైన ఆటవిక తెగలు. కిరాతక, నిషాద, బోయ, శబర, పుళింద, మూతిబ తెగలు ఇలాంటివే. ఈ తెగలు వర్ణ వ్యవస్థలో రాజీపడి, అధమ స్థాయిలో జీవించడానికి యిష్టపడలేదు. పైగా తమ ప్రాచీన సాంప్రదాయాల్ని. వ్యక్తిత్వాన్ని వదులుకోవడానికి ఏ మాత్రం అంగీకరించకుండా, దూరంగా అడవుల్లో, కొండలోయల్లో స్వతంత్రంగా జీవించనారంభించాయి. ఈ విధంగా ఆదిమ తెగలు తమ ప్రత్యేక ప్రతిపత్తిని నిలబెట్టుకున్నాయి. నేటి ఆదిమవాసులుగా పిలువబడుతున్న గిరిజన తెగలే, ఆనాటి స్వతంత్రను నిలబెట్టుకొన్న తెగలుగా మనం తెలుసుకోవలసి వుంది.

ఆదిమకాలం నుంచీ భరతఖండంలో నెలకొనివున్న ఆటవిక తెగల పూర్వాపరాలు ఈ క్రిందివిధంగా వున్నాయి. ప్రధానమైన ఆటవికతెగలు హిమాలయాల్లో ఉత్తర, తూర్పు సానువుల్లోనూ, హిమాలయ పర్వతాలు, చోటా నాగపూర్, పళీ తూర్పు పర్వతశ్రేణుల్లో వింధ్య పర్వతారణ్యాల్లో, రాజస్తాన్, మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో, సహ్యాద్రి పర్వతలోయల్లో, గుజరాత్, హిమచలప్రదేశ్‌లో నెలకొని వున్నాయి. దేశంలోని ఆదివాసుల్లో 55 శాతం తెగలు ఈ ప్రాంతాల్లో జీవిస్తున్నాయి. దీన్ని బట్టి అత్యధిక భాగం తెగలు ఆరావళి, సహ్యాద్రి, మధ్య, వింధ్య పర్వతశ్రేణి

కుదురులోనూ, చోటానాగపూర్ మరియు హిమాలయ పర్వత శ్రేణుల్లోను కేంద్రీకరించుకొని వున్నాయని అర్థమవుతోంది. పర్వతశ్రేణుల్లో నెలకొనివున్న కొన్ని ఆదిమతెగల మధ్య సారూప్యత నెలకొని జీవనం సాగిస్తు న్నాయి. ఈ ప్రాంతాల్లో పాదుకున్న ప్రధానమైన ఆటవిక జాతులు తమదైన జీవన సరళిని, సంస్కృతిని కలిగి వున్నాయి. అత్యంత ప్రాచీనకాలంలోనే ఆదివాసుల వలసలు ఒక ప్రాంతాన్నుండి మరొక ప్రాంతానికి జరిగి నట్లు చరిత్రకారులు నిర్ధారిస్తున్నారు. దక్షిణ సముద్రాల నుండి దక్షిణ భారతదేశంలోకి వలసవచ్చిన ఆటవికతెగలు అండమాన్ నికోబార్ దీవుల్లో, నీలగిరి కొండల్లో కుదుట బడ్డాయి. భౌగోళికమైన తేడాలు దేశం నలుమూలలా విస్తరించివున్న ఆటవిక తెగల్లో భిన్నత్వాన్ని ఏర్పరచి పెట్టాయి. ముఖ్యంగా 1.జాతి, 2.భాష, 3.నివాసం ఆటవిక తెగలమధ్య విభజనకు కారణాలుగా వున్నాయి. ఒక ప్రాంతాన్నుండి మరొక ప్రాంతానికి జీవనాన్ని వెతుక్కుంటూ వలసలు పోవడం ఆదిమ తెగలకు అనివార్యమైన స్థితిగా వుండేది. అప్పట్లో తాము నివసించే ప్రాంతంలోని ఆహారం దొరకని స్థితి ఏర్పడగానే, కొత్త ప్రాంతాలకు వలస పోవలసివచ్చేది. అక్కడ అప్పటికే నివసిస్తున్న తెగలతో సంపర్కం అనివార్యం అయ్యేది. ఈ దశలో శీతోష్ణస్థితి మారడం వల్ల కొత్త సంతతిలో మార్పులు జరిగేవి.

శారీరక, మానసిక స్థితిగతుల్లో ప్రకృతి పరమైన మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, జీవన విధానంలో పాత రాతియుగం వరకు ఎలాంటి మార్పులు సంభవించ లేదు. కాని క్రీస్తుకు పూర్వం అయిదువేల సంవత్స రాలనాటికి మాత్రం ఆదిమతెగల జీవన విధానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. కొన్ని తెగలు ఒకే ప్రాంతంలో స్థిరనివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. సంచార జీవితం నుండి క్రమేణా గ్రామజీవనం అల వడింది. వ్యక్తి జీవితం అనగా వ్యసాయిక జీవనం, పశు పాలన, స్థిరజీవనం ఏర్పడింది.

నదీ తీరాల్లో నివసించిన ఆదిమతెగల జీవనంలో పురోభివృద్ధి జరిగింది. గ్రామ జీవితం నుండి నగర జీవితానికి దారితీసింది. బాబిలోనియా, సుమేరియా సింధునదీ తీరాల్లోని హరప్ప తెగల జీవితాల్లో పోలికలు వున్నాయి. ఇతరేతర ప్రాంతాల్లోని తెగలు, స్థిరనివాసం ఏర్పరచుకొన్న తెగలు మీద దాడులు జరిగేవి. మనుగడ, జీవనం కొరకు ఆదిమ తెగల్లో ఈ దశల్లో పరస్పరం దాడులు, పోరాటాలు జరిగాయి. తిరిగి కొత్త పాత తెగల మధ్య సమన్వయం, సహజీవనం ఏర్పడేది. ఈ పరిస్థితి ప్రపంచవ్యాప్తంగా కొన్ని వేల సంవత్సరాలపాటు కొన సాగింది. చారిత్రక పరిణామక్రమంలో ఒక భాగంగా మానవ తెగల జీవన విధానం అనేక మార్పులకు చేర్పు లకు గురైంది. ఆదిమ తెగలన్నీ గిరుల్ని, నదుల్ని ఆశ్రయించుకొని జీవించాయి. ఆదిమ తెగల నాయకులు, గణాధిపతులు కాలక్రమంలో దేవతా గణంగా రూపుదిద్దుకోవడం జరిగింది. ఆర్య, అనార్య తెగల సమ్మే ళనంతోపాటు, దేవ సమన్వయం (థియోక్రసీ) కూడా జరిగినట్లు మనకు ఇతిహాస కావ్యాల ద్వారా తెలుస్తోంది. అసుర గణాధిపతి శివుడు, దేవతల అధిపతి విష్ణువు, ఆదిమానవులు ప్రకృతి శక్తులను పూజించేవారు. వృక్షాలను, కొండల్ని, నదుల్నీ మాతృదేవతలుగా భావించి కొలిచేవారు.

పార్వతి పర్వత రాజు హిమవంతుని పుత్రిక, శివుని తొలి దేవేరి సతి. ఈమె దక్ష ప్రజాపతి కుమార్తె. దక్షయజ్ఞం సందర్భంలో తండ్రి అవమానించాడని సతి యజ్ఞ గుండంలో పడి ఆహుతి అవుతుంది. ఈ దుర్వార్త విని శివుడు ప్రళయాన్ని సృష్టించాడు. వీరభద్రుని పంపి దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేస్తాడు. తదుపరి శివుడు మనస్సు వికలం చెంది, హిమ పర్వత సానువుల్లో తపస్సు చేసు కుంటూ వుండి పోతాడు. పర్వత రాజు పుత్రిక గిరిజ. ఈమెకు మరొక పేరు ఉమ. గిరిజ తమ పరిసరాల్లో తపస్సు చేసుకుంటున్న శివునిచూసి ప్రతిరోజు ఆయనకు పాలు, పండ్లు సమర్పిస్తూ, సన్నిహితురాలైంది. శివుడు

కూడా ఆమె యెడల ప్రసన్నత వహిస్తాడు. పర్వతరాజు హిమవంతుని దృష్టికి గిరిజా శివుని ప్రణయ వృత్తాంతం చేరుతుంది. తుదకు గిరిజను శివునికిచ్చి హిమవంతుడు వివాహం జరిపిస్తాడు.

అప్పటి నుండి గిరికన్య గిరిజకు ఇష్టంగా వుండేందుకు కైలాసపర్వతం పైనే తమ నివాసాన్ని శివుడు ఏర్పరచు కుంటాడు. గిరిజ, గిరిజనులు, గిరులనగా పర్వతాలను ఆశ్రయించుకొన్నందున పర్వతవాసులే అయ్యారు. ప్రాచీన కాలానికి చెందిన గిరిజ వృత్తాంతం తుదకు పురా ణాల్లో చోటుచేసుకున్నది. దీనివల్ల గిరిజనుల ప్రాచీనతకు గల ప్రతిపత్తి మనకు తెలుస్తోంది. సింధు నాగరికత వికసించిన దశలో, అప్పటిదాకా సంచార జీవనం చేస్తున్న మానవ తెగల్లో వైవిధ్యం ఏర్పడింది. ద్రావిడ, నాగ, యక్ష తెగలు స్థిరనివాసంతో, గ్రామ జీవితంలో ప్రధానపాత్ర వహించి, నాగరికతను సంతరించుకొన్నప్పటికీ, మరికొన్ని తెగలు అడవుల్ని, కొండల్ని మాత్రమే ఆశ్రయించుకొని వుండడం జరిగింది. మాతృస్వామిక వ్యవస్థనీ, ఆటవిక జీవనాన్ని అంటి పెట్టుకొని నిషాదులు, శబరులు, కిన్నెరులు, బోయలు, గోండులు, కిరాత తెగలు ప్రాచీన సాంప్రదాయాల్ని, జీవన విధానాన్ని కొనసాగించడం జరిగింది. ఆర్య, అనార్య తెగల మధ్య యుద్ధాలు ఆర్య తెగల్లోనే పరస్పరం దాడులు, ఘర్షణలు జరుగుతూ, తిరిగి యీ తెగలన్నిటి మధ్య వివాహాలు, సంబంధ బాంధవ్యాలు జరుగుతూ సామాజిక జీవనంలో సరికొత్త మార్పులు ఏర్పడుతున్న దశలో - ఆదిమ తెగలు మాత్రం ఈ నూతన సాంఘికావిర్భవంలో భాగస్వాములు కాలేదు. కొత్తగా వచ్చిన ఆర్యతెగల పెత్తనాన్ని, ఆర్య, అనార్య తెగల సమ్మిశ్రమమైన సాంఘిక వ్యవస్థనీ ఆదిమతెగలు గుర్తించ డానికి యిష్టపడలేదు. తమదైన జీవన సరళినీ, అలవాట్లనీ వదులుకోలేదు. ఒకరికి తలవంచి జీవించడం అంగీకరిం చని ఆదిమతెగలు అడవుల్లో కొండల్లో, సురక్షిత ప్రాంతా లకు పరిమితమై, స్వతంత్రంగా జీవించడం కొనసాగిం చాయి. భారతీయ సామాజిక చరిత్రలో ఆదిమతెగల నిర్ణయం ప్రత్యేకతను సంతరించుకొన్నది. విలక్షణంతో కూడుకొని వుంది.

ఆదివాసులు తాము నివసించే పర్వతాలు, అరణ్య ప్రాంతాల్లో సర్వాధికారాన్ని చెలాయిస్తూ వుండేవారు. వీరు స్వతంత్రులు. ఎవ్వరికీ తలవంచరు. ఆదిమతెగల ప్రత్యేక లక్షణం ఇది. అందువల్ల ఆర్యుల దండయాత్రలను తమ ప్రాంతాల్లో ఎదిరించడం జరిగింది. బలోపేతమైన ఆర్య సైన్యాలతో తలపడి, ఓటమి పొందినప్పుడు, వారితో రాజీపడి జీవించడానికి యిష్టపడక, మారుమూల ప్రాంతా లకు వలసలు వెళ్ళి, స్వతంత్రంగా జీవించసాగారు. ద్రావిడ, యక్ష, నాగతెగలు ఆర్యతెగలతో యుద్ధాల్లో ఓడిపోయి వారితో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకొని సహజీవనం చేయడం జరిగింది. ఆ విధంగా ఆర్యుల ఆధిపత్యంలో ఏర్పడిన వర్ణ వ్యవస్థలో తమకు కేటాయిం చిన వర్ణానికి చేర్చబడి, అప్పుడేర్పడిన సామాజిక క్రమంలో భాగస్వాములయ్యాయి. ఈ సందర్భంలో ఆదివాసులు తమ ప్రత్యేకతను వదులుకోలేదు. ఆర్య, ద్రావిడ తెగ లతో సమ్మిశ్రతమై పొదుకొన్న వర్ణ వ్యవస్థకు దూరంగా, తాము తరతరాలుగా అవలంబిస్తున్న జీవన సరళినే ఆదిమతెగలు పాటిస్తూ వచ్చాయి. ఈ అంశం భారతీయ సామాజిక చరిత్రలో గుర్తుపెట్టుకోదగింది.

భరతఖండంలో తొలితెగలు ఆదిమ తెగలేనని ప్రాచీన భారతచరిత్ర తెలియపరుస్తోంది. కిరాతులు, నిషాదులు, చెంచులు, బోయలు, కిన్నెరులు, గోండులు, శబరులు తదితర తెగలే ఆదిమతెగలుగా పిలువబడినవి. ఆదిమ తెగలైన కిరాతులు, బోయలు, చెంచులు, శబరులు ప్రాచీన భారతదేశంలో ప్రసిద్ధిచెందిన ఆటవిక తెగలుగా వుండేవని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ ఆటవిక తెగలు భారతదేశ సామాజిక జీవన విధానానికి ఆటపట్టు లుగా ప్రకృతి ఒడిలో ఒదిగి సంస్కారం నమ్మక విశ్వా సాలతో తమదైన జీవనశైలిలో కొనసాగుతూ వచ్చాయి.

❁ ❁ ❁

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ సినిమా పాటలు - అభ్యుదయ విప్లవ కవిత్వం

- సుమతి కురెళ్ల

జనచైతన్యానికి కవితాబావుటాలెత్తిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు. సామాన్య మానవుణ్ణి కవితా వస్తువు చేసుకొని, పీడితుల పక్షం వహించి ఐదు దశాబ్దాలకు పై కవితా జైత్రయాత్ర సాగించిన శ్రామిక పక్షపాతి అయిన కవి శ్రీశ్రీ. "మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది. పదండి ముందుకు, పదండి తోసుకు పోదాం, పోదాం పైపైకి ! పదండి ముందుకు పదండి" అని ఉవ్వెత్తున లేచి బెబ్బులిలా గర్జించాడు. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితలు చదివి కవిలోకం నివ్వెరపోయింది. నిఖిడాశ్చర్యం ఆయన వంకే చూసింది. ప్రపంచ బాధని తన బాధని తన బాధగా చేసుకొని కదిలాడాయన.

శ్రీశ్రీ మహాప్రస్థానానికి ముందుమాట రాస్తూ "కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ - ప్రపంచానికి బాధ శ్రీశ్రీ బాధ" అంటాడు చలం. ఇది అక్షర సత్యం. "మహాప్రస్థానం ఈ శతాబ్దంలో వచ్చిన ఏకైక మహాకావ్యం" అంటాడు పురిపండ అప్పలస్వామి. ఇక ఆయన రాసిన "కవితా ! ఓ కవితా" అనే కవిత ఆయన కీర్తిని శిఖరాయమానం చేసిందనే చెప్పాలి. "కనీసం వేయి సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు సాహిత్యంలో కవితను ఇలా నిర్వచించి, ఇంత కవితాత్మకంగా వర్ణించి, ఇంత అద్భుత సృష్టి చేసిన మరో కవి లేనే లేడు. యోగ్యతాపత్రం పేరుతో మహాప్రస్థానం పుస్తకానికి 1940లో చలం రాసిన పీఠిక. తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప పీఠికల్లో ఇది ఒకటి. 18ఏట 1928లో 'ప్రభవ' అనే కావ్యాన్ని సంప్రదాయ పద్ధతిలో రాసి ప్రచురించారు శ్రీశ్రీ. "1950లో మహాప్రస్థానం మొదటిసారిగా ప్రచురితమైంది. ఇది ఆయన్ని మహాకవిని చేసింది. తరువాత మరో ప్రపంచం, ఖడ్గసృష్టి అనే కవితా సంకలనాలను వెలువరించారాయన. చరమరాత్రి పేరుతో కథల సంపుటి, రేడియో నాటకాలనూ రచించారు శ్రీశ్రీ. వరం వరం, అమ్మ, మేమే, త్రీఛీర్స్ ఫర్ వన్‌మెన్, మానవుడి పాట్లు, సౌధామిని (పురిపండా గేయాలకు ఆంగ్లానువాదం) గురజాడ, మూడు యాభైలు, వ్యూలు, రివ్యూలు, లెనిన్ రెక్క విప్పిన రివల్యూషన్, వ్యాసక్రీడలు, మరో మూడు యాభైలు, చీనాయానం, సిప్రాలి, శ్రీశ్రీవ్యాసాలు, అనంతం (ఆత్మకథ) వంటివి గ్రంథాలను వెలువరించి సాహిత్యంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకొని, ఎవరూ చేరలేనంత ఎత్తులకు ఆయన ఎదిగారు. ఇక ఆయన రాసిన సినిమా పాటలు కూడా ఎంతో జనాదరణ పొందాయి." విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయిత సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా, హేతువాది మరియు నాస్తికుడిగా పేరు పొందిన మహాకవి శ్రీశ్రీ జూన్ 15, 1983న కన్నుమూశారు.

తెలుగు కవిత్వాన్ని మలుపు తిప్పిన మహాకవి. అభ్యుదయ కవిత్వానికి ఆద్యుడు శ్రీశ్రీ. ఆధునిక కవిత్వానికి వేదం లాంటి మహాప్రస్థానం రచించి మానవాభ్యుదయాన్ని ఆకాంక్షించిన మహాకవి. ఆకాశమార్గంలో పయనిస్తున్న జగన్నాథ రథచక్రాలను భూమికి దింపిన దార్శనిక కవి. పద్యాన్ని విడిచి వచన పద్యాన్ని గేయ కవితను అందుకొని ఎన్నో కొత్త భావాలను ప్రవేశపెట్టి ప్రజలను ఆలోచింపజేస్తున్న క్రాంతిమూర్తి. మార్క్సీయ సిద్ధాంతాలతో ప్రభావితుడై అదే భావధారతో ఉత్తేజమైన రచనలు వెలిగించిన విప్లవమూర్తి.

తెలుగు సినిమాపాటల చరిత్రలో అభ్యుదయ విప్లవ కవితోద్యమాలు ప్రేరణగా వచ్చినవి ప్రగతిగీతాలు పాటలకు సంబంధించినంత వరకు తెలుగు సినిమాల్లో ఉపయోగించిన మొదటి విప్లవాత్మకగీతం 'కాలచక్రం'లోని

శ్రీశ్రీ మహాప్రస్థానగేయమే. 50ల దశకంలో సామ్యవాద సిద్ధాంతాల ఛాయలుగల కొన్ని పాటలు వచ్చాయి. విప్లవాత్మక చిత్రాలలో అన్నీ ఆ బాణీకి తగిన పాటల్ని రాయించడం ఎనభయ్యవ దశకంలో నవతరం పిక్చర్స్‌తోనే ప్రారంభమైనది. ఆ ధోరణికి దోహదం చేసిన చారిత్రక నేపథ్యాన్ని సినిమాపాటలుగా వచ్చిన శ్రీశ్రీ 'మహాప్రస్థానం', 'ఖడ్గసృష్టి' కవితా సంకలనాల్లోని కవితల్ని ముందుగా పరిశీలించాలి. తెలుగు సినిమాపాటల్లో చైతన్యగీతాలు రావడానికి మొదట అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి దోహదం చేశాయి.

50ల దశకంలో మద్రాసు వచ్చిన వామపక్ష సభ్యుల ప్రయత్నాలకంటె శ్రీశ్రీ అభ్యుదయ గీతాలే 80వ దశకంలో వచ్చిన ఎర్రపాటలకు ఎక్కువ స్ఫూర్తినిచ్చాయి. 'కాలచక్రం'తో సినిమా పాటలుగా రావడం రసారంభమైన శ్రీశ్రీ కవితలు ఆ తర్వాత 'పల్లెటూరు', 'రణభేరి', 'పదండి ముందుకు', 'నేటి భారతం', 'భారతనారి', 'మహాప్రస్థానం', 'విప్లవశంఖం', 'సత్యాగ్రహం', 'స్వరాజ్యం' మొదలైన చిత్రాల్లో సినిమా పాటలుగా వచ్చాయి. వీటిలో కొన్నిటిని యథాతథంగా సినిమాల్లో తీసుకొంటే- కొన్నిటికి శ్రీశ్రీయే మార్పులు చేర్పులూ చేసి యిచ్చారు. ఇలా ముందుగా అచ్చయిన కవితల్ని మార్చి సినిమా పాటలుగా చేసిన కవులలో శ్రీశ్రీదే అగ్రస్థానం. 'పల్లెటూరు'లో 'పాలాలనన్నీ హలాలదున్నీ' (ప్రతిజ్ఞ-మహాప్రస్థానం) అనే గీతాన్ని, 'నేటి భారతం', 'భారతనారి' చిత్రాలలో- 'యమున మహిషపు లోహఘంటలు', (అవతారం- మహాప్రస్థానం); 'స్వరాజ్యం' చిత్రంలో 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' (జయభేరి-మహాప్రస్థానం), 'సత్యాగ్రహం'లో- 'పాపంపుణ్యం ప్రపంచమార్గం (శైశవ గీతి- మహాప్రస్థానం మొదటి రెండు చరణాలు మాత్రం) గేయాలను యథాతథంగా ఉపయోగించారు.

సాహిత్యంలో శ్రీశ్రీ చెయ్యని ప్రక్రియలేదు. పద్యం రాయడంలోనూ, గద్యం రాయడంలోనూ నవ్యసాచి. గేయాలనీ, లిమరిక్కులనీ, శతకాలనీ - ఇలా భాషలో ఉన్న అన్నిరకాల ప్రక్రియల్నీ ఔపోసన పట్టినవారు. చమత్కారాలూ, 'పన్'లూ రిటార్ట్‌లూ సరేసరి. మాటలతో గారడీలు, పారడీలూ చెప్పనే అక్కర్లేదు ఇలాంటి రచయితని 'డబ్బింగ్' కోసం తెచ్చుకుంది సినిమా. ఒక భాషలో ఉన్న మాటల్ని, ఆ పెదవుల కదలికల్నిబట్టి, అదే అర్థం తెస్తూ తెలుగుమాటలు రాయగల సమర్థుడెవరు? అని ఆలోచించి, మొదటి డబ్బింగ్ చిత్రం తీసిన నిర్మాతలు శ్రీశ్రీని పట్టుకున్నారు. డబ్బింగ్ రాయడం ఒక ఫీటు. ఆ ఫీటు చెయ్యగలవాడు, థాటుగలవాడూ శ్రీశ్రీయే అని 'నీరా అవుర్ నందా' అనే ఆ హిందీ సినిమాకు, ఆయనచేత రాయించారు ఆ నిర్మాతలు. అదే తెలుగులో 'ఆహుతి' పేరిట 1950లో విడుదలైంది. ఐతే, పరోక్షంగా ఆయన 1940లోనే సినిమా ప్రవేశం చేశారు. అమంచర్ల గోపాలరావు తీసిన 'కాలచక్రం' చిత్రంలో శ్రీశ్రీ రాసిన 'మరో ప్రపంచంలో పిలిచింది' గేయాన్ని ఉపయోగించుకున్నారు.

ఆంధ్రప్రభ, ఆనందవాణి పత్రికల్లో పదేళ్లపాటు ఉద్యోగం చేశాక, 1950లో సినిమాల్లో పెట్టిన కాలు అక్కడే నిలదొక్కుకుంది. 'ఆహుతి' డబ్బింగ్ సినిమాయే అయినా, అందులో ఆయన రాసిన పాటలు అందర్నీ ఆకర్షించి, హెచ్.ఎమ్.రెడ్డి సంస్థ రోహిణిలో 'ఆస్థానకవి'ని చేశాయి. 'నిర్దోషి' (51)లో ఆయన కొన్ని దృశ్యాలూ, పాటలూ రాశారు. మూనాస్ 'ప్రపంచం' (53) ఆరంభిస్తూ శ్రీశ్రీని కూడా ఒక రచయితగా తీసుకున్నారు. విశలాచార్య 'కన్యాదానం' (55) చిత్రానికి శ్రీశ్రీ పాటలూ, మాటలూ రాశారు.

కథ విని, సందర్భాలు వినీ శ్రీశ్రీగారు ఒక్కరోజులోనే పన్నెండు పాటలు రాశారు! గ్రేట్!" అని విశలాచార్య చెప్పేవారు. డబ్బింగ్ చిత్రాలకు రచయితగా మాటలూ, పాటలూ, అసలు చిత్రాలకు పాటలూ ఎన్నెన్నో రాశారు శ్రీశ్రీ. ఎన్నదగ్గ పాటలు ఎన్ని? అని అడిగితే, లెక్క తేలదు. "ఉద్రేకం. ఉత్తేజం కలిగించే పాటలు రాయాలంటే శ్రీశ్రీయే రాయాలి!" అన్నారు సినామావారు. పాటల

మీదనే ఎక్కువగా దృష్టి పెట్టుకోవడంతో మాటలు రాసిన చిత్రాలు తక్కువే. 'కన్యాదానం' కాక, 'మరదలుపెళ్లి (52), అక్కా చెల్లెళ్లు' (57) చిత్రాలకు ఆయన మాటలూ, కొన్ని పాటలూ రాశారు. ఆయన రాసిన అన్నిరకాల పాటల్లోనూ ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. అవి 'కాకి నలుపు నిమ్మకాయపులుపు' (మనోహర:54), 'తూరుపు సిందూరపు మందారపు' (మనుషులుమారాలి:69), 'కలకానిది విలువైనది' (వెలుగనీడలు:61) అయినా సరే, భక్తి, రక్తి, శక్తి, హాస్యం, లాస్యం, ఆనందం, విషాదం అన్నీ రాశారు శ్రీశ్రీ.

ఎర్రటిఛాయలో ఉండే శ్రీనివాసరావు, వేళ్లమధ్య సిగరెట్టు బిగించి, పెదవులతో లాగినప్పుడు సిగరెట్టు నిప్పు మరింత మండి, ఆయన ముఖాన్ని ఇంకా ఎర్రగా చూపించేది. చాలా సౌమ్యమైన కంఠం, మధ్యమధ్యలో చిన్ననవ్వు - చిరులక్షణాలు. పైజమా, షర్టు వేసుకుని కార్లలో తిరిగారు; బస్సుల్లో తిరిగారు; నడిచారు. భేషజం ఉండేది కాదు. సిగరెట్టు కాలుస్తూ బస్సు స్టాపుల్లో నిలబడి దిక్కులుచూస్తున్నా, ఏదో ఆలోచన కనిపించేది. కనిపించిన ప్రతి పుస్తకం, కాగితం చదవడం ఓ అలవాటు. చాలాకాలం క్రితం ఒక సినిమా ఆఫీసులో పాట రాయడానికి వచ్చిచ, సంగీతదర్శకుడు ఇంకా రాలేదని శ్రీశ్రీ ఇడ్లీ తెమ్మన్నారు. ఇడ్లీ - పొట్లం లోపల ఉన్నా, పైన పాత న్యూస్‌పేపరు చుట్టివుంటే, ఆ కాయితం విప్పి, అటూ ఇటూ తిప్ప, చదివిన తర్వాతగానీ ఇడ్లీ తినలేదు. "పారీడానికి లేదు, ఏదో నో పాయింటుంటుంది!" అన్నారు శ్రీశ్రీ -గొప్పచదువు చదువుకున్నవాడైనా, పాత వార్తాపత్రిక ముక్కలో ఏముందో చూడాలన్న ఆసక్తి ! మాటికి మాట వెంటవెంటనే చెప్పడం, చమత్కారం చెయ్యడం శ్రీశ్రీ ఆభరణం. చాలా వరకు ప్రచారంలో ఉన్నా, వాటిని మళ్లీ చెప్పకుని ఆనందించడంలో తప్పులేదు. శ్రీశ్రీ, ఒక పత్రికమిత్రుడి ఆఫీసుకు వెళ్లి, "ఏమిటాలోచిస్తున్నారు? పదండి అలా వెళ్దాం!" అంటే, "ఫోటో వెయ్యాలి. కొచ్చిన్ సిస్టర్స్ వేద్దామా అని ఆలోచన!" అని మిత్రుడంటే, ఠపీమని శ్రీశ్రీ "ఎందుకొచ్చిన సిస్టర్స్ - పదండి!" అన్నారు.

శ్రీశ్రీ వివిధ తరగతులకు చెందిన గీతాలతో పాటు ప్రణయ యుగళగీతాలను, హాస్య గీతాలను, తత్త్వ గీతాలను, భక్తి గీతాలను, హరికథలను, యక్షగానాలను.. -ఇలా అన్ని రకాల పాటలను రాసి కేవలం వాడి వేడి గల పాటలేకాదు - గుండెను తడిచేసే పాటలను కూడా రాయగలనని నిరూపించుకొన్నారు. అయితే తెలుగు సినీగేయ చరిత్రలో శ్రీశ్రీ ప్రత్యేకత మాత్రం ఎరుపు ముద్రనే అంశాన్ని ఎవరూ కాదన లేదు. ఆపైన- తన భావాలెంత పదునైనవో అంత పదునుగానూ సూటిగానూ వాటిని వ్యక్తీకరించే ప్రజ్ఞగల శబ్దవిరించి శ్రీశ్రీ అనడంలో సందేహం లేదు.

'ఈ గుర్రపు పందెంలో ఫలానా గుర్రం గెలుస్తుందని నిశ్చయంగా ఎలా చెప్పలేమో అలాగే ఫలానా చిత్రంలో ఈ పాట 'హిట్' అవుతుందని నిక్కచ్చిగా చెప్పలేం.

చాల కాలం కిందట ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి 'పెంపుడు కొడుకు' చిత్రానికి నేను పాటలు రాస్తున్నాను. యస్.రాజేశ్వరరావు సంగీత దర్శకుడు.

'ఉన్నవారికే అన్ని సుఖాలోరయ్యో! అయ్యో!
లేని వారికి ఈ లోకంలో నుయ్యో గొయ్యో!'

అనే పాటను ట్యూన్ చేస్తూ రాజేశ్వరరావు పాడుతున్నాడు. అప్పుడు కిటికీ బయట బోలెడు మంది జనం ఆ పాటకు ఆకర్షింపబడి పోగయ్యారు. తప్పకుండా ఈ పాట హిట్ అయి తీరుతుందని మేమందరమూ అనుకొన్నాం. కాని 'పెంపుడు కొడుకు' బాక్సాఫీసు వద్ద ఫెయిల్ కావడంతో ఆ పాటకు రావలసినంత గుర్తింపు రాలేదు' అంటూ ఓ పాట విజయవంతం కావడానికి అనేక కారణాలుంటాయని విశ్లేషించిన శ్రీశ్రీ తను రాసిన సుమారు వెయ్యిపాటలలో (అనువాద గీతాలు కలుపుకొని) ఒక వందయినా నాలుగు కాలాలపాటు నిలుస్తాయనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. 'పంతాలు- పట్టింపులు' చిత్రంలోని-

'ఇనుకోరా ఇనుకోరా
ఈ మల్లన్న మాటే ఇనుకోరా!'

తన పాటల్లో తనకు నచ్చిన పాటని చెప్పారు. ఆయన దృష్టికోణం అది. మరి శ్రీశ్రీ పాటల్లో జనం మెచ్చిన వాటిని కొన్నిటిని చూద్దాం-

1. ఆకాశవీధిలో అందాల జాబిలి (మాంగల్య బలం-1959)
2. నందుని చరితము వినుమా (జయభేరి-1959)
3. కలకానిదీ విలువైనదీ (వెలుగునీడలు - 1960)
4. పాడవోయి భారతీయుడా (వెలుగునీడలు-1960)
5. పయనించే మన వలపుల బంగరునావ (బావా మరదళ్లు -1961)
6. పాడవేల రాధికా ప్రణయసుధా గీతిక (ఇద్దరు మిత్రులు-1961)
7. ఏమని పాడెదనో ఈ వేళ (భార్యాభర్తలు-1961)
8. జోరుగా హుషారుగా షికారు పోదమా (భార్యా భర్తలు-1961)
9. నా హృదయంలో నిదురించే చెలీ (ఆరాధన-1962)
10. ఎవ్వరి కోసం ఈ మందహాసం (నర్తనశాల-1963)
11. ఓ సజీవ శిల్ప సుందరీ (పునర్జన్మ-1963)
12. ఉందిలే మంచికాలం ముందు ముందన (రాముడు-భీముడు-1964)
13. నినుజేర మనసాయెరా (బొబ్బిలి యుద్ధం-1964)
14. మనసున మనసై బ్రతుకున బ్రతుకై (డా॥చక్రవర్తి-1964)
15. నీవు నా వూహలందే నిలిచావు (ఇల్లాలు-1965)
16. బొమ్మను చేసి ప్రాణము పోసి (దేవత-1965)
17. నారాణి కనుల లోనె.. (చిలకా-గోరింక-1966)
18. ఓహో! మోహన రూపా (శ్రీకృష్ణ తులాభారం-1966)
19. తూలీ సోలెను తూరుపు గాలి (అడుగు జాడలు - 1966)
20. తూరుపు సిందూరపు మందారపు వన్నెలలో (మనుషులు మారాలి-1969)
21. కళ్లలో పెళ్లిపందిరి కనపడసాగె (ఆత్మీయులు -1969)
22. మహాతుమడే కలలు గన్న మరో ప్రపంచం (మరోప్రపంచం-1970)
23. దేవుడు చేసిన మనుషుల్లారా (దేవుడు చేసిన మనుషులు-1973)
24. తెలుగువీర లేవరా, దీక్షబూని సాగరా (అల్లూరి సీతారామరాజు-1974)
25. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని (భూమికోసం-1974)
26. కలసిపాడుదాం తెలుగుపాట (బలిపీఠం-1975)
27. సమరానికి నేడే ప్రారంభం (యమగోల-1977)
28. ఇలాగ వచ్చి అలాగ తెచ్చి (గోరింటాకు-1979)
29. నేడే ఈనాడే ప్రజాయుద్ధ సంరంభం (ఈనాడు - 1982)
30. అర్ధరాత్రి స్వతంత్రం, అంధకార బంధురం (నేటి భారతం -1983)

శ్రీశ్రీ చెప్పినట్టు ఇవి మాత్రమే ఉత్తమ గీతాలు కాకపోవచ్చు- కాని ఇవి జనంలో ప్రచారం పొందిన పాటలు. ఈ జనరంకమైన జాటల జాబితా నుంచి ముచ్చటించుకో దగిన విశేషాంశాలు గల కొన్ని పాటల పూర్తి పాఠాలను చూద్దాం-

కలకానిది, విలువైనది-బ్రతుకు
కన్నీటి ధారలలోనే బలిచేయకు
ఏదీ తనంతతానై నీ దరికిరాదు
శోధించి సాధించాలి, అదియే ధీరగుణం ॥కల॥
(వెలుగునీడలు)

అవకాశం దొరికినపుడల్లా శ్రీశ్రీ తన సినీగేయాల్లో సామాన్యుడి మనసుకు హత్తుకొనేలా నూక్తులను, హితోక్తులను సందేశాలను సంధించారు. అలాంటి

సందేశాత్మకమైన ఈ పాట ఆత్మహత్యకు పూనుకున్న ఓ వ్యక్తిని ఆలోచింపజేసి ఆ ప్రయత్నాన్ని విరమింపజేసి పూర్ణాయువును పొసిందట!

ఈ పాట ముక్తాయింపులో మనిషికి ప్రయత్నం, పట్టుదల ముఖ్యమనీ, ఏదీ తనంతతానై దరికిరాదనీ, శోధనతోనే సాధన సాధ్యమౌతుందనీ అమూల్యమైన సందేశాన్నిచ్చారు కవి.

'సుడిలో దూరి ఎదురీదకా
మునకే సుఖమనుకోవోయ్' (దేవదాసు)

అన్న భావనకు భిన్నమైన ఆశావహమైన సందేశం ఈ పాటలోని విశేషం.

ఈ పాట ప్రభావం గురించి సుద్దాల అశోక్‌తేజ ఇలా రాశారు.

'సినీగీతాలలో పాజిటివ్ థింకింగ్ గురించి, సర్వనాలిటీ డెవలప్‌మెంట్ గురించి ఇటీవల మేం- అంటే సీతా రామశాస్త్రి గారు 'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి' చంద్ర బోస్ 'రేపన్నది మాపన్నది పనికిరాదులే... ఓ మారియా' నేను 'ఒకటే జననం ఒకటే మరణం..' రాసినా- అనాడే 'కలకానిది విలువైనది..' అంటూ ఒక విజయపథ గమనాన్ని చూపించే గీతా సంజీవినీ పర్వతాన్ని నిలిపి 'ఏదీ వదల లేదు శ్రీశ్రీ 'అని పించుకున్నాడు..'

తెలుగు సినిమా చరిత్రలో అభ్యుదయ, విప్లవ భావాలతో సినీ గేయాలు రాసిన కవులలో

శ్రీశ్రీ మొదటి వరుసలో నిలబడతారు. ఆయన రాసిన ప్రతిపాట ఆణిముత్యమే, ప్రతిపాటలో ఆలోచించే గుణంతో పాటు చైతన్యం ఉంటుంది. ఇది శ్రీశ్రీ పాటల ప్రత్యేకత.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దాశరథి రంగాచార్య నవలలు - తెలంగాణ సామాజిక అంశాలు

- సి. హెచ్. నాగలక్ష్మి, తెలుగు అధ్యాపకురాలు, బద్రూకా కళాశాల, కాచిగూడ.

కామానవ శ్రేయస్సె అంతిమ లక్ష్యంగాగల మార్క్సిజం, విశ్వమానవ శ్రేయస్సును, వసుదైక కుటుంబాన్ని కాంక్షించే భారతీయ తాత్వికతలను ఆలంబనగా చేసుకుని తనదైన శైలిలో రచనయాత్ర కొనసాగిస్తున్నారు. తెలంగాణా జన జీవితాలను చిత్రించే నవలలు, కథలు, కవితలు, అనువాదాలు, రామాయణ, భారత, భాగవతాలు, వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు ఇలా భిన్నంగా ఆయన అక్షర సృష్టి సాగింది.

నైజాం రాజ్యంలో నిజాం పాలనా కాలంలో జన్మించిన దాశరథి రంగాచార్య మొదట ఆంధ్ర మహాసభ, ఆర్య సమాజాలు వేర్వేరుగా నిజాం పాలనలోని లోపాలను ఎదుర్కొంటున్న తీరుకు ఆకర్షితులయ్యారు. తండ్రి సనాతనవాది ఐనా అన్న దాశరథి కృష్ణమాచార్యులు ప్రఖ్యాత అభ్యుదయ కవి. "ఆయన సాంగత్యంలో అభ్యుదయ భావాలను, విప్లవ భావాలను అలవర్చుకున్నారు రంగాచార్య. చిన్నతనం నుండి అన్యాయమని పించినదాన్ని వ్యతిరేకించడం ఆయన నైజం. తెలంగాణ సాయుధ పోరాటం నాటి స్థితిగతులు, ఆకాలంలోని దారుణమైన బానిస పద్ధతులను దాశరథి రంగాచార్య చిల్లరదేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం నవలల్లో కళ్లకు కట్టినట్టు చూపించారు. చిల్లర దేవుళ్లు నవలలో సాయుధ పోరాటం ముందు స్థితిగతులు, మొదుగుపూలు నవలలో తెలంగాణ సాయుధ పోరాటకాలం నాటి పరిస్థితులు, అనంతర పరిస్థితులను 'జనపదం'లో చిత్రించారు.

రంగాచార్యులు తెలంగాణాలో అంగ్రేజిపాలకుల అనర్థపాలనను ఎదిరించె జాతీయోద్యమంలో స్వయంగా పాల్గన్నారు. అంతేకాక నిజాం నిరంకుశ పాలనను తెగింపుతో ఢీకొన్నారు. ఉద్యమాలలో పాల్గన్నారు. ఈ ప్రాంతం ఉద్యమాలకు కారణభూతాలైన అనేక విషయాలను రికార్డు చేసె విధానంలో భాగంగా తెలుగు సాహితీ ప్రక్రియల్లో నవలను ఎంచుకుని చిల్లర దేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం, మాయజలతారు, రానున్నది వంటి నవలలు వ్రాశారు. దాశరథి, రంగాచార్య నవల్లో ప్రధానంగా తెలంగాణా సామాజికాంశాలె యితివృత్తాలైనాయి. స్వయంగా చూసిన పరిణామాలు, అనుభవించిన కష్టనష్టాలు, సంఘటనలు, పరిసరాలు. అన్నీ వారి నవలలకు కేంద్ర బిందువులు అయ్యాయి. పాశవిక ప్యూడల్ వ్యవస్థలోనె అసాంఘిక ఆచారమైన 'ఆడబాప' విధానం బాల్యంలోనె దాశరథి రంగాచార్యుల్ని కలచి వేసింది. వారి చిల్లరదేవుళ్ళు నవల్లో ఆ ఆడబాప విధానం. ప్రవేశపెట్టడం జరిగింది. చిన గూడూరులో వారి ఇంటి పక్కన అమృతపాణి అనే ఆడబాప కూతురు ప్యూడల్ పాశవికానికి బలి అవ్వడం మరచిపోలేక చిల్లరదేవుళ్ళు నవల్లో 'వనజ' పాత్రగా తెలియజేశారు. ఆ పిల్లతల్లి పేరుతో 'అమృతపాణి'గా జనపదంలో చోటు చేసుకుంది. దాశరథి గారు పుట్టిన వరంగల్ జిల్లా 'చినగూడూరు' గ్రామం చిల్లరదేవుళ్ళు నవలా తెలంగాణా సమాజంలో గ్రామీణ ప్యూడల్ శక్తులు, దొరలయిష్టా రాజ్యాలు, ప్రజల భూమి హక్కు పోరాటాలు, వెట్టి నిర్మూలన, నిజాం వ్యతిరేక పోరాటాలు అన్నీ దాశరథి రంగాచార్యులు గారి నవలల్లో జీవం పోసుకున్నాయి. ప్యూడల్ సమాజంలో 'మతం' ఒక అభివ్యక్తిగానూ, స్వార్థ చింతనగానూ, ఒక దుర్మార్గంగానూ, ఒక విశ్వాసం గానూ, అందించిన విషయాల పరంగా తెలంగాణా గ్రామీణ సమాజం ఏ విధంగా బలైంది 'చిల్లరదేవుళ్ళు' నవల్లో దాశరథి రంగాచార్యులు గారు దర్శనీయం చేశారు.

రంగాచార్యులు గారు 'పావని' నవల్లో 1960-70 దశకంలో తెలంగాణా గ్రామాల్లోని ప్రాథమిక విద్యారంగం పరిస్థితులను పాత్రలు, సంఘటనలతో ముడివేసి

తెలియజేశారు. అంపశయ్య నవీన్‌గారు ముళ్ళపొదలు నవల్లో యువకుల్లో విద్యానంతర పరిస్థితులు, ఉద్యోగాల వేట దాని తాలూకు పరిస్థితులను అయిదుగురు కథా నాయకుల ద్వారా తెలియజేశారు. ఈ నవల్లో వేణుపాత్ర ద్వారా తెలియజేసిన ప్రాంతీయాభిమానం తాలూకు అంశంలో తెలంగాణా సామాజిక జీవన పరిస్థితులు, విశాలాంధ్రలో తెలంగాణా ప్రజల దుస్థితిని సమగ్రంగా తెలియజేశారు. అంతె కాకుండా 1969 నాటి తెలంగాణా ఉద్యమాన్ని అనేక కోణాల్లో నిశితంగా పరిశిలించారు. దోపిడీ వ్యవస్థను గర్హించె విద్యార్థులు పోరాటం వైపు ఎలా ప్రభావితమైందీ కళ్ళకు కట్టినట్లు దర్శింపచేశారు.

దాశరథి రంగాచార్యులు గారు చిల్లరదేవుళ్ళు, మోదుగుపూలు జనపదం నవలల్లో తెలంగాణా పోరాట చరిత్ర నేపధ్యంగా రచించారు. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం పాలనలో నిదమననీతి, జల అసంతృప్తి తెలంగాణా గ్రామీణ సమాజం బలహీన స్థితి, నిస్సహాయతలను 1938-41 మధ్య కాలంలో తెలంగాణా సమాజాన్ని, సామాజికాంశాలను స్పష్టంగా తెలియజేశారు. నిజాంపై ప్రజల వ్యతిరేకపోరాటంలోని రెండడవ దశను 1942-48 కాలాన్ని మోదుగుపూలు నవల్లో తెలియజేశారు. జనపదం నవల్లో 1948-67 మధ్యకాలంలోని తెలంగాణా సామాజికాంశాలను తెలియజేశారు. 1938 నాటి నుండి తెలంగాణా పల్లెల సామాజిక, ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక వెనుకబాటుతనాన్ని దాశరథి రంగాచార్య చిల్లరదేవుళ్ళు, మోదుగపూలు, జనపదం, పావని, మాయజలతరు, రానున్నది ఏది నిజం నవలల్లో స్పష్టంగా తెలియజేశారు. మానవ సంబంధాలు, మతమార్పిడులు, ఆర్థిక సంబంధాలు, రాజకీయ సంబంధాలు మొదలైన సామాజిక వాస్తవాంశాలు స్పష్టంగా విశదపరిచారు. ప్రాథమిక విద్య దాని అవసరం, గ్రంథాలయోద్యమం మొదలైన సంస్కరణాత్మక అంశాలను కొన్ని ప్రయోగాత్మక పరిష్కారాలతో తెలియజెప్పి మార్పు తప్పనిసరి అని తేల్చారు. తెలంగాణా 20వ శతబ్ది ఏ విధంగా ఉద్యమాలు చేపట్టింది. వాటి వెనుకవున్న కారణాలను స్పష్టంగా తెలియజేశారు.

స్వాతంత్ర్యానంతర కాలంలో స్వాతంత్ర్య సమర యోధులుగా గుర్తింపును పొందే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. ఇటువంటి ప్రయత్నాలు చేసిన వారిలో నిజమైన వారున్నారు. వారితో పాటు నకిలీ యోధులు కూడా సిద్ధమయ్యారు. వీరు రాయితీలు, పారితోషికాల కోసం పైరవీలు ముమ్మరం చేశారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో గ్రామాల్ని విడిచివెళ్ళిన కొంతమంది భూస్వాములు కొత్తగా గాంధేయ వాదులయ్యారు. స్వాతంత్ర్య సమరయోధులుగా కొత్త గుర్తింపు కోసం ఆరాట పడ్డారు. బలరామయ్యకు గాంధీ గురించి తెలియదు. ఖద్దరు దుస్తుల్ని ఎందుకు ధరిస్తారన్నది కూడా ఆయన అవగాహనలో లేదు. గాంధీతత్వాన్ని ఏ మాత్రం అర్థంచేసుకోలేని బలరామయ్య స్వభావాన్ని 'జనపదం' నవలలో ఆయన మాటల ద్వారా రచయిత వ్యక్తీకరించారు.

'మనం ఖద్దరు కట్టుకోవాల్నయా తప్పదా రామల్ల ఆ గాంధీగారు చెప్పి ఓయిండంటాంటివి. నిజంగ చెప్పిండో లేదో తెల్వదాయె. ఆయన్ననే చూడనైతి. చెప్పింది వినైతి. అది మనోండ్లు చెప్పిరి. మనమేమొ ఇనాల్నాయె. నలుగురు చూసెటందుకు కట్టుకున్నామనుకో అయ్యగారు అందరికి చెప్పి ఉల్లిగడ్డతినొద్దని తానేం తినకుండున్నారు. మొగోళ్లం మనమెట్లనన్న ఏడస్తం. ఆడోళ్ళకెందుకయా అది ఆ సుందరావు కాడికి పోయొచ్చింది. మనిషి పూర మారిపోయిందనుకో, చూస్తున్నవుగద, ఇల్లంతా ఖద్దరు చేసింది. ఈ ముతక బట్టలెందుకయ్యా మనకు, మా తాతలు కట్టిన్రు, తండ్రులు కట్టిన్రు ఆ మాటంటె కోపమొస్తది. ఇగ కిర్రు కిర్రుమని రాట్నం తిప్పుతు కూచుంటది అంటాడు బలరామయ్య. గాంధీ గురించిన అవగాహన లేని వ్యక్తి గాంధేయవాదిగా చెలామణిలోకి వచ్చి అధికారాన్ని అనుభవించడం

వైచిత్రిగానే కన్పిస్తుంది. బలరామయ్యకు అమృత పాణికి జన్మించిన రామయ్య 'జనపదం' గ్రామంలో కొత్త దొరగా అవతరించాడు. అతడు ఒకప్పుడు సాయుధపోరాటం చేసినరోజుల్లో వీరభద్రం శిష్యుడు. కాలంతోపాటు రంగుమార్చుకున్నాడు. రామయ్య ఊరిలో కొత్త దొరగా అవతరించాడు. తెలంగాణ గ్రామసీమల్లో ఆవిర్భవించిన కొత్తదొరల సంస్కృతిని గురించి శాసనసభలో వీరభద్రం చేసిన ప్రసంగం అనాటి పరిస్థితుల్ని వాస్తవికంగా చిత్రించింది.

'కొత్త దొరలు ఊరురా వెలిశారు. సారాయి, గూండాలు వారి రాజకీయాలైనాయి. ఈ కొత్త దొరలకు నడమంత్రపు సిరి వచ్చింది. డబ్బు కోసం వారు తలలు తీయటానికి సైతం వెనుకాడటంలేదు. గుండెలు తీసిన బంట్లయినారు. ప్రభుత్వయంత్రాంగం వారికి అన్ని విధాలా సహకరిస్తుంది. అసలు ప్రభుత్వం చేస్తున్నది కొత్త దొరలా? ఎన్నికైన శాసన సభ్యులా? అనే విషయం అర్థం కాకుండా ఉంది. ప్రజలు విసిగిపోయారు. న్యాయం అనేది మందులోకి సైతం దొరకడంలేదు. ప్రభుత్వం ఈ విషయంలో గట్టి నూచనలు తీసుకోకుంటే పరిస్థితులు విషమించే సూచనలున్నాయి. అక్షరాక్షర సత్యంగా వీరభద్రం పలికిన మాటలు అనంతర కాలంలో వాస్తవాలుగా మారాయి. కొత్త దొరల ప్రాబల్యం నానాటికీ పెరిగింది. రెండవ శాసన సభ ఎన్నికల్లో ప్రజల మనిషి వీరభద్రం ఓడిపోయాడు. కొత్త దొర రామయ్య విజయదుందుభి మోగించాడు. మంత్రి పదవిని సాధించుకున్నాడు. గ్రామాల్లో పాతుకొని పోయిన అసలు దొరల్ని సాయుధపోరాటం ద్వారా బయటకు తరిమిన వీరతెలంగాణలో కొత్త దొరల ఆవిర్భావం విస్మయకరమైన రాజకీయ పరిణామం. దీన్ని 'జనపదం' నవల ఎంతో స్పష్టంగా చిత్రించింది.

తెలంగాణ రాజకీయాలకు ఇక్కడి భూవనతికి దగ్గరి సంబంధం ఉంది. భూయాజమాన్యం వ్యక్తుల సామాజిక గౌరవాన్ని పెంచింది. భూస్వాములకు ఎటువంటి పెట్టుబడులు అవసరంకాని మిగులు ధనాన్ని ఇది సమకూర్చి ఇచ్చింది. ఈ మిగులు ధనం రాజకీయ రంగంలో పెట్టుబడిగా వారికి ఉపయోగపడింది. విస్తార మైన భూకమతాల్లో పనిచేసే పాలేర్లు రైతు కూలీలు. గుమాస్తా యంత్రాంగం యావత్తు అనివార్యంగా భూస్వామి కనుసైగల్లో ఉండవలసివస్తుంది. దీనితో సహజంగానే భూస్వామి పలుకుబడి పెరిగిపోయింది. తెలంగాణ ప్రాంత రాజకీయాల్ని భూస్వాములు దాదాపుగా శాసించగలిగారు. దాశరథి రంగాచార్య రచించిన 'పావని' నవలలోని శివయ్య భూపరిమితి చట్టం పట్ల అందోళనతో పట్నం చేరుకున్నాడు. అతడు ఒక పెద్ద నాయకుడిని కలుసుకున్నాడు. 'భూసంస్కరణలు ప్రవేశపెట్టారు. ముందు భూమి దక్కించుకో తరువాత మిగతాది చూసు కోవచ్చు. మనకు బలం భూమి. అది లేకపోతే మనం పోతాం. సుభద్రమ్మకు విడాకులివ్వు. ఆమెకోపాలు దక్కుతుంది.'21 అని ఆ అధినేత శివయ్యకు హితబోధ చేస్తాడు. అతడి సలహాను పాటించి తన భార్య సుభద్రమ్మకు విడాకులు ఇచ్చేందుకు శివయ్య సిద్ధమవు తాడు.

తెలంగాణ ప్రాంతంలో భూమికీ రాజకీయాలకూ మధ్య ఉన్న సంబంధాలు ఇక్కడ స్పష్టపడుతున్నాయి. అయితే 1980వ దశాబ్ది తర్వాత పరిస్థితులు మారాయి. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వామపక్ష తీవ్రవాదం విజృంభించింది. ఈ పరిస్థితుల్లో వామపక్ష తీవ్రవాదానికి భయపడిన భూస్వాములు నగరాల్లో కొత్త వ్యాపారాన్ని ఆరంభించారు. అక్కడి భూములు బీళ్ళుగా మారాయి. భూస్వాముల వ్యాపార సంస్కృతి నగరాల్లో ప్రస్తుతం తన ప్రభావాన్ని చూపుతోంది. అయితే రంగాచార్య 1980 తర్వాత రచించిన ప్రముఖమైన నవలలులేవు. అందువల్ల ఇటీవలి కాలపు స్థితిగతుల చిత్రీకరణ ఆయన నవలల్లో దొరకదు. ఎన్నికల ప్రక్రియల కారణంగా స్వతంత్ర భారతదేశంలో సమూలమైన మార్పులు రావడం సాధ్యం కాదనే అభిప్రాయంతో యువతరం సాయుధ పోరాటం వైపు సిద్ధంకావడం రంగాచార్య 'జనపదం' నవలలో సమర్థవంతంగా చిత్రించబడింది.

శ్రీకాకుళం జిల్లాలో అక్కడి రైతులు గిరిజనులు ఆరంభించిన 1970 నాటి పోరాటం అప్పటి తెలంగాణ లోని విద్యావంతులైన యువతరానికి స్ఫూర్తి నిచ్చింది. 'జనపదం' నవలలో ప్రకాశం పాత్ర తీవ్రవాద వామపక్ష భావనలకు ప్రతినిధి. ప్రకాశం జననం వెనుక ఒక నేపథ్యం ఉంది. కొత్త దొరగా అవతరించిన రామయ్యకు, తెలంగాణ సాయుధపోరాట సందర్భంగా భర్తను కోల్పోయిన మంగమ్మకూ జన్మించిన వాడు ప్రకాశం. మంగమ్మను వీరభద్రం వివాహం చేసుకున్నాడు. ఇందులో గొప్ప త్యాగం ఉంది. అందులో ప్రకాశంకు ఒక సామాజిక స్థాయిని కల్పించాలనే సంకల్పం ఉంది. ప్రకాశం చదువు సంధ్యల బాధ్యతలన్నీ వీరభద్రం స్వీకరించాడు. ప్రకాశం ఆయనను కక్కయ్య అని పిలిచేవాడు. ప్రకాశం ఎంతో చురుకైనవాడు. చిన్ననాటి నుంచి తన చుట్టూ ఉన్న సమాజాన్ని, సమకాలీన పరిస్థితుల్ని గమనించినవాడు. రామయ్యవంటి దుర్మార్గులు, అవినీతి పరులు అంతకంతకూ ఎదిగిపోతూ ఉండడం, మిగతాబీదవర్గాల జీవితాల్లో ఎటువంటి మార్పులు రాకపోవడం ప్రకాశంలో కొత్త ఆలోచనల్ని కలిగించింది. ప్రస్తుత వ్యవస్థ పట్ల ఇది అతడి ఆగ్రహానికి కారణమైంది. ఇరవై ఏళ్ళు నిండీ నిండని వయసులో ప్రకాశం హృదయం నిండా విప్లవ భావాలు నిండి పోయాయి. వీరభద్రం మితవాదవామపక్షభావాలు కలవాడు. అతడు అన్ని సందర్భాలలోనూ అతివాద వామపక్ష దుందుడుకు వైఖరుల్ని ఖండించాడు. ఈ సమాజం మారాలి, ఈ విధానం మారాలి, దీన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి వేయాలి. ఈ కుళ్ళులో మీరు ఒక భాగంగా కన్పిస్తున్నారు' అన్న ప్రకాశం మాటలు ఆనాటి వామపక్ష తీవ్రవాద భావజాల ప్రతిధ్వనులు.

ఓట్లతోనే సామాజం మారదు. ప్రజల్ని నమ్ముకున్న వాండ్లకు ఓట్లు రావటంలేదు. డబ్బును నమ్ముకున్న వాండ్లకు ఓట్లు వస్తున్నాయి. ఇది ధనస్వామ్యం దీన్ని కూకటి వేళ్ళతో పెరికివేయాలి. అందుకు విప్లవం రావాలె. అది మాటలతోనీ ఓట్లతోనీ రాదు..' అన్నది ప్రకాశం నిశ్చితాభిప్రాయం. ప్రకాశం విప్లవ ధోరణి ఆసాంతం అదేస్థాయిలో ఉండేటట్లు రచయిత పాత్ర కల్పన చేశారు. ఒక పోలీసు అధికారితో వాదించిన సందర్భంలో ప్రకాశం చేసిన ఉద్రేక పూరిత ప్రసంగం దీన్ని స్పష్టపరుస్తోంది.

'భారతదేశం ఎర్రగా కనిపించింది. ఎరుపు ఎరుపు, ఎరుపు కార్మికులు వస్తున్నారు. కష్టం చేసేవారు వస్తున్నారు. డాక్టర్లు, లాయర్లు, సైంటిస్టులు, గుమస్తాలు, టీచర్లు, జనం కార్మికులు కర్షకులు మేధావులు కదలాడసాగారు. ముందు పెద్ద జెండా పట్టుకుంది గీత. పక్కనే తాను ప్రకాశం. తన పక్కనెవరు మంగమ్మ. మంగమ్మ చేతిలో జెండా ఉంది. ఎర్రజెండా. అటుపక్కనెవరు? వీరభద్రం. వీరభద్రం చేతిలోనూ అదే జెండా ఎర్రజెండా'25 అంటూ ప్రకాశం ప్రాణం పోతున్న దశలోనూ పలవరించాడు. 'విప్లవం వర్ధిల్లాలి' అని రాస్తునే ప్రకాశం చేయపడి పోయింది. గ్రామస్థాయిలో కొత్త పెత్తందారులు, రాష్ట్ర స్థాయిలో అవినీతివంతులైన రాజకీయవేత్తలు, వీరిని వారిని ఆశ్రయించుకొని బతుకుతున్న లంచగొండి గుమస్తాలు, అధికార వర్గం, ఎంత కష్టపడినా ఫలితం దక్కని సన్నకారు రైతాంగం ప్రజా ప్రభుత్వంలోనూ ఎన్నో బాధలు పడుతున్న ప్రజలు ఈ దృశ్యాలన్నీ ప్రకాశంవంటి నవయువ తరాన్ని విప్లవాదంవైపు మళ్ళించాయి.

'జనపదం' నవలలో వీరభద్రం పాత్ర ద్వారా తన అభిప్రాయాలు పలికిస్తాడు. వీరభద్రం మితవాద వామపక్ష ప్రతినిధి. తీవ్రవాద మితవాద వామపక్షాల మధ్య నిరంతర సైద్ధాంతిక సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. తెలంగాణలో విప్లవ వామపక్ష రాజకీయ పరిణామాల్ని గమనించిన వారికి వీరభద్రం మితవాద వాదన సబబైనదే నని అర్థమవుతుంది. వీరభద్రం విప్లవ వ్యతిరేకి కాడు, అతడు ఉద్యమ సంస్కృతిని ప్రేమించిన వ్యక్తి, విప్లవమనే పేరుతో సాగే దుందుడుకు తనానికి, కార్యాచరణకూ, ఉద్యమ నిర్మాణానికీ మధ్య ఉండే తారతమ్యం వీర భద్రానికి తెలుసు. ప్రకాశం తల్లి మంగమ్మతో వీరభద్రం మాట్లాడిన తీరు అతడి సంయమనశీలతను, సమగ్ర అవగాహనను పరిచయం చేస్తోంది.

తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చండ్ర పుల్లారెడ్డి ఆంధ్రప్రదేశ్ వామపక్షవాదుల్లో మేధావులుగా, ఉద్యమ నిర్మాతలుగా గుర్తింపును పొందారు. వీరు తొలుత అవిభక్త కమ్యూనిస్టు పార్టీలో నిరంతరం శ్రమించిన వారే. అయితే, వామపక్ష వాదులు అతి మిత వాదంతో వ్యవహరించడం వీరికి నచ్చలేదు. దీనితో 1970వ దశకంలో వీరు విప్లవ కార్యాచరణ వాదులుగా వేరయ్యారు. సైద్ధాంతిక స్థాయిలో వీరు వామపక్ష మితవాదులతో విభేదించారు. అయితే మితవాద వామపక్షనేతల మనోగతాలు, వారు వేసుకున్న అంచనాలు మరో విధంగా ఉన్నాయి. ఆనాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం సామ్యవాద ధోరణిని ప్రకటించింది. సన్న కారు రైతుల అభివృద్ధి, భూసంస్కరణల అమలు, రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయీకరణ, ప్రభుత్వపు సామ్యవాద ధోరణికి సూచికలు అయ్యాయి. సహజంగానే మితవాద వామపక్ష వాదుల్ని ఈ ధోరణి బాగా ఆకట్టుకున్నది. దీనితో వారు విప్లవ కార్యాచరణ పట్ల వైముఖ్యతను ప్రకటించారు. తరిమెల, దేవులపల్లి, చండ్ర వర్గంతో మితవాదులు పూర్తిగా విభేదించారు. ఇక్కడ ప్రస్తావించబడిన వీరభద్రం అభిప్రాయంలో నాటి ఇందిరాగాంధీ సర్కారు సామ్యవాద తరహా ధోరణిని సమర్థించిన తీరును గుర్తించవచ్చు. అయితే, సామ్యవాద ధోరణులు చివరకు కాగితాలకే పరిమితమవుతాయనే అభిప్రాయంతో విప్లవ వామపక్ష శిబిరం, అందులోనికి ఆకర్షితులైన విద్యార్థి లోకం వాటిని విశ్వసించలేదు. ఇటువంటి విప్లవ విద్యార్థులకు ప్రకాశం బృందం ప్రతినిధివంటిది. అయితే సమాజంలో నిజమైన సామ్యవాదం ఆవిర్భవించాలనే విషయంలో రచయిత రాజీలేని నమ్మకాన్ని ప్రకటించారు. 'రానున్నది ఏది నిజం' నవలలోని వాక్యాలు దీనికి చక్కని ఉదాహరణలు.

తెలుగు సాహిత్యంలో చెరగని ముద్రను వేసిన రంగాచార్య 'చిల్లరదేవుళ్లు' నవలకుగాను ఆంధ్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. వేదాలను, మహా భారతాన్ని అనువదించినందుకుగాను అభినవ వ్యాసుడు బిరుదును పొందారు. 1994 ఖమ్మంలో సాహితీ హారతి ఆధ్వర్యంలో వెండి కిరీటం పెట్టి రంగాచార్య దంపతు లను సత్కరించారు. తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం అందించింది. ఇలా ఆయన 60 ఏళ్ల సాహిత్య ప్రస్థానం లెక్కకు మిక్కిలిగా సత్కారాలు అందుకున్నారు. తెలంగాణ జనజీవితాలను ప్రతిబింబించే రచనలతోనూ, ఇతర రచనలతోనూ రచయితగా ఒక ప్రత్యేక గుర్తింపును పొందిన ఈ దాశరథి రంగాచార్య తన 2015, జూన్ 8న తన 86ఏట కన్ను మూశారు.

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రాచీన సాహిత్యంలో వృత్తుల ప్రస్తావన

- రామడుగు రమాదేవి

వృత్తి అంటే నడవడి జీవనోపాధి, రీతి, పద్ధతి అని అర్థాలున్నాయి. వివిధ పనుల్లో నేర్పరి అయిన మానవుడు అదే తనవృత్తిగా జీవిస్తాడు. ఈ వృత్తి జీవనభృతినిస్తుంది. ఈ నైపుణ్యమే తన కుటుంబానికి వంశానికి పారంపర్య వృత్తిగా స్థిరపడుతుంది. ఈ వృత్తిమానవుడి నడవడిని క్రమబద్ధం చేసి ప్రత్యేక జీవిత విలువల్ని కల్గిస్తున్నాయి.

ఇప్పటి వరకూ లభించిన గ్రంథాలలో అతి ప్రాచీన మైనది రుగ్వేదం. అంతేకాకుండా ఇండో యూరోపియన్ భాషల్లో లభించిన మొట్ట మొదటి గ్రంథం కూడా ఇదే. ఇందులో పది మండలాలు ఉన్నాయి. ఇరానియన్ భాషలో వెలువడిన ప్రాచీన గ్రంథమైన అవెస్తాకు, రుగ్వేదానికి చాలా పోలికలున్నాయి. ఈ రెండు గ్రంథాలలో సామాజిక వర్గాలకు ఒకే పేర్లు ఉపయోగించబడ్డాయి. మొట్ట మొదటి ఆర్యుల్ని గురించిన ప్రస్తావన రుగ్వేదంలో కనిపిస్తుంది. రుగ్వేద కాలంలో ఆర్యులతో సంఘర్షించినట్లు చెప్పబడే జాతులు మొహంజోదారో, హరప్పాలోని ద్రావిడులు, కాశ్మీరు నుండి అస్సాం వరకు, ఆపై కొండ లోయల్లో నివసించిన మునే చ్మేరులు (కిరాతులు) రుగ్వేదంలో ఈ ఉభయుల మధ్య ఎటువంటి భేదాన్ని తెలుపలేదు. వీరినే కృష్ణవర్ణులు, కృష్ణ చర్ములుగా (నల్లని వారుగా) వర్ణించింది. రుగ్వేదం పదవ మండలం లోని పురుషసూక్తంలో వర్ణ వ్యవస్థ గురించి ప్రప్రథమంగా ప్రస్తావించించబడింది.

చోర, గాయక, వండ్రగి, వడ్డీ వ్యాపారం, చికిత్సక, వేట తదితర వృత్తుల గురించి మనుస్మృతిలో ప్రస్తావన ఉంది. అదే విధంగా కసాయి, కమ్మర్లు, నిషాద, రంగావతరిక, సువర్ణకార (కంసాలి), శస్త్ర విక్రయ (ఆయుధాలను అమ్మేవారు), శ్వాన్ (కుక్కలు పెంచేవారు), మేదరి వాళ్ళు, చేల నిర్ణక, పుంశ్చలీ (వ్యభిచారి) అనే వృత్తుల్ని మనువు పేర్కొన్నాడు. వీటికి సంబంధించిన శ్లోకాలు కూడా ఉన్నాయి. ఈ వృత్తులే కాకుండా వర్ణ సంకరం వలన మరికొన్ని కొత్త జాతులను తెలిపాడు. వర్ణ సంకరం అనగా ఒకజాతి స్త్రీకి గానీ, పురుషుడికి గానీ వేరే జాతి వారితో సంబంధం కలిగి ఉండటం. మనుస్మృతిలో చెప్పబడింది.

"ద్విజులు తమ జాతి కంటే వెంబడిదగుజాతి స్త్రీల యందు పుట్టించిన కుమారులు మాతృ దోషమును బట్టి నిందితులై, పితృ సజాతీయులే అగుదురు. బ్రాహ్మణునికి క్షత్రియ స్త్రీ యందు పుట్టినవాడు మూర్ధావసిక్తుడు. క్షత్రియునికి వైశ్య స్త్రీ యందు పుట్టినవాడు మహిష్యుడు. వైశ్యునికి శూద్ర స్త్రీ యందు పుట్టినవాడు కరణుడు. ఇందు మూర్ధావసిక్తునికి గుర్రములు , ఏనుగులు మచ్చిక చేయుట, రథము దోలుట, మహిష్యునికి వృత్తగీతముల చేతను, జ్యోతిష్యము చేతను జీవనమును, ధన ధాన్యముల కాపుదల, రాజసేవ, దుర్గము, అంత పురము వీనికి కావలి కాంచుటయు వృత్తులు.

శూద్రుని వలన వైశ్య క్షత్రియ బ్రాహ్మణ స్త్రీల యందు పుట్టిన వారు వరుసగా ఆయోగవ క్షత్తృ చండాలురు. వీరు ప్రతిలోమ జాతులు కనుక బాహ్యాలు. ఈ బాహ్యాలగు నాయోగవ, క్షత్తృ, చండాలులురు ముగ్గురును తమ జాతి స్త్రీలయందును, తమకంటే పై జాతులగు చాతుర్వర్ణ స్త్రీల యందును తమకంటే నీచులైనందున మిక్కిలి బాహ్యాలగు పదునేవురు పుత్రులను పుట్టించుదురు. "అదెట్లనగా అయోగవుడు తన జాతి స్త్రీలయందును, చాతుర్వర్ణ్య స్త్రీయందు నేవురు పుత్రులను పుట్టింతురు. ఇట్లే క్షత్తృ చండాలురును నైదుగురేసి పుత్రులను పుట్టింపగా మొత్తము పదునైదుగురు అగుదురు. అట్లే అనులోమజుల కంటే హీనులైన వైశ్య క్షత్రియుల వలన

పుట్టినవారగు మాగధ వైదేహసూతులు ముగ్గురును ముందటి వలె చాతుర్వర్ణ స్త్రీయందును, సజాతి స్త్రీ యందును నొక్కక్కరు ఐదుగురి వంతున తమకంటే హీనులగు వారిని పుట్టింతురు. ఇట్లు బాహులగువారు తమకంటే నీచులగు బాహ్యులను ముప్పదుండ్రును పుట్టింతురు.

శూద్రుని వలన వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ స్త్రీల యందు పుట్టిన వారు వరుసగా అయోగవుడు, క్షత్తృ, చండాలుడు వీరు ప్రతిలోమ జాతులు. ఈవిధంగా వర్ణ సంకరం పేరుతో ఉపకులాలు సృష్టించి మరికొన్ని శాఖోపశాఖ కులాలకు జీవం పోసినట్లు మనువు వృత్తుల పరంగా దర్శనమిస్తాడు. ఈవిధంగా మనుస్మృతి పదవ అధ్యాయంలో వృత్తులకు సంబంధించిన ప్రస్తావన పుష్కలంగానే ఉంది. వర్ణసంకరులు అనే విభాగంలో అన్ని రకాల వృత్తులను పేర్కొన్నాడు. వృత్తులకు సంబంధించిన చర్చ ఈ రోజుది కాదు. రుగ్వేదం, కైఫియత్తులు, వృత్తి పురాణాల్లో కూడా ఉంది. అదేవిధంగా డా.బి.ఆర్. అంబేద్కర్, చరిత్రకారుడైన డి.డి.కోశాంబి, రోమిల్లాథాఫర్, హనుమంతరావు వంటి ప్రముఖులు వృత్తికులాలకు సంబంధించి పరిశోధనలు జరిపారు. ఏది ఏమైనా వృత్తి అనగానే మొదటిగా గుర్తొచ్చేది మనుస్మృతి అయినప్పటికీ వృత్తి పురాణాల్లో కూడా వృత్తులకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయి.

భగవద్గీతకు సాహిత్య పరంగా విశేష స్థానముంది. ప్రొఫెసర్ కోశాంబి అభిప్రాయం ప్రకారం భగద్గీతను క్రీ.శ.150 నుండి క్రీ.శ. 850 సంవత్సరాల మధ్య కాలంలో రచించబడిందని పేర్కొన్నాడు.

This helps date the work as some where betwen 150-350 AD near the later then the earlier date గుప్తయుగానికి పూర్వం అమలులో ఉన్న ఉన్నతమైన సంస్కృతీ, భాషశైలీలో భగవద్గీత రచించింప బడిందని, అందుచేత గుప్తుల యుగానికి కొంచెం ముందుగా రచించాడనే అభిప్రాయాన్ని కోశాంబి వెలి బుచ్చాడు. భగవద్గీతను గీత అని కూడా అంటారు. అత్యంత ప్రాచీన గ్రంథాల్లో ఇదొకటి. రుగ్వేదం, మను స్మృతి గ్రంథాల వలే భగవద్గీతలో కూడా వృత్తులకు సంబంధించిన ప్రస్తావన, వర్ణవ్యవస్థ వివరాలు ఉన్నాయి. భగవద్గీతను రాసింది వేదవ్యాసుడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు, శూద్రులకు వారి వారి జన్మాంతర సంస్కా రమును అనుసరించి స్వభావంచే కలిగిన గుణముల చేత వారు ఆచరించవల్సిన కర్మములు విభజింపబడినవి. జాతశ్రీ కథల్లో కూడా వివిధ వృత్తుల కథలున్నాయి. వాటిని తరువాత అధ్యాయనంలో పరిశీలించడం జరిగింది.

అన్నం వ్యవసాయ వృత్తివల్ల దొరికేఫలం మనం అన్నాన్ని పరబ్రహ్మ స్వరూపంగా కొలుస్తాము. వ్యవసాయ వృత్తిని గురించి తెలుగు సాహిత్యంలో అన్ని ప్రక్రియలో సాహిత్యం వచ్చింది. భౌతిక సృష్టిజరగడానికి ఆసృష్టి నిలవ డానికే అవసరమైన ఈ వృత్తిని పోతన, శ్రీనాధుడు మొద లైన కవులు ఎన్నుకొన్నారు. వ్యవసాయదారునికి వ్యవ సాయపు పనిముట్ల తయారీ చేసే కమ్మరి వృత్తి ప్రాధా న్యత ప్రత్యేకమైనది. వ్యవసాయదారుడు విత్తనాలు చల్లే జడిగమును వ్యవసాయ వస్తువులను తయారు చేసే లోహపుదిమ్మె గురించి, నూరన ప్రభావతీ ప్రద్యు మ్నములో వివరించాడు.

సంఘజీవనంలో చేనేతవృత్తి కూడ ముఖ్యమైనది. వీటినే సాలి పద్మశాలి అని పిలువబడుతున్నది.

భారతీయ చేనేతవృత్తి, పనితనం వేదకాలం నుండి వస్తున్నాది. ఆంధ్రమహాభారతంలో ఉదంకోపాఖ్యానం లో నాగలోకంలో మగ్గంనేస్తున్న స్త్రీ లిద్దరూ ధాత, విధాతలు. కనుక మగ్గం నేసేవారు పరమాత్మకు బ్రహ్మకు ప్రతీకలుగా చెప్పబడ్డారు. వారు నేసే తెలుపు నలుపు దారపు పోగులు పగలు రాత్రులకు ప్రతీకలుగా నన్నయ వివరించాడు. జీవించడానికి అవరసరమైన వస్తువుల్లో ఆహార పదార్థాలకు నీటికి కావలసినవి కుండలు. వీటిని తయారుచేసేవాడు కుమ్మరి. ఈ కుమ్మరి వృత్తిగురించి అయ్యలరాజు నారా యణా కవి హంశవింశతిలో పింగళి సూరన - ప్రభావతీ

ప్రద్యుమ్నములో, పాల వేకరిక దిరీపతి-శుకనప్తతి కావ్యాలలో వివరించబడింది. కుండలు ఉపయోగించని శుభాశుభ కార్యాలు లేవు. వివాహలతో 'ఐరేని' కుండలు వివిధ రంగులతో తీర్చిదిద్ది నీటితో నింపి వివాహవేడుకల్లో పెడతారు. కుండలు చేసే కుమ్మరి పరమాత్మతో పోల్చింది హంస వింశతి కావ్యం ఇదే కావ్యంలో కుమ్మరి కుల ధర్మాన్ని మరియు కుమ్మరి త్రిమూర్తులకు పరమాత్మకు ప్రతిరూపంగా చెప్పబడింది. ఉద్యోగ పర్వంలో తిక్కన యుద్ధభేరి మ్రోతకు భూమి కుమ్మరి సారెవలె గుండ్రంగా తిరిగింది. ఇతర వృత్తులు వలె వడ్రంగం కూడా ప్రత్యేక మైనది. ఆధునిక కాలంలో ఈ వృత్తి ప్రాముఖ్యాన్ని పొంది రకరకాల పనితనాన్ని చూపిస్తుంది. అల్లసాని పెద్దన మను చరిత్రలో చంద్రున్ని దంతపు దువ్వెన వలె వర్ణించాడు. ఆనాడు కురులు దువ్వుకొవడానికి దంతపు దువ్వెనలిన ఉపయోగించే వారని తెలుస్తుంది. ఈ విధంగా సమాజ జీవనంలో వివిధ వృత్తులు వారి జీవన చిత్రణను వర్ణించారు.

తెలంగాణలో వృత్తిజీవనం :

ఇప్పటికే వివిధ కులాలలోని యువతీ యువకులు తమకు ఇష్టం వచ్చిన వారిని (ఇతర కులాలకు చెందిన) పెళ్లి చేసుకుంటున్నారు. ప్రేమ వివాహాలు జరుగుతూ ఉన్నాయి. వ్యక్తి చైతన్యం, జ్ఞానం పెరిగినప్పుడు కులాంతర, మతాంతర వివాహాలు చోటు చేసు కుంటాయి. ఇప్పుడు ప్రపంచమంతటా జ్ఞానానికి పెద్దపీట వేస్తున్నారు. జ్ఞానం - తెలివితేటల ఆధారంగా వధూవరుల వేట జరుగుతోంది. వారి జీతాలు, ఉన్న సౌకర్యాల ఆధారంగా ఇంటర్నెట్లో వివాహాలు జరుగుతున్నాయి. వీటి శాతం ఇప్పుడు తక్కువగా కనిపించవచ్చుగాని ఈ ధోరణి ముందు ముందు బలపడే సూచనలే ఎక్కువున్నాయి. సంప్రదాయ వృత్తులున్నప్పుడు ఒకచోట స్థిరనివాసం ఉండేది. ఆధునిక వృత్తులొచ్చాక ఒకే చోట స్థిర నివాసానికి ఎవరూ ఓటు వేయడంలేదు. ఎక్కడ అవ కాశాలుంటే అక్కడికి పక్షిలా వెళ్ళి వాలిపోతున్నారు. దాంతో కట్టుబాట్లు, విలువలు పలుచనై వ్యక్తిగత ఇష్టం, అభిరుచి, ఆకాంక్షలు ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి. అందుకు అనుగుణంగానే జీవిత భాగస్వామిని ఎంపిక చేసు కుంటున్నారు. తప్ప కులాల పట్టింపు తగ్గుతోంది. ఒకవేళ వారి కులంలోనే ఒక చదువు, వరుడు ఉంటే అటువైపు మొగ్గుచూపడం సహజమే. లేనిపక్షంలో ఇతర కులాలకు చెందిన వారిపట్ల మొగ్గు చూపుతున్నారు.

ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ వృత్తి, ఈ వృత్తులలో తిరిగి ఉపకులాల మాదిరి ఉ పవృత్తు లున్నాయి. ఒక వృత్తిలోని యువకుడికి అదే వృత్తిలోని యువతి నచ్చితే వివాహమాడతాడు. నచ్చకపోతే మరో వృత్తి యువతి కోసం వేట ప్రారంభిస్తాడు. ఇక్కడ వృత్తులే కులాలుగా భావిస్తే ఆ కులాలను గాకుండా ఇతర కులాల (వృత్తుల) వైపు మొగ్గుచూపడం జరుగుతోంది. దీనికి సామాజిక అడ్డంకులు కూడా ఏమీలేవు. కేంద్ర మంత్రి మణిశంకర్ అయ్యర్ కుటుంబానికి చెందినవారు అనేక దేశాల, రాష్ట్రాల వారిని పెళ్లి చేసుకుని ఎక్కడెక్కడో నివసిస్తున్నారు. ఖండాంతరాలలో కూడా ఉన్నారట. మరి వారందరిది ఏ కులం ? ఏ జాతి? చెప్పడం కష్టమే. అలాంటి కుటుంబాలు, అలా మారుతున్న కుటుంబాలు చాలా ఉన్నాయి. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ కుటుంబాన్నే తీసుకున్నా ఈ విషయం మనకు బోధపడుతోంది. వాళ్ల ఇంట్లో పార్సీ, ఇటాలియన్, ఇట్లా అనేకులు చేరారు. మరికొన్ని తరాలు గడిస్తే మరెంత మంది వచ్చి చేరుతారో?

తెలంగాణలో కూడా ఇలా వివిధ కులాల, మతాలను తమలో కలుపుకున్న కుటుంబా లున్నాయి. ప్రముఖ రచయిత్రి ముదిగంటి సుజాతారెడ్డి ఒక మహారాష్ట్ర యువతిని కోడలిగా చేసుకుంది. ఒక అమెరికన్ పౌరుడిని అల్లుడిగా స్వీకరించింది. ఇలా కుల మతాలకు అతీతంగా కేవలం జ్ఞానం, అభిరుచి, వ్యక్తిగత ఇష్టం ఆధారంగా మానవ సంబంధాలు రూపుదాల్చుతున్నాయి. కొత్త

సంస్కృతి రూపుదిద్దుకుంటోంది. వసుధైక కుటుంబకమ్ అనే మాట విస్తృత స్థాయిలో కాకపోయినా సూక్ష్మ స్థాయిలో మనకు కనిపిస్తోంది. ఇంతగా మారుతున్న సమాజంలో మన ఇష్టాయిష్టాలకనుగుణంగా వృత్తులు, ఆ వృత్తులను అనుసరించే కులాలు అలాగే కొనసాగాలంటే కుదురుతుందా ?... కుదరదనే విషయం ఈ సమాజం చెబుతోంది. ఈ సమాజంలోని ధ్వని ఈ పుస్తకంలో ప్రతిధ్వనిస్తుంది. లుప్తమవుతున్న సంస్కృతిని చూస్తే అయ్యో అనిపిస్తుంది. కాని శక్తిమంతమైన 'పరివర్తన' గాలి వారి జీవితాలను కమ్మేస్తుంటే వారెలా మనగలుగుతారు? ఆ సంస్కృతి ఎలా సజీవంగా నిలుస్తుంది ? అందుకే వీలయినంతగా వారిని అభివృద్ధిక్రమంలోకి తీసుకురావడమే ఉత్తమం. ఈ విషయమై జప్యం చేస్తే అంతగా వారు వెనుకబడిపోతారు.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వావిలికొలను రాజ్య లక్ష్మి కథల్లో కుటుంబ జీవనం

- సయ్యద్ అఫ్రీన్

రచయిత్రి వావిలికొలను రాజ్యలక్ష్మి పుట్టిన ఊరు వనపర్తి జిల్లా ఏదుట్ల. ప్రముఖ రచయిత్రి పోల్కంపల్లి శాంతాదేవి వీరికి స్వయాన వదిన గారు. తాను రచయిత్రి కావడానికి ముఖ్య ప్రేరణ తన వదినగారేనని రాజ్యలక్ష్మి గారు చెప్పుకుంటారు. ఆమె రాసిన మొట్టమొదటి కథ మధుశ్రీ. ఆ తర్వాత అనేక వార, మాస పత్రికల్లో తన రచనలు ప్రచురితమయ్యాయి. పెళ్లికాకముందు పోల్కం పల్లి రాజ్యలక్ష్మి పేరుతో కొన్ని కథలు, మూడు నవలలు రాశారు. వీరి తొలి నవల ఆనంద కిరణాలు. రాజ్యలక్ష్మి గారి కథా సంపుటాలు బ్రహ్మలిఖితం, పూల దోసిళ్లు విశేషంగా ప్రజాధరణ పొందాయి. దాదాపుగా ఇప్పటి వరకు 16 నవలలు, తొంభైకి పైగా కథలు రాశారు.

కథా ప్రక్రియలో ఒక్కో రచయితది ఒక్కో విధానం. కొన్ని అంశాల్లో వావిలికొలను రాజ్యలక్ష్మి గారిది ప్రత్యేక విధానంగా చెప్పుకోవచ్చు. వారి కథల్లో ప్రత్యేకంగా కుటుంబ జీవన చిత్రాన్ని చూడవచ్చు. వారి బ్రహ్మలిఖితం కథల సంపుటి చదివితే ఈ విషయం ఎవరికైనా అవగత మవుతుంది.

పూలరెమ్మ :

బ్రహ్మలిఖితం కథల సంపుటిలోని పూలరెమ్మ కథలో కుటుంబ జీవన చిత్రం స్పష్టంగా మనకు కనబడుతుంది. పొద్దుపోయేవరకు పడుకున్న విజయను భర్త వేణు గోపాల్ నిద్ర లేపకపోవడం, కంగారుగా లేచి కనీసం భర్తకు టైమ్ కి కాఫీ పెట్టివ్వలేక పోయానే అని బాధ పడడం, భార్యను ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక తనే కాఫీ పెట్టుకోవడం, భార్య కోసం కూడా ఫ్లాస్కులో ఉంచడం లాంటివి కుటుంబ జీవనానికి సంబంధించినవి. కాఫీ పెట్టుకోవం తెలియకపోయినా భార్యను ఇబ్బందిపెట్టడం ఇష్టంలేక పాలనుకొని మజ్జిగతో కాఫీ పెట్టుకోవడం, అది తెలిసి భార్య బాధపడడం లాంటివి కూడా కుటుంబ జీవనానికి సంబంధించినవే. పొరపాటు గమనించి ఇద్దరు నవ్వు కోవడం కుటుంబ జీవనానికి అద్దం పట్టింది. ఆ తర్వాత చిక్కటి పాలతో విజయ కాఫీ పెట్టి భర్తకిచ్చి తాను తాగడం కుటుంబ జీవనాన్ని గుర్తుకు తెస్తాయి.

ఆనుపత్రిలో టెస్టులు చేయించుకున్న విజయకు పిల్లలు పుట్టరన్న విషయం భర్త వేణుగోపాల్ దాచిపెట్టడం, భార్యకు అనుమానం వచ్చి అడిగినా అసలు నిజం తెలిస్తే భార్య బాధ పడుతుందని అబద్ధం చెప్పి మభ్యపెట్టడం కుటుంబ అనుబంధాల విలువలకు తార్కాణం.

వేణుగోపాల్‌కు ఇదివరకే పెళ్లయిందని, ఆమె పేరు వాసంతి అని, ఆమె ఓ మగ శిషువుకు జన్మనిచ్చి కన్ను మూసిందని, ఆ బాబును స్నేహితుడి ఇంట్లో ఉంచి వేణు గోపాల్ అప్పుడప్పుడు వెళ్లి చూసి వస్తుంటాడని విజయకు తెలిసిపోయింది. ఇలాంటి పరిస్థితిలో విజయ స్థానంలో మరో ఆడది ఉంటే ఆ ఇల్లు నరకంగా మారిపోయేది. కాని విజయ అందుకు భిన్నంగా ప్రవర్తించింది. వేణు గోపాల్ బాధను అర్థం చేసుకుంది. విజయ నెమ్మదస్తు రాలు సరళ స్వభావురాలు కావడం వలన ఆ బాబు విషయంలో భర్తకు పూర్తిగా సహకరించింది విజయ. ఆనందంతో బాబును తీసుకురావడానికి తన భర్త స్నేహితుని ఇంటికి బయలుదేరింది. పరిస్థితులను అర్థం చేసుకొని బాబును ఇంటికి తీసుకురావడానికి మన స్ఫూర్తిగా అంగీకరించిన తన భార్యను చూసి ఆనందంతో ఉప్పొంగిపోయాడు వేణుగోపాల్. ఇదంతా కూడా కుటుంబ జీవన విధానాన్ని తేటతెల్లం చేస్తాయి.

రాతిగుండె :

అలాగే ఈ కథల సంపుటిలో మరో కథ రాతిగుండె. కట్నం తీసుకోకుండా పెళ్లి చేసుకోవాలనుకున్న శేఖరానికి

కట్నం తీసుకోవలసిన పరిస్థితులు దాపరించాయి. తన చెల్లెలి పెళ్లి కోసం కట్నం ఇవ్వాల్సి వచ్చింది. అందుకోసం తను కట్నం తీసుకోవలసి వచ్చింది. ఇదంతా కూడా కుటుంబ జీవనం కోసమే అని మనం అర్థం చేసుకోవచ్చు. ఈ కథలో పొందుపరిచిన అన్ని సన్నివేషాలు కుటుంబ జీవనం నేపథ్యంలోనే ఉన్నాయి. ఇది రచయిత్రి శైలి గొప్పతనం. కట్నం తీసుకున్న భర్త పరిస్థితిని రాధ అర్థం చేసుకొని అతనికి అనుకూలంగానే ఉండడం కూడా కుటుంబ జీవన చిత్రాన్ని చూపించింది.

శేఖరం తన అన్నయ్య నారాయణకు కాసింత జ్వరం వచ్చిందని తెలిసి కంగారు పడడం, భోజనానికి కూర్చున్న వాడల్లా లేచి వెళ్లి అన్నయ్యను పలకరించడం, నుదిటి మీద చేయిపెట్టి చూసి చాలా వేడిగా ఉందని బెంబేలు పడిపోవడం, నారాయణ ఈ మాత్రం జ్వరానికే కంగారు పడతారెందుకు నాకేం ఇబ్బంది లేదని చెప్పడం, అయినా డాక్టర్ ను పిలిపిస్తానని శేఖరం చెప్పడం లాంటివన్నీ కూడా కుటుంబ సంబంధ భాందవ్యాలకు సంబంధించినవే. అంత జ్వరంలో ఉన్న నారాయణ తన గురించి ఆలోచించుకోకుండా కొత్తగా కాపురానికి వెళ్లిన చెల్లి అక్కడ ఎలా ఉందో, కొత్త మనుషుల మధ్య ఏమైనా ఇబ్బందులు పడుతుందో ఉత్తరం రాసి కనుక్కోమని తమ్ముడికి చెప్పడం, శేఖరం అన్నయ్య చెప్పిన మాటను తూచ తప్పకుండా పాటించడం రామ లక్ష్మణులను గుర్తుకు తెస్తాయి. రాధ హటాత్తుగా చనిపోవడం కుటుంబంలోని అందర్ని కలచివేసింది. ఇలాంటి సంఘటనలు కుటుంబ జీవనాన్ని ప్రతిబింబించాయి.

దీపాలు వెలిగాయి :

వావిలికొలను రాజ్యలక్ష్మి కథల్లో మరో కథ దీపాలు వెలిగాయి. ఈ కథలో కూడా కుటుంబ జీవన విధానం కనిపిస్తుంది.

ఉద్యోగంలో స్థిరపడిన మదన్ తన చెల్లెలు రజనీని తన దగ్గరే ఉంచుకొని చదివిద్దామనుకుంటాడు. చిన్న బస్తీలో తండ్రి దగ్గర ఉంటున్న రజని సిటీలో ఉంటున్న అన్నయ్య దగ్గర ఉండి చదుకోబోతున్నందుకు ఎంతగానో సంబరపడుతుంది. మంచి తెలివితేటలుండి చదువులో చురుగ్గా ఉన్న చెల్లెలిని చదివించి పైకి తీసుకురావాలని, అందుకు చెల్లెలిని ప్రోత్సహించాలని అనుకుంటాడు. దానికి తన భార్య ఒప్పుకోకపోవడం, స్వార్థంగా ప్రవర్తించడం కూడా అనేక కుటుంబాల్లో సహజంగా ఉండేవే. రచయిత్రి కుటుంబ నేపథ్యంలో ఉండే అనుకూలతలే కాదు, ప్రతికూలతలను, ఆనందాలనే కాదు, బాధలను కూడా తన కథల్లో పొందుపరచడం సహజంగా ఉంది. భార్య వద్దన్నా సరే చెల్లి చదువు ఎలా కొనసాగించాలి, ఎక్కడ చదివించాలనే ఆలోచనల్లో పడ్డాడు. ఇంటికి తీసుకువచ్చి రజనీని ఇబ్బందిపెట్టడం ఇష్టంలేక ఎంత ఖర్చయినా సరే హాస్టల్లో ఉంచి చదివించాలనుకోవడం కుటుంబం కోసం అతను పడే తపన వ్యక్తమవుతుంది. ఈ విషయంలో తండ్రికి ఏలాంటి ఖర్చు కాకుండా తనే చూసుకోవాలనుకుంటాడు మదన్. అన్నయ్య తన గురించి అంత తపన పడుతుంటే తను ఆ ప్రేమలో కరిగి పోయింది. తనను ఇంట్లో ఉంచుకోలేని అసమర్థుడినైన నన్ను క్షమించమని చెల్లెలిని అడగడం, చెల్లెలు అన్నయ్య పరిస్థితిని అర్థం చేసుకొని జాలి పడడం అంతా చాలా కుటుంబాల్లో జరిగే విషయాలే. అందరికి తెలిసిన విషయాలనే అందంగా కథల రూపంలో అందించడం రచయిత్రి వావికొలను రాజ్యలక్ష్మి గారి గొప్పతనం.

చెల్లెలిని, భార్యను సినిమాకు తీసుకువెళ్దామనుకోవడం మదన్ మంచితనం. అన్నయ్య వదినలతో కలిసి సినిమాకు వెళ్లే అవకాశం రావడం రజనీకి ఆనందం. ఇదంతా నచ్చని మదన్ భార్య లత సీన్ క్రియేట్ చెయ్యడం, రజని పలకరించినా లత స్పందించకపోవడం సగటు కుటుంబాల్లో జరిగేవే. అనుబంధాలు ఆప్యాయతలు, ఈర్షలు ద్వేషాలు అన్ని కలగలిపి తన కథల్లో కుటుంబ చిత్రాన్ని చక్కగా చిత్రించారు. సాఫీగా సాగిపోయే జీవితాలు కొన్నయితే, గజిబిజిగా సాగే జీవితాలు మరి కొన్ని. అన్నీ కలిస్తేనే కుటుంబ జీవనమని వావికొలను

రాజ్యలక్ష్మి గారి దీపాలు వెలిగాయి కథ గుర్తు చేస్తుంది. అన్నా చెల్లెల్ల అనుబంధాన్ని ఓర్చుకోలేని లత లాంటి పాత్రలు నిజ జీవితాల్లో ఎందరో కటుంబ జీవనంలో కనిపిస్తారు.

చెల్లెలి కాలేజి ఫీజు కోసం దాచిన డబ్బుతో లత చీరలు కొనుక్కోవడం, భర్త ఇలా ఎందుకు చేశావని అడిగితే భార్యకు చీర కొనుక్కునే హక్కు కూడా లేదని రెచ్చిపోయి మాట్లడడం, అంతటితో ఆగకుండా రజని క్యారెక్టర్ మంచిది కాదని అబద్దాలు చెప్పడం లాంటివి అనేక కుటుంబాల్లో మనకు కనిపిస్తూనే ఉంటాయి. వినయ విధేయతలతో ఉండే చెల్లిలిపై అబాండాలు వేసినందుకు లత చెంప చెల్లుమనిపించాడు భర్త. అనేక కుటుంబాల్లో జరిగే సహజ సమస్యలను కథా వస్తువుగా ఎంపిక చేసుకొని, మనకు అందించడం గొప్ప విషయం.

మదన్ కొట్టినందుకు లత ఇంటికి తాళం వేసి వెళ్లిపోవడం, మదన్ మదన పడడం, ఇదంతా తనవల్లనే జరిగిందని రజని బాధపడడం, నెలలు గడుస్తున్నా లత తిరిగి రాకపోవడం అనేక కుటుంబాల్లో జరిగే సహజమైన సన్నివేషాలే.

దీపావళి పండగొచ్చింది. పండక్కి మదన్ తన చెల్లికి ఖరీదైన పట్టుచీర కొన్నాడు. వేకువజామునే లేచి రజని ఇల్లంతా అలంకరించి, తలస్నానం చేసింది. రజని అన్నయ్యకు నమస్కారం చేసింది. మదన్ చెల్లెలిని మన స్ఫూర్తిగా ఆశీర్వదించాడు. రజనీ చేసిన పిండివంటలు అన్నయ్యకు దగ్గరుండి కొసరి కొసరి వడ్డించింది. అన్నయ్యను ఈ పండుగ రోజైనా కడుపునిండా తినేలా చేసింది. టపాసుల మోతలో, పండుగ వేడుకల్లో బాధలను ఎంత మరచిపోదామన్నా మరచిపోలేక పోతున్నారు. ఈ పండుగ వేళ లత ఉంటే ఎంత బాగుండే దని లతను తలచుకుంటూ అన్నా చెల్లెలు మరింతగా కుమిలిపోవడం లాంటి సన్నివేషం చదువుతుంటే అనేక కుటుంబ జీవనాల్లో ఉండే సన్నివేషాలు కల్లముందు కదలాడాయి.లత తిరిగి భర్త దగ్గరకు వచ్చింది. అందుకు కారణం రజనీయే. మదన్ మరో పెళ్లి చేసకోబోతున్నట్లు రజనీ లతకు ఉత్తరం రాసింది. కంగారు పడిపోయి రావడమే కాదు, పశ్చాత్తాపంతో వచ్చింది. పుట్టింట్లో ఉండగా ఇరుగుపొరుగువారు భర్తను వదిలేసి వచ్చిందని సూటిపోటీ మాటలు అంటుంటే భరించలేక పోయింది. తమిద్దరిని కలపడానికి రజని పడిన తపనను అర్థం చేసుకుంది. వారి పట్ల తాను తప్పుగా ప్రవర్తించానని తన తప్పు తెలుసుకుంది. కుటుంబ జీవనంలో ఎలా ఉండాలో ఎలా ఉండకూడదో ఈ కథ ద్వారా రచయిత్రి చక్కగా తెలియజేశారు.

వెన్నెల వెలుగు :

ఈ కథ కుటుంబ జీవన విధానంలో అక్కా చెల్లెళ్ల మధ్య ఆప్యాయతలను, ప్రేమానురాగాలను ఆవిష్కరించింది. ఒకరి కోసం ఒకరు అన్నట్టుగా జీవించడం కుటుంబ వ్యవస్థకే మకుటం లాంటిది. ప్రియుడి చేతిలో మోసపోయిన రాధిక తన అక్కయ్య సూచనల మేరకు తమ నాన్న గారి స్నేహితులైన గిరిరావు, భాగ్యమ్మ దంపతుల వద్దకు వెళ్లింది. వారు ఎంతో ప్రేమగా రాధికను చూసుకున్నారు. రాధిక వారిని బాబాయి, పిన్ని అని పిలుస్తూ వారి మమతానురాగాలను పొందింది. తన అక్కయ్య ఉత్తరాలు రాయడం, ఖర్చులకు డబ్బు పంపించడం ఇదంతా కూడా కుటుంబ జీవనానికి సంబంధించినదే అయినా రచయిత్రి తనదైన శైలిలో ప్రత్యేకత చూపించారు.

అక్కయ్య రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుందన్న విషయం తెలిసి రాధిక ఎంతగానో సంతోషించింది. ఇన్నాళ్లకు తన అక్కయ్య పెళ్లి జరిగినందుకు సంబరపడింది. తను ఇక్కడికి వస్తుందన్న సమాచారం తెలిసి పట్టరాని సంతోషంతో అక్కయ్య కోసం స్పేషల్ గా పిండి వంటలు తయారు చేయడం కుటుంబ జీవనంలోని ప్రేమాను బంధాలను గుర్తు చేస్తాయి.

అందుకోలేని అనురాగం :

అనారోగ్యంతో ఉన్న మధుసూదన్ ను అప్యాయతతో

పలకరించి ప్రేమగా చూసుకుంటుంది జానకి. అందు కోలేని అనురాగం కథలో కుటుంబ విలువలతో పాటు, ప్రేమానురాగాలను రంగరించి పాఠకులకు అందించింది రచయిత్రి వావికొలను రాజ్యలక్ష్మి. తన అన్నవాళ్లు ఎవరు లేని మధుసూదన్‌ను ప్రేమించి చేరదీసింది జానకి. తండ్రి సహకారంతో అనారోగ్యంతో ఉన్న మధుసూదన్ కు చికిత్స చేయిస్తోంది. తనకీ జబ్బు తగ్గదని, మరోకర్ని పెళ్లి చేసుకొని సుఖంగా ఉండమని మధుసూదన్ చెప్పడం. నీతో పాటే నా జీవితం. నీవు లేకుండా నేను ఉండలేనని చెప్పడం పాఠకుల మదిని కలచివేస్తుంది. మధుసూదన్‌ని సంపూర్ణ ఆరోగ్యవంతునిగా చేయమని జానకి భగవంతుడిని కోరుకుంటుంది. ఆమె కోరిక ఫలించి మధుసూదన్ బాగా కోలుకుంటున్నాడు.

తమ కుటుంబంలోని ఒక వ్యక్తిని బాగా చూసుకోవడం అందరు చేసే పనే. ఇంకా కటుంబ సభ్యుడు కాకుండానే అంతకన్నా ఎక్కువ చూసుకోవడం ఈ కథలోని ప్రత్యేకత. మధుసూదన్ కు ఎవరూ లేరు. ట్యూషన్‌లు చెప్పుకొని బతుకుతున్నాడు. అతనిని ప్రేమించింది జానకి. తండ్రికి చెప్పింది. తల్లి లేని జానకి కోరిక కాదనలేకపోయాడు. పెళ్లికి అంగీకరించాడు. అతన్ని తనకుటుంబంలో చేర్చు కోవాలనుకున్నాడు. అంతలోనే మధుసూదన్‌కు ఆరోగ్యం బాగోలేదని తెలిసింది. జానకి తండ్రి తనకున్న పొలం అమ్మి మధుసూదన్‌కు వైద్యం చేయిస్తున్నాడు. ఇలా కుటుంబ నేపధ్యాన్ని విభిన్నంగా సమర్పించింది రచయిత్రి రాజ్యలక్ష్మి.

మధుసూదన్ కోలుకోవడానికి సహకరించిన తన తండ్రికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది జానకి. ట్రీట్‌మెంట్ తీసుకొని ఆరోగ్యంతునిగా తిరిగివస్తున్న మధుసూదన్‌ను రిసివ్ చేసుకోవడానికి ఆనందంగా వెళ్లాడు జానకి వాళ్ల నాన్న విశ్వనాథం. ఇవన్నీ కూడా కుటుంబ సంబంధాలను వ్యక్తం చేస్తాయి. ఆ తర్వాత జరిగే పరిణామాలు, ట్విస్టులు అన్నీ కూడా అనేక కుటుంబాల్లో జరిగేవే, జరుగుతున్నవే.

వావిలికొలను రాజ్యలక్ష్మి బ్రహ్మలిఖితం కథల సంపుటి లోని మిగితా కథల్లో కూడా కుటుంబ జీవనం, ఆ జీవనంలో వైవిద్యం మనకు ప్రస్పుటంగా గోచరిస్తాయి.



BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సి.నా.రె సినిమా పాటలు - చమత్కార వైవిధ్యం

- పి. రమేష్

విత్తనాన్ని మట్టిలోకి విసిరికొడితే/వృక్షమై పేలుతుంది/ ఒక్క నీటిని నొక్కాలని చూస్తే/లక్ష కంఠాలై మోగుతుంది" అంటారు అభ్యుదయ భావజాలంలో డా॥సింగిరెడ్డి నారాయణరెడ్డి. వివిధ ప్రక్రియలో దాదాపు ఐదు దశాబ్దాలకు పైగా సాహిత్య సృజన గావించిన విశ్వంభరుడు సి.నారాయణరెడ్డి. ఆరంభంలో సికింద్రాబాద్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కొంతకాలం అధ్యాపకుడిగా పనిచేశారు. అటు తర్వాత నిజాం కళాశాలలో అధ్యాపకుడిగా కొంతకాలం పనిచేశారు. తదుపరి కాలంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పనిచేస్తూ అనేక ఉన్నత పదవులు చేపట్టారు. 6ఏళ్ల పాటు సినారె రాజ్యసభ సభ్యులుగా సేవలందించారు. 1953 నవ్వనిపువ్వు సంగీత నృత్యనాటిక ప్రచురితమైంది. అదే సినారె తొలి ప్రచురణ. తదుపరి జలపాతం, విశ్వగీతి, అజంతా సుందరి వంటివి వెలువడ్డాయి. ఆయన రాసిన రామప్ప సంగీత నృత్య రూపకం అన్ని భారతీయ భాషల్లోకి అనువాదమైంది. ఆయన పరిశోధన గ్రంథం ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు, ప్రయోగములు అత్యంత ప్రామాణిక గ్రంథంగా పేరుపొందింది.

సినారె 1962లో వచ్చిన "గులేబకావలి" కథ చిత్రం ద్వారా సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. "నన్ను దోచుకుందువటే వెన్నెల దొరసాని అనే పాటతో ఆయన సినీకవిగా పేరు పొందారు. అది మొదలు దాదాపు మూడు వేల సినీగీతాలు రాశారు. సినారె ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారుగా, రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా ఎనలేని సేవలందించారు. ఇక రాష్ట్రస్థాయి, దేశస్థాయిలో ఆయన పొందినన్ని పురస్కారాలు మరెవరూ పొంది ఉండరు. 1966వ సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ పురస్కారాన్ని సినారె అందుకున్నారు. ఇది అందుకున్న రెండవ తెలుగు కవి సినారె. సినారె రాసిన విశ్వంభర కావ్యానికి గాను ఈ పురస్కారం ఆయన అందుకున్నారు. సాహిత్యంలో ఎవరెస్టు శిఖరమంత ఎదిగిన డా॥సింగిరెడ్డి నారాయణరెడ్డి 12, జూన్ 2017న కన్నుమూశారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ సి.నారాయణరెడ్డి సినీ గేయాలలో వైవిధ్యాన్ని వివరించడమే ఈ వ్యాస లక్ష్యం.

అర్ధశతాబ్ద కాలంగా సినీరంగంలో వున్న సి.నా.రె. 60, 70ల దశకాలలో పుంఖానుపుంఖాలుగా పాటలను రాశారు. ఆ తర్వాత వివిధ పదవుల బాధ్యతల వల్ల పాటల జోరును తగ్గించారు. వివిధ చిత్రాలకు సుమారు 3000 పాటలతోపాటు 'ఏకవీర' 'అక్బర్ సలీం అనార్కలీ' చిత్రాలకు ఆయన సంభాషణలను కూడా సమకూర్చారు. వేలకొద్దీ వస్తున్న సినిమాలలో పాటలు రాయాల్సిన సందర్భాలలో సాధారణంగా పెద్ద మార్పులుండవు. వస్తువు, సన్నివేశం పాతవే అయినా చెప్పే విధానంలో కొత్తదనం వుంటేనే పాట నిలుస్తుంది. అందుకే 'పాతదాన్ని కొత్తగా చెప్పు. కొత్తదాన్ని మనసుకు హత్తుకొనేటట్టు చెప్పు' అని సినిమావర్గాల వారు తరచుగా అంటుంటారు. ఈ సూక్తిని సి.నా.రె. అక్షరాలా పాటించారు. అభివ్యక్తులలో నిత్యం కొత్తదనం కోసం ప్రయత్నించి తన పునికిని చాటుకొన్నారు.

ఉదా : పువ్వునై కురులలో పొంచివుందును. నవ్వునై పెదవిపై పవ్వళింతును (జమీందార్) నవ్వు పెదవులపై పరుండడమనేది అపూర్వమైన ప్రయోగం. నిన్నలేని

అందమేదో - నిదురలేచె నెందుకో తెలియరాని రాగమేదో - తీగసాగె నెందుకో (పూజాఫలం)కొత్త అందాలు వచ్చాయని చెప్పాడానికి అందం నిద్ర లేచిందని చెప్పడం ఎంత అందమైన అభివ్యక్తి! ఏనాడూ నేను నీదాన్ని నీ హృదయానికి అనువాదాన్ని (మగాడు) మొదటి పంక్తిలో చెప్పిన సత్యాన్ని రెండో పంక్తిలో అలంకారికంగా బల పర్చడం ఈ అభివ్యక్తిలోని విశేషం! చిగురులు వేసిన కలలన్నీ సిగలో పూలుగ మారినవి మనసున పొంగిన అలలన్నీ మమతల తీరం చేరినవి (పూలరంగడు) వలపుమత్తును ఇలా కొత్తగా గమ్మత్తుగా వర్ణించడం ఈ ప్రేమగీతంలోని విశిష్టత. నీ పేరు తలచినా చాలు మదిలో పొంగు శతకోటి యమునాతరంగాలు (ఏకవీర) శ్రీ కృష్ణుని విగ్రహం ముందు పాడిన ఈ మధుర భక్తిగీతం పల్లవిలో యమునా తరంగాలను ప్రస్తావించడం ఔచిత్యానికి నిదర్శనం. ఇలా అడుగడుగునా కొత్తదనంతో సి.నా.రె. పాటలు గేయాభిమానులను అలరించాయి.

అటు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనూ ఇటు నిజాం రాష్ట్రంలోనే ఉన్న తెలుగువారు 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణతో ఒకే రాష్ట్రంగొడుగునీడలో ఒదిగినపోయారు. భారత జాతీయోద్యమంతో ఇంచుమించుగా సమాంతరంగా ఏళ్ళ తరబడిగా సాగిన ఆంధ్ర రాష్ట్రోద్యమాన్ని నిజాం రాష్ట్రంలోని తెలుగు ప్రజలు కూడా ముక్తకంఠంతో బలపరిచారు.

మాడపాటి హనుమంతరావు, సువరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణరెడ్డి, దేవులపల్లి రామానుజరావు వంటి తెలంగాణా ప్రాంత నాయకులు తెలుగవారందరికీ ప్రత్యేకరాష్ట్రం కావాలని ఉద్ఘోషించిన వారే. ఉద్యమించినవారే. పొట్టిశ్రీరాములు ఆత్మాహుతితో 1953లో ఏర్పడిన ఆంధ్రరాష్ట్రం సమస్తాంధ్రుల ఆకాంక్షకు సమగ్రాకృతిగా 1956లో 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రంగా రూపు దిద్దుకుంది. ఆంధ్రరాష్ట్రానికి కర్నూలు రాజధానిగా ఉంటే, ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాదు నగరం రాజధానిగా ఏర్పడింది. కాకతీయ యుగం తరువాత తెలుగు వారందరికీ ఒక రాష్ట్రం రూపొందినందుకు నిఖిలాంధ్రజాతి ఉత్సవ తరంగితమైపోయింది. భాషాసంస్కృతుల సమైక్య రూపమున్న తెలుగువారిమధ్య రాజకీయ, సాంఘిక, పరిపాలనపరమైన కొన్ని అసమానతలవల్ల. అపార్థాలవల్ల 'ఆంధ్ర', 'తెలంగాణా' అనే ప్రాంతీయ దృక్పథం వేరుదన్నుకుని నిలిచింది. క్రమంగా ప్రత్యేక తెలంగాణా రాష్ట్రవాదం ఉద్యమంగా ఉబికొచ్చింది. ఆ పరిస్థితుల్లో 1970లో నేనురాసిన ఒక పాటను గురించి ప్రత్యేకంగా వివరించడానికే ఈ నేపథ్యం ఇవరించవలసి వచ్చింది. ఆ సంవత్సరం నేను పాటలు రాసిన చిత్రాల్లో ఆర్.కె., ఎన్.ఎ.టి. వారి 'తల్లా-పెళ్ళామా' పేర్కొనదగింది.

సాంస్కృతికంగా, సాంఘికంగా, రాజకీయంగా తెలుగువారి సమైక్యతను వాంఛించే యన్.టి.ఆర్. ఆశయ నిబద్ధతతో ఆ గీతానికి ప్రత్యేకసన్నివేశాన్ని సృష్టించుకున్నాడు. ఆ గీతం పల్లవి ఇది.

> "తెలుగుజాతి మనది - నిండుగ వెలుగుజాతి మనది.
> తెలంగాణా నాది, రాయలసీమ నాది
> సర్కారు నాది నెల్లూరు నాది
> అన్నీ కలసిన తెలుగునాడు మనదే మనదే మనదేరా"

పై పంక్తుల్లో 'మనది' అనే పదమున్న పంక్తులు కథానాయకుడు పలికేవి. 'నాది' అని పలికినవారు నాలుగు ప్రాంతాలను సూచించే నలుగురు వ్యక్తులు. 'నాది' అనేది సరికాదు 'మనది' అనేదేబాగు అన్న అభిప్రాయాన్ని చరణంలో ఇలా వ్యక్తీకరించాను.

> "ప్రాంతాలు వేరైనా - మన అంతరంగమొకటేనన్నా.
> యాసలు వేరుగున్నా - మనబాస తెలుగుబాసన్నా.
> వచ్చిండన్నా వచ్చాడన్నా వరాలతెలుగు ఒకటేనన్నా".

ఎక్కడున్నా తెలుగువారు తెలుగువారే. అందరినీ ముడివేసే అనుబంధం మాతృభాషాబంధం. ప్రాంతానికే కాదు జిల్లా జిల్లాకు కూడా యాస మారుతుంటుంది. ఉప నదులెన్నో కలిస్తేనే ఒక మహానది. యాసలెన్నో

ఉంటేనే ఒక సమగ్రభాష. తెలంగాణాలో 'వచ్చిండ'ని అన్నా, ఆంధ్రప్రాంతంలో 'వచ్చాడ'ని అన్నా రెండూ యాసలే. ఏదీ గ్రాంథికం కాదు. ఈ అభేదభావాన్నే సాహిత్యపరంగా రెండో చరణంలో.

"మహాభారతం పుట్టింది రాణ్మహేంద్రవరంలో.
భాగవతం వెలసింది ఏకశిలానగరంలో.
ఈ రెంటిలోన ఏదికాదన్న ఇన్నాళ్ళ సంస్కృతి
నిండుసున్న".

నాటి వేర్పాటు ఉద్యమంలో 'ఆంధ్రోల్లు వేరు, తెలంగానోల్లం వేరు' అని కొందరు వాదిస్తుంటే విని, నాకళ్ళముందు హైదరాబాదు నగరంలోని శ్రీ కృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయం, కాకినాడలోని ఆంధ్రసాహిత్య పరిషత్తు ఏక కాలంలో ప్రత్యక్షమయ్యేని, ఆంధ్ర ప్రాంతంలో రాజమహేంద్రవరంలో పుట్టిన నన్నయ భారతం పేరు 'ఆంధ్ర మహాభారతం' వరంగల్లులో ఉదయించిన పోతన్న భాగవతం పేరు 'శ్రీమదాంధ్ర మహా భాగవతం'. తెలంగాణాలో ఆంధ్రశబ్దాన్ని బహిష్కరించాలనుకుంటే 'ఆంధ్ర మహాభాగవతం' పేరు కూడా మార్చాలా? ఆ ప్రశ్నకి సమాధానం పై చరణంలో ఉంది. ఆ గ్రంథ రత్నాలు రెండూ విభిన్న ప్రాంతాల్లోనివైనా, అవి తెలుగువారి సంస్కృతికి కట్టిన అక్షరదీపస్తంభాలు. మూడోచరణంలో ఇటు పోచంపాడు, అటు నాగార్జున సాగరం జలాశయాలు అయిదుకోట్ల తెలుగువారివని ఉగ్గడించాను. నాలుగోచరణంలో సిపాయి కలహం మొదలు కుని స్వరాజ్యసిద్ధి వరకు తెలుగువారు ఏరకంగా వివిధోద్యమాల్లో పాల్గొన్నారో వివరించారు.

ఈ గీతంలోని చివరిచరణం ప్రత్యేకంగా గమనించ దగింది. ఇందులో నేను సమకాలీన వాస్తవికతను నిర్ద్వంద్వంగా ఎత్తిచూపాను. అభిప్రాయభేదాలున్నాయి, అసమానతలున్నాయి, అన్యాయాలు జరిగాయి. కాదన లేము. అంతమాత్రాన మూల రాష్ట్రానికే ముప్పుఏర్పడడం వాంఛనీయం కాదు. అప్పటి స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని విజ్ఞప్తిరూపకంగా ఆ చివరిచరణంలో ఇలా నివేదించారు-

"ఇంటిలోన అరమరికలువుంటే ఇల్లెక్కిచాటాలా?
కంటిలోనలక తీయాలంటే కనుగుడ్డు పెరికివేయాలా?
పాలుపొంగు మన తెలుగుగడ్డను పగలగొట్టవద్దు.
నలుగురిలో మనజాతిపేరును నవ్వులపాలు చెయ్యొద్దు"

పల్లవినీ, మిగతాచరణాలనూ ఎంతో ఆవేశంతో అభినయించి చూపిన కథానాయకుడు ఈ చరణాన్ని ఆర్ద్ర నయనాలతో, ప్రశాంతవదనంతో అభినయించాడు. రామారావు గారు ఈ గీతంలో ఎంత విలీనమైపోయారో ఒక చిన్న సంఘటన చెబితే తెలుస్తుంది. ఘంటసాలగారు, బృందగాయకులు పాడుతూ వుండగా ఈ పాట రికార్డింగు జరుగుతూంది. నేనూ అక్కడే వున్నాను. 'వచ్చిండన్నా, వచ్చాడన్నా' అనే పంక్తిని ఘంటసాలగారు పాడుతూ వుండగా రామారావుగారు అదే పంక్తిని వచన పద్ధతిలో మైకులో పాడేశారు. దానిలోని ప్రత్యేకతను గుర్తించి ముందు రామారావు గారి పంక్తిని పలికించి. ఆ పంక్తినే ఘంటసాలగారిచేత పాడించడం జరిగింది. రికార్డు శ్రోతలకు తెలుసు ఆ రహస్యం.

ఈ చిత్రం విడుదలైన తరువాత ఈ పాట రాష్ట్ర మంతటా మారుమోగింది. సమైక్యతావాదుల్లో అనుకూల స్పందన కలిగిస్తే, వేర్పాటువాదుల్లో ప్రతికూల స్పందన కలిగించింది. ఏమైనా అప్పటికే రెండు థియేటర్లను నిర్మించి కళాకారుడిగా, నిర్మాతగా హైదరాబాదులో స్థిరపడిపోయిన రామారావుగారు నాటి అననుకూల రాజకీయ వాతావరణంలో ఈ సమైక్యాంధ్రగీతాన్ని తమ చిత్రంలో ప్రవేశపెట్టడం సాహసమే.సినారె సినీ గేయాల్లో అలంకార వైవిధ్యాన్ని ప్రత్యేక శ్రద్ధతో రచించారు. ఆయనకు ప్రాచీన కావ్యాలమీద అధ్యాయనం మక్కువ చేత సినీమా పాటల్లో అలంకార వైవిధ్యాన్ని చమత్కార వైచిత్రితో కళ్ళకు కట్టించారు. ప్రాచీన కావ్య పాఠాలను ఏళ్ల తరబడి బోధించడం వల్లనేమో ఆయనకు అలంకారాలంటే అమితమైన యిష్టం. సినిమాపాటల రచన

ప్రారంభించిన కొత్తలో ఆయన అర్థాలంకారాలలో ఎక్కువగా ఉత్తరాలంకారం (ప్రశ్న-సమాధానాలు ప్రధాన లక్షణం) శబ్దాలంకారాలలో అంత్యాను ప్రాసాలంకారాల పట్ల ఎక్కువ మక్కువ చూపించేవారు. ఆయన అలంకార ప్రియత్వానికి కొన్ని ఉదాహరణలు.

మబ్బులో ఏముంది? నా మనసులో ఏముంది? మబ్బులో కన్నీరూనా మనసులో పన్నీరు.. అవునా? (లక్షాధికారి ఉత్తరాలంకారం). పలకరించితేనే ఉలికి ఉలికి పడతావు, నిన్ను ప్రేమిస్తే ఏం చేస్తావో? మనసు పెనవేస్తే ఏమౌతావో? (జమీందార్-అర్థాపత్తి అలంకారం). నవ్వులా అవికావు నవపారిజాతాలు రవ్వంత సడిలేని రసరమ్య గీతాలు (ఏకవీర-అపహ్నుతి అలంకారం). ఓ ముత్యాల రెమ్మ, ఓ మురిపాల కొమ్మ, ఓ పున్నమి బమ్మ, ఓ పుత్తడి గుమ్మ, ఓ రాములమ్మ, రాములమ్మ (ఒసేయ్ రాములమ్మ - అంత్యానుప్రాస). సిగ్గేస్తోందా-సిగ్గేస్తోందా, మొగ్గలాంటి చిన్నది బుగ్గమీద చిటికేస్తే హోయ్ (మనుషులూమమతలూ వృత్యను ప్రాసాలంకారం) ఇలా ఏరుకోవాలేగాని - సి.నా.రె. సినిమాపాటల్లో అలంకారాలు కోకొల్లలు. సి.నా.రె. కవి పాత్రలో లీనమై ఎంత ఉద్వేగంతో ఈ పాటను రాశారో శబ్ద సంస్కారం గల గాయకుడు బాలు పాట నర్థం చేసుకొని అదే స్థాయిలో ఆలపించడం వల్ల ఇది చిరస్మరణీయ గీతంగా నిలిచింది.

వస్తాడు నారాజు ఈ రోజూ రానే -వస్తాడు నెలరాజు ఈ రోజు- కార్తీక పున్నమి వేళలోన -కలికి వెన్నెల కెరటాల పైనా తేలి -తనువులు వేరైనా దారులు వేరైనా ఆ బంధాలే నిలిచేనులే ॥వస్తాడు॥ (అల్లూరి సీతారామరాజు) చిత్రంలో సీతారామరాజు కోసం ఎదురుచూసే సన్నివేశానికి రాసిన ఈ పాట ఉదాత్తమైన అనురాగానికి అక్షరరూపం. అందమైన వెన్నెల కెరటాల మీద తేలి నాయకుడు వస్తాడనే రమణీయమైన భావచిత్రం గల పల్లవి ముందుగా శ్రోతల్ని పరవశింప చేస్తుంది.

'దానవీరశూరకర్ణ'లో సి.నారాయణరెడ్డి తెనిగించారు. ఉదాహరణగా 'దానవీరశూరకర్ణ'లోని స్వేచ్ఛానువాదాన్ని పరిశీలింపవచ్చు. ఏల సంతాపమ్ము మరి నీకేల సందే హమ్ము పార్థ -మృతులకై -జీవితులు పండితులు దుఃఖితులౌదురా- కర్మముల యందె కల దధికారమ్ము; సాంఖ్య యోగంలో 'అశోచ్యానన్వశోచ్ష' అనే శ్లోక భావంతో ప్రారంభమై జ్ఞానయోగంలోని 'పరిత్రాణాయ సాధూనాం...' శ్లోక భావంతో అంతమైన ఈ గీతా సారాంశంలో మధ్యలో శ్లోకాలు ఒక వరుసలో గాక భావానుగుణంగా గ్రహింప బడ్డాయి. ఇంకా.. 'మహాకవి క్షేత్రయ్య', చిత్రంలో సి.నారాయణరెడ్డి ఒక పాటలో కూర్చిన అష్టనిధనాయికా లక్షణాలు కూడా అలంకారిక సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకొన్నవే. ఈ వర్ణనలో ముందు లక్ష్యాన్ని, తర్వాత క్షేత్రయ్య పాత్ర ముఖంగా లక్షణాన్ని చెప్పారు. ఉదాహరణకు వాసకసజ్జిక వర్ణన. ఎంత ముచ్చటైన వాడే- నా ప్రియుడు ఈ క్షణమే రానున్నాడే- ఇదుగో పైట చెంగు తొందరపడెనే- అదుగదుగో పూలపాన్పు గుసగుస లిడెనే- అతని మెత్తని అడుగుల సడి -లేత గాలిలో వినబడి-అరరే నా ఒడలంతా అలజడి.. అలజడి..అలజడి -పడకిల్లు సరిచేసి -పతి కొరకు వేచేటి పడతి వాసక సజ్జిక, వాసక సజ్జిక.

'చాంగురే బంగారు రాజా' అంటూ పల్లవి ఎత్తుకున్నాను. ఆ తరువాత 'మజ్జారే మగరేడా/ మత్తైన వగకాడా/అయ్యారే నీకే మనసియ్యాలని ఉందిరా' అంటూ పల్లవి పూరించాను. చాంగురే, మజ్జారే, అయ్యారే అనే పదాలు అచ్చతెలుగువైనా మన వాడుకలో లేనివి. వీటి ప్రయోగాలు ప్రాచీన ప్రబంధకావ్యాల్లో మాత్రమే వున్నాయి. 'చాంగురే' అనేది చాంగుభళా రూపంలో బుర్ర కథల్లోకి ఎక్కింది. మానవరూపంలో ఉన్నా ఎంతైనా రాక్షస రమణి కదా! ఈ పదాల ప్రయోగంవల్ల ఒక వింతసొగసు గుబాళించింది. ఈ పాటలోనే గుబాళింపు, గుబులుకునే అనే మాటలను కూడా ప్రయోగించాను. సామాన్య ప్రేక్షకులకు ఈ పాటలోని మొత్తంపదాలు అపూర్వంగా అనిపించాయి. 'చాంగురే' అనేది దేశ్యపదమని మన 'శబ్దరత్నాకరం' లాంటి నిఘంటువులు చెబుతున్నా బుర్రకథల్లోని

'చాంగురే' మరాఠీ జానపద గేయగాథల్లోని 'చాంగ్లా' లాగా ధ్వనిస్తున్నది. అయితే 'చాగు' నుంచి 'చాంగు' వచ్చి ఉంటుందని మన నిఘంటుకారుల అభిప్రాయం. 'మజ్జారే' అనే పదంకూడా అచ్చ తెలుగుమాటే అని నిఘంటువులు చెబుతున్నాయి. కానీ నాకనిపిస్తున్నది. 'మజ్జ' అనేది 'మజా' నుండి వచ్చి వుంటుందని. 'మజా' అంటే రుచి. ఇది ఫారసీ పదం. 'మజ్జారే' అనేది ఆశ్చర్యార్థకం. అంటే మాంచి రుచికరంగా ఉన్నదన్న అభివ్యక్తే అది. పాన్నెగంటి తెలగన్న అచ్చతెలుగు కావ్యం 'యయాతి చరిత్ర'లోనూ, ఇతర కావ్యాల్లోనూ ఈ ప్రయోగం వుంది. పదమూడో శతాబ్ది నాటికే తెలుగులో ఫారసీపదాలు ప్రవేశించాయి. 'తల్వార్' అనే ఫారసీపదాన్ని 13వ శతాబ్దికి ముందే నన్నెచోడుడు తన 'కుమార సంభవం' కావ్యంలో ప్రయోగించాడు. 'తరాజు' అనే ఫారసీపదాన్ని తిక్కన 'ఆంధ్రమహా భారతం'లో 'త్రాసు' అని ప్రయోగించాడు. ఇలాంటి పదాలు శ్రీనాథుని కావ్యాల్లో కోకొల్లలు.

ఈ పాటలో 'అమ్మకచెల్ల' అనే మరో ప్రయోగం వుంది. ఇదీ ఆశ్చర్యార్థకమే. అచ్చతెలుగుమాటే. ఆనందమో ఆశ్చర్యమో కలిగినప్పుడు అమ్మో, అబ్బో, అయ్యో అంటాం. అంటే అమ్మానాన్నలను తలచుకుంటాం. 'అమ్మకచెల్ల'లో అమ్మ, అక్క, చెల్లె ఉండడం గమనించదగిన విషయం. ఈ 'అమ్మకచెల్ల' అనే అనే పదాన్ని చేమకూర వెంకటకవి 'విజయవిలాసం' కావ్యంలో యమకగమకంలో 'అమ్మకచెల్ల! నాదు మనసమ్మక చెల్లదు' అని ప్రయోగించాడు. నాపైన ప్రాచీన కావ్యవాసన లుండడం వల్ల ఇలాంటి పదాలన్నీ నాటి పదరచనలో తరుముకొచ్చాయి. బాగా చెక్కిచెక్కి రాసిన పాట కాదది. గంటలో పూర్తిచేసింది. మగరేడు, వగకాడు, మొలకమీసం, సింగపునడుము, మచ్చెకంటిచూపు, పచ్చలపిడిబాకు, విచ్చిన పువురేకు, కైదండ లాంటి పదాలన్నీ ఈ పాటలోని చిక్కదనానికి బాగా తోడ్పడ్డాయి. మచ్చెకంటి చూపు, పచ్చలపిడి బాకు అనడం పదునైన అభివ్యక్తి. 'కోడెవయసు లెస్స'లోని 'లెస్స' కూడా పాత తెలుగుపదమే అయినా 'దాని గుబాళింపు ఇంకా హైలెస్స' అనడం జాలరుల మడికారాన్ని రంగరించిన ప్రయోగం. చిక్కని అచ్చ తెలుగుమాటలతో చెక్కిన ఈ పాటకు టి.వి. రాజుగారి స్వరరచన సైదోడుగా సాగింది. గాయని జిక్కి గొంతులోని గడుమహెూయలు వాదోడుగా సాగింది. చిత్రీకరణకూడా ఆ పాటను పదుగురి మనసుకెక్కించడంలో బాగా తోడ్పడింది.

సంగీత దర్శకుడు స్వరపరిచిన బాణీకి పాటరాయడం సమర్థుడైన కవికి క్రీడలాంటిది. ఆరితేరిన అశ్వికుడు పరిగెత్తుతున్న గుర్రంమీద కూర్చునేకాదు నిల్చునికూడా స్వారీ చేయగలుగుతాడు. పదాలమీద పట్టున్న గీత రచయితకు ట్యూన్‌కొలత అట్టే ఇబ్బంది పెట్టదు. అట్టే ఎందుకంటున్నానంటే జగణాలు (తనాన) అధికంగా ఉన్న బాణీ అయితే పదాలను వెతుక్కోవలసివస్తుంది. కారణం? తెలుగులో జగణాలు తక్కువ. 'తనాన' వచ్చినప్పుడల్లా హుషారు, ఖుషీగ, పసందు, అలాగ, బలేగ, ఫలించి, ఒకింతలాంటి మాటలు ప్రయోగించవలసి వస్తుంది. హిందీ, ఉర్దూ భాషల్లో ఈ జగణాలు పుష్కలంగా దొరుకుతాయి.''కాకినాడ రేవుకాడ కలుసుకుంటవా నా-కళ్లలోని బాసలన్ని తెలుసుకుంటవా'' అని నాయిక అంటే-కాకినాడ రేవుకాడ కళ్లు కళ్లు కలుపుకుంటె -ఓడలోని నీటు గాళ్లు ఊరుకుంటరా'' అంటారు నాయకుడు. అచ్చమైన పల్లెపాటల వరుసలో పోతపోసిన ఈ గీతంలో కాకినాడరేవుతో పాటు 'గండిపేట చెరువు' ప్రసక్తి ఉండడం గమనించదగిన అంశం.పందిరిలేకుంటే తీగ పైకి పోతుందా- గోడలు లేకుంటే గోపురమే వుంటుందా- పురుషులు లేకుంటే తరుణుల పని గోవిందా'' సినీగీత రచయితకు కథావస్తువుతో సంబంధించివున్న గీతాలు రాయడమంటే వాలునీటిలో తేలిపోయినంత సుఖంగా ఉంటుంది. అది జానపదమైనా సాంఘికమైనా. రక్తికీ, అటు భక్తికి రుక్మిణి అనగానే రక్తి ఎరుగని కేవల భక్తు రాలనుకోరాదు. ప్రేమించిన వాణ్నే పిలిపించుకుని పెళ్లాడిన పౌరాణికాంగనల్లో ప్రథమతాంబూలం అవిడకే.

శ్రీ కృష్ణుని అష్టమహిషుల్లో సత్యాభామని విలక్షణ మానిని. స్వాభిమానం ఆవిడ వ్యక్తిత్వానికి మూలధనం. దానికి ఏమాత్రం క్షతికలిగినా దండతాడిత భుజంగినిలా బుస్సుమంటుంది. కలహభోజనుడు నారదుడు తెచ్చి యిచ్చిన పారిజాత పుష్పాన్ని కృష్ణుడు రుక్మిణిసిగలో తురి మాడని తెలుసుకుని ఆవిడపొందిన క్రోధరూపం 'పారి జాతాపహరణం' కావ్యంలో నందితిమ్మన అచ్చొత్తినట్టు చూపించాడు. ఆ అలకలకొలికి తన ప్రాణేశ్వరుణ్ణి పాదతాడనంతో సత్కరించి, అంతలోనే భోరున అశ్రు వృష్టి కురిపించి పారిజాతం మొక్కనే నందనవనం నుంచి తెప్పించుకుని తనపెరట్లో నాటించుకుంటుంది. అప్పు దడుగానీ తాను అందరికన్నా మిన్న అనే ఆత్మాభిమాన తర్పణం జరగలేదు.

పగలే వెన్నెలాజగమే ఊయెల- కదలే ఊహలకే కన్నులుంటే -మనసే వీణగా గణగణ మ్రోయగా- బ్రతుకే పున్నమిగావిరిసిపోదా ॥పగలే॥ (పూజాఫలం) ఇది అచ్చమైన భావగీతం. సి.నా.రె. పేరు చెప్పగానే గుర్తొచ్చే పాట. సినీకవిగా సి.నా.రెకి గుర్తింపు తెచ్చిన పాట. ఈ పాటకు మీట 'కదలే ఊహలకే కన్నులుంటే' అనే పంక్తి. అది ముందుంటేనే పాట అర్థవంతంగా వుంటుందని వి.ఏ.కె. రంగారావు విమర్శనాస్త్రాలు నంధిస్తూ ఓ వ్యాసం రాసినట్టు, దానిమీద వాదోపవాదాలు జరిగినట్టు సి.నా.రె.యే తెలియజేశారు. నిజానికి 'కదలే వూహకు కనులుంటే..' అనే ప్రారంభంతోనే మొదటి పల్లవి రాసి, బి.యన్.రెడ్డి సూచన మీద సి.నా.రె. ఈ కొత్త పల్లవి రాశారట! 'పగలే వెన్నెల-జగమే వూయెల' అనే విలక్షణమైన ప్రారంభం శ్రోతల్ని ఆ కట్టుకొంది గనుకనే ఈ పాట శాశ్వతత్వాన్ని సంతరించుకొంది. ఈ ప్రాణం లాంటి పల్లవికి- చరణాల్లో సాంప్రదాయిక కవిసమయాలనే తీసు కొని ప్రకృతి గతమైన అనురాగాన్ని అనుబంధాన్ని అంద మైన పదబంధాలతో చెప్పి ముడి వేయడం ఈ పాటలోని విశిష్టత.

'తేనెజల్లు' 'కన్నెవాగు' 'నీలిమబ్బు' 'పూలబుతువు' మొదలైన హృద్యమైన పదప్రయోగాలు ఈ గీతాన్ని శ్రవణ పేయం చేశాయి. తోటలో నా రాజు తొంగిచూసెను నాడు- నీటిలో ఆ రాజు నీడ నవ్వెను నేడు (ఏకవీర) కథా నాయకుడు కుట్టాన్ సేతుపతిని (ఎన్.టి.ఆర్) తొలిసారి తోటలో చూసిన నాయిక మీనాక్షి (జమున) మలిసారి కొలను నీటిలో ప్రతిబింబ రూపంలో చూసి తన పారవశ్యాన్ని వ్యక్తం చేస్తే, పక్కనే పొంచి వున్న నాయకుడు తన మనసును విప్పడం ఈ గీత సన్నివేశం. బావ ప్రధానమైన ఈ గీతాన్ని కృష్ణశాస్త్రి రచనగా కొందరు భ్రమించారట! శైలీ మార్దవం మేరకు కృష్ణశాస్త్రి ధోరణి సి.నా.రె.లో వున్నా, ఈ పాటలో పదబంధాలు, అభివ్యక్తి సి.నా.రె. ముద్రను స్పష్టం చేస్తాయి.



BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సి.నా.రె సినిమా పాటలు - చమత్కార వైవిధ్యం

- డా॥. డి.ఉదయ కుమారి, అసోసియేట్ ప్రొఫెసర్, -కం-డిప్యూటీ డైరెక్టర్,
ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

సాహిత్య లోకంలో ప్రబంధ యుగం విశిష్టమైనదిగా గుర్తింవచ్చు. ప్రబంధమనగానే శృంగార రసం అంగిరసంగా ఉంటుందనేది అందరికీ కలిగే భావం. అలంకారికులు ప్రబంధానికి ఒక దిశానిర్దేశం చేశారు. ప్రబంధానికి కొన్ని లక్షణాలను ఆపాదించారు. ఆ లక్షణాలు పూర్తిగా కలిగి ఉన్నదే ప్రబంధమన్నారు. ఈ ప్రబంధ లక్షణాలు కొన్ని ప్రబంధాలలో పూర్తిగా కనిపించవచ్చు. వీటిలో పూర్తిగా కాకపోయినా కొన్ని కూడా కనిపించవచ్చు. ఈ లక్షణాలు ప్రకృష్టమైన బంధం కలది ప్రబంధం శృంగార రసం అంగి రసంగా ఉండాలి. తదితర రసాలు ప్రబంధాల్లో పోషింప బడాలి. స్వతంత్ర రచనై ఉండాలి. భాషాంతరీకరణం కాకూడదు. అందుకే నన్నెచోడుడు అష్టాదశ వర్ణనా లంకృతంబై తన కుమారసంభవం ఉందని ఘంటా పథంగా చెప్పగలిగాడు. వస్తైక్యం మరో ప్రబంధ లక్షణంగా చెప్పుకోవచ్చు. పై లక్షణాలను బట్టి మనకు ప్రబంధము ఈ పై లక్షణాలతో అలరారుతుందని మనం చెప్పుకోవచ్చు.

వీటిలో కృష్ణరాయల ఆస్థానమైన భువన విజయంలో (క్రీ.శ.1509-1530) అలరారిన అష్టదిగ్గజ కవుల్లో ప్రముఖు లైన కవులు రాజుతో కలిపి కృష్ణదేవరాయులు, అల్లసాని పెద్దన, నంది తిమ్మన, తెనాలి రామకృష్ణుడు, పింగళి సూరన, రామరాజ భూషణుడు. వీరు రచించిన ప్రబం ధాలు అత్యుత్తమై అలరారినవి. తెలుగు సాహిత్యంలో నన్నెచోడుని కుమార సంభవం ప్రథమాంధ్ర ప్రబంధమని కొందరు ఒప్పుకున్నా మరికొందరు ఒప్పుకోకపోయినా కుమార సంభవంలోని లక్షణాలను బట్టి ప్రబంధమనే కొంతమంది పండితులు అంగీకరించారు. ఈ కుమార సంభవ ప్రబంధంలో వస్తైక్యం ఉన్నదని ప్రబంధో చితమైన వర్ణనలు చేయబడినవి అష్టాదశ వర్ణనాలం కృతమై ఉన్నదని నన్నెచోడుడు చెప్పుకోవడం జరిగింది. కాని ఇక్కడ నాయికా నాయకులు పార్వతీ, పరమేశ్వర్లు, వారి శృంగార కేళఙ పారలౌకికమైనది కానీ లౌకికమైనది గాదు. కాని ప్రబంధానికి కావలసిన లక్షణాలన్నీ మనకు ఇందులో కనిపిస్తాయి. ఈ ప్రబంధంపైన వచ్చిన వాగ్వి వాదాలను పక్కన పెడితే ఒక చక్కటి అలంకార యుతమైన, వర్ణనాయుతమైన కథాసంవిధానం ఇందులో కనిపిస్తుంది. ఇక శ్రీనాథ శృంగారనైషధ కావ్యంలో కూడా ప్రబంధోచితమైన వర్ణనలు అద్భుతంగా దర్శనమిస్తాయి. సాహితీ లోకంలో చిరస్థాయిగా నిలబడగలిగిన సీసపద్యం ఈ కావ్యంలో మనకు దర్శనమిస్తుంది. సీసపద్యగతి స్రగ్ధర, మహాస్రగ్ధర లాంటివి బహుగంభీరంగా దర్శన మిసాయి కావ్యంలో. శృంగార నైషధ కావ్యం ప్రబంధ పోకడలను సంతరించుకున్న మహాకావ్యం. ఈ నైషధ కావ్యాన్ని సంస్కృతంలో రచించిన శ్రీహర్షుణి సాహిత్య లోకం ఎన్నటికీ మరువలేనిది. మూలకథను కొంత మార్చి కొంత చేర్చి సముచితమైనవి అనుకున్నవి కూర్చి అందుకే నైషధాకావ్యం కల్మషంలేని మహాకావ్యమని మనం ఈనాటికీ చెప్పుకుంటున్నాం. తనివితీరా ఆ మహాకావ్యం లోని అందాన్ని ఆస్వాదిస్తున్నాం. ఈ నైషధ కావ్యంలోని నాయకుడు నలుడు పవిత్ర వర్తనుడు ఆయన పవిత్రతను గంగానదితో పోల్చదగిన పవిత్రత, "నిర్మల నిజ కథా నిమిష కల్లోలినీ క్లాళితాఖిల జగత కల్మషుండు" అని నలుని పవిత్రత చెప్పబడింది. మహా కావ్య పరం పరలో నైషధం మహోత్కృష్టమై అలరారినది.

కృష్ణదేవరాయల కాలానికి వచ్చేసరికి రాజే ప్రబంధాన్ని రచించడం ఇక్కడ ప్రత్యేకత. ఆముక్తమాల్యద గోదాదేవి

శ్రీరంగనాథుల అద్భుతమైన కథ. దీనికే విష్ణుచిత్తీయం అనే పేరు కూడా ఏర్పడింది. కానీ ఆముక్తమాల్యదలో విష్ణుచిత్తుడు నాయకుడు కాదు. గోదాదేవి శ్రీ రంగ నాథుల వివాహం ప్రధాన కథగా మనకు కన్పిస్తుంది. తాను కొప్పులో ధరించిన మాలికను శ్రీరంగనాథునికి సమర్పించడమే ఇందులోని కథ. అందుకే ఈ ప్రబంధానికి ఆముక్తమాల్యదనే పేరు వచ్చింది. నాయిక పేరుతో వెలిసినటువంటి మొట్టమొదటి ప్రాచీనాంధ్ర గ్రంథం ఆముక్తమాల్యద. రసోత్కృష్టమైన మహా ప్రబంధంగా దీనిని పేర్కొనవచ్చు. ఇందులో ఉపాఖ్యానాలన్నీ ప్రధాన కథ యైన గోదాదేవి శ్రీ రంగనాథుల వివాహంలో అద్భుత మైనవి కనుక ఆముక్తమాల్యద చక్కటి వస్తైక్యాన్ని కలిగి ఉన్నదని భావించవచ్చు. ఇక్కడ అన్నీ ప్రబంధాలలో లాగే లౌకిక శృంగారం కాక జగజ్జననీ అయిన లక్ష్మీ అవతారమైన గోదాదేవి శ్రీరంగనాథుల పారలౌకిక శృంగారం వర్ణిత మైనది. ఈ ప్రబంధంలో వైష్ణవ మతం పారమ్యములైన ఉపాఖ్యానాలు ఉన్నాయి. ఈ విధంగా పురాణ కథలను స్వీకరించి కథానుగుణంగా మార్పులు చేసి ఈ ప్రబంధాన్ని కృష్ణరాయలవారు వినిర్మించారు. గోదాదేవి సౌందర్యాన్ని 30 పద్యాలలో వర్ణించాడు.

ఆముక్తమాల్యదలో అంగికరసం శృంగారమే. ఇతర రసములైన వీరరసము, ధర్మవీరము, దయావీరము, యుద్ధవీరము, అద్భుతరసము, శాంతరసము ఇవన్నీ కూడా శృంగార రసానికి పరిపోషకమైనవి. కానీ అలౌకిక శృంగారం మిళితమై ఉన్నది గనుక ఇందులో మధుర భక్తి శృంగారం మనకు కనిపిస్తుంది. ఈ విదంగా వైష్ణవ సంప్రదాయినికి కూడా ఈ ప్రబంధంలో పెద్దపీఠ వేయడం జరిగింది. విష్ణుచిత్తుని పేరే వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి ఉందని మనం చెప్పుకోవచ్చు. ఈ ప్రబంధం లోని చతమ్కృతి, సంవిధానం చాతుర్యం, పాండిత్య పటిమ, వర్ణనలు, అలంకారిక శైలి మొదలైన ప్రబంధ లక్షణాలు ఆముక్తమాల్యదకు ఒక విశిష్టస్థానాన్నిచ్చి గౌరవించింది.

కృష్ణరాయల ఆస్థానంలో క్రీ.శ.1470-1540 కాలంలో అష్టదిగ్గజ కవులలో అగ్రగణ్యుడుగా పేరుపొందిన అల్లసాని పెద్దన మనుచరిత్ర అనే మహాప్రబంధాన్ని రచించాడు. దీనినే మనం మనుచరిత్రము, స్వారోచిష మనుచరిత్రము, స్వారోచిష మనుసంభవం అని మూడు పేర్లతో వ్యవహరిస్తున్నాం. ఇది 6 ఆశ్వాసాల ప్రబంధం. ఇందులో వస్తైక్యం లేదని కొందరనప్పటికీ స్వరోచి జననం, జన్మసంస్కారాలు, వరూధుని వృత్తాంతం, స్వరోజి చరిత్రం అనేవి రససముచితాలుగా స్వయం సంపూర్ణములగా ఉండే రెండు కథలను కలిపి ఒకే సూత్రంలో బంధించడంలో పెద్దనగారి నేర్పు గణనీయ మైనది. ఇందలి కథ విచిత్రమైన పాత్రల కలయికతో మనకు కన్పిస్తుంది. మాయాప్రవరుడు, వరూధినికి జన్మించినవాడు స్వరోచి, స్వరోచికి జింకరూపంలో ఉన్న వసదేవతకు కలిగినవాడే మనువు. ఇతనినే స్వారోచిష మనువు అని పిలవబడం జరిగింది. మను సంభవమునకు ప్రవరుని చరిత్ర విత్తనం. ఇక్కడ మనకు కథా సంవిధానంలో పెద్దన కవితా గుణమైన అల్లకజిగిబికి కన్పి స్తుంది. ఇక ప్రవరుని వర్ణించిన తీరు అతని ధర్మదీక్ష చక్కగా వర్ణించాడు. ప్రవరుని వైరాగ్య రీతి. ఈ విధంగా వ్యక్తమైంది.

"వాని చక్కదనము వైరాగ్యమునజేసి కాంక్షసేయు
జారకామినులకు భోగభాహ్యమయ్యె"

అలాగే వరూధుని పాత్రకూడా చక్కని భావకుల మనోనేత్రములకు సజీవ సృష్టి వరూధిని. వరూధిని వలపు ఆమె ఎరిగిన లోకంలో ఆమెకది జన్మసాఫల్యం. కాని ప్రవరుడు పెరిగిన మానవలోకంలో చాలా హేయమైన చర్య. ప్రవరుని పాత్ర ధర్మ వీరమునకు ప్రతిబంధం. పెద్దన ఆత్మీయతా ముద్ర ఇందులో మనకు గోచరిస్తుంది. అలాగే ఇందులో శృంగార రసం ప్రధానరసమై అడు గడుగునా చిప్పిల్లుతూ ఉంటుంది. ప్రవరునిలో శాంతము. వరూధునిలో శృంగారము అక్కడక్కడ ఇతర రసములు శాంతరసము, ధర్మవీరము, ఇవన్నీ ఈ

ప్రబంధంలో చూడవచ్చు. వీర భయానకములు కూడా ఇందు కనిపిస్తాయి. అద్భుత రసము కూడా మను చరిత్రలో కనిపిస్తుంది. ధర్మవీరము కూడా ఇంఉదలో ప్రధానంగా పరిఢవిల్లింది. ఇదొక్క పద్యం చాలు ఆయన కవితాగుణాన్ని చెప్పడానికి -

''అటజని కాంచె భూమిసురుడంబర చుంబి శిరస్సరజ్ఝరీ
పటల మహోర్మిహర్ల్లదభంగ తరంగ హృదంగా నిస్వన

(మనుచరిత్ర, 2-3)

అలాగే వరూధుని చలత్సౌందర్య చిత్రణ మను చరిత్రలోని రెండవ ఆశ్వాసంలో 29-30 పద్యంలో చెప్ప బడింది. ఇందులోని రచనా శిల్పం, శబ్ద సంధానం, భావ గాంభీర్యం కూర్చిన సమ్మేళనం అల్లసాని అల్లికజిగిబిగి అల్లసాని కవితాగుణానికి సాధ్యం.

అలాగే పారిజాతాపహరణం ప్రబంధాన్ని నందితిమ్మన 5 ఆశ్వాసముల శృంగార ప్రబంధంగా తీర్చిదిద్ది రాయల వారికి అంకితమిచ్చారు. ఇందులోని కథ. కృష్ణరాయల ధర్మపత్ని అయిన తిరుమలదేవికి మధ్య కలిగిన చిన్నపాటి పొరపొచ్చాన్ని తీర్చడానికి ఈ ప్రబంధాన్ని తిమ్మన రచించాడని భావించారు. ఇందులో రుక్మిణి, సత్య భామల మధ్య చిటపటలు అతిరమ్యంగా ఈయన చిత్రించాడు. ఇందులోని పాత్రచిత్రణ అద్భుతమైన నాటకీయ దృక్పథానికి మార్గంగా తోస్తుంది. పారిజాతాపహరణంలోని పద్యాన్నిక్కడ చూడవచ్చు.

''అనవిని వ్రేటు పడ్డ యురగాంగనయుంబలె నేయివోయ భ
గ్గన దరికొన్న భీషణ హుతాశన కీలయనంగ లేచి హె

(పారిజాతాపహరణము, (1-82)

మనం ఈ కథను ప్రబంధాకారంలో ఉన్న నాటకంగానే పరిగనించవచ్చు. ఇందులోని ప్రతి పద్యం కనులముందు సాక్షాత్కరిస్తుంది. కథా గుణాలు కథా సంవిధానం, కథా గుణములైన పంచసంధులు అమరి ఉన్నాయి. మనకు నాటక లక్షణాలు ఇందులో కనిపిస్తాయి. ఈ ప్రబంధంలో ప్రధాన రసంగా శృంగార రసం కనిపిస్తుంది. వీరరౌద్ర భయానక భీభత్స రసములు అంగరసములై ఉన్నవి. శాంతరసం, అద్భుతం కూడా ఉన్నది. కాని అన్నింటికంటే ఎక్కువగా శృంగారరసం పరిపోషితమైనవి. పారిజాతాప మరణమంతట నాటకీయత గోచరిస్తుంది. పాత్రోచితమైన సంభాషణలు, సహజ సుందరమైన పాత్రచిత్రణ నాటకంలో ఉన్న రీతులు, ప్రకృతి వర్ణనలు, నాయికా నాయికుల శృంగార వర్ణనలు, వస్తువర్ణనలు, ఇవన్నీ కూడా మనోజ్ఞాలంకార లలితములై మృదు మధుర లలితమని చెప్పదగిన గునములతో అలరారుతున్నది. ఈయన రచనా శిల్పం రమ్యమైనది.

ఈ విధంగానే పాండురంగమహాత్మ్యం, పింగళి సూరన కళాపూర్ణోదయం, రామరాజభూషణుని వసుచిత్ర మహా ప్రబంధాలుగా తెలుగు సాహిత్యంలో తమకంటూ ఒక యుగాన్ని ఏర్పరుచుకొని అద్భుతమైన వర్ణనలతో సుస్పష్టమైన కథా సంవిధానంతో, వర్ణనా చాతుర్యంతో, కథాగతిలో విలక్షణతతో అద్భుతమైన లాలిత్యమైన పదాలతో నాటకీయాలతో శృంగార భూయిష్టమై తమకంటూ ఒక ప్రత్యేకతను ఆపాదించుకున్న ప్రబంధ రచనా రీతి సాహితీ లోకంలో సుస్పష్టమైన, సుగమమైన ఒక మార్గాన్ని సాహితీ ప్రియులకు చూపించింది.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి.నాగయ్య
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా.ద్వా.నా.శాస్త్రి

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వి.ఆర్.రాసాని 'శ్రీరామ నిర్యాణము' - వస్తు వైవిధ్యం

- ఎ. దశరథన్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

ప్రస్తావన :

ఆధునిక తెలుగు కవులలో తనకంటూ ఒక ప్రత్యేక మైన స్థానాన్ని సంపాదించుకున్నవారు డాక్టర్ వి.ఆర్.రాసానిగారు. వీరు రచయిత, కవి కథకుడు, విమర్శకుడు, వ్యాసకర్త, పరిశోధకుడు, సామ్యవాది, మానవతావాది, అధ్యాపకుడు, ఉపన్యాసకుడు, పరిశోధక మార్గదర్శి, నటుడు, నగర ప్రవాసి అయినా ఇప్పటికీ పల్లెమనిషే. బడుగుల పీడితుల పక్షపాతి, ప్రతినిధి స్వరం. అతడి మూలాలు, పల్లెజీవితం నుండి వేళ్లు ధన్నుకుని ఐదువేళ్ళు కలాన్ని గట్టిగా కౌగలించుకుని, హృదయపు గదుల్లో మెదడు పొరల్లో, మేధోమథనం జరిపి ఆలోచనల పొగల సెగలతో రచనలు వేలార్చాడు. అందుకే అవి చైతన్య జ్వాలలు. దగ్ధమవుతున్న, పడిపోతున్న, విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాలకు ప్రతిబింబాలు. ఈయన రచించిన నాటకాల్లోని పాత్రలు ఆయా సంబంధాల ప్రతీకలు. నాటకాల్లో వీరు చిత్రీకరించిన సంభాషణలు విల్లు విడిచిన బాణాలు, చూపులు - గుచ్చుకొనేవి, దూసుకుపోయేవి, గాయపరిచేవి, సేదదీర్చేవి. రాసాని కలం ఫ్యాక్టరీలా మూస ఉత్పత్తులు అందించే యంత్రం కాదు. పునరుత్పత్తి జరిపే ఏ ప్రాణి అయినా పడే సంవేదనతోను, ప్రసవ వేదనతో సమానమైన వేదనతోను సృజనకారుడిగా రచనలు ఆవిష్కరిస్తాడు. విషయ వైవిధ్యం రాసాని రచనల జీవనాడి. తెలిసిన జీవితంలోకి చాపకింద నీరులా పరుచుకుంటాడు. తెలియని రహస్య గదుల్లోకి చొరబడి పాళీపాల నేత్రంతో పరికిస్తాడు. విచికిత్సకు గురౌతాడు. చికిత్స చేసే సామాజిక వైద్యుడవుతాడు. అందుకే వర్తమాన సీమ ప్రతిభావంతుల్లో ముందు పంక్తిలో నిలబడగలిగాడు. అయినా ఏ భేషజాలు కనబరచక నిశ్శబ్ద సైనికుడిలా ముందు వరుసనుండే యుద్ధం చేస్తాడు. అసహాయశూరుడిలా, చీకటి లోకాలకు వెలుగు సూర్యుడిలా రచనాకాంతులు వెదజల్లుతాడు. రాసాని కలం నుండి జాలువారిన నాటకాల్లో 'శ్రీరామనిర్యాణము' అనే మంచి పౌరాణిక నాటకాన్ని రచించి సమాజానికి ధర్మప్రబోధం చేశాడు. ఈ 'శ్రీరామనిర్యాణము' నాటకంలోని వస్తువైవిధ్యాన్ని పరిశీలించడమే ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశం.

నాటక సమాజాల ఆవిర్భావంతోనూ, ప్రదర్శనల తోనూ విభిన్న దృక్పథాలతో కూడిన నాటకాలు వెలిశాయి. అందులోనూ పౌరాణిక, చారిత్రకాలు, సాంఘికాలు చెప్పుకోదగ్గవి. అయితే ఈ నాటక సమాజాలవారు పౌరాణిక, నాటకాల పట్లనే ఎక్కువ ఆసక్తి కనబరచారు. ప్రధానంగా ఈ సమాజాలు ప్రదర్శించిన నాటకాలు పౌరాణిక నాటకాలు. ప్రతి సమాజానికి నియత కవులుండేవారు. వారు అన్ని రకాల నాటకాలూ రాసేవారు. కానీ ప్రాముఖ్యం వహించినవి పౌరాణిక నాటకాలే. పౌరాణిక నాటకాల్ని రచించిన వాళ్లలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, వీరేశలింగం పంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహారావు, బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, తిరుపతి వేంకటకవులు, విశ్వనాథ సత్యనారాయణ పేర్కొనదగ్గ వారు. వీరి కోవకే చెందుతాడు డాక్టర్ వి.ఆర్.రాసానిగారు.

ఈ పౌరాణిక నాటకకర్తలు సాధారణంగా తమ నాటకాలకు ఇతివృత్తాన్ని రామాయణ, భారత, భాగవతాది గ్రంథాల నుంచి గ్రహించారు. వీరు రచించిన పౌరాణిక నాటకాల్లో సాధారణంగా ఒకే లక్షణం అంతర్నిహితంగా గోచరిస్తుంది. ఆయా పురాణాల ఆదర్శవాక్యాలు, ధర్మప్రవచనాలు, నీతిసూత్రాలు నిజంగా విశ్వసించారు నాటకకర్తలు. తాము విశ్వసించడమే గాదు, ప్రజలంతా

విశ్వసించాలనీ, పౌరాణిక ధర్మాలు శిరోధ్యాలనీ, మరి గత్యంతరం లేదనీ ప్రబోధించారు. పురాణాల్లో చెప్ప బడింది ఒప్పయినా, తప్పయినా ఒప్పుకోవాలనే దృష్టి తప్ప మరి విమర్శించాలన్న భావం వీరెవ్వరికీ తట్టలేదు. రాముడంటే దేవుడే. కృష్ణుడంటే పరమాత్మ పాండవులు చేసిన ప్రతిపనీ ధర్మమే. అంతే. ఇదీ మన పౌరాణిక నాటకాల తత్వ ప్రతిపాదన.

శ్రీరామనిర్యాణము :

శ్రీకృష్ణాష్టమి నాడు శ్రీకృష్ణుడి లీలలు పాడుకుంటాం. వినాయక చవితికి గణపతి మాహాత్మ్యాన్ని చదువుకుంటాం. శ్రీరామనవమి రోజు మాత్రం రాముడి వ్యక్తిత్వాన్ని గుర్తు చేసుకుంటాం. పితృవాక్య పరిపాలననూ, ఏకపత్నీవ్రతాన్నీ, రాజ్యపాలననూ తన్మయంగా తలచుకుంటాం. యుగాలు గడిచినా, తరాలు మారినా, జనం దృష్టిలో పాలకుడంటే రాముడే, రాజ్యమంటే రామరాజ్యమే. చైత్రశు ద్ధనవమి....సీతారామకల్యాణ మహోత్సవం. ఆకాశం ఏ పెద్ద చలువపందిరి అవుతుంది. భూలోకమంతా కల్యాణమండపంలా వెలిగిపోతుంది. సిగ్గులమొగ్గ సీతమ్మ మెడలో... సకలగుణాభిరాముడు శ్రీరాముడు మూడు మూళ్లూ వేస్తాడు. మంగళవాద్యాలు మిన్నంటుతాయి. అక్షంతలు ముత్తెపుచినుకులవుతాయి. ఎవరినోట విన్నా రామారామా అంటూ రామకథాగానమే. అందులోనూ తెలుగువారికి సీతారాములంటే జననీజనకులంత భక్తీ, గౌరవమూ, 'సీతమ్మ మాయమ్మ, రామయ్య మా అయ్య' అని పాడుకోగలిగినంత దగ్గరితనమూ, 'ఎవడబ్బ సొమ్మని కులుకుతూ తిరిగేవు రామచంద్రా' అంటూ నిందాస్తుతి వినిపించేంత చనువూ! రామనవమి నాటికి, భద్రగిరి మరో అయోధ్యపురిగా మారిపోతుంది. ఎక్కడెక్కడి జనమో తరలివస్తారు. ఎప్పుడో త్రేతాయుగం నాటి రాముని కథే అయినా ఈనాటికీ చెప్పుకుంటాం. పాడుకుంటాం, పరవశంగా నెమరేసుకుంటాం. రాముడంటే పైపైకి కనిపించే ఆజానుబాహుడో, అరవింద దళాయతాక్షుడో మాత్రమే కాదు. నిలువెత్తు ధర్మ స్వరూపం. 'రామా యణం' అంటే రాముడు నడిచిన దారి. రాముడి ప్రతి అడుగూ ధర్మంవైపే, రాముడి ప్రతిమాటా ధర్మశాస్త్రాల సారమే. అందుకే పెద్దలు... కష్టాలు వచ్చినపుడు రాముణ్ణి తలచుకోమంటారు. తలచుకోగానే ఏ హనుమద్వాహనం మీదో వచ్చి రక్షిస్తాడని కాదు. అయన నడచిన మార్గం గుర్తుకువస్తుందని, ఆ బాటలోనే మనమూ ధైర్యంగా వెళ్తామని... 'రమంతే అస్మిన్ ఇతిరామ:' రాముడంటే ఆనందాన్ని ఇచ్చేవాడు భర్తగా సీతకు ఆనందాన్నిచ్చాడు. కొడుకుగా దశరథుడికి ఆనందాన్నిచ్చాడు. సమర్థ పాలకుడిగా ప్రజలకు ఆనందాన్ని ఇచ్చాడు. అధికారాన్ని అనుభవిస్తూ రాజ్యాన్ని పాలిస్తూ సంసార జీవితాన్ని ఆస్వాదిస్తూ కూడా ఓ రుషిలా బతకొచ్చని రాముడు నిరూపించాడు. "విద్ధిమాం రుషిభి: తుల్యం; కేవల ధర్మ మాస్థితం" ఋషిలానే నేను ధర్మాచరణకు కట్టుబడి ఉన్నానని ప్రకటించాడు ఒక సందర్భంలో.

శ్రీరాముడు జగజ్జేత ఎందుకయ్యాడు? చేతిలోని కోదండంవల్లా, శక్తివంతమైన రామబాణంవల్లా, అశ్వమేధ యాగాన్ని చేయడంవల్లా, వానరసేన వెన్నంటి ఉండడం వల్లా? అవేవీ కారణం కాదంటాడు వాల్మీకిమహర్షి. 'సత్యేన లోకాన్ జయతి' సత్యాన్ని నమ్ముకోవడం వల్లే రాముడు ప్రపంచాన్ని జయించాడు అని దశరథుడితో చెప్పించాడు. హనుమంతుడు రాంబంటుగా మారింది కూడా, రాముడి బలాన్ని చూసో బలగాన్ని చూసో కాదు. 'గుణై: దాస్యముపాగత:' నేను శ్రీరాముడి గుణాల్ని చూసే దాసుడిగా మారాను అంటాడు మారుతి.

సత్యాన్ని నమ్ముకుంటే అదే ఆయుధమై కాపాడు తుంది. అదే అనంత, అనుచరగణమై అండగా నిలు స్తుంది. అదే సోపానమై విజయాలవైపు నడిపిస్తుంది. జన్మకో సార్థకతనిస్తుంది. రాముడి జీవితమే అందుకు సాక్ష్యం.

ఆ ధర్మమూర్తినీ, అతని ధర్మాచరణనూ మరొకసారి ఈతరం పాఠకులకు గుర్తు చేసిన నాటకం వి.ఆర్.రాసాని గారు రచించిన 'శ్రీరామనిర్యాణము'. నాలుగు

దృశ్యాలుగా విస్తరించిన నాటకమిది. రాముడి దీన వదనంతో మొదటి దృశ్యం ప్రారంభమౌతుంది. సీత మహా సాధ్వి. భూగర్భంలోకి వెళ్లిపోవడమే రాముడి వేదనకు ప్రథమకారణం, ప్రధానహేతువు. లక్ష్మణుడు, సుమంతుడు, హనుమంతుడు ఈ విషయంగా చాలా మధనపడుతుంటే రాముడే ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, ఒక బ్రాహ్మణోత్తముడు రాచనగరుకు వస్తున్నాడని, అతణ్ణి తీసుకురమ్మని హనుమను నియోగిస్తాడు. లక్ష్మణుని చేరబిలిచి, ''ఇక విపత్తులు రాబోతున్నాయని, గుండె దిటవు చేసుకోవాలని''(శ్రీరామనిర్యాణము,పుట.1) చెప్పాడు. కానీ లక్ష్మణుడు ఆ మాటను చాలా తేలికగా తీసుకుంటూ, కొండంత అండ శ్రీరామభద్రుడుండగా విపత్తులేమిటని అభిప్రాయపడుతాడు.

కానీ రాముడు లక్ష్మణుణ్ణి అనునయిస్తూ భరత పట్టాభిషేకానికి ఏర్పాట్లు చేయమంటాడు. భరతుడు ఇందుకు నసేమిరా ఒప్పుకోడు. తనకు మారుగా లక్ష్మణుణ్ణి రాజుగా ప్రకటించమంటాడు. లక్ష్మణుడు కూడా పట్టాభిషేకం తనకు మారుగా శత్రుఘ్నునికి చేయ మంటాడు. శత్రుఘ్నుడు లక్ష్మణుని అభిప్రాయంతో విభే దించి, రాజనీతి ప్రకారం సాధారణంగా వంశంలో పెద్దవాడే రాజుగానీ చిన్నవాళ్లు కాదనీ, అతని తర్వాత అతని సంతతి రాజ్యార్హులవుతారని చెప్పాడు.

దీంతో ఏకీభవించిన లక్ష్మణుడు, కుశలవులను అయోధ్యానగర ప్రభువులను చేయాలని చెప్పాడు. భరతుడూ లక్ష్మణుని మాటనే బలపరచాడు. రాముడు కూడా సోదరుల మాటను విని మంత్రి సుమంతుని సలహా కోరాడు. సుమంతుడు కూడా రామానుజుల మాట లకు తన హర్షాన్ని తెలియజేశాడు.

ఇంతలో హనుమంతుడు ఆ బ్రాహ్మణుణ్ణి వెంట బెట్టుకుని సమావేశ మందిరంలోకి వచ్చాడు. రాముడు వచ్చిన బ్రాహ్మణోత్తమునికి లేచి స్వాగతం పలికాడు. లక్ష్మణుడినుద్దేశించి తనకూ, ఆ బ్రాహ్మణుడికి ఆంత రంగిక గృహంలో ఏకాంత సమావేశం ఏర్పాటు చేయ మన్నాడు. ఆ ఏకాంత సమావేశానికి అంతరాయం కలి గించకూడదని, అలా కలిగించినవారు కఠినశిక్షకు గురి కావాల్సివస్తుందని హెచ్చరించాడు.

ఈ సంభాషణ విన్న సుమంతుడి మనసు ఏదో కీడు శంకించింది. అదే విషయాన్ని లక్ష్మణుడికి కూడా చెప్పాడు. కానీ లక్ష్మణుడు మరేం ఫరవాలేదని, ఆ ఆంతరంగిక భవాన్ని తానే స్వయంగా కాపలా కాస్తానని చెప్పాడు. రాముడు, బ్రాహ్మణుడు తమ చర్చలు ఎంత సేపటికీ ముగించలేదు. లక్ష్మణుడికి నిరీక్షణలో వినుగు పుడుతోందని పదే పదే ఊర్మిళను గుర్తు చేసుకుంటు న్నాడు. మళ్లీ అంతలోనే నిరంతరం రామసేవలో, శ్రీరామ సాన్నిధ్యంలోనే ఆనందాన్ని అమరత్వాన్ని చవిచూసే తన మనసెందుకో ఈ రోజు విసుగు కలిగించి కీడు శంకిస్తోం దని ఆలోచిస్తాడు.

ఇంతలో దుర్వాసమహర్షి రాజప్రసాదానికి వచ్చాడు. ఎన్నడూ రాని దుర్వాసమహర్షి ఈ రోజు అంత హఠాత్తుగా రావడంలో ఆంతర్యమేమిటో లక్ష్మణునికి అంతు బట్టలేదు. శ్రీరామునితో కొన్ని ధార్మిక విషయాల్ని చర్చించాలని, ఒక యజ్ఞం చేయడానికి ఏర్పాట్లు చేయించుకోవడానికి వచ్చానని దుర్వాసమహర్షి చెప్పాడు. లక్ష్మణుడు శ్రీరామచంద్రుడు ఆంతరంగిక వ్యవహారాల్లో ఉన్నాడని, కాసేపు ఆగిమని చెప్పాడు. ఈ సమాధానానికి సంతృప్తిపడని దుర్వాసుడు ఆగ్రహించాడు. తనకు అట్టే వ్యవధి లేదు గనుక ఆ క్షణంలోనే ఆయనను కలవాలని పట్టుపట్టాడు ఆ మహర్షి. అయినా సౌమిత్రి లోపలికి పంపడానికి వీల్లేదని చెప్పడంతో అతణ్ణి శపించ బూనుకున్నాడు. లక్ష్మణుడు వేరే గత్యంతరం లేక మహర్షికి దారి వదిలాడు. దీంతో మొదటి దృశ్యం పూర్తయింది.

రామాజ్ఞను ఉల్లంఘించిన లక్ష్మణుడు ముద్దాయిగా నిండుసభలో నిలబడి ఉండగా రెండో దృశ్యం ప్రారంభ మౌతుంది.

రాజధిక్కారానికి దోషికి మరణదండన శిక్షగా సుమంతుడు చెప్పాడు. రాముడు కూడా దాన్ని

బలపరుస్తూ శిక్షను అమలుచేయమన్నాడు. సుమంతుడు మరొకసారి ఆలోచించమని రాముని చెప్పినా రాముడు ససేమిరా కాదన్నాడు. వేసిన దండన మార్చినా, రద్దు చేసినా రామరాజ్యంలోని ప్రజలు హర్షించరని, ప్రజలకు ఒక న్యాయం, ప్రభువులకు ఒక న్యాయం ఉండవని స్పష్టం చేశాడు. హనుమంతుడు కూడా లక్ష్మణుణ్ణి శిక్షించడం సబబు కాదన్నాడు. రాముడు తనది ఒకే మాట, ఒకే బాణం, ఒకే భార్య అన్న సిద్ధాంతమని గుర్తు చేశాడు.

భరతుడు సీతామాత ఉంటే ఈ అనర్థం జరిగేది కాదని వాపోతాడు. రాముడు సీతను తలచుకుని నిర్వేదంలో పడతాడు. కానీ లక్ష్మణుడు కలుగజేసుకుని తనకు దుర్వాసముని శాపంకంటే రామశాసనానికి విధేయుడుగా ఉండడమే మేలని, తాను రాజశాసనానికి బద్ధుడననీ తెలియజేస్తాడు. సుమంతుడు మళ్లీ కలుగజేసుకుని మరణదండన, దేశాంతరశిక్ష రెండూ ఒకటేనని న్యాయ శాస్త్రం చెబుతుందని, అంచేత లక్ష్మణునికి మరణదండన బదులు దేశాంతర శిక్ష విధించడం మంచిదని సూచన చేశాడు. శత్రుఘ్నుడు కూడా సుమంతుని మాట ఆలకించ మని రాముణ్ణి వేడుకుంటాడు.

రాముడు కూడా కాస్త మెత్తబడి, లక్ష్మణుణ్ణి ఆ రాత్రి రాజమందిరంలో గడిపి, సూర్యోదయం లోపల దేశ సరిహద్దులు దాటమని ఆజ్ఞాపించాడు. సభ ముగిసాక రాముడు సింహాసనం మీద దీనంగా కూర్చుని ఉంటాడు. లక్ష్మణుడు శ్రీరాముణ్ణి సమీపించి తనను కడసారిగా దీవించమంటాడు. రాముడు అతణ్ణి భుజాలు పట్టుకుని పైకి లేపి రాజుకు తన, మన అనే బంధాలు ఉండవని, న్యాయబద్ధుడే రాజని, తనను క్షమించమని అంటాడు. లక్ష్మణుడు ఏడుస్తున్న రాముణ్ణి ఓదార్చుతూ పాలితుల గురించి పాలకులు ఎప్పుడూ విలపించకూడదని, అన్న గారి కళ్లల్లో కన్నీళ్లు తాను చూడలేనని చెప్పాడు. ఆ మాట గొంతు అంటోందే గానీ లక్ష్మణుని హృదయం అనలేదు. అందుకే అతను శోకసముద్రంలా ఉప్పొంగాడు.

అప్పుడు రాముడు తన అవతార రహస్యం లక్ష్మణునికి చెప్పాడు. లోకకంటకుడైన దశకంఠుణ్ణి సంహరించడానికి తాను శ్రీరామావతారం దాల్చల్సివచ్చిందని, రావణ సంహారంతో అవతార పరిసమాప్తి కావొచ్చిందని, బాధపడ వద్దని కీలక రహస్యం చెప్పాడు రాముడు.

ఈ యుగంలో తనకు తమ్ముడిగా పుట్టి ఎనలేని సేవలు చేసిన లక్ష్మణునికి రాబోయే యుగంలో తమ్ముడిగా పుట్టి సేవలందిస్తానని రాముడు అభయ మిచ్చాడు. ఈ మాటలతో ఊరడిల్లిన లక్ష్మణుడు సంతోషంతో శ్రీరాముడి నుండి వీడ్కోలు తీసుకుని వెళ్లి పోవడంతో రెండో దృశ్యం పూర్తవుతుంది.

మూడవ దృశ్యం యమసభతో ప్రారంభమౌతుంది. యముడు వికటాట్టహాసం చేస్తూ భూలోకంలో పుట్టిన ఏ జీవి అయినా అంతిమకాలంలో యమపాశానికి చిక్కాల్సిందేనని యమధర్మాల్ని ఏకరువు పెడతాడు.

ఆ యమధర్మాలననుసరించే శ్రీరాముణ్ణి, లక్ష్మణుణ్ణి విడదీసినట్టు చెబుతాడు. ఇక నిరంతరం శ్రీరామనామాన్ని హృదయంలో నిల్పుకున్న పరమభాగవతోత్తముడైన హనుమంతుణ్ణి కూడా రాముని నుండి విడదీస్తానని చెప్పి బ్రాహ్మణ వేషాన్ని ధరించి అయోధ్యను సమీపిస్తాడు.

సరిగా ఆ సమయంలోనే అయోధ్యాలో లవకుశుల పట్టాభిషేక మహోత్సవాలు జరుగుతున్నాయి. అంత:పురంలో పనిచేసే సింగడు తోటి పరిచారిక అయిన సింగితో పరాచికాలాడుతూ మాటల్లో మాటగా శ్రీరాముణ్ణి తులనాడుతాడు. పరాయివాడి పంచన ఉండివచ్చిన భార్యను తిరిగి ఏలుకున్నాడనీ ఎప్పటికైనా రాజ్యంలో భాగమడుగుతాడేమోననే దూరాలోచనతో లక్ష్మణుణ్ణి దేశాంతరం పంపేశాడని, రాముడు సుగుణాభిరాముడు కాడని మతిలేని మాటలంటాడు. భరత, శత్రుఘ్నులు, హనుమంత, సుమంతులు ఈ మాటలు విన్నారు. హను మంతుడు రామదూషణను సహించలేక ఆవేశంతో అతని ముందు నిలబడతాడు. అప్పుడు సింగడు హను మంతుడు తనను చంపేస్తాడనే భయంతో రాముని శరణు వేడాడు.

రాముడు హనుమంతుణ్ణి శాంతించమని చెప్పి, లోకం అనుకుంటున్న మాటల్నే వాడూ అన్నాడని చెప్పాడు. భరత, శత్రుఘ్నులు కూడా రామాజ్ఞతో నిష్క్రమిస్తారు. ఇంతలో బ్రాహ్మణవేషంలో యముడు శ్రీరామ మందిరం లోకి ప్రవేశిస్తాడు. రాముడు అతని రాకకు కారణ మడిగాడు. కుశలవుల పట్టాభిషేక మహోత్సవానికి వచ్చానని చెప్పాడు ఆ విప్రుడు. అంతేకాదు, తాను ఒక యజ్ఞం చెయ్యాలనుకుంటున్నానని, ఆ ధర్మ విషయాలు ఏకాంతంగా చర్చించడానికి వచ్చానని చెప్పాడు. రాముడు రహస్య మందిరానికి కాపలాగా హనుమనునియోగిం చాడు. కొంత సమయం గడిచింది. మళ్లీ వచ్చాడు దుర్వాసుడు. యజ్ఞార్థం రాముడిచ్చిన ధనం ఖర్చు అయి పోయిందని, మరికొంత ద్రవ్యం అపేక్షించి మళ్లీ రావాల్సి వచ్చిందని అనుకుంటూ రాముణ్ణి వెదుక్కుంటూ వచ్చాడు. ద్వారం దగ్గర రామభక్తి ధ్యాన సామ్రాజ్యంలో మునిగి ఇహాన్ని మరచిపోయిన హనుమంతుణ్ణి కది లించడం ఇష్టంలేక దుర్వాసుడు సరాసరి ఆ రహస్య మందిరం దగ్గరకే వచ్చేసాడు.

రాముడు, విప్రుడు చర్చలు ముగిస్తూ ఉన్న సమయంలో దుర్వాసుడు ప్రత్యక్షమయ్యాడు. రాముడు "హనుమా! అంజనాపుత్ర!" అని గట్టిగా అరిచాడు. రాముడి గొంతు విని హనుమ ఇహలోకంలోకి వచ్చాడు. తను ధ్యానంలో ఉన్నప్పుడు జరిగిపోయిన తప్పును గ్రహించాడు. మన్నించమని ప్రాధేయపడ్డాడు. కానీ రాముడు "వాయుతనయా! నిన్ను మన్నిస్తే తమ్ముణ్ణి శిక్షించి, భక్తుణ్ణి రక్షించిన భక్తజనపక్షపాతి అనో, మరి ఏ ఇతర రాజకీయ కుట్ర అనో లోకం దుమ్మెత్తి పోస్తుంది." (శ్రీరామనిర్యాణము, పుట.15) కాబట్టి శిక్ష అనుభ వించాల్సిందేనని కరాఖండిగా చెప్పాడు. హనుమంతుడు పరిపరివిధాల ప్రాధేయపడ్డాడు. అప్పుడు రాముడు అతనికి జ్ఞానబోధ చేశాడు. ద్వాపరయుగంలో రాబోవు కురుక్షేత్ర సంగ్రామంతో పార్థుడి రథానికి సారథిగా తానుం టానని, సర్వమానవాళి ఉపశ్రమనంకోసం భగవద్గీతను బోధిస్తానని రాముడు చెప్తాడు. అప్పుడు హనుమ ఆ గీతోపదేశాన్ని వినే భాగ్యం తనకు కూడా కలిగించమని అభ్యర్థిస్తాడు.

హనుమ అభ్యర్థనను మన్నించిన శ్రీరాముడు పార్థుడి పతాకానికి చిహ్నంగా ఉండేటట్లు అతణ్ణి అనుగ్రహిస్తాడు. హనుమంతుడు శ్రీరాముని దగ్గర సెలవు తీసుకుని తపోభూమికి వెళ్లిపోవడంతో మూడవ దృశ్యం ముగిసింది.

యమధర్మరాజు, దుర్వాసమహర్షుల సంభాషణతో నాలుగవ దృశ్యం ప్రారంభమౌతుంది. శ్రీరామ నిర్యాణా నికి, ఒక విధంగా దుర్వాసుడు కూడా బాధ్యుడేనని అతనికి తాను విప్రరూపంలో వచ్చిన సంగతి, ఆ రహస్య సంభాషణలు దుర్వాసుడి ద్వారా ఎలా భగ్నమయ్యాయో, తత్కారణంగా సౌమిత్రి, హనుమలు ఎలా దేశ బహిష్కృతు లయ్యారో వివరించాడు యమధర్మరాజు.

లవకుశులకు పట్టాభిషేకం జరిగిన తర్వాత రాముడు నారవస్త్రాలు ధరించి అరణ్యాలకు బయలుదేరాడు. ఆయనను సాగనంపడానికి భరత, శత్రుఘ్నులు కూడా వచ్చి సరయూనదీ తీరంలో విడిది చేశారు. ఒకనాటి ఉదయాన రాముడు సరయూనదిలో స్నానం చేస్తూ, హఠాత్తుగా నీటిలో మునిగిపోయాడు. అది చూచిన భరత, శత్రుఘ్నులు కూడా అన్నను రక్షించాలని ఆ నదిలోకి దూకారు. అంతే మళ్లీ వాళ్లు కూడా తిరిగి రాలేదు. అందరూ పవిత్రనిర్యాణం పొందారని యముడు తన కర్తవ్యాన్ని పూర్తి చేసిన వైనాన్ని దుర్వాసుడికి వివరించడంతో నాటకం ముగుస్తుంది.

ముగింపు :

వి.ఆర్.రాసాని నటుడు, దర్శకుడు, ప్రయోక్త నాటక రచయిత. తెలుగు నాటక రంగ చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిన నిర్దేశకుడు. తాను ఏమి రాసినా దానిలో తన ముద్రను చాటుకున్నారు. నాటక రచయితలై తెలుగు నాటక రంగం మీద మధ్య తరగతి జీవితంలో ఎదురయ్యే సమస్యలు అన్నింటికీ రంగస్థలం

మీద సజీవ రూపకల్పన చేసి నాటకంలో వాస్తవికతకు పరాకాష్ట చూపాడు. నేటి మానవుల్ని కలవరపెడుతున్న మతకల్లోలం, యుద్ధం, శాంతి సమస్యలకు పరిష్కార మార్గం చూపెట్టి సమాజంలో రచయిత బాధ్యత ఏమిటో స్పష్టం చేసిన రచయిత రాసాని. సమస్యలను ప్రధానంగా తీసుకుని సామాన్య మానవుడికి తాను నమ్మిన సామ్య వాద సిద్ధాంత పరిధిలో స్పష్టంగా అందిచగలిగారు డాక్టర్ వి.ఆర్.రాసానిగారు.

ఆధార గ్రంథాలు :

1. శ్రీరామనిర్యాణము (నాటకం) - రాసాని వెంకట్రామయ్య
2. తెలుగు నాటకవికాసం - పి.యస్.ఆర్.అప్పారావు, నాట్యమాల ప్రచురణులు, 23 డిసెంబరు 1967.
3. తెలంగాణ పోరాట నాటకాలు, నాటికలు - బి.యస్.కామేశ్వరి, 2-10-671, టీచర్స్ కాలనీ, వడ్డేపల్లి, హన్మకొండ, అక్టోబర్ 2001.
4. తెలుగు నాటకం - ఎస్.గంగప్ప, గుంటూరు, డిసెంబర్ 1985.
5. నూరేళ్ళ తెలుగు నాటక రంగం (వ్యాస సంకలనం) - ఎం.నాగభూషణ శర్మ, 1980.

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అన్వర్ ముస్లింవాద సాహిత్యం

– డా॥. వెల్దండి శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా. తెలంగాణ.

తెలుగు సాహిత్యానికి ముస్లింవాదం మరో ప్రపంచాన్ని చూపించింది. 1992 డిసెంబర్ 6 బాబ్రీమసీదు కూల్చి వేతతో దేశంలో ముస్లిం ప్రజలు సెన్సిటైజై ఈ దేశంలో తమ ఉనికేమిటో ఆలోచించడం మొదలుపెట్టారు. మేము కూడా ఈ దేశ మూలవాసులమేనని తమను దేశద్రోహులుగా, క్రిమినల్స్‌గా చూడడం తగదని ముస్లిమే తర సమాజానికి అర్థం చేయించడం ప్రారంభించారు. నిజానికి తెలుగు నేలలో ఎన్నో శతాబ్దాలుగా ముస్లింలు, హిందువులు కలిసిమెలసే జీవిస్తున్నారు. తెలంగాణలో అయితే హిందూ, ముస్లింల ఐక్యతను గంగా - జమున తెహజీబ్ అని కొనియాడారు. ఇబ్రహీం కులికుత్బ్‌ను తెలుగు కవులు 'మల్కీభరాముడు' అని కీర్తించారు. హబుల్ హసన్ తానీషా భద్రాద్రి శ్రీరాముని కళ్యాణానికి భాగ్యనగరం నుండి ముత్యాల తలంబ్రాలు తీసుకొని పోయేవాడు. 1908లో మూసీ నది పొంగిపొర్లి హైదరాబాద్ నగరంలో వరదలు వచ్చినపుడు అవి తగ్గుముఖం పట్టడానికి ఆనాటి నిజాం ప్రభువు జంధ్యం వేసుకొని మరీ యజ్ఞం చేయడం హిందూ, ముస్లింల అనుబంధానికి ప్రతీక. ఇప్పటికీ అనేక గ్రామాల్లో తావీజుల కోసం, పిల్లల జడుపు మంత్రాల కోసం, దువా చదివించడం కోసం ఎంతో మంది హిందువులు మసీదుల చుట్టు, ముల్లాల చుట్టు తిరగడం గమనిస్తాం. నెమలీకల వింజామరతో ఊదుపొగ వేస్తూ అల్లా ఆశీర్వాదాన్ని అందిస్తూ గ్రామ గ్రామాన తిరిగే ముస్లిం సోదరులెంతో మంది అడుగడుగున కనిపిస్తూనే ఉంటారు. ఇక పీరీల పండుగనైతే ముస్లిం కన్నా ఎక్కువ హిందువులే జరుపుకోవడం గమనిస్తాం. చాలా గ్రామాల్లో పీరీలను హిందూ యువకులే ఎత్తుకుంటారు.

ఖాదర్ మోహియొద్దీన్ 'పుట్టుమచ్చ' (1991) మొదలుకొని 'జీహాద్' (1997), 'జల్‌జలా' (1998) 'అజా' (2002), 'రజ్మియా' (2012), 'ముఖామీ' (2018) లాంటి సంకలనాల మీదుగా 'బ్లాక్ వాయిస్', 'ఆరోవర్ణం' (ఇక్బాల్ చంద్), 'ఫత్వా' (ఖాజా), 'థూ' (కరీముల్లా), 'ముఖౌటా' (హనీఫ్), 'నఖాబ్' (డా. షాజహాన) 'జగ్‌నేకీ రాత్' (స్కైబాబ), 'జఖ్మీ' (నస్రీన్‌ఖాన్) లాంటి కవితా సంపుటాలను ఆధారంగా చేసుకొని తెలుగులో ముస్లింవాదం చాలా బలంగా వేళ్లూనుకుంది. ఈ పునాది మీద నిలబడి ఎంతో మంది ముస్లిం కవులు, రచయితలు తమ మనో భావాల్ని వ్యక్తీకరిస్తూ, తమ అస్తిత్వాన్ని వెతుక్కుంటూ, తామెదుర్కుంటున్న వివక్షను ప్రశ్నిస్తూ, ముస్లిం మత ఛాందసాల్ని ఎండగడ్తూ, సాటి ముస్లిం సోదరులను మేల్కొల్పుతూ ఎంతో విలువైన సాహిత్యాన్ని వెలువరించారు. ఆ మార్గంలో మహమ్మద్ అన్వర్ పాషాది విభిన్నమైన గొంతు. రాను రాను దేశంలో హిందుత్వ శక్తులు బలపడుతున్న ప్రస్తుత ప్రత్యేక సందర్భంలో అన్వర్ ముస్లింవాద సాహిత్యం మరింత చర్చనీయాంశం అయింది.

నిరంతర చలనశీల రచయిత అయిన అన్వర్ కలం నుండి ఇప్పటిదాకా తలవంచని అరణ్యం, ముర్గీ, సవాల్, ఖుల్లంఖుల్లా అనే కవితా సంపుటాలు, బక్రీ కథల సంపుటి, జమీలాబాయి నవల జాలువారాయి. 1969 వరంగల్ అమర వీరులు, ఆత్మబలిదానాలు (2009-2011), అజా తెలంగాణ కవిత వెలువడ్డాయి. ఇవేగాక తెలుగు కవిత్వంలోనే బృహత్తరమైన 'నాయిన' కవితా సంకలనానికి అన్వర్ సంపాదకత్వం వహించారు. ఇంకా పలు పుస్తకాలకు ఇతరులతో కలిసి సంపాదకత్వం వహించారు.

కవిగా, కథకునిగా, నవలాకారునిగా, సంపాదకునిగా, ఉద్యమకారునిగా బహుముఖీన ప్రతిభను కనబరుస్తూ

సాగిపోతున్న అన్వర్ సాహిత్యంలో తెలంగాణ తనం, ముస్లింవాదం, ప్రగతిశీల భావం ఈ మూడూ పురులు పెనవేసుకుని ఉంటాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జరుగుతున్నన్నినాళ్లు ఆ ఉద్యమంతోపాటు ఉపనదిలా ప్రవహించి విస్తృతంగా తెలంగాణ ఉద్యమ కవిత్వాన్ని వెలువరించాడు. దీనితో పాటు అన్వర్ సాహిత్యం నిండా పరుచుకున్న ప్రగతిశీల భావాలు సమస్త సమాజాన్ని ఒక వినూత్న ఆలోచనా సముద్రంలో ముంచుతాయి. అన్వర్ సాహిత్యంలో తొంగిచూసిన తెలంగాణతనం, ప్రగతిశీల భావాల్ని కాసేపు పక్కకుపెట్టి అతని సాహిత్యంలో ప్రతిఫలించిన ముస్లింవాదాన్ని ఆవాహన చేసుకుందాం.

"కవిత్వం శరీరంలో రక్తనిష్ఠగా ప్రవహించేలా జీవితాన్ని కొనసాగించాలనే ఆవేశం నాది. ఇదే ఆశయం, ఆదర్శం బతుకు చివరికంటా కావాలని ఆశిస్తున్నాను" అని ప్రకటించుకున్న కవి అన్వర్. అందుకే "తెల్లకాగితమే కదా! ఇష్టమొచ్చింది, ఇష్టమొచ్చినట్లు రాసి దాన్ని ఖరాబు చేయకు. రాసిన అక్షరాన్ని కాగితం భరించేటట్లు చేయి" అంటాడు ఒకచోట. దీన్నిబట్టే తెలిసిపోతుంది అన్వర్ అక్షరం ఎంత విలువైందో. ఎంత బాధ్యతా యుతమైందో. ఇప్పుడు సోషల్ మీడియాలో రోజు కొన్ని వేల కవితలు ప్రచురితమవుతున్నాయి. వాటిల్లో సారమెంత. కాలపు జల్లెడలో మిగిలేవి ఎన్ని అనేది కోటి రూకల ప్రశ్న.

అన్వర్ శుద్ధమానవతావాది. ఒక నియ్యతి. ఒక పబ్బతి, ఒక అసమ్మతి. తాను ప్రకటించే ముస్లింవాదం కూడా ఈ సూత్రం మీదే నడుస్తుంది. అన్వర్ కవిత్వం నిండా అబ్బాజాన్‌ల కోసం వెతికే బేటీలు, పేదరికం నిండిన కుటుంబాలు, విధి వంచనకు గురై రోడ్డు మీద పూలమ్మే అక్బర్‌లు, ఆత్మగౌరవం కోసం పెనుగులాడే ముసల్మానులు, చేతి వృత్తులిరిగిన భయ్యాలు ప్రతి పుటలో కనిపిస్తారు.

"ఏం దువా చేసినవురా భాయీ
ఏం మన్నత్ కోరినవే అమ్మీ
ఏ నేల మీద నమాజ్ చేసినమో సజ్దా చేసినమో
ఆ నేల మీద వారసత్వపు మనుషులం కాలేక పోతున్నాం
అందరిలాగా స్థిరంగా నిలబడి గొంతును సవరించుకునే
జనాలం కాలేకపోతున్నాం
కనీసం సాదా సీదా శవాలం కాలేకపోతున్నాం"

-పీరీలు లేషినయ్

1980ల నాటికే ముస్లింలను అనుమానంగా చూడడం మొదలయ్యింది. 1992 నాటికి అది నేలంతా విస్తరించి పోయింది. మెల్లమెల్లగా ముస్లిం మైనార్టీల వ్యతిరేక భావనను ప్రోది చేసి హిందుత్వ శక్తులు బలపడడం పెరిగిపోయింది. క్రమంగా ముస్లిం మైనార్టీల మనుగడ ప్రశ్నార్థకంగా, అభద్రతలోని మారింది. ఈ భూమ్మీద అందరిలాగే పుట్టిన మనుషుల్లో కొంత మందిని మతం పేర వివక్షతో చూడడం, అనుమానంగా చూడడం, ఈ దేశ పౌరులు కాదేమోనని బట్ట కాల్చి మీదేయడం ఎంత వరకు సమంజసం. అందుకే కవి అల్లా ముందు మోకరిల్లి ఏం కోరుకున్నామో కాని ఈ దేశంలో అందరితో సమానంగా చూడబడలేకపోతున్నాం. ఈ దేశానికి మేం కూడా వారసులమేనంటే ఒప్పుకోని స్థితిలోకి నెట్టివేయ బడ్డాం. కనీసం అందరిలాగా సాదా సీదా శవాలం కూడా కాలేకపోయామేనని లోలోపల కుమిలిపోతాడు.

"అబ్బాజాన్ ఏడి? బతావో
జల్దీ బతావో అంటోంది నీ బేటీ
ఇంట్ల ఒక్క ఫోటో వుంచకపోతివి?"

- అబ్బాజాన్

పేదరికం ఒక వైపు, హిందుత్వ శక్తులు మరోవైపు ఈ దేశ ముస్లిం యువకుల్ని ఎడారి దేశాల వెంట వలస బాట పట్టేలా చేశాయి. పుట్టి, పెరిగి, పెద్దయ్యేదాకా కూడా తన అబ్బాజాన్ రూపం ఎలా ఉంటుందో తెలియని పిల్లలు కోకొల్లలుగా ఉంటారు. కనీసం ఫోటో కూడా దిగలేని దౌర్భాగ్యం. ఇక ఆ కూతురి ప్రశ్నలకు ఎవరు జవాబు చెప్తారు.

"ఇల్లంతా
షాదీ కాని అమ్మాయిలు
నౌకరీ లేని అబ్బాయిలు
భర్తలొదిలేసిన భార్యలు
బడికి పోవాల్సినోడు కూలీకి
కూలీకి పోవాల్సినోడు ఖబరస్తాన్‌కి"

- హిస్సా

ఈ దేశంలో కొన్ని కోట్ల మందిని పేదరికం రాచ పుండులా బాధిస్తుంది. ముస్లింలకు ఈ బాధ మరింత ఎక్కువ. ఏ ఇంటిలోకి తొంగి చూసినా పేదరికం కుప్ప పోసి కనిపిస్తుంది. పెళ్లికాని అమ్మాయిలు, ఉద్యోగాలు లేని యువకులు, తలాక్‌తో ఒంటరిగా మిగిలిపోయిన భార్యలు ఇట్లా బాధల నిప్పుల వెంట ప్రయాణించడమే కనిపిస్తుంది. అన్నీ సక్రమంగా ఉంటే పాఠశాలకు పోవాల్సిన పిల్లలు కర్మాగారాల్లో బాల కార్మికులుగా మగ్గి పోతున్నారు. అదీ సాధ్యంకాని వాళ్లు ఏకంగా స్మశానంలోకే దారి పడుతున్నారు. ఇన్ని బాధల మధ్య బతుకు సాగడం ఎట్లా? వాళ్ల కష్టాల్ని పూర్తిగా రాయాలంటే ఎన్ని అక్షరాలు కావాలి? ఎన్ని పేజీలు సరిపోతాయి?

"పూట పూటకే వాడిపోయే మల్లెపూవులాగా
చౌరస్తాలో పూటపూటకు వాడిపోతున్న
పసితనపు బతుకు
మల్లెపూలతో పాటు వాని మనస్సు కూడా
తీసుకుపోతాన
ఐదు పూటలా మసీదు నుంచి వినిపించే
అల్లాహూ అక్బర్ వింటున్నప్పుడల్లా
మల్లెపూలు మల్లెపూలు అంటున్న అక్బర్ పిలుపే"

-మల్లెపూల అక్బర్

చదువులేక, చదువుకున్న యువకులకు ఉద్యోగాలు లేక ముస్లిం కుటుంబాల్లో పిల్లలు కూడా కుటుంబ భారాన్ని మోయడం తప్పని పరిస్థితి. హోటల్లో టీ కప్పులు కడుక్కుంటూనో, సైకిల్ రిపేరు షాపులో సైకిల్ పంపు కొడుతూనో, చెప్పుల దుకాణంలో జీతం ఉంటూనో, చివరికి చౌరస్తాలో పూల బుట్ట ముందు పెట్టుకొని కూర్చోవడమో చేయకపోతే పస్తులుండాల్సిన పరిస్థితి. అయిదు పూటలా నమాజ్ పక్కకు పెట్టి మల్లెపూలు మల్లెపూలు అని జీవన పోరాటం చేసే పిల్లలే ఎక్కడ చూసినా కనిపిస్తారు. అందుకే కవి లేలేత పసిబతుకులు ఎలా బుగ్గిపాలవుతున్నాయో అల్లా సాక్షిగా మనముందు అవిష్కరిస్తాడు.

"న ఇమారత్ హై నా హుకూమత్
న ఇస్కూల్ న నౌకరీ
గరీబ్ హై రోటీకా రోజీ కా
ఫిర్‌బీ తెలంగాణమే ముసల్మాన్ నవాబ్ హై"

- యే మేరా తెలంగాణ

ఉండడానికి ఇల్లుండదు. తినడానికి తిండి ఉండదు. బతకడానికి సరిపడ డబ్బులుండవు. స్కూల్‌కు పోవడానికి లేదు. ఉద్యోగం చేయడానికి వీల్లేదు. ఇంత దుర్భర దారిద్ర్యం వెంటాడుతున్నా తెలంగాణలో ముస్లింలను నవాబులుగానే చూస్తారు. ఇదెక్కడి చోద్యమని కవి ప్రశ్న.

"చెట్టుకింద చెప్పులు కుట్టే రుషిలాగా
మోకాళ్ల మీద కూసోని పైజామా కుట్టుకుంటూ
ఏం యాదికొస్తదో ఏందో
కండ్లల్ల ఊట బావులు
చెంపల మీద ఉప్పునీళ్ల చారికలు
కూసోని కూసోని కూసోని
తోచీ తోచక
చేతిల ఉన్న సూదీ దారం కోసమే
దేవులాడుతుంటడు"

- దేవులాట

పేదరికం ఎలాంటి వ్యక్తినైనా పరధ్యానంలోకి విసిరి పారేస్తది. బతుకు లోతు అందక కండ్లల్ల ఊట బావులు ఊరుతూనే ఉంటాయి. భుజాల మీద కుటుంబ బరువు మోసి మోసి చెంపల మీద కన్నీటి చారికలు అట్టగట్టి పోతాయి. జీవనాధారం కోసం దేవులాడుతూ ఆలోచనల్లో పడి చేతిల ఉన్న దారం కూడా కనిపించదు. దాని కోసమే వెతుకుంటాడు అబ్బాజాన్.

ఊచకోతలు హత్యాచారాలు
బతుకుల్నంతా నాశనం చేసి
మూన్నాళ్లపాటు నరమేధం సాగించి
ఎన్నేళ్లయినా కోలుకోకుండా నరకయాతన చేశారే!
ముబారక్ ముబారక్"

- ఇనామిచ్చిండ్లు - ముబారక్

గుజరాత్ నరమేధం ఈ దేశ ముస్లింల హృదయాల్లో ఒక మానని గాయం. మూడు రోజుల పాటు హిందుత్వ శక్తులు చెలరేగిపోయి విచక్షణ రహితంగా కొన్ని వందల ముస్లింల ఇళ్లను తగులబెట్టారు. ఎంతో మందిని వాళ్ల పిల్లల ముందే నిర్దాక్షిణ్యంగా నరికి మంటబెట్టారు. నిండు గర్భిణిలతో సహా చాలా మంది ముస్లిం యువతులపై అత్యాచారాలు చేశారు. ఈ నొప్పినంతా పుక్కిట పట్టిన కవిత ఇది. కవి ఒక దయనీయ పరిస్థితి నుండి, ఒక నిస్సహాయ స్థితి నుండి మాట్లాడుతాడు ఈ కవితలో.

"వసంతం లేని ముస్లిం సమాజం
మసీదు మినారు సొరుగుల్లో
పావురాల బతుకు ముస్లింలది
చెమట రాలుతున్న ప్రతీచోట
శ్రమిస్తున్న మట్టి మనిషి ఈ దేశంలో ముసల్మానే
వ్యాపారం లేని మతం
కుల వృత్తి లేని మతం
చదువు సంధ్యలు లేని గరీబు జాతి
మారుతున్న కాలంతో ఏ మాత్రం
మారని పెహచాన్ ముసల్మాన్
మూడు సింహాల రాజసం ముందు
మేక పిల్లల సామూహిక ఆక్రందన నా జాతి
ఇమాందార్ జమీన్‌దార్ వతందార్
అబ్ పూరా లుట్‌గయా"

- అబ్ అప్నాభీ హిస్సా లేనా

ఈ దేశంలో ముస్లింలు బహుశా పౌరోహిత్యం తప్ప అన్ని వృత్తులను చేస్తున్నారు. అయినా వాళ్ల జీవితాల్లో వెలుతురు లేదు. వెన్నెల లేదు. ఎక్కడ చెమట బిందువులు అవిశ్రాంతంగా పడుతాయో అక్కడ ముస్లిం ప్రజల శ్రమ దాగి ఉంటుంది. ఒక కచ్చితమైన వ్యాపారం కాని, కుల వృత్తి కాని లేని వాళ్లు. చదువు సంధ్యలు లేక మారుతున్న కాలంతో పాటు మారలేని వారు. సింహాలు ఎగవడ్డ నేల మీద మేకపిల్లల్లాగా బిక్కుబిక్కుమంటూ భయాందోళనలతో రోజులు గడుపుతున్న జాతి నాది అంటాడు. ఒకప్పుడు ఇమాందార్, జమీన్‌దార్, వతందార్ అని పిలిచే వాళ్లు ఇప్పుడవన్నీ కాలం చెల్లి పోయాయి అని ఆవేదన చెందుతాడు. ఎన్నో ఏండ్లుగా ఎన్నో పనుల్లో మగ్గిపోయిన మనం ఇకనైనా ఉన్నత చదువులు చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించుకోవాలి. ఈ దేశ నాయకులుగా రాణించాలని ఆకాంక్షిస్తాడు కవి.

"గొడ్డు మాంసాన్ని నిషేధించి
మనిషి బతుకును తూకానికి పెట్టిండ్లు
గొడ్డును కాపాడి ఎవర్ని బలిత్తరోగనీ
గొడ్డే పాణమైనట్లు
బఱ్ఱూపినట్టు తలూపుతున్నరు
ఇగిప్పుడు బఱ్ఱె, గొఱ్ఱె, మేక, కోడి, గుడ్డు
అన్నింటి మీద రాజముద్రలొస్తయి
రాజ్యాం నీది కావచ్చు ఏలుకో
మా నోటికాడి బుక్క నీదా?"

- గొడ్డు

గత కొంత కాలంగా దేశంలో ఆవుకున్న విలువ ఆడ దానికి లేదు. మగవానికి కూడా లేదు. దేశంలోని పౌరులు ఎవరు ఏం తినాలో, ఏం తినకూడదో, ఎలా జీవించాలో అన్నీ ఏవో అదృశ్య శక్తులు నిర్ణయిస్తున్నాయి. ప్రజాస్వామ్య విలువలు, లౌకిక భావనలు అపహాస్యం పాలవుతున్నాయి. కనీసం ప్రజలకు ఎవరికి నచ్చిన తిండిని వారు తినే స్వేచ్ఛ కూడా లేదు.

"మనమంతా ఒక కులంల పుట్టలేదు
ఒక మతంగా పుట్టలేదు
ఒక్క దేశంగా బతుకుదాం
పుట్టిన దేశమే మన కులం మన మతం

సందేహించకు రా భయ్యా!
కులం మతం సూడకు
కౌగిలించుకుందాం గట్టిగా
గర్వంగా ఒక్క జాతిగా''

- మన కులం

భారతదేశ సంస్కృతికి మూలస్తంభమైన భిన్నత్వంలో ఏకత్వమనే ఆత్మను తన కవిత్వానికి అపాదించు కుంటాడు కవి ఇక్కడ. కులం లేదు. మతం లేదు. మనదంతా ఒకే భరతజాతి. మనమంతా సహోదరులం. రా భయ్యా! గుండె నిండా అలాయ్‌బలాయ్ తీసుకుందాం అని పిలుపునిస్తాడు. పుట్టినపుడు లేవు. పోయేటపుడు లేవు. మధ్యలోనే వచ్చిపోయే ఈ కుల మతాల కోసం ఎందుకు మనుషులమంతా కొట్టుకు చావడమనే ఒక తాత్వికత కూడా తొంగి చూస్తుందీ కవితలో.

''నాలుగు రోజులు నువు పారేసిన చెత్తను తీసే జనాలు లేకపోతే
నాలుగు రోజులు నువ్వేసుకునే బట్టలు ఉతికే వాళ్లే లేకపోతే
నాలుగు రోజులు నీ చెప్పులు కుట్టి పాలిష్ చేసే మనుషులే లేకపోతే
విత్తనాన్ని పంటను చేసి మన బతుకుల్ని పండిస్తున్న వాళ్లే లేకపోతే
నీకు బువ్వపెట్టే చేతులు, నీ కోసం కన్నీళ్లు పెట్టే కళ్లే లేకపోతే
తరాల ఆస్తుల ముందు మన చివరి యాత్రలో నడిచొచ్చే మనిషుండడు
బాగా బతుకుతున్న వాళ్లు - అవమానాల్లోంచి బతుకును నెట్టుకొస్తూ
ఆత్మహత్యలు చేసుకొని అర్ధాంతరంగా వెళ్లిపోయి కొందరు

- వెళ్లిపోక కొందరు. నా ఈ కథలు.''

అని తన కథలు ఎవరి గురించి మాట్లాడుతాయో చెప్పే అన్వర్ కథలు ప్రధానంగా ప్రాంతీయ, లైంగికత, ముస్లింవాదం చుట్టు తిరుగుతాయి. అన్వర్ ఇప్పటిదాకా ప్రచురించిన ఏకైక కథల సంపుటి 'బక్రీ' లో ముస్లింవాదం గురించి మాట్లాడే నాలుగు కథలున్నాయి. అవి. 1. అమ్మితుజే సలాం 2. బక్రీ 3. ఆకుపచ్చని స్వప్నం 4. ఇమ్రాన్ ఉరఫ్ రాము.

''నాకైతే అమ్మీని మించిన గొప్పవారు ఈ భూమ్మీద మరెవరూ పుట్టలేరనిపిస్తది. అమ్మీని గుర్తు చేసుకుంటే మనసంతా వర్షం కురుస్తున్నట్లు, అమ్మీ మాటెత్తితే ఒక సంగీతపు వరద హృదయాన్ని ముంచెత్తినట్లు, అమ్మీలేని బతుకు తుఫాను పట్టిన సముద్రం మీద ఈదుతున్నట్టే ఉంది. అమ్మీ జీవితం సామాన్యం. అమ్మీ కష్టం అసా మాన్యం అని అనిపించేదెప్పట్కీ. ప్రశాంతమైన కాజల్‌కి ఆంఖే అమ్మి. అమ్మీయాది విషాధ మనోహరం. అమ్మీ తుమ్హారీ యాద్ దిల్‌మే కాంటేసే జైసా చుబ్ రహా హై.'' ఒక వైపు సముద్రమంతటి అమ్మ ప్రేమను మరోవైపు అంతకంటే లోతైన ముస్లిం కుటుంబాల పేదరికాన్ని అంతర్లీనంగా చిత్రించిన గొప్ప కథ 'అమ్మీ తుజే సలాం'.

ముస్లిం కుటుంబాల్లో ఒక మేకకున్న విలువ కూడా స్త్రీలకు లేదు. ఆ పరదాల వెనక జరిగే గృహహింస చాలా సార్లు బయటికి రానేరాదు. దీనికి 'బక్రి' కథ ఒక సజీవ ఉదాహరణ. జహీరాబీకి పెండ్లి అయి తొమ్మిదేండ్లు అయింది. ఏడుగురు పిల్లలున్నారు. అంటే దాదాపుగా ప్రతి సంవత్సరం ఆమె కడుపుతోనే ఉంటుంది. అంటే ఆమె భర్త ఆమెను ఎంత బలవంతంగా లొంగదీసు కుంటున్నాడో అర్థమవుతుంది. యాకూబ్‌మియా ఒక మేకపిల్లను తెచ్చుకొని దాన్ని అల్లారుముద్దుగా పెంచు తుంటాడు. ఒకనాడు ఇంట్లో వాళ్లు అందరూ చూస్తుండ గానే దాని గొంతు కోసి స్నేహితులకు పోగులు వేస్తాడు. ఈ కథలో పైకి ఒక కథ నడుస్తుంటుంది. లోపల మరో కథ నడుస్తుంటుంది. 'బక్రీ' పేరుతో రచయిత గొప్ప ధ్వనిని సాధించాడు. చివరికి ముస్లిం కుటుంబాల్లో స్త్రీలు ఎలా బక్రాలుగా మారుతున్నారో, ఆ పేదరికానికి, భర్త

ఆధిపత్యానికి బలవుతున్నారో రచయిత చాలా లాఘవంగా చెప్పాడీ కథలో.

ఈ దేశంలో ముస్లిమేతరులతో పాటు మేము కూడా ఒక ఆత్మగౌరవంతో, స్వేచ్ఛగా, ఎలాంటి వివక్షకు గురి కాకుండా బతకాలనేది ముస్లింల 'ఆకుపచ్చని స్వప్నం'. ఈ కథలో మనోహర్ అనే హిందూ పిల్లవాడు సలీం అనే ముస్లిం స్నేహితుడిని తన పుట్టినరోజుకు పిలవడానికి వెళ్తాడు. ఆ సమయంలో మనోహర్‌లో చెలరేగిన అనేక ఆలోచనలే ఈ కథ. కథకుడు ముస్లింల పేదరికాన్ని వర్ణిస్తూ "తవ్వకాల్లో బయటపడ్డ మట్టిగోడల్లా వున్నాయి ఇళ్లన్నీ. తట్టు పరదాల చాటు. పిలవడానికి గొళ్లెం కొడితే గొళ్లెం ఊడేట్టుంది. తలుపు తడితే తలుపులే ఊడి పోయేట్టున్నాయి. గోడను ముట్టుకుంటే మట్టి రాలుతుంది." అంటాడు.

"ఏ పుణ్యం కట్టుకోవడానికి మసీదును కూల్చారో, హిందుత్వ రాజకీయ దుర్మార్గాలు కళ్లముందు కదలాడాయి మనోహర్‌కు. విడిపోయిన దేశంతో పాటు వీడి పోకుండా, ఈ మట్టిని వీడిపోకుండా సారేజహాసే అచ్చా హిందు సితాహమారా అని గొంతెత్తింది ముస్లిమే" కదా అని అనుకున్న మనోహర్ "ఎందుకిలా వీళ్ల బతుకులు చదువుల వరకు రావడం లేదు. ఈ దేశంలో ముస్లింల ఆర్థిక, రాజకీయ, సామాజిక స్థితులు ఏ మాత్రం బాగోలేవు. ముస్లింలకు రోజువారి బతుకు తప్పితే ఎదుగుతూ అభివృద్ధి చెందుతున్న జాతిగా నిలబడే అవకాశమే లేని లౌకిక రాజ్యం ఇది" అని కూడా అనుకుంటాడు.

గొప్ప మతసామరస్య కథ 'ఇమ్రాన్ ఉరఫ్ రాము'. ఆచరణ సాధ్యంకాకపోయినా ఈ కథలో ముస్లిం పిల్లలు హిందువుల పేర్లు, హిందువుల పిల్లలు ముస్లిం పేర్లు పెట్టుకుని గొప్ప మత సామరస్యాన్ని ప్రదర్శిస్తారు.

ఇమ్రాన్ ఓ రోజు హిందువులలాగే నడుముకు మొలతాడు కట్టుకుంటాడు. అతని తల్లిదండ్రులు నూర్జహాన్, రజ్బానీఖాన్‌లు ఇదేం విచిత్రమని ఆశ్చర్యపోతారు. కాని మా స్కూళ్లో అందరూ ఇలాగే ఉంటారని బదులిస్తాడు ఇమ్రాన్. మనం ముస్లింలం ఇలా చేయడం తప్పకాదా? తోటి ముస్లింల ముందు మన పరువు పోతుంది కదా? అని ప్రశ్నిస్తే "రాజకీయం కాకపోతే మనదేశంల మత మెక్కడిదీ అబ్బాజాన్ అన్నీ అభిమతాలే తప్ప. ఒకరి మీద మరొకరికి వల్లమాలిన ప్రేమే కాని మతవిశ్వాసాలు ఎక్కడివీ అబ్బాజాన్. ఒకరి మతాన్ని ఇంకొకరు కించపరుచొద్దన్నరు. కానీ పాటించొద్దని ఎవరు చెప్పిండ్లు అబ్బాజాన్. ఎవరి మతాన్ని వాళ్లు, ఎవరి కులాన్ని వాళ్లు, ఎవరి కులపోల్లను వాళ్లు, ఎవరి మతపోళ్లను వాళ్లు ప్రేమించుకుంటే, ఆరాధించుకుంటే, విశ్వసించుకుంటే ఇది భారతదేశం ఎందుకైతది అబ్బాజాన్ మనమంతా భారతీయులం ఎందుకైతం" అంటాడు ఇమ్రాన్ వాళ్ల అబ్బాజాన్‌తో. అంతేకాదు "రాముని కోసం ఓట్లు కాకుండా దేశం కోసం ఓట్లేసే రోజొస్తది అబ్బాజాన్. మా శ్రీను సారీ రహీంను తీసుకొస్తా అబ్బాజాన్ మనింటికి. ఒకే ఆకాశంలోని చుక్కల్లాగా, సూర్యుని చుట్టూ ఉన్న అనేక గ్రహాలలాగా, గాలిలో స్వేచ్ఛగా ఎగురుతున్న అనేక పక్షులలాగా, అనేక రకాల తుమ్మెదల్లాగా అందమైన పువ్వుల్లాల వేలాది చిన్న పిల్లల్లాగా వాడు మీకు కనిపిస్తాడు అబ్బాజాన్" అని తన వయసుకు మీరి మాట్లాడినా వాస్తవ చిత్రాన్ని మనముందుంచుతాడు. పిల్లలంతా కలిసి ఏం సాధించ బోతున్నారో కూడా చెప్తాడు.

అన్వర్ కవిత్వంలో అయినా, కథల్లో అయినా తెలంగాణ ప్రాంతీయతతో పాటు, ముస్లింవాదం కూడా సమపాళ్లలో ఉంటుంది. తెలుగు నేల మీద వీస్తున్న ముస్లిం వాదాన్ని అందిపుచ్చుకొని ఒకింత సీరియస్‌గానే ముస్లిం వాదాన్ని వినిపిస్తున్న వాళ్లలో అన్వర్ కూడా ఒకరు. తన రాబోయే రచనల్లో మరింత బలంగా ముస్లింవాదాన్ని వినిపించి ముస్లింవాదాన్ని మరింత సంపద్వంతం చేస్తాడని ఆశిద్దాం.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు దినపత్రికలు - సాహిత్యసేవ

- దొరిశెట్టి లక్ష్మీకరసింహం, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగము, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.

"పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు పత్రికొక్కటున్న మిత్ర కోటి" అని నార్ల వారు ఏనాడో చెప్పిన మాటలు అక్షరాల సత్యం అని చెప్పక తప్పదు. నేడు దినపత్రికలు నిర్వర్తిస్తున్న పాత్ర గురించి చెప్పుకోవాలంటే ఎంతో చెప్పాల్సి వస్తుంది. సమాజంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలను దినపత్రికలు కళ్ళకు కట్టినట్లు మన ముందుకు తెస్తున్నాయి. నేటి ఆధునిక కాలంలో పత్రికా రంగం నూతన పుంతలు త్రొక్కుచున్నది. ఎలక్ట్రానిక్ యుగంలో సైతం దినపత్రికలు ప్రాచుర్యం పొందడానికి కారణం ఆయా పత్రికలలోని వైవిధ్యాంశాల సమాహారమే అని చెప్పక తప్పదు. భారతదేశంలో 1780లో 'బెంగాఆల్ గెజిట్' అనే పత్రికతో ఆరంభమైన పత్రికల ప్రస్థానం దిన దినం అభివృద్ధి పథంలో కొనసాగుతునే ఉన్నదని చెప్పవచ్చు.

పత్రికలనేవి ప్రజలను చైతన్యవంతం చేస్తాయి మంచి చెడులను అవి విశ్లేషిస్తాయి. సమాజంలో జరిగే సంఘటనలకు పత్రికలు అక్షర రూపాన్నిస్తాయి. పత్రికల ఆవిర్భావం నుండి నేటివరకు తెలుగు దిన పత్రికలు పోషించిన పాత్ర గొప్పదనే చెప్పవచ్చు. ఇక తెలుగులో పత్రికల ఆవిర్భావ విషయానికి వస్తే ఎక్కువ మంది అభిప్రాయం ప్రకారం తెలుగులో పత్రికల ఆవిర్భావం 1830-1857 మధ్య కాలంలో జరిగి ఉంటుందని నిర్ధారించడం జరిగింది. తెలుగులో తొలి పత్రిక ఏది? అనే విషయంలో సైతం ఏకాభిప్రాయం లేదు. అయితే 1838లో మద్రాస్ నుండి వెలువడిన 'వృత్తాంతి' అనే వార పత్రికను తొలి తెలుగు పత్రికగా ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. 1875 తరువాత తెలుగు పత్రికా రంగంలో వికాసయుగం ప్రారంభమైనట్లుగా చెప్పవచ్చు.

1885లో భారత జాతీయ కాంగ్రేస్ ఆవిర్భావం పత్రికా రంగానికి కావలసిన సైద్ధాంతిక భూమికను ఏర్పర్చిందని చెప్పవచ్చు. తెలుగులో తొలిదశలో మాస పత్రికలు ఆ తరువాత వార పత్రికలు ఆఖరున దిన పత్రికల ఆవిర్భావం జరిగినట్లు మనకు తెలుస్తుంది.

20వ శతాబ్దంలో తెలుగు దినపత్రికల రంగంలో ఒక విప్లవం సంభవించిందనే చెప్పవచ్చు. ఎందుకంటే ఈ శతాబ్దంలో కొన్ని వందల సంఖ్యలో పత్రికలు వెలువడ్డాయి. ముఖ్యంగా 1960లో ఆంధ్రజ్యోతి, 1974లో ఈనాడు, 1985లో ఉదయం, 1996లో వార్త పత్రికలు తెలుగు పాఠక లోకానికి వెలుగును చూపాయనే పేర్కొన వచ్చును.

తెలుగు దిన పత్రికలలో సాహిత్యాంశాలు :

సమాజహితాన్ని కోరేది సాహిత్యం తెలుగు సాహిత్యానికి వేల సంవత్సరాల చరిత్ర కలదు. నన్నయ్య కాలం నుండి తెలుగు సాహిత్యం నూతన పుంతలు త్రొక్కుతూ ఆధునిక రూపాలను సంతరించుకొంది. సాహిత్యం అనేది వ్యక్తికి ఒక అనుభూతిని కలిగిస్తుంది. పాఠకుడిని క్రొత్త ఆలోచనా స్రవంతివైపు పయనింపజేస్తుంది.

అయితే ఆధునిక కాలంలో తెలుగు దినపత్రికలు సైతం పాఠకులలో సాహిత్యం పట్ల ఆసక్తిని, అభిరుచిని కలిగించేలా అనేక సాహితీ అంశాలను సమకాలీన వార్తా కథనాలతో పాటు ప్రచురిస్తున్నాయి. తెలుగు దిన పత్రికలలో సాహితీ అంశాల ప్రచురణ గురించి మాట్లాడేటప్పుడు తొలుత ఆంధ్రజ్యోతి దినపత్రికను పేర్కొనాలి. ఎందుకంటే విభిన్న సాహితీ ప్రక్రియలు, విమర్శా వ్యాసాలు, చేరాతలు మొదలగు అనేక సాహిత్య సంబంధిత అంశాలను ప్రచురించడంతో పాటు ఇప్పటికి కూడా ప్రతి సోమవారం 'వివిధ' పేరుతో ప్రత్యేకంగా ఒక పేజిని

కేటాయించి అనేక సాహితీ వ్యాసాలను అందిస్తుంది. ఇక్కడ కొన్ని దినపత్రికలు ప్రచురిస్తున్న సాహితీ అంశాల గురించి వివరించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి దినపత్రిక :

సాహితీ అంశాలకు సంబంధించిన శీర్షిక. వివిధ (ప్రతీ సోమవారం) ఈ శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రతీ సోమవారం సాహిత్యాంశాలపై విశ్లేషణలు, వ్యాఖ్యలు, రచయితల అంతరంగాలు, పుస్తక సమీక్షలు, సాహితీ కార్యక్రమాల వివరాలు, వచన, గేయ కవితలు మొదలైన అంశాలను ఎప్పటికప్పుడు పాఠకలోకానికి అందిస్తు సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నదనే చెప్పవచ్చు.

ఈనాడు :

తెలుగు పత్రికా రంగంలో ఈనాడు ఒక పెను సంచలనం అనే చెప్పవచ్చు. వార్తా ప్రచురణలో ఈనాడు ఒక కొత్త ధోరణితో ఇప్పటికి అశేష పాఠకలోకాన్ని తనవైపుకి ఆకర్షించగలిగింది. అయితే మిగతా దిన పత్రికలతో పోలిస్తే ఈనాడులో సాహితీ అంశాలకు కొంత తక్కువ ప్రాధాన్యత ఉందనే చెప్పవచ్చు. అయితే ఆయా కవుల, రచయితల జయంతులు, వర్ధంతుల సందర్భాలలో ఎన్నో అమూల్యమైన సాహితీ వ్యాసాలను ఈనాడు ప్రచురిస్తున్నది. ఈనాడు ఆదివారం అనుబంధంలో ఒక కథను ప్రతి ఆదివారం ప్రచురిస్తున్నారు. ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా ఈనాడు ఎంతో విలువైన సాహితీ అంశాలను ప్రతిరోజు ప్రచురించి పాఠకులను అలరించిందనే చెప్పవచ్చు.

ఆంధ్రభూమి :

ఆంధ్రభూమి దినపత్రిక ప్రతి శనివారం 'నుడి' శీర్షికన విలువైన సాహితీ వ్యాసాలను ప్రచురిస్తున్నది. ప్రతి సోమవారం 'సాహితీ' శీర్షికన సైతం అనేక సాహిత్య సంబంధిత అంశాలను ప్రచురిస్తున్నది. 'వాహిని' శీర్షికన పారాణిక గ్రంథాలనుండి కొన్ని ఇతివృత్తాలను అందిస్తున్నది.

ఆంధ్రప్రభ :

ఆంధ్రప్రభ దినపత్రిక సైతం ప్రతీ సోమవారం 'సాహితీ గవాక్షం' పేరుతో సాహిత్య సంబంధ అంశాలను పాఠకులకు అందిస్తున్నది. ఈ శీర్షికన ప్రచురితమయ్యే సాహితీ కదంబం లో భాగంగా సమకాలీనతను ప్రతిబింబించే సామాజిక, రాజకీయ అంశాలపై ఆయా కవులు సంధించే వచన కవితలను ప్రచురిస్తున్నది.

సాక్షి దినపత్రిక :

తెలుగు దినపత్రికలలో తొలిసారి పూర్తి పుటలను రంగులలో ముద్రించి పత్రికా రంగంలో సంచలనం సృష్టించిన సాక్షి దినపత్రిక ప్రతి సోమవారం 'సాహిత్యం' శీర్షికన ఎన్నో వైవిధ్యభరిత సాహితీ వ్యాసాలను తెలుగు పాఠకులకు అందిస్తున్నది.

'సింగిల్ కాలమ్' పేరిట రచయితలు కవుల గురించిన విశేషాలు, రీడింగ్ రూమ్ పేరిట నూతన గ్రంథాలను పరిచయం చేయడంతో పాటు ఎన్నో సాహితీ అంశాలను అందిస్తున్నది.

నమస్తే తెలంగాణ దినపత్రిక :

2011 జూన్ 6న తెలంగాణ ఉద్యమ సైద్ధాంతిక నేపథ్యంగా ఆవిర్భవించిన ఈ పత్రిక తెలంగాణలోని సాహిత్యాంశాలను ప్రచురించడంలో ఎంతో కృషి చేస్తున్నది. మరుగునపడ్డ అనేకమంది తెలంగాణ కవులు, రచయితలను పాఠకులకు పరిచయం చేస్తున్నది. ప్రతి సోమవారం 'చెలిమె' పేరుతో అమూల్య మైన సాహిత్య అంశాలను అందిస్తు సాహిత్యాభివృద్ధిలో తనవంతు పాత్రను పోషిస్తున్నది.

వార్తా దినపత్రిక :

1996లో ఆవిర్భవించిన 'వార్తా' దినపత్రిక సైతం సాహిత్యాంశాలను ప్రచురించడంలో ఎంతో కృషి చేస్తున్నది. 'కావ్య' పేరుతో ప్రతీ సోమవారం సాహితీ వ్యాసాలు, విమర్శా వ్యాసాలు, లేఖా సాహిత్యం మొదలగు అంశాలు ప్రచురిస్తున్నారు. ప్రతి శుక్రవారం 'గళం' పేరుతో మహిళా రచయిత్రులు రాసిన కవితలను ప్రచురిస్తున్నది.

ప్రజాశక్తి దినపత్రిక :

ప్రజాశక్తి దినపత్రిక ప్రతి సోమవారం 'సవ్వడి' శీర్షికన

వివిధ సాహిత్యాంశాలను ప్రచురిస్తున్నది. ముఖ్యంగా ఉద్యమ సాహిత్యానికి ఈ పత్రిక పెద్ద పీఠ వేస్తుందని చెప్పవచ్చు.

సూర్య దినపత్రిక :

నూకారపు సూర్యప్రకాశరావు నేతృత్వంలో 2007లో పురుడు పోసుకున్న ఈ దినపత్రికలో 'అక్షరం' శీర్షికన ప్రతి సోమవారం సాహితీ అంశాలు ప్రచురించబడు చున్నవి. ప్రతి ఆదివారం 'కొత్త పుస్తకం' శీర్షికన నూతనంగా వెలువడిన రచనలను విమర్శనాత్మకంగా సమీక్షిస్తు పరిచయం చేస్తున్నది. ఈ పత్రిక ఆదివారం అనుబంధంలో బాల సాహిత్యానికి పెద్ద పీఠ వేస్తున్నది.

మన తెలంగాణ దినపత్రిక :

2015లో ఆవిర్భవించిన ఈ పత్రిక సైతం రాజకీయ, సామాజిక వార్తా కథనాలతో పాటు ప్రతి సోమవారం 'కలం' పేరుతో విభిన్న సాహిత్యాంశాలను పాఠకులకు అందించడంలో తనవంతు పాత్రను పోషిస్తున్నది. ఆదివారం అనుబంధం 'దునియా' పేరుతో ప్రచురిస్తు అందులో ప్రతి ఆదివారం ఒక కథను అందిస్తున్నది.

ఈ విధంగా తెలుగు దినపత్రికలు ఇప్పటికి సాహితీ అంశాలను ప్రచురిస్తు సాహితీలోకానికి విశిష్ట సేవ చేస్తున్నాయనే చెప్పవచ్చు. ఆయా దినపత్రికలు ప్రచురిస్తున్న సాహిత్యాంశాలు సాధారణ పాఠకులతో పాటు, పరిశోధక విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమౌతున్న వారికి, అధ్యాపక లోకానికి ఎంతో ఉపయోగపడు తున్నాయనడంలో ఇసుమంతైనా ఎలాంటి సందేహం లేదు.

❁❁❁

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

లల్లాదేవి గారి లకుమాదేవి నవల : సమాలోచన

- డా॥. శిల్ప ఈడ్పుగంటి

రెడ్డి రాజులలో ఒకరైన కొమరగిరిరెడ్డి రాజు ఆస్థాన నర్తకి లకుమాదేవి. ఈమెను గూర్చి నాలుగైదు రచనలు న్నాయి. వాటిల్లో ఒకటి లల్లాదేవి రచించిన లకుమాదేవి నవల. ఈ నవలలో లల్లాదేవి లకుమాదేవి పాత్రను తీర్చిదిద్దిన వైనాన్ని వివరించడం వ్యాస ఉద్దేశ్యం. లకుమాదేవిని గూర్చి తెలుసుకునే ముందుగా దేవదాసీ వ్యవస్థను గూర్చి తెలుసుకోవాలి. ఎందుకంటే లకుమాదేవి ఒక దేవదాసీ కుటుంబంలో జన్మించిన రాజనర్తకి.

భారతదేశం భిన్న సంస్కృతులకు నిలయం. మన దేశంలో లలితకళలకు దేవాలయాలు పట్టుగొమ్మలు. బ్రిటిషువారి హయంలో రాజులు దేవాలయాల అభివృద్ధికి కృషిచేశారు. ఆలయాల్లో వేకువజామున దేవుడికి మేలు కొలుపులు పాడడం నుంచి, రాత్రివేళ పవళింపు సేవ వరకు నృత్యగానాలు ప్రదర్శించేవారు. ఇవన్ని చేయడానికి దేవాలయాలలో ప్రత్యేకించి మనుషులు కావాలి. ఇందుకుగాను అమ్మాయిల్ని దేవాలయాలకు దానం చేసేవారు. దేవుని సేవకు నియమింపబడిన ఈ అమ్మాయిని దేవదాసీ అని పిలిచేవారు. "భరతనాట్యంగా ప్రసిద్ధి పొందిన కళ కేవలం నృత్యం మాత్రమే. దీని అసలు పేరు సదిర్ లేదా దాసి". (TELUGU SEVAKA. 2005, JULY) దేవదాసీగా మారిన అమ్మాయి భరతనాట్యం, సంగీతం వంటి కళలలో ప్రావీణ్యం సంపాదించి దేవాలయంలో ప్రదర్శిస్తుంది. "10, 11శతాబ్దాలలో దేవాలయ నిర్మాణం, వాటి పునరుద్ధరణ ఉన్నతస్థాయికి చేరుకుంది. దేవుళ్ళ పేరుతో వారి సేవకోసం దేవాదాసీ సంప్రదాయం మొదలైంది. అందుకుగాను దేవదాసీలకు భూములను, నగదును ఇచ్చేవారు." (లలిత, వకుళాభరణం. 2007: 31). ఊరికి మంచి జరుగుతుందనే భావంతో ఆరోజులలో బ్రాహ్మణ కుటుంబాలలోని ఒక అమ్మాయిని దేవదాసీగా చేసేవారు. ఒకవేళ పిల్లలు లేకపోతే దత్తత తీసుకుని మరి వారిని దేవదాసీలుగా చేసేవారు. దేవదాసీలుగా మారిన అమ్మాయిలు కఠిన నియమాలు పాటించేవారు. ఎంతో నియమ నిష్ఠలతో ఉండేవారు. దేవుని సేవకే అంకిత మయ్యేవారు. ఈ దేవదాసీలే తరువాత రాజదాసీలుగా మారారు.

దేవదాసీలు రాజులు ఇచ్చిన మాన్యాలతో పొట్ట పోసుకుంటూ నిరాడంబర జీవితం గడిపేవారు. కాల క్రమంలో వీరి నృత్యం ఆలయం నుంచి రాజాస్థానానికి మారింది. ఫలితంగా రాజులు వీరిని రాజనర్తకిలను చేశారు. రాజనర్తకిలు రాజసభలలోనూ, రాజు అంత:పుర మందిరాలలోను నృత్యం చేసేవారు. రాజుకు రాజ దాసీలుగా (ఉంపుడుగత్తెలుగా) ఉండేవారు. దాంతో వీరి జీవన విధానంలో మార్పు వచ్చింది. విలాసాలకు, సౌఖ్యాలకు అలవాటు పడ్డారు. కాకతీయ రాజులు దేవదాసీలను రాజదాసీలుగా నియమించుకునేవారు. చాళుక్య రాజైన గుణగ విజయాదిత్యుని నాటి చెల్లవ్వ, రెండవ అమ్మరాజు నాటి దావెకాంబ, రెండవ ప్రతాపరుద్రుని నాటి మాచల్దేవి, కొమరగిరిరెడ్డి ఆస్థానంలో లకుమాదేవి, పల్నాటి వీరచరిత్రలో వర్ణింపబడిన కామ భూవిభుని ఆస్థాననర్తకి కుంజలోచన మొదలైనవారంతా రాజనర్తకీమణులే. తదుపరి కాలంలో రాయల ఆస్థానంలో రంజకం కుప్పాయి, రంగనాథరాయల ఆస్థానంలో ముద్దు చంద్రరేఖ మొదలైనవారంతా రాజనర్తకి సంప్రదాయానికి చెందినవారే. వీరంతా నృత్యకళను ప్రచారంలోకి తీసు కొచ్చారు. అలాగే రాజాస్థానంలో కవయిత్రులుగా ఉంటూ రాజుకు భోగపత్నులుగా కొంతమంది ఉన్నారు. 17వ శతాబ్దంలో రంగాజమ్మ, 18వ శతాబ్దంలో ముద్దు పళని వంటివారు రాజులకు భోగపత్నులుగా జీవించారు.

బెంగుళూరు నాగరత్నమ్మ మాత్రం తాను దేవదాసీనేనని ప్రతిచోట ఎంతో గర్వంగా చెప్పుకునేది. ప్రముఖ సంగీత విద్వాంసురాలు ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి కూడా దేవదాసీ కుటుంబం నుండి వచ్చినవారే. పూరీ జగన్నాథస్వామి ఆలయంలో నేటికీ ఇద్దరు దేవదాసీలు ఉన్నారు. వీరికి అక్కడ ఇప్పటికీ ఎంతో గౌరవం ఉంది. వివాహం అయిన స్త్రీలు ఎంతోమంది వీరి దగ్గరకు వచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు. కాని వీరి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. రాజ్యాలు, జమీందారీ వ్యవస్థ అంతరించిన పిదప దేవదాసీల పరిస్థితి దుర్భరమైంది.

దేవదాసీ సంప్రదాయం ప్రకారం ఒక వంశంలోని స్త్రీలలో తరానికొక్కరిని చొప్పున గుడిలోని దేవునికి పెళ్ళి చేసేవారు. ఆ స్త్రీ జీవితాంతం అవివాహితగానే ఉండాలి. మొదట్లో కేవలం బ్రాహ్మణ కుటుంబాలలో నుంచి మాత్రమే దేవదాసీలు ఉండేవారు. తరువాత నిమ్న వర్గాల నుంచి కూడా వచ్చారు. దీనికి గల కారణం 'ఉన్నత వర్గాలు తక్కువ కులాల వారిని దేవాలయాలలోకి ప్రవేశించనివ్వకపోవడం. దాంతో తక్కువ కులాలవారు వారు నివసించే ప్రాంతాలలోనే దేవాలయాలు నిర్మించుకోవడం మొదలుపెట్టారు. ఆ దేవాలయాలకు అమ్మాయిల్ని వారి జాతిలో నుంచే అర్పించేవారు'. ఈవిధంగా నిమ్న వర్గాలలోనూ దేవదాసీలు వచ్చారు.

లల్లాదేవి నవల లకుమాదేవి లోని లకుమ పాత్ర గూర్చి ఇక్కడ చర్చించాను. రాజనర్తకి లకుమ, లకుమాదేవి అయిన విధానాన్ని, దీని ద్వారా ఆమె తన ఆశయాన్ని నెరవేర్చుకున్న తీరును ఈ నవలలో చాలా చక్కగా చిత్రించారు. ఉన్నతాశయాలు కలిగిన నాయికగా లకుమాదేవిని చూపించారు.

ఈ నవలలో లకుమ ఆశ్రమ వాతావరణంలో పెరిగిన అమ్మాయి. ఆమె వయసు పదకొండేళ్ళు. ప్రతిరోజు ఆశ్రమంలోని ఆలమందను మేతకు తోలుకెళుతుంది. ఆలమందలో ఒక చిన్న ఆవుపిల్లను కపిల అని పిలుచుకుంటుంది. కపిల అంటే లకుమకు ఎంతో ఇష్టం. ఆశ్రమ పెద్ద కమలయోగిని. ఈమెకు మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయంలో ఒక చిన్నపిల్ల, కొంతడబ్బు, నగలు, ఒక భూర్జపత్రం దొరుకుతాయి. భూర్జపత్రంలో ఆ పాప తల్లి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు డబ్బు, నగలతో తన పాపను పెంచమని కోరుతూ రాస్తుంది. కమలయోగిని పాపను, భూర్జపత్రాన్ని ఆశ్రమానికి తీసుకొస్తుంది. ఆ పాపే లకుమ. ఇదీ ఈమె బాల్య నేపథ్యం. చారిత్రకంగా చూస్తే ఈమె బాల్యానికి సంబంధించిన విషయాలు ఏమి తెలియవు. కాని ఈ నవలలో లకుమ బాల్యాన్ని చాలా చక్కగా చిత్రించారు. పాఠకునికి ఆసక్తి కలిగించేవిధంగా ఉంది. లకుమకు, కమలయోగినికి మధ్యగల ప్రేమానుబంధం గాఢమైంది. సాధారణంగా విరాగిని, యోగినిగా మారిన వారు ప్రేమ అప్యాయతలకు దూరంగా ఉంటారు. ఎటువంటి బంధాలు, అనుబంధాలు ఉండవు. ఆశ్రమంలోని మిగతా వారితో కమలయోగిని అలాగే ఉంటుంది. ఒక్క లకుమతో తప్ప. లకుమ కమల యోగినిని అత్తయ్య అని పిలుస్తుంది. కమలయోగిని తన తర్వాత ఆశ్రమానికి లకుమను ఆశ్రమపెద్దగా చేయాలనుకుంటుంది. కాని లకుమ మనస్తత్వం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. నాట్యం పట్ల ఆసక్తి కనబరుస్తుంది. ఒక దేవదాసీని నాట్యానికి సంబంధించిన విషయాలు అడుగుతుంది. నాట్యం నేర్చుకోవాలనే కుతూహలంతో ఉంటుంది. ఆశ్రమ వాతావరణంలో పెరిగిన లకుమకు నాట్యం పట్ల ఉన్న ఆసక్తిని చూసి కమలయోగిని ఆశ్చర్యపోతుంది.

రెడ్డిరాజులలో ఒకరైన కొమరగిరి రెడ్డి నాట్య కళారాధకుడని, అందచందాలు కలిగినవాడని తెలుసుకుని అతన్ని మనసులోనే ఆరాధిస్తుంది. అతని దర్శనం కోసం ఎదురుచూస్తుంది. ఒకసారి కమలయోగిని అత్తయ్య ద్వారా కొమరగిరి రెడ్డి దర్శనం చేసుకుంటుంది. తనకు ఎంతో ఇష్టమైన కపిల ఆవును రాజుకు కానుకగా ఇస్తుంది. ఆ సందర్భంలో లకుమ మాట్లాడిన మాటలకు

రాజు ఆకర్షితుడవుతాడు. నాట్యం నేర్చుకోవాలనే పట్టుదల చూసి ఒక నాట్య గురువును నియమిస్తాడు. ఇదంతా లకుమకు పదకొండేళ్ళ వయసులో జరుగుతుంది. నాట్యం నేర్చుకోవడం పూర్తవుతుంది. లకుమ మొదటి సారిగా రంగస్థలం మీద నాట్యం చేస్తున్నప్పుడు ఆమెకు నాట్యం నేర్పిన గురువు కూడా ఆశ్చర్యపోవడం జరుగుతుంది. లకుమలో తను నేర్పిన దానికి మించిన జన్మ సంస్కారాలు పనిచేస్తున్నాయని ఆమె అనుకుంటుంది. అందుకు గల కారణం లకుమ తల్లి ఒక దేవదాసి కావడం. ఆమె ఆస్థాననర్తకి కావాలనుకుంటుంది. (ఈ విషయం నవల చివరి భాగంలో తెలుస్తుంది.) అదే తపన కూతురిలోనూ కనిపిస్తుంది. అందుకే లకుమ నాట్యం నేర్చుకున్న తర్వాత రాజుగారి ఆస్థానంలో రాజనర్తకి కావాలనే ఆరాట పడుతుంది. వసంతరాజీయం అనే నాట్యశాస్త్ర గ్రంథం రాయాలనే రాజుగారి కోరికను తన ఆశయంగా చేసుకుంటుంది. ఆ రచనలో రాజుకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తుంది. ఈమె ప్రోత్సాహంతోనే రాజు రచన చేశారని చెప్పవచ్చు. ఈమెకు కళల పట్ల మక్కువ ఎక్కువ. కళాకారులను గౌరవిస్తుంది. ఆశ్రమానికి వచ్చిన శాంతి వర్ధనుడనే శిల్పిని కూడా ఎంతగానో ప్రోత్సహిస్తుంది. రాజుగారి సౌధాన్ని నిర్మించలేక శాంతివర్ధనుడు తిరిగి ఆశ్రమానికి వస్తాడు. ఆ సమయంలో అతని ప్రతిభను అతనికి తెలియజేసి ఉత్సాహాన్ని కలిగిస్తుంది. తన రూపాన్ని శిల్పంగా మలచమంటుంది. ఈ శిల్పాన్ని శాంతివర్ధనుడు రాజుగారి ఉద్యానవనంలో ఉంచుతాడు. ఆ శిల్పాన్ని చూసిన రాజు ఆమె అందచందాలకు ఆకర్షితుడవుతాడు. 'ఆమె అపురూప సౌందర్యవతి. ఆమె మాట్లాడుతుంటే సంగీతంలా వినసొంపుగా ఉంటుంది. నడుస్తుంటే నాట్యం చేస్తుందా అన్నట్లు ఉంటుంది. చురకత్తి లాంటి చూపులు ఇవన్నీ లకుమలో ఉండడం వలన ఆమె ఎదుటి మనుషులను సులభంగా ఆకట్టుకుంటుంది.' శాస్త్ర సంప్రదాయాలతో నాట్యకళ తెలిసిన నర్తకిని తన ఆస్థాన నర్తకిగా నియమిస్తే తాను రాయబోయే నాట్యశాస్త్ర గ్రంథానికి ఆదర్శంగా ఉంటుందని, లక్షణ లక్ష్యాలను సమన్వయపరచి గ్రంథరచన చేయవచ్చని రాజు ఆలోచిస్తున్న సమయంలో లకుమ గూర్చి తెలుస్తుంది. వెంటనే లకుమ నాట్యప్రదర్శన ఏర్పాటు చేయిస్తాడు. లకుమకు కూడా రాజుగారి ముందు నాట్యం చేయాలనే కోరిక తీరుతుంది. ఆమె నాట్యభంగిమలు రాజుగారి హృదయంలో ముద్రింపబడతాయి. వెంటనే ఆమెను ఆస్థాన నర్తకిగా చేసుకుంటాడు. లకుమ ఆస్థాన నర్తకి అయినప్పటికి ఎటువంటి అలంకారాలు లేకుండానే సాధారణ అమ్మాయిలానే ఉంటుంది. రాజు నగలు ఇచ్చినా తిరస్కరిస్తుంది. ఆయనను నాట్యశాస్త్ర గ్రంథరచన చేయమని ప్రేరేపిస్తుంది. రాజు ఆమెను ఉన్నతాదర్శం గలిగిన స్త్రీగా గౌరవిస్తాడు. ఆమె అభిప్రాయాలకు విలువ ఇస్తాడు.

ఈ నవలలో లకుమ సేవాదృక్పథం కలిగిన స్త్రీ. ఒక వృద్ధురాలిని ఆదరిస్తుంది. రాజు దర్శనం కంటే వృద్ధురాలి సేవకే ప్రాధాన్యం ఇస్తుంది. అయితే తరువాత ఆమె తన తల్లి అని తెలిసి ఎంతో ఆనందపడుతుంది. ఈ నవలలో లకుమను గూర్చి కొమరగిరి రాజు అభిప్రాయాలను కొన్నింటిని పుటకించాను. "లకుమ ఉన్నతమైన లక్ష్యాలతోనే వచ్చిందని గ్రహిస్తాడు. ఆమె శారీరకమైన ఆనందానికి ఏమాత్రం విలువ ఇచ్చే మనిషి కాదు. ఆమె నాట్యంతో ఎటువంటి రసరమ్య లోకాలను ప్రత్యక్షం చెయ్యగలదో తన వ్యక్తిత్వంతోనూ అలాగే అద్భుతాలను చూపగలదు. అటువంటి ఆకర్షణీయమైన అందచందాలు, అంతటి అద్భుతమైన పదచలనమూ, అంతటి అబ్బురమయిన వ్యక్తిత్వమూ ఒకేచోట త్రివేణీ సంగమంలా లకుమలో మూర్తీభవించాయి. రసహృదయుడైన పురుషుడు ఎవడు కూడా ఆమె వ్యక్తిత్వం ముందు ప్రణమిల్లకుండా ఉండలేడు. ఆమె ఔన్నత్యాన్ని అందుకోవడం కోసం ఒక్క రాణినే కాదు, ఈ రాజ్యాన్ని, ఆఖరుకు తన ప్రాణాలను అర్పించాలనిపిస్తోంది." (లల్లాదేవి. 1982: 161, 162) అని రాజు అనుకుంటాడు.

"ఎంతో జన్మసంస్కారం ఉంటేకాని ఉన్నతమైన ఆశయా లకు అంకితమయిపోవాలన్న ఆలోచన మనసుకు రాదు. నీ సంస్కారమే నిన్ను పవిత్రంగా కాపాడుతుందని" రాజ గురువు లకుమతో అంటాడు. (లల్లాదేవి. 1982: 168) "నీవు ఆస్థాన నర్తకివి అయివుండి లాలనలకు దూరంగా వుంటున్నావు. ఇంతటి తాత్వికురాలయిన స్త్రీ ఒక ఆస్థాన నర్తకి కావటం చరిత్రలో ఇదే ప్రథమం" అని రాజు లకుమతో అంటాడు. (లల్లాదేవి. 1982: 183) వీటిని బట్టి లకుమ వ్యక్తిత్వం ఎటువంటిదో తెలుసుకోవచ్చు. నాట్యశాస్త్ర రచనలో రాజు తనకు లకుమకు ఏకాంతం కావాలనుకుంటాడు. ఏకాంతం ప్రణయానికి దారి తీస్తుందని ముందుగా రాజును పెళ్ళి చేసుకోమని అడుగుతుంది. వారిద్దరి వివాహం జరుగుతుంది. లకుమ లకుమాదేవి అవుతుంది. అయితే రాణి కావాలనో, నగలు, ధనాన్ని ఆశించో రాజును పెళ్ళి చేసుకోదు. కేవలం రాజు కోరిక నాట్యశాస్త్ర గ్రంథ రచన తప్ప మరే ఉద్దేశ్యం ఉండదు. అది రాజుకు కూడా తెలుసు. రచన పూర్తయిన పిమ్మట రాజును పట్టపురాణికి, ప్రజలకు అప్పగించి లకుమ వెళ్ళిపోతుంది.

దేవదాసీలు దేవాలయాలకు దానం ఇవ్వబడితే రాజ దాసీలు రాజాస్థానాలకు నియమింపబడతారు. దేవ దాసీలు దేవుని ఎదుట నాట్యం చేస్తారు. రాజదాసీలు రాజు ఎదుట నాట్యం చేస్తారు. దేవాలయం నుండి రాజాస్థానానికి మార్చబడిన దేవదాసీలు ఉన్నారు. దేవదాసీలైనా, రాజదాసీలైనా నాట్యసేవ చేయడం ద్వారా దేవుణ్ని ఆరాధించడం ముఖ్యంగా కనిపిస్తుంది. నాట్యం ద్వారా దేవదాసీలు దేవుణ్ని ఆరాధిస్తే, రాజదాసీలు రాజును ఆరాధిస్తారు. ఇటువంటి ఆరాధనే లకుమది. కొమరగిరిరాజును చిన్ననాటి నుంచి ఆరాధిస్తుంది. అతని ఆశయ సిద్ధికి తోడ్పడుతుంది. వీరందరూ కళారాధకులే. కాని నాట్య కళారాధనకే తమ జీవితాలను అంకితం చేసిన కొంతమంది జీవితాలు మాత్రం దుర్భరంగా ఉండేవి. వారి సౌందర్యం, ఆటపాటలు, తెలివితేటలు కొంతమంది రసికహృదయులకు అవసరమయ్యేవి. వీటిని పూర్తిగా అనుభవించేవారు. మొట్టమొదట్లో దేవదాసీలన్నా, దేవదాసీలను పోషించే వాళ్ళన్నా ఎంతో విలువ ఉండేది. రాజులు, రాజ్యాలు పోయిన తర్వాత దేవదాసీల పరిస్థితి మరీ దిగజారి పోయింది. కొంతమంది పోషణ నిమిత్తం భూస్వాములకు దాసీలుగా ఉండేవారు. తదనంతరం సెక్స్ వర్కర్లుగా మారారు.

ఈ నవలలో లకుమాదేవిని స్త్రీత్వానికి ప్రతీకగా చెప్పడం జరిగింది. ఆమె ఉన్నత ఆశయం కలిగిన ఆదర్శమూర్తి. సేవాదృక్పథం కలిగిన వనిత. కళలను ఆరా ధించే కళామూర్తి. నాట్యచరిత్ర అంటే లకుమ చరిత్రే అవుతుందని చెప్పుకునేంత గొప్ప నాట్యశిఖామణి.

ఉపయుక్త గ్రంథసూచి :

1. రామకృష్ణ, నటరాజ. 1987. రుద్రగణిక. పేరిణి ఇంటర్ నేషనల్ ప్రచురణ, హైదరాబాద్.
2. లల్లాదేవి. 1982. లకుమాదేవి. నవజ్యోతి పబ్లికేషన్స్, విజయవాడ.
3. లలిత, వకుళాభరణం. 2007. జోగిని వ్యవస్థ. జనచైతన్య వేదిక ప్రచురణ, ఆంధ్రప్రదేశ్ కమిటీ. హైదరాబాద్.
4. శాంతిప్రబోధ, వి. 2007. జోగినీ దురాచారం - సంస్కరణ, (వజ్రభారతి 1947-2007). కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రచురణ, విజయవాడ.
5. TELUGU SEVAKA, 2005 July. నర్తనశాల. language engineering.blog spot. com.

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆచార్య ముదిగొండ శివప్రసాద్ వంశధార నవల - స్త్రీ పాత్ర చిత్రణ

- పిట్టా శాంతి, పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఆంధ్రుల పూర్వచారిత్రక వైభవాన్ని పునరుద్ధించుటకు కంకణం కట్టుకొని తన రచనల్లో వాటిని పొందుపరుస్తూ, సమకాలీన సాంఘీక సంఘటనలతో ముడిపెడ్తూ నవలలు వ్రాస్తున్న వారిలో అగ్రగణ్యుడు ఆచార్య ముదిగొండ శివప్రసాద్. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా పదవీ బాధ్యతలు నిర్వర్తించి విరామ జీవితంలో కూడా తన సాహిత్యాభిలాషను కొనసాగించారు. పదవీ విరమణ వయస్సుకుగాని మనసుకు కాదని నిరూపిస్తూ వ్యాస, కవిత, కథ, నవలలుపై ఇప్పటికీ 118 రచనలు చేశారు. వీరు వ్రాసిన చారిత్రక నవలలు చలనచిత్రాలుగా మలచబడ్డాయి. చారిత్రక నవలా చక్రవర్తి, చారిత్రక నవలా సామ్రాట్, అభినవ పాల్కురికి అన్న బిరుదులు పొందిన ముదిగొండ శివప్రసాద్ వార్ధక్యం మీదపడ్డ లెక్కచేయక నేటికీ విభిన్న ప్రక్రియలలో రచనలు చేస్తూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు. విశ్వనాథ రచనాశిల్పంలోని ఔచిత్యాన్ని, బాపిరాజు కళా సౌందర్యాన్ని, నోరి చారిత్రక ప్రామాణికతను ఆదర్శంగా తీసుకుని చారిత్రక నవలలను వ్రాయడంలో తనదైన ఒక కథాకథన పద్ధతిని ఉత్కంఠత కలిగించే శైలిని ఏర్పర్చుకుని చారిత్రక, సాంఘిక నవలా తోరణాల్ని అనన్యకల్పనా నైపుణ్యంతో తీర్చిదిద్దిన వారు ఆచార్య ముదిగొండ శివప్రసాద్. ముదిగొండ వారి నవలా ప్రస్థానం 1960 సంవత్సరం నుండి ప్రారంభమైంది. వీరు దాదాపు 30కి పైగా నవలలు రచించారు. కొన్ని కథా సంపుటాలు, విమర్శనాత్మక సంపుటాలు ప్రచురించారు. సాంఘిక నవలలలో సాహిత్య రచనా జీవితాన్ని ప్రారంభించిన రచయత కాలక్రమేణ చారిత్రక నవలా చక్రవర్తిగా పేరు సుస్థిరం చేసుకున్నారు.

శివప్రసాద్ గారికి తెలుగు సాహిత్య ప్రక్రియలు చారిత్రక నవలా రచన మీద అభిలాష మెండు. అందుకే చారిత్రక నవలా చక్రవర్తిగా పేరుగాంచారు. సంప్రదాయ పునరుద్ధరణ వికాసాలకు ఆధునిక కాలంలో కొందరే ప్రముఖులు కృషి చేశారు. వారిలో ముదిగొండ వారొకరు. నవ్య సాంప్రదాయ రీతుల్లో రచనలు చేస్తూ పరిశోధకులుగా, విమర్శకులుగా, నవలా రచయితగా, వక్తగా జాతీయస్ఫూర్తి కలిగించిన సాహితీవేత్తగా ప్రముఖుల ప్రశంసలందుకున్నారు.

ముదిగొండ వారు తన 80వ రచన 'వంశధార' నవల. ఈ వంశధార నవల రావూరి భరద్వాజ్ 'పాకుడురాళ్ళు 2'గా పేర్కొంటారు. 'పాకుడురాళ్ళు' నవలలో భరద్వాజ సినిమా హీరోయిన్స్ కష్టాలు ఇతివృత్తంగా పేర్కొన్నారు. అయితే ముదిగొండ వారు వంశధార నవలలో సినిమా రచయితల కష్టాలు ఇతివృత్తంగా చేసి ఫీల్డ్‌లో జరిగే యదార్థ సంఘటనలను కొద్ది మార్పులు చేర్పులతో ఇతివృత్తాన్ని మలిచారు. నవల మొత్తం పాఠకులను ఉత్కంఠతను రెకెత్తిస్తుంది. హాస్యం, దుఃఖం, కరుణం, భయానకం, రౌద్రం, విస్మయం మొదలైన నవరసాలు ఈ నవలలో దర్శనమిస్తాయి.

పాత్ర చిత్రణలో స్వరూప స్వభావములు సహజసిద్ధం. మొదటి బాహ్యమైన లేదా భౌతికమైన శారీరక వర్ణనకు సంబంధించినదైతే, రెండోది అంతరంగికమైన మానసిక వర్ణనకు సంబంధించినది. ఈ రకమైన స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని ''పాత్రల విశిష్ట స్వభావ లక్షణాన్ని పాఠకుడు భావించుకోవడానికి, చూడడానికి వీలుగా రచనలో పాత్రను ప్రవర్తింపజేయటాన్ని పాత్ర చిత్రణగా కాత్యాయనీ విద్వేహే అభివర్ణించారు''[1].

బాహ్య చిత్రణంలో నఖశిఖ పర్యంతమైన అంగాంగ సౌందర్య వర్ణన, వస్త్రాలంకరణ, భాషణాది వర్ణనం అనేవి ముఖ్యంగా కనిపిస్తాయి. పాత్ర చిత్రణ దర్శనంలో

ముందు స్వరూపం. ఆ తర్వాత స్వభావం దర్శించడం జరుగుతుందని నిరూపించబడింది[2].

ఆచార్య ముదిగొండ శివప్రసాద్ వంశధార నవలలో ప్రతిపాత్రను ఎంతో నేర్పరితనంతో తీర్చిదిద్దారు. సమాజం లోని విభిన్న వ్యక్తుల మనస్తత్వాలను చిత్రకబట్టి వాటిని దృశ్యరూపంలో తన నవలలో పొందుపరిచారు. వంశధార నవలలో కనిపించే పాత్రలు ఆయా కాలాల్లో ఆయా సమాజాల్లో నిబిడీకృతమై మనమధ్య తిరుగుతున్న వ్యక్తుల ఆంతరంగిక స్వభావమే అని చెప్పవచ్చు. వంశధార నవల నిండా కనిపించే పాత్రలు నిజంగా జరిగిన సంఘటనలు అన్నింటిని మేళవించి రచయిత ఎంతో నైపుణ్యాలతో పాత్ర చిత్రణ చేశారు. ఈ నవలలో కనిపించే పాత్రల్లో స్త్రీపురుష పాత్రలుగా రెండింటిని రచయిత అత్యద్భుతంగా మనస్తత్వ చిత్రణ చేశారు.

ముదిగొండ శివప్రసాద్ వినూత్న, విశిష్టమైన పాత్ర చిత్రణకు పెట్టింది పేరు. కథా నందర్భాన్ని బట్టి సన్నివేశాన్ని బట్టి పాత్రల మనస్తత్వాన్ని విశ్లేషించుకుంటూ స్వయం వ్యక్తిత్వం గల పాత్రలుగానూ, స్వయం ప్రకాశవంతమైన, మహత్తరమైన, రమణీయమైన పాత్ర లను శిల్పాలను తీర్చిదిద్దారు. ముఖ్యంగా వీరి స్త్రీ పాత్ర చిత్రణ అద్భుతం. ఆయా పాత్రల సంప్రదాయాల సంస్కృతిని కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు.

పార్వతమ్మ :

పార్వతమ్మ మరిది దేశభక్తి కోసం చేసే ఆరాటాన్ని పోరాటాన్ని సమర్థించి తనకు దేశభక్తి ఉందని నిరూపించుకుంది. ఒకవైపు సనాతన ఆచార వ్యవహారా లను పాటిస్తూనే మరొకవైపు అభ్యుదయ భావాల్ని కాంక్షించిన మాతృమూర్తి. భర్తమాట జవదాటని సాధ్వీ మణి. భర్త ఉన్న ఆస్థిపాస్తులు ప్రజలకు పంచిపెడుతుంటే చూస్తూ ఆనందించిందేకాని అడ్డుకోని సహృదయశీలి. ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులే వారు బాగుంటేనే తాము బాగుంటామని భావించిన ఇల్లాలు. పార్వతమ్మ పాత్ర నేటి సమాజానికి మార్గదర్శకమైన విలువలతో కూడిన పాత్రగా రచయిత మలచడం హృద్యంగా ఉ ందని చెప్పవచ్చు.

నాగమ్మ :

నాగమ్మ రామప్రసాద్ భార్య. భర్తచాటు భార్య. పార్వతమ్మని 'పిన్ని' అని పిలుస్తుంది. పాణిని సొంత తమ్ముడిగా చూసుకుంటుంది. కుద్దిగాంలో సంభవించిన వరదల్లో పార్వతమ్మ భర్తను కోల్పోయి తమ్ముడైన రామకృష్ణ పంచన చేరింది. పార్వతమ్మ అమె కుమారుడు పాణి ఇద్దరు కట్టుబట్టలతో కొత్తూరు చేరారు. పార్వతమ్మను, పాణిని ప్రేమగా ఇంటికి ఆహ్వానించింది నాగమ్మ.

నాటి సమాజంలో బాంధవ్యాలు ఎలా ఉండేవో నాగమ్మ పాత్ర ద్వారా రచయిత చూపించాడు. నేటి సమాజంలో మనుషుల మధ్య రక్తసంబంధీకుల మధ్య ప్రేమలు ఆప్యాయతలు అంతం మాత్రంగా ఉన్నాయి. మా ఇంటికి వస్తే ఏమి తెస్తారు. మీ ఇంటికొస్తే ఏమి ఇస్తారు అనే సంప్రదాయం నేడు బాగా వ్యాపించి బంధాలు అటకెక్కాయి. అటువంటి సమాజంలో ఉన్న మనుషులకి నాగమ్మ పాత్ర చెంపపెట్టు. నిరధార స్థితిలో వచ్చిన భర్త అక్కను అమ్మలా చేరదీసి ఆమె ఊపిరి ఆగిపోయేంత వరకు సేవలు చేసిన సహృదయశీలి. పార్వతమ్మ అనారోగ్యంతో చనిపోతే పాణిని సొంత కొడుకులా చూసుకుంది. పాణి వైరాగ్యంతో ఇల్లు విడిచి వెళ్ళిపోతే బాధపడింది. ప్రతిరోజు అన్నం తినేటప్పుడు ముగ్గురికి మూడు కంచాలు పెట్టి ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూసిన ధన్యజీవి. నాగమ్మ పాత్ర ద్వారా రచయిత ఆస్తులు కాదు ప్రేమాభిమానాలు శాశ్వతం అని తెలియజేశారు.

హసంతి ఉరఫ్ బసంతి :

హసంతి సంప్రదాయ కుటుంబంలో జన్మించింది. తండ్రి అధ్యాపక వృత్తిలో ఉంటూ రచయితగా పేరు ప్రఖ్యాతలు సంపాదించాడు. తండ్రి హసంతి అభ్యున్నతికి

అహర్నిశలు శ్రమపడేవాడు. ఎంత ఉన్నత భావాల్లో పెరిగినా సమాజం మనలోని మంచిని ప్రక్కకు పెట్టేసి చెడుతనాన్ని ప్రేరేపిస్తుందని చెప్పకనే హసంతి పాత్ర ద్వారా రచయిత చెప్పించాడు. హసంతి అనామకుడ్ని ప్రేమించి వాడి మాయమాటలకి లోబడి ఇంట్లో చెప్పకుండా అతడితో పారిపోతుంది. వెంట తెచ్చుకున్న సొమ్ము తరిగిపోయింది. హసంతి మీద మోజు తీరిపోవడంతో అతడు ఆమెను వదిలేసి పారిపోయాడు. ఆత్మహత్యకు పాల్పడుతుంది. కాని ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. కారణం తను గర్భవతి. కడుపులో పిల్లవాడిని చంపేసే అధికారం తనకి లేదని మొండిగా బతుకుతుంది. మద్రాసులోనే జూనియర్ ఆర్టిస్ట్‌గా పడరాని పాట్లు పడుతుంది.

హసంతి బసంతిగా మారి అనేక అవమానాలు ఎదుర్కొంటూ బిడ్డను పోషిస్తుంది. బసంతి పాత్ర ద్వారా రచయిత క్షణికమైన ప్రేమకు లోబడితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని తెలియజేశారు. మోసపోయి తిరిగి ఇంటికి వెళ్ళటానికి సాహసించలేకపోయింది. తన కుటుంబ పరిస్థితుల కారణంగా ఆగిపోయింది. బసంతి పాత్ర ద్వారా సినిమా ఫీల్డ్‌లో జూనియర్ ఆర్టిస్ట్‌లు పడే కష్టాలను రచయత కళ్ళకు కట్టినట్లు చూపించారు.

బాలకామేశ్వరి :

బాలకామేశ్వరి డబుల్ బి భార్య. మహాసాధ్వి. కళ్ళు కుతంత్రాలు, మోసాలు తెలియని సామాన్య స్త్రీ. భర్త దుర్మార్గుడైన ఏ రోజుకైనా మారకపోతాడు అని ఎదురు చూసిన పతివ్రత. అటువంటి సాధ్విని దశవతారం షూటింగ్ స్పాట్‌లో భర్తలేని సమయంలో మానభంగం చేస్తాడు. ఆ హఠాత్ పరిణామానికి బాలకామేశ్వరికి మతిభ్రమించి పిచ్చిదైపోయింది. మతి తప్పినా పురాణాలు, వేదాలు అందులోని సారాలను పాణికి అర్థ వివరణ ఇస్తుండేది. పాణి దుర్మార్గుడికి ఇంతటి సాధ్వి ఎలా భార్య అయింది అని ఎన్నోసార్లు అనుకునేవాడు. పాణి చేత రామాయణం మహా భారతాలు చదివి వినిపించుకునేది. భర్త దుర్మార్గుడైన అతడినే అంటిపెట్టుకుని బతికింది. బాలకామేశ్వరి పాత్ర ద్వారా రచయిత దశావతారం వంటి దుర్మార్గులు ఉంటారని వారి ద్వారా తమని తాము కాపాడుకోవాలని చెప్పారు.

సురేఖ :

సురేఖ సినీఫీల్డ్‌లో పెద్ద హీరోయిన్. ఆమె ఆ స్థాయికి రావడానికి నానా కష్టాలు పడింది. తన శరీరాన్నే పెట్టుబడిగా పెట్టి అంచెలంచెలుగా అగ్ర కథానాయికల స్థాయికి చేరింది. రచయిత సురేఖ పాత్ర ద్వారా నేటికి కూడా సినిమా ఫీల్డులో ఇటువంటి సంప్రదాయాలు కొనసాగు తున్నాయని తెలియజేశారు. సురేఖ చదువు లేకపోయినా లౌక్యంతో పైకి ఎదిగింది. సురేఖ వంటి పాత్రలు నేటి సినిమా ఫీల్డులో కోకొల్లలుగా ఉన్నాయని చూపించారు.

బిందు మాధవి :

బిందుమాధవి అగ్రకథానాయిక. మాఫియా మనుషులతో చేతులు కలిపి వాళ్ళ పనులు చేస్తుండేది. అయినా సేవతత్పరత, మానవత్వం ఉన్న మనిషి. ఎంతోమంది డైరెక్టర్‌లకి, జూనియర్ ఆర్టిస్టులకు సహాయాన్ని అందించింది. రచయిత బిందుమాధవి మృదు స్వభావి. ప్రేమిస్తే ప్రాణమిస్తుంది. ఆగ్రహిస్తే అంతు చూస్తుంది. నువ్వే దిక్కు అంటే ప్రాణమైనా ఇచ్చేస్తుంది. వరాలుకి బిందుమాధవి మనస్తత్వమంటే ఇష్టం. అందుకే ఆమెను శరీరకంగా కోరుకోకపోయినా మానసికంగా ఆరాధించాడు. రచయిత బిందుమాధవి పాత్ర ద్వారా మానవత్వపు విలువల్ని వెల్లడి చేశారు.

పొన్నమ్మ :

పొన్నమ్మ డబుల్ బి ఇంట్లో పని మనిషి. బాలకామేశ్వరికి మతి చెలించడంతో ఆమెను కంటికి రెప్పలా చూసుకునేది. నిస్వార్థపరురాలు. నిజాయితీ గల స్త్రీ. యజమాని ఇంటి గుట్టు భయటపెట్టని పనిమంతురాలు. పాణి బాలకామేశ్వరి పరిస్థితికి కారణం ఎన్నిసార్లు అడిగినా

చెప్పలేదు పొన్నమ్మ. రచయిత పొన్నమ్మ పాత్రల ద్వారా నిజాయితీపరుల వ్యక్తిత్వాన్ని చూపించారు. పొన్నమ్మ గుట్టుమనిషి. బాలకామేశ్వరి మరణంతో వరాలు దగ్గర చేరుతుంది. వరాలు రహస్య సమాచారాన్ని తెలుసుకు రమ్మన్నప్పుడు ఆ పనిని సమర్థవంతంగా పూర్తి చేసిన ధీరురాలు. పొన్నమ్మ పాత్ర ఆదర్శవంతం.

వైదేహి :

రచయిత వైదేహి పాత్ర ద్వారా నడమంత్రపు సిరికి పొంగిపోకూడదని తెలియజేసిన పాత్ర. ఒకప్పుడు తినడానికి కూడా లేని స్థితి నుండి విదేశాలకు భర్తతోపాటు తిరిగేస్థాయికి చేరుకుని కన్నుమిన్ను కానరాకుండా పోతుంది. అటువంటి వారికి వైదేహి పాత్ర గొడ్డలిపెట్టు. ఎదుటివాళ్ళను చూసి అసూయపడడం వైదేహి లక్షణం. వైదేహి పాత్ర ద్వారా అసూయ, ద్వేషాలు ఉండరాదని తెలియజేశారు.

సారమ్మ :

సారమ్మ సురేఖ బినామీ. మనోధైర్యం గలిగిన స్త్రీ. ఒంటరిగా బతుకుతూ లౌక్యంగా బతకసాగింది. ఒకవైపు భర్తను పోగొట్టుకుంది. మరోవైపు మాయతోడేళ్ల వలలో పడిపోకుండా బతకసాగింది. వరాలు ఈమె వాక్చాతుర్యానికి ముగ్ధుడైపోయాడు. పాండిత్య వాసన లేక పోయినా లోకం పోకడలను చెప్పసాగింది. రచయిత సారమ్మ పాత్ర ద్వారా ఎన్ని కష్టాలు వచ్చినా మనో ధైర్యంతో బతకాలని తెలియజేశారు.

పాటీ :

'పాటీ' మాయా పూజారాణి. తనకు మంత్రాలు వచ్చని భక్తులను మత్తు పదార్థం కలిపిన తీర్థం ఇచ్చి వాళ్ళు ఊగిపోయేలా చేస్తుంది. 'పాటీ' వంటి మాయా పూజారిణులు ఈ లోకంలో అనేకమంది ఉన్నారని రచయిత ఈ పాత్ర ద్వారా తెలియజేశారు. భక్తుల కల్పవల్లిగా కొలిచే పాటీ మాఫియా మనిషి. ఈమె విదేశాల నుండి ఏకముఖీ రుద్రాక్షలు, వజ్రాలు, నాగమణులు వీటితో పాటు డ్రగ్స్ కూడా స్మగ్లింగ్ చేయిస్తుంది. నేటి సమాజంలో ఇటువంటి దొంగ మాతాజీలు, బాబాలు ఉన్నారని రచయిత పాటీ పాత్ర ద్వారా తెలియజేశారు. పాటీ పాత్ర ద్వారా మంత్ర తంత్రాలతో మనుషుల్ని అతి మూఢవిశ్వాసాల వైపు మళ్లిస్తున్న తీరును విమర్శించారు.

లీల :

పాటీ సహాయకురాలు లీల. పాటీ స్మగ్లింగ్‌కి సంబంధించిన అన్ని విషయాలు పూర్తిగా తెలిసిన వ్యక్తి లీల. 'పాటీ' అక్రమాలను ఎప్పటికప్పుడు కప్పిపుచ్చుతూ తన భర్త మురళీధరన్ ద్వారా విదేశాలకు రహస్యాలను చేరవేస్తుంది. భారతదేశ విలువైన సంపద పాటీ, లీలల ద్వారా విదేశాలకు అమ్మివేయబడి ఆర్థికస్థితి క్షీణించే స్థాయికి చేరుకుంటుందని రచయిత చెప్పకనే చెప్పాడు.

ఫిలోమినా :

ఫిలోమినా విదేశీయురాలు ఉత్తమ ధావన్ కోడలు, విమల్ ధావన్ భార్య. చదువు పేరుతో విదేశాలకు వెళ్ళిన భారతీయ సంతతి విద్యార్థులను మాఫియా గ్యాంగ్స్ ఫిలోమినా వంటి ద్వారా ప్రేమలో పడేసి వారిని పూర్తిగా విదేశస్థులుగా తయారు చేస్తారు. ఈ తరుణంలో వారికి పూర్తిగా మాదకద్రవ్యాలు అలవాటు చేసి పూర్తిగా వశం చేసుకుంటారు. అలా వశమైపోయినవాళ్ళు తమ సంస్కృతి సంప్రదాయాలను పూర్తిగా మర్చిపోయి బతుకుతారు. రచయిత ఫిలోమినా పాత్ర ద్వారా అనేకమంది స్వదేశీ సంస్కృతిని విదేశీ సంస్కృతులు ఎలా దెబ్బతీస్తున్నాయో వివరించారు.

ప్రమీలా ధావన్ :

ప్రమీలా ధావన్ సనాతన శ్వేతఃబంర తెగకు చెందిన జైన మతస్థురాలు. ఉత్తమ ధావన్ భార్య, కొడుకు విమల్‌ధావన్ పై చదువులకి విదేశాలకు వెళ్ళి అక్కడ ఫిలోమినాను ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు. కోడల్ని కొడుకుని చూసుకోవడానికి ప్రమీలా ధావన్ విదేశాలకు వెళ్తుంది. అక్కడ ప్రమీలా ధావన్ కొడుకు కోడలు తీరుకు

ఆశ్చర్యపోయింది. ఇంట్లోనే బార్ డైనింగ్ టేబుల్ మీద మాంసాహారం ఉండడం చూసి తట్టుకోలేకపోయింది. రెండు భిన్న సంస్కృతుల మధ్య ఇమడలేకపోయింది. కొడుకు ప్రవర్తనకి బాధపడి తిరిగి వచ్చేసింది. మానసిక క్షోభతో మంచం పట్టి చనిపోయింది. ప్రమీలా పాత్ర ద్వారా నేటి పాశ్చాత్య సంస్కృతికి లోబడి సనాతన ధర్మాలను విడనాడిన తీరును వివరించారు. రచయిత ప్రమీల పడిన ఆవేదన యదార్ధవంతంగా తీర్చిదిద్దారు.

సుబ్బలక్ష్మి :

తిక్కశర్మ భార్య సుబ్బలక్ష్మి, భర్తచాటు భార్య. సగటు మధ్యతరగతి కుటుంబానికి చెందిన స్త్రీలు ఎలా ఉంటారో రచయిత సుబ్బలక్ష్మి పాత్ర ద్వారా చూపించాడు. ఆడంబరాలు కాదు ప్రేమాభిమాలు గొప్పవని భర్త తోడిదే లోకమని సుబ్బలక్ష్మి భావించింది. అందుకే భర్త సంపాదన గొనెతోకంతైన ఉన్నదానిలోనే తృప్తిపడింది. ఒకరోజు కడుపునిండా తింటే రెండు రోజులు పస్తులు పడుకోవాల్సిన పరిస్థితి. అటువంటి దీనస్థితిలో కూడా పుట్టింటికి వెళ్ళిపోకుండా భర్తతోపాటే కష్టాల్లో పాలు పంచుకుంది. చిన్న చిన్న కారణాలే భర్తతో ఉండకుండా విడిపోయే నేటి తరానికి సుబ్బలక్ష్మి పాత్ర ద్వారా స్త్రీ ఎలా మెలగాలో చెప్పకనే చెప్పారు.

జ్యోతి :

జ్యోతి సినిమా హీరోయిన్ అవ్వాలని మద్రాసుకు పారిపోయి వచ్చింది. సినిమా ఫీల్డు బురదలో మునిగి పోయి మోసపోయింది. తిరిగి ఇంటికి వెళ్ళలేక చంటి బిడ్డతో సినిమా అవకాశాలకోసం తిరగసాగింది. జ్యోతి లాంటి వాళ్ళు సినిమా ఫీల్డులో కోకొల్లలుగా కనిపిస్తారు. రచయిత జ్యోతిపాత్ర ద్వారా జూనియర్ ఆర్టిస్ట్‌లు పడే కష్టాలు వివరించారు.

ముగింపు :

ఈ విధంగా ఆచార్య ముదిగొండ శివప్రసాద్ వంశధార నవలలో పాత్రలు మనస్తత్వాన్ని అంచనా వేసి సమాజంలో మనం ఎలా బతకాలో ఎలా బతకకూడదో తెలియజేశారు. ఉత్తమమైన గుణాలు కల్గిన వ్యక్తుల ప్రవర్తన సానబట్టిన వజ్రంలా ప్రకాశిస్తుందని వారిని ఆదర్శంగా తీసుకోవాలని రచయిత యువతకు సందేశం అందించారు.

ఆధార గ్రంథాలు :

1. ఆచార్య ముదిగొండ శివప్రసాద్, వంశధార, కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్, 2013.
2. ఆచార్య కాత్యాయనీ విద్మేహే, తెలుగు వచన రచనా పరిచయం, ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1986.
3. దేవదాసు వెంకటేశ్వరరావు, ప్రాచీనాంధ్ర సాహిత్యం - మధురభక్తి, శాంతిశ్రీ పబ్లికేషన్స్, విజయవాడ, 1994.

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ సామెతలు - పదస్వరూపం

- సంగి రమేశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మల్కాజ్‌గిరి.

తరతరాల జీవన అనుభవసారాన్ని రంగరించి తమ దైన యాసలో, భాషలో ప్రాసను మేళవించి చెప్పుకునేవే సామెతలు. తెలంగాణ జానపదులు గ్రామీణ ప్రాంతాల్లో వీటినే శాస్త్రాలుగా పిలుస్తారు. గ్రామీణులు ఏదో శాస్త్రం / సాత్రం చెప్పినట్లు, ఏదో శాస్త్రం చెప్పవడితివి, ఎన్కటి కెవడో జెప్పినట్లు, శాస్త్రానికి అంటూ "ఇసుల్ల పుట్టోలె" ఎన్నో సామెతలను అప్రయత్నంగా అలవోకగా చెప్పడం కనిపిస్తుంది.

ఇక్కడ తెలంగాణ సామెతలు ఇతర తెలుగు సామెతల కంటే భిన్నమైనవా అంటే 'సామెత' కుండే సార్వజనీన గుణం వల్ల ఒకేరకమైన సమానమైన అర్థాన్ని, భావాన్నిచ్చే ఒకేరకమైన సామెతలు ఈ రెండు ప్రాంతాల్లోనూ ప్రత్యేకంగా ఉండవచ్చు. అలాగే ఇతర భాషల్లో కూడా ఉన్నాయి.

ఈ సామెతలు ఎక్కడ ముందు పుట్టాయి, ఏ భాష లోంచి, ఏ భాషలలోకి వెళ్ళాయి అని చెప్పడం అంత సులభం కాదు. ఐతే తెలంగాణ సామెతల విషయంలో 3 అంశాలను దృష్టిలో పెట్టుకొని పరిశీలించవచ్చు.

1. ఇక్కడి ప్రాంత సంస్కృతిని బట్టి
2. భౌగోళిక స్వరూప అంశాలను బట్టి
3. భాషా వ్యవహారాన్ని బట్టి ... పరిశీలిస్తూ తెలంగాణ సామెతలను ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు.

ఐతే తెలంగాణ సామెతలుగా చెప్పుకున్నంత మాత్రాన ఇవి ఇక్కడ మాత్రమే ఉన్నట్టు కాని, ఇక్కడ మాత్రమే పుట్టినట్లు గాని చెప్పరాదు. తెలంగాణ ప్రాంతంలో విస్తృతంగా జన వ్యవహారంలో ఉండి ప్రజల నోళ్లల్లో ప్రత్యేక భాషలో, యాసలో నలుగుతున్న సామెతలు అని చెప్పవచ్చు.

భాష సమాజంతో ముడిపడి ఉన్న ఒక వ్యవస్థ. భాషలేని సమాజాన్ని ఊహించుకోలేము, సమాజం లేకుండా భాష కూడా లేదు. అంటే భాష సమాజం పర స్పరం ఆధారపడి ఉంటాయి. సమాజంలో ఒకరి భావా లను మరొకరికి తెలుపడానికి ఏర్పరుచుకున్న ధ్వని సంకేతాల వ్యవస్థ భాష.

భాషకు మూలం సంస్కృతి. ఈ సాంస్కృతిక చారిత్రక, సామాజిక పునాదుల మీద భాష నిర్ధారణం జరుగుతుంది. సంస్కృతికి భాషకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. సంస్కృతిని భాష ప్రతిబింబింపచేస్తున్నది.

భాషకు మార్పు సహజం, భాషకు స్థిరరూపం అనేది సాధ్యం కాదు. సమకాలీన భాషల్లో - ప్రాంతం, కులం, వృత్తి మొ॥ అంశాల ప్రాతిపదికన భాషలో బేధాలుంటాయి.

భాషాభేదాల ఆధారంగా తెలంగాణ, ఆంధ్రప్రాంతాల తెలుగు భాషా వ్యవహారం గురించి నందిని సిదారెడ్డి గారు క్రింది విధంగా అభిప్రాయపడ్డారు.

"తెలంగాణ ఆంధ్ర రెండు పదాలు ప్రాంత సూచికలు గానే వాడుకలోకి వచ్చినాయి. 'తలైంగ్' జాతీయులు నివసించిన ప్రాంతం తెలంగాణ, ఆంధ్రక సంతతి జాతి నివసించిన ప్రాంతం ఆంధ్రగా స్థిరపడ్డాయి. ప్రాంతాల వారి ప్రత్యేకతలతోనే భాషలు వికసించి తదనంతరం తెలుగు రూపొంది ఉండాలి. చారిత్రకంగా చాలా సంవత్సరాలు ఒకే పాలనలో ఉండడం వలన మరిన్ని వందల సంవత్సరాలు వేర్వేరు పాలనలో ఉండడం వలన భాష, సంస్కృతి, జీవనంలో అనేక మార్పులు సంభ వించినాయి.

భాషవిషయకంగా సాంస్కృతిక విషయకంగా పోలిక లెన్ని ఉన్నాయో వ్యత్యాసాలన్నీ ఉన్నాయి. రెండు ప్రాంతాల వాళ్ళదీ తెలుగే అయినా ఉచ్చారణలో,

పదజాలంలో, క్రియారూపాల్లో, వాక్య నిర్మాణంలో, ఎవరి ప్రత్యేకతలు వారికున్నాయి. ఆయా ప్రాంతాల ప్రజలు తమ అవసరాల కోసం రూపొందించుకున్న తెలుగు, ఉమ్మడి అవసరాల కోసం రూపొందిన తెలుగు భిన్న రూపాలు పొందింది. మొదటిది - వ్యవహార భాషగా, మాండలికంగా, రెండోది - పాలనా భాషగా, గ్రాంథిక భాషగా గుర్తింపు పొందింది. (2013 - తెలంగాణ తోవలు - కాసుల ప్రతాపరెడ్డి - తెలంగాణ సాంస్కృతిక వేదిక)

అందుకే కాళోజీ మనది పలుకుబళ్ళ భాష కావలె కాని బడిపలుకుల భాష కాదు అన్నాడు. ఇలా - తెలంగాణ సామెతలో కనపడే ప్రత్యేకమైన పదజాలం, పదాల్లో వచ్చిన మార్పులు సంధులు, క్రియరూపాలు, వాక్య నిర్మాణాలను పరిశీలించవచ్చు.

పదజాలం :

భాషా వ్యవహారంలో మనం ఎదుటి వ్యక్తులతో మాట్లాడేవి అన్నీ వ్యాక్యాలు గానే ఉంటాయి. వాక్యానికి కనిష్ట రూపమే పదమని భాషావేత్తలు నిర్వచించారు.

ద్రావిడ భాషా కుటుంబానికి చెందింది తెలుగు. ఈ తెలుగు భాష మాట్లాడే ప్రాంతాల్లో ఒక ప్రాంతంలో మాట్లాడే భాషకు మరొక ప్రాంతంలోని భాషలో విలక్షణత, ప్రత్యేకత కనిపిస్తుంది.

ఇతర ప్రాంతాల్లో మాట్లాడే తెలుగు భాషకంటే తెలంగాణ తెలుగు భాషనే అసలైన భాష అనే వాదన నేడు బలంగా వినిపిస్తుంది. కారణమేందంటే. తెలంగాణ భాష నుడికారంను మిగతా తెలుగు పదాలతో పోల్చి చూసినపుడు తెలంగాణలో కొన్ని పదాలు ప్రత్యేకంగా కనబడ్తాయి. ఇవి ప్రాచీన పదజాలం ఉండడం, అన్య దేశాల్లో ప్రత్యేకంగా ఉర్దూ పదజాలం ఇక్కడ భాషా సంస్కృతిలో ఇమిడిపోయిన ఉండడం కనపడుతుంది. ఈ పదజాలాన్ని క్రింద ఉదహరించిన సామెతల్లోని ఒత్తు అక్షరాల్లో ఉన్న పదాల ద్వారా గమనించవచ్చు.

1. ఈడుపుల దీపం బెట్టనోడు దేవుడికి బోనం బెడ్తానన్నట్లు
2. వర్దన్నపేటకు ఎద్దునియ్యద్దు - అడ్డగూడూరుకు పిల్లనియ్యద్దు
3. గోసిల గాశారం బెట్టుకుని - నాచారం బోతె ఏం లాభం
4. తవ్వేడిస్తె తంగెళ్ళు పీకాలె
5. పోశమ్మ కూడవెడ్తె మైసమ్మ మాయం జేసినట్టు
6. నాగుంబామంత కోపం జెర్రిపోతంత పిరికి
7. పెనం మీంచి పొయ్యిల వడ్డట్టు
8. ఊపిరిలేనోడు ఉర్కోతె - పానం లేనోడు పట్టపోయిండు
9. చెర్ల వడ్డోన్ని దీసి బాయి లేసినట్టు
10. గుమ్మినిండ గింజలుండాలె గూటాలోలె బిడ్డలుండాలె.
11. కట్టకు పుట్ట చేటు - చెట్టుకు తొర్ర చేటు
12. కొన్నది బింకెడు కొసిరేది లొట్టెడు
13. అన్నంలేక కోతిరూపు - బట్టల్లేక బాంచరూపు
14. దొప్పడంబలి కోసం దోసిట్లంబలి ఒలుకబోసిండట
15. రొట్టెలోని కంటే తునకలోడె నయం / మేలు
16. అంబలి తాగెటోనికి మీసాలెత్తెటోడొకడు
17. అయినోల్లకు ఆకుల్ల కానోల్లకు కంచాల్ల
18. తొందరపడితే బొందల వడుతవ్
19. నాభికాడ సల్లవడితె నవాబ్‌తోనె సవాల్ చెయ్యచ్చు
20. పండుటాకు పడ్డదని - పచ్చాకు నగిందట
21. ఆవులావులు గూనులాడి ల్యాగెల కాళ్ళు ఇరగ్గొట్టినట్లు
22. అల్లుడు కొడుకు గాదు - కోడలు బిడ్డె కాదట
23. ఆనరాకట - పానం బోకట - ఎవలు చెప్పంచ్చిండ్రు

24. ఏడ్పుగల్లోడు ఎవుసం బెడితే ఎప్పటికో మడి ఎండిపాయెనన్నట్లు
25. తవ్వేడల్ల కూలికిపోతె - తూమెడల్లు దుడ్డె బుక్కి పోయిందట.
26. ఎద్దు ఏడిస్తే ఎవుసం ఉండదు - రైతు ఏడిస్తె రాజ్జెం ఉండదట.
27. యాప ఇత్తేస్తే - మామిడి సెట్టు మొలుసత్తద ?
28. నడిసే ఎద్దునే ముల్లుతో పొడిసినట్లు -
29. దున్నంగవొయ్యి దులుపంగ అచ్చినట్టు
30. నియ్యతుంటి బర్కతుంటదట
31. పొద్దుగుత్త గని - పాలం గుత్త కాదట
32. అనుపసేండ్ల పోగొట్టుకుని మినుపసేండ్ల లెంకినట్లు
33. కింద వడ్డ బంఛోత్ - మీద వడ్డ బంఛోత్
34. కచ్చీరుకెక్కినోడు గాడిదెక్కినోడు ఒక్కటే
35. నవాబుసాబు కెదురులేదు - నాకు ఖదరు లేదు
36. ఎంటికేసి - గొంగడి దొబ్బినట్లు
37. ఇసుంట రమ్మంటే - ఇల్లంతనాదన్నట్లు
38. దారిల మామిడికాయ వెట్టి దండిగ దీసినట్లు
39. తెగిన బొక్కెన నూతిల దాక
40. మనాదికి మందులేదు - ఎట్టికి సుఖం లేదు
41. తండ్రి తంతెల మీద ఏరిగితె - కొడుకు కోనేట్ల ఏరిగినట్లు
42. ఆనెగాళ్ళోడు అంగడివోతె అచ్చిందాక నమ్మకం లేదన్నట్లు
43. పోశమ్మ పాతం జేస్తె - మైసమ్మ మాయం జేసిందట
44. నీరెటోడు పాలం ఎండబెట్టుకుంటడా అన్నట్లు?
45. తర్ర అడ్లకు నీళ్ల కల్లట
46. కత్తిపడితె ఖాన్ సాబ్ - చిప్పపడితే ఫకీర్‌సాబ్
47. గుమ్మడికాయ దొంగ అంటే భుజాల పునుక్కున్నట్లు
48. పొట్టకులేనోడికి - పోకట / డ ఎక్కువ.
49. అడవిల దిని - ఆకుతో తుడుచుకున్నట్లు
50. పాసువండ్లోడు దాసివెడితె - బంగారు పండ్లోడు దినిపోయిండట
51. గవ్వ అందాని లేదు గడియ పుర్సతు / రికాం లేదు
52. మొగులు జూసి ముంతల నీల్లు పారబోసినట్లు -
53. సకినమోలె ఉన్నవురా కొడుకా అంటే సచ్చి నీ కడుపున పుడుతా అన్నడట
54. తేలు మంత్రం రానోడు - పాం పొక్కల ఏలు వెట్టిండట
55. నమ్మిచ్చి బొండిగ గోసినట్లు
56. చెరువుల బర్రెను తోలి కొమ్ములకు బేరం జేసినట్లు
57. బర్రెను గొని తనుగుకు ఎన్క కచ్చినట్లు.
58. పాపం పోనని పచ్చిపులుసు వొస్తే కారం లేదని కచీరుకెక్కినట్టు
59. తోడెమంత పనికి అంగడంత లొల్లి
60. ఏతులకు ఏశం కట్టి మూతిమీసాలు గోక్కున్నట్లు
61. గుడ్డోడి చేతిల గుత్పకట్టె లెక్క
62. ఎన్కకెళ్ళి గుమ్మడికాయ పోతే గుర్తు వట్టడుగని ముందరికెల్లి ఆవగింజ వోతె ఎర్కవడ్తడు
63. ఈదుల్లకు వోయినోడు ఇల్లు గాలినా ఇంటికి రాడట.
64. కడివెడు అంబట్ల కశికెడు కారం గలిపినట్లు
65. ఏమందల కడ్తె ఏంది - మనమందల ఈంతె అయిపాయె అన్నట్లు
66. మొగులు మీద మన్నువోస్తె - మొకం మీద వడ్డట్లు
67. హకుమత్ కు నియ్యత్ లేదు - జంగల్ కు ధర లేదు
68. రికం లేని మనిషికి రఖం జోరు

69. నాటకం ఆడిన కాళ్ళు - నమిలిన నోరు ఊకుండయి
70. పిట్టెముత్తెమంత - గూత కొండంతనట
71. బతుకలేనోడు బాయిలపడవోతె - తియ్యవొయి నోడు కయ్యల వడ్డడట
72. గుడిజూసి రారా భీమన్న అంటే గుళ్ళె వొయి కూసుండట
73. తుంట లెత్తేసి మొద్దులెద్దుకున్నట్లు
74. ధరంపురి మంగళి సొరం లెక్క
75. సర్కసుల పులుల నాడిచ్చిటోడు - కుక్క గర్సి సచ్చిపోయిండట
76. తంతె పరుపుల వడ్డట్టు
76. బూడిదల ఉన్న చెయ్యి - బుకల పడ్డట్టు
77. బిచ్చగానింటికి దొంగతనంకు బోతె ఏకాణలు దొరికినట్టు
78. పొద్దటిది పొట్టకు - మాపడిది బట్టకు
79. రుబాబు రూపాయి - చేష్టలు సేపాయి
80. మూడు కొత్తలు ఉన్నయని మురిసిపోతె - ఏడు కొత్తలు బాకి అయిననయ్యట
81. చిన్న కుండకు ఎసరెక్కువనట
82. తుట్లె బాగోతం
83. చెర్ల నీల్ల అవుతల వడ్డంక ఏంజేస్తె ఏం లాభం
84. పిల్లలు లేని ఇల్లు పీర్ల కొట్టం అట
85. నచ్చిపోయిన బర్రె - పగిలిపోయిన బుడ్డెడు పాలిచ్చేదన్నట్లు
86. ఏం దెల్వనోడు ఆకాశినాడు వోతె - అన్ని దెల్సినోడు అమాసనాడు వోయినట్లు.
87. చెవిటోడి ముందు శంఖం ఊదితె - బొక్కెందుకు గొరుకుతవ్ అన్నడట
88. మంది మాటలు వట్టుకుని మార్మానం పోతె - మల్లచ్చె కల్ల ఇల్లు గాలిపోయిందట
89. కైకిల్జేసెటోనికి కైకిల్‌బోవద్దు - ఆలిని జంపినోనికి మార్మానం బోవద్దు.
90. కూసున్నకాడ నీళ్ళాడినట్లు
91. తలకు మాసినెంటికె ఏ రేవున పోతేంది
92. బోరెమంత మొగడు వోంగ - బొంత చింపుల కేడ్సినట్లు
93. ఆటపాటల్ల హన్మాజిపేట, మాటముచ్చట్ల మల్లారం
94. అయిలాపురం జోడోలె
95. గొర్రెకు కార్జెం లేదు.
96. అంగటానపకాయ లెక్క
97. అంబట్ల తెడ్డోలె

తెలంగాణ సామెతల్లో కనిపించే పదాల్లో చోటు చేసుకున్న ధ్వని మార్పులు ప్రత్యేకతలు

1. పదాది అచ్చుల్లో మార్పు :

- ఇ > ఉ గా మార్పు చెందుట - 'ఉస్కెల నూనెదీసినట్లు' - ఇసుక > ఉసుక > ఉస్కె / ఉస్క
- ఏ > ఆ - గా మార్పు : చాపపిల్ల కీత నేర్పినట్టు - చేప - చాప
- ఏందెల్వనోడు ఆకాశినాడు వోతె అన్ని దెలిసినోడు అమాసనాడు వోయినట్టు - ఏకాదశి - ఆకాశి
- చాట్ల తౌడు వోసి కొట్లాట వెట్టినట్టు - చేట - చాట

2. పద మధ్య అచ్చు మార్పు :

- ఉ > ఇ : "దార్లె మామిడికాయ వెట్టి దండిగ (జుర్మాన) దీసినట్లు - దండుగ - దండిగ
- అ > ఇ : తన చెయ్యి గాల్తదని సవితి బిడ్డ చేత్త కలియవెట్టిందట - సవతి - సవితి

- ఊ > ఇ : కొండ నాలికెకు మందేస్తె ఉన్న నాలికె ఊడిందట - నాలుక - నాలికె / నాలిక
- ఒ > ఎ : తుట్లె బాగోతం లెక్క - తుట్టిలో - తుట్లె

3. పదాంత అచ్చుకు పూర్వమున్న హల్లు మార్పు :

- చ > స - సల్లకచ్చి ముంత దాసినట్లు - చల్ల - సల్ల
- దాసి దాసి దయ్యాల - దాచి - దాసి
- గోసిల గాశారం బెట్టుకుని నాచారం జోతె ఏం లాభం - గోచి - గోసి
- పొద్దిడిసిన ఎండ (మొగున్నిడిసిన రండ) - ఇడిచి - ఇడిసి
- అవ్వేడంగ బిడ్డేడ్సినట్లు - ఏడ్చిన - ఏడ్సిన
- చూసి రమ్మంటె కాల్చి వచ్చినట్లు - చూచి - చూసి

4. పదాంత అచ్చు మార్పు :

అ > ఎ: - గావురాల బిడ్డె పుడితె గడ్డపారతో చెవులు గట్టించిండట - బిడ్డ - బిడ్డె
పిట్టెముత్తెమంత - గూత కొండంతనట - పిట్ట - పిట్టె
కొండ నాలికెకు మందేస్తె ఉన్న నాలుక ఉండిందట - నాలుక - నాలికె

ఊ > ఇ : ● ఏటికెదిరీదినట్లు - ఏరు > ఏటి
● ఏటికి వొయి జారపడి - ఊరు అచ్చిరాలేదన్నట్లు
● ఏటికి ఎన్ని నీళ్ళచ్చినా - కుక్కకు గతుకు నీళ్ళే

5. పదాది హల్లు మార్పు :

చ > స : ● పట్టి పట్టి పంగనామాలు వెడితె గోడ సాటుకు వొయి తుడుసుకున్నట్లు
● ఏనుగు సచ్చినా వెయ్యే బతికినా వెయ్యే
● నాభికాడ సల్లవడితె నవాబ్‌తోనె సవాల్ జెయ్యచ్చు
● గొర్రెపిల్లను / ల్యాగపిల్లను సంకల వెట్టుకుని అడవంత లెంకినట్లు
● దరిద్రుని సేన్ల వడగండ్లవాన
● యాప ఇత్తేస్తె - మామిడి సెట్టు మొలుస్తది?
● పటేలు సల్ల సిక్క గుండదన్నట్లు
● సచ్చినోడి పెండ్లికి అచ్చిందే కట్నం
● సల్ల కచ్చిముంత దాసినట్లు
● సీమంతపనికి అంగడంత లొల్లి
● సాకలోల్ల గాడిదికి ఆకలైన నీళ్ళీ, దూపైనా నీళ్లే
● సచ్చిపోయిన బర్రె - పగిలిపోయిన బుడ్డెడు పాలిచ్చేదన్నట్లు

క > గ :
- నక్కవాగుల గొట్టుకపోతు - ఊరంత మునుగుతుందన్నదట
- గాలికి గడ్డపారలు గొట్టుకుపోయినట
- పొద్దుగుత్త గని - పాలం గుత్తగాదట
- ఆనె గాళ్ళోడు అంగడివోతె - అచ్చిందాక నమ్మకం లేదన్నట్లు
- నమ్మిచ్చి బొండిగ గోసినట్లు
- పిట్టె ముత్తెమంత - గూత కొండంతనట
- సర్కసుల పులుల నాడిచ్చెటోడు - కుక్క గర్సిసచ్చిపోయిండట
- మొకం మంచిగ లేక అద్దం నేలకు గొట్టినల్లు
- కాకులను గొట్టి గద్దల కేసినట్లు
- ఊదుగాలది - పీరీల్లెవ్వయి
- తోటోడు తొడగోసుకుంటె - నేను మెడ గొసుకుంట అన్నడట
- బంగారు కత్తని మెడ గోసుకున్నట్లు

చ > జ :
- పోశమ్మ పోతం జేస్తె - మైసమ్మ మాయం జేసిందట
- మొగులు జూసి ముంతల నీళ్ళు వారవోసిండట
- శకునం జెప్పే బల్లి - కుడిదిల పడి సచ్చినట్లు
- దాసి దాసి దయ్యాల పాలు జేసినట్లు
- చెప్పంగ వినకుంటె - చెడంగ జూడాలె
- ఇగురం జెప్పు ఈరక్క / మల్లక్క అంటే సల్లవోసి ఇల్లు అలకమన్నదట
- కైకిల్జేసెటోనికి కైకిల్ బోవద్దు - ఆలిని జంపినోనికి మార్మానం బోవద్దు

ప > వ :
- పొమ్మనలేక పొగవెట్టినట్టు
- పోశమ్మ కూడ వెడ్తె మైసమ్మ మాయం జేసె
- పట్టి పట్టి పంగనమాలు వెడితె - గోడ సాటుకు వోయి తుడుసుకున్నట్లు
- చెర్ల వడ్లోన్ని దీసి బాయిలే (వగయ) సినట్లు
- దొప్పటంబలి కోసం - దోసిట్లంబలి ఒలుకవోసిండట
- తొందర వడితె - బొందల వడుతవ్
- గొర్రె పిల్లను సంకల వెట్టుకుని అడివంత లెంకినట్లు
- నడిసే ఎద్దునె వొడిసినటు
- గొర్లు దినెటోడు వొయి బర్లు దినెటోడచ్చినట్టు
- దార్లె మామిడికాయ వెట్టి దండిగ దీసినట్లు
- గాలికి వొయ్యే కంపను వీపుకు తగిలించుకున్నట్లు
- పట్టి పట్టి పంగ

ప > బ : ● ఈడుపుల దీపం బెట్టనోడు - దేవుడికి బోనం బెడ్తడన్నట్లు
● కందిసేన్ల ఉంగురం బారేసుకొని - పప్పుకుండల లెంకినట్లు
● మంది మాటలు వట్టుకుని మారుమానం బోతె - మల్లచ్చెటికల్ల ఇల్లు గాలిపోయిందట.
● కైకిల్జేసెటోనికి కైకిల్ బోవద్దు ఆలిని జంపినోనికి మార్మానం బోవద్దు

త > ద : ● కుండ పలిగినా కుక్క బుద్ధి దెలిసింది
● చెర్లవడ్డోన్ని దీసి బాయిలేసినట్లు
● పిల్లికండ్లు మూసుకుని పాలు దాగినట్లు
● అడవిల దిని - ఆకుతో తుడుసుకున్నట్లు
● గాలికి వొయ్యే కంపు వీపుకు - దగిలించుకున్నట్లు
● దూప గాంగనె బాయి దవ్వినట్లు

6. పదాంత హల్లు మార్పు

వ > య : ● చెర్లవడ్డోన్ని దీసిబాయి లేసినట్లు

7. పదాది హల్లు లోపించి అచ్చుమిగలడం :

వ > ఆ - ● ఆన రాకట పానం బోకట ఎవ్వలు జెప్పొచ్చిండ్రు

వ > అ - ● సచ్చినోని పెండ్లికి - అచ్చిందే కట్నం
● ఆనెగాళ్ళోడు అంగడిబోతె - అచ్చిందాక నమ్మకం లేదు
● తర్ర అడ్లకు నీల్లకల్లట

వ > ఇ : ● ఇత్తేసి పొత్తుగూడు
● యాప ఇత్తేస్తే మామిడి సెట్టు మొలుస్తద
● ఇంటికి ఇత్తు లేదు - కంటికి నిద్రలేదు
● అన్నీ ఉన్న ఇస్తరి అనిగిమణిగి ఉంటది - ఏం లేని ఇస్తరి ఎగిరెగిరిపడ్తది

వ > ఈ : ● మడిమెత్తు బంగారం కన్న - ఈసమెత్తు అధికారం మేలట

వ > ఎ : ● ఏడ్పుగల్లోడు ఎవుసం బెడితె - ఎప్పటికో మడి ఎండిపాయెనట
● ఎద్దుఏడిస్తె ఎవుసం ఉండదు - రైతేడిస్తె రాజ్జెం ఉండదు
● ఎంటికేసి - గొంగడి దొబ్బినట్లు
● ఏతులకు ఏశం గట్టి మూతిమీసాలు గొరుక్కున్నట్లు
● ఎన్కకెళ్ళి ఏనుగులు వోయిన సరె గని - ముంగలి కెళ్ళి చీమలు వోవద్దు

8. పద మధ్య మల్లు మార్పు :

ణ > న - ఆనరాకట - పానం బోకట ఎవరు చెప్పచ్చిండ్రు

న > ల - బర్రెనుగొని తలుగుకు ఎన్కకచ్చినట్లు

ద > గ - ఎన్కకెళ్లి ఏనుగులు వోయిన సరెగని - ముంగలి కెళ్ళి చీమలు వోవద్దు

9. పదమధ్య వర్ణ లోపం :

- మీది నుంచి > మీంచి - పెనం మీంచి పాయ్యిల వడ్డట్లు
- చెరువుల > చెర్ల - చెర్ల వడ్డోన్ని దీసి బాయి లేసినట్లు
- భోజనం > బోనం - ఈడుపుల దీపం బెట్టనోడు - దేవుడికి బోనం బెడ్తడట
- ఆకులల్ల > ఆకుల్ల - అయినోల్లకు ఆకుల్ల - కానోల్లకు కంచాల్ల

  కంచాలల్ల > కంచాల్ల
- గోదావరి > గోదారి - కుక్కతోక వట్టి గోదారీ దినట్లు
- పచ్చనాకు > పచ్చాకు - పండుటాకు పడ్డదని పచ్చాకు (పైనున్న) నగిందట
- నిజాయితి > నియ్యతి - నియ్యతుంటె బర్కతుంటదట

ఇట్లా పదజాలంలో, పదంలోని ధ్వనుల మార్పుల్లో గల ప్రత్యేకతలు పరిశీలించవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో కూడా పద జాలం, ధ్వనుల ప్రయోగాలు తదితర భాషాపరమైన అంశాలలో ఏకరూపత లేదు. కాబట్టి తెలంగాణ భాషకు ప్రామాణికతను చేకూర్చే ప్రస్తుత సందర్భంలో, గతంలో తెలుగు ప్రామాణిక భాష ఈ విషయంలో జరిగిన పొరపాట్లు "రెండున్నర జిల్లాలదే దండిభాష" లాగా మనసు నొప్పించే అవకాశం ఇవ్వ కుండా, మన భాష "బడి పలుకులది గాకుండా పలుకు బడులదిగా ఉండాలంటే సామెతల్లో ఇంకా మిగిలి పోయిన అచ్చమైన, స్వచ్ఛమైన భాషా స్వరూపాన్ని కూడా ప్రాతిపదికగా తీసుకోవాల్సిన అవసరం ఎంతయినాఉంది.

ఆధారగ్రంథాలు :

1. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా॥ ఆర్.వి.ఎస్. సుందరం
2. తెలుగు సామెతలు - జానపదుల సంస్కృతి - బి. దామోదర్ రావు
3. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - డా॥ భద్రిరాజు కృష్ణమూర్తి
4. తెలంగాణ మాండలికాలు, కావ్య ప్రయోగాలు - ఆచార్య రవ్వా శ్రీహరి
5. శ్రీహరి నిఘంటువు - ఆచార్య రవ్వా శ్రీహరి
6. తెలంగాణ జాతీయాలు - వేముల పెరుమాళ్ళు
7. తెలంగాణ సామెతలు, జాతీయాలు - కర్ర ఎల్లారెడ్డి
8. తెలంగాణ పదకోశం - డా॥ నలిమెల భాస్కర్

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పల్నాడు ప్రాశస్త్యం

– ఐ. వేణునాయక్, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

పల్నాడు అనేది కూడా రాయలసీమ, తెలంగాణా వలె ఒక ప్రాంతపు పేరు మాత్రమే. ఇది ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన ప్రదేశం. ఈ ప్రాంతంలో జరిగిన పల్నాటి యుద్ధం ప్రముఖమైనదని చెప్పవచ్చు. పల్నాడులో ప్రజల జీవన విధానం గురించి, ఈ ప్రాంతపు మహిళలు, బాలలు, వృత్తి కళాకారులు, వారి మధ్య గమనించిన జానపద గేయాలను గురించి చెప్పడం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

పల్నాటి సీమ అంటే అది నేటి గుంటూరు జిల్లాలోని ప్రముఖ ప్రదేశం అవడానికి ఇది చాలా చిన్న ప్రదేశం అయినప్పటికీ దీని ప్రాముఖ్యత ప్రపంచం అంతా విస్తరించింది. నిజానికి పల్నాడనే గ్రామంగానీ పట్టణంగానీ ఈ ప్రాంతంలో లేదు. పల్నాడు అనే పదానికి పల్లెనాడు, పలనాడు, పల్లవ బుగ్గ, పల్లవ భాగ, పల్లవభోగం, పలినాడు, పల్లిదేశము, పల్లి రాష్ట్రము, పల్లె విషయం మొదలైన పేర్లు మనకు కనిపిస్తాయి. మన ప్రాచీన చరిత్రలో నాడు అనే పదం పల్లెలకు, పల్లెలున్న భూభాగానికి ఉండేది. దేశాన్ని సీమలుగా, నాడులుగా, మండలాలుగా విభజించిన దాఖలాలు కన్పిస్తాయి. అదేవిధంగా గురజాల తాలూకా, సత్తెనపల్లి, నర్సరావు పేట, వినుకొండ, తాలూకాల్లోని గ్రామాల్ని కలిపి పల్నాడని వ్యవహరించేవారు. మాచర్ల ఆదిత్యేశ్వరాలయంలోగల శాసనంలో 'పల్లిదేశము'ని, అమరావతి శాసనంలో 'పలనాడు' అని, కారంపూడి తూర్పు వైపున గల నల్లాం చక్రవర్తుల శాసనంలో 'పలినాటివారు' అన్న పదాలు కన్పిన్తున్నాయి. కవి సార్వభౌముడు శ్రీనాధమహాకవి ప్రయోగాల్లో కూడా పల్లెనాడు, పల్నాడు, పలనాడు అనేవి కన్పిస్తాయి. ప్రభావతి ప్రద్యుమ్నంలో పింగళి సూరన తాను పల్నాటను, పాకనాటను ప్రసిద్ధుడై నట్లు చెప్పుకొన్నాడు. విదేశీయులైన పహ్లవ అన్న రాజ వంశీయుల పాలనలోనిది. కాబట్టి ఆ రాజవంశ పరంగా వచ్చిన 'పహ్లవ' శబ్దం పల్లవగా మారిందని కొందరంటారు. పల్నాటి సీమ నైసర్గిక స్థితికి అనుగుణంగా స్థిరపరచిన వాదం 'పల్లు' అనే పదం తెలుగులో 'పల్లం' అనే పదానికి రూపాంతరం. ఎన్నెన్నో కొండ గుట్టల మధ్య పల్లంగా ఉన్న ప్రదేశం లేదా నాడు కాబట్టి 'పల్లునాడు' అయి క్రమేణా పల్నాడు అయి ఉండవచ్చని ఒక అభిప్రాయం. ఈ విధంగా పల్నాడు ప్రాంతం గురించిన విషయం అర్థం అవుతుంది. అసలు పల్నాడు ప్రాంతం గుంటూరు జిల్లాలో ఉన్నది. గుంటూరు జిల్లాలోని కొన్ని మండలాలు పల్నాడులో ఉంటాయి అవి.... పల్నాడులో తాలూకాల పరిధిలో ఉన్న మండలాలు మాచర్ల, దుర్గి, కారెంపూడి, పిడుగురాళ్ళ, మాచవరం, దాచేపల్లి, గురజాల, వెల్దుర్తి, రెంటచింతల అనే తొమ్మిది మండలాలు ఉన్నాయి. ఈ పల్నాడుకు సరిహద్దుగా గుంటూరు జిల్లాలోని వినుకొండ, సత్తెనపల్లి, పెదకూరపాడు మండలాలతోపాటుగా ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు తాలూకా మండలాలు కూడా పల్నాడుకు సరిహద్దు మండలాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో 95 గ్రామాలు మాత్రం ఉన్నాయి. ఈ పల్నాటి సీమకు పశ్చిమోత్తరాన దాదాపు 100 కి.మీ. సరిహద్దుగా కృష్ణానది ఉంది. అంటే ఈ సీమకు పశ్చిమాన ఉన్న అడవులగుండా ప్రవేశించి, ఉత్తరాన వేమవరం, తంగెడల వద్ద పల్నాటి సీమను దాటుతుంది. తూర్పు ఈశాన్య ప్రాంతం హద్దుగా గుంటూరు జిల్లాలోని నర్సరావుపేట తాలూకా, దక్షిణ హద్దుగా గుంటూరు జిల్లా వినుకొండ తాలూకా ఇంకా ప్రకాశం జిల్లా గిద్దలూరు తాలూకాలు కూడా ఈ పల్నాడు ప్రాంతానికి హద్దులుగా ఉన్నాయి. ప్రతి గ్రామానికి ఒక పేరు ఉంటుంది. ఆ పేరు రావడా

నికి అనేక కారణాలుంటాయి. అక్కడి ప్రజల జీవన విధానం ఉదాహరణగా కుమ్మరి కులంవారు ఉండే ప్రాంతాన్ని కుమ్మరిపాలెం అని పిలిచేవారు. ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితి ఉదాహరణకు మేళ్ల చెరువు అనేది అక్కడ చెరువు ఉండేది. కాబట్టి దానిపేరు మీదుగా ఆ గ్రామ నామం ఏర్పడింది. ఇలాంటి ఎన్నెన్నో కారణాలతో గ్రామనామాలు ఏర్పడ్డాయి. కొన్ని సందర్భాల్లో వీరుల పేర్లమీదుగా కొన్ని గ్రామాలు కూడా ఏర్పడ్డాయి. అలుగు రాజు పేరు మీదుగా అలుగురాజు పల్లె అనే గ్రామం ఏర్పడడం ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చరిత్రలోకి ప్రవేశిస్తే అప్పటి గ్రామనామాలు నేడు కన్పించకోవచ్చును నేడు అనేక గ్రామాలు కొత్తవి పుట్టుకు రావడం జరిగింది. పల్నాడుకు పశ్చిమోత్తరాన కృష్ణానది సుమారు 100 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. పూర్వం తూర్పు ఈశాన్య ప్రాంతం హద్దుగా గుంటూరు జిల్లాలోని నర్సరావుపేట తాలూకా ఉండేది. ప్రస్తుతం అలా లేదు. పల్నాడులో ప్రస్తుతం ఉన్న ఈ తొమ్మిది మండలాలలో ఉన్న కొన్ని ముఖ్యమైన గ్రామాలను వాటి చరిత్రను పరిశీలిద్దాం.

గురజాల :

పల్నాటి వీరుల చరిత్రలో ప్రసిద్ధిగాంచిన పట్టణం గురజాల. ఈ గురజాలకు పూర్వం అనేక పేర్లు ఉండేవి. వాటిలో గురివిందల, మాధవ పురము' అనే పేర్లు ముఖ్య మైనవి. మాధవ తీగ లేక మాధవి అంటే గురివింద తీగ అని అర్థం. అంటే ఆ ప్రాంతంలో గురివింద తీగలు విస్తారంగా పెరిగేవని, వాటిని నరికి అక్కడ ఊరు కట్టడం వల్ల ఆ ప్రాంతానికి 'గురివిందల' అనే పేరు ప్రజా వ్యవహారంలో గురివిందల కాస్తా గురజాల అయిందని వాడుక. ఈ గురజాలను రాజధానికా చేసుకొని హైహయ వంశపురాజైన అలుగురాజు పలనాడును పరిశీలించాడు. తర్వాత అతని వారసుడయిన నలగాముడు కూడా గురజాల రాజధానిగా పలనాడును పరిపాలించాడు. నలగాముని సోదరుడు మలిదేవుడు మాచర్లను రాజ ధానిగా చేసుకుని పరిపాలించాడు. ఈ గురజాల నేడు ఒక పట్టణం. ఈ పట్టణంలో కూడా ప్రతి గ్రామానికి ఉన్నట్లే ఒక గ్రామదేవత ఉంది. ఆమె పేరు గంగమ్మ. ఆమె పేరుతో కట్టిన గుడి ఇక్కడ గ్రామదేవత గుడిగా ప్రసిద్ధి చెందినది. నేటి గుంటూరు జిల్లాలోని గురజాల మండలంలో సుమారు పద్దెనిమిది గ్రామాలు ఉన్నాయి. వాటిల్లో ముఖ్యమైనవి.. తేలుకుట్ల, గంగవరం, గోగులపాడు, పల్లెగుంట, అంబాపురం, జంగమహేశ్వర పురం, సమాధానపేట, గొట్టి ముక్కల, దైదా, గురజాల మండలంలో గురజాలతోపాటుగా పులిపాడు, చెర్లగుడి పాడు, మాడుగుల గ్రామాలు నేటికీ అవే పేర్లతో పిలవ బడుతున్నాయి.

మాచర్ల :

మాచర్ల పల్నాటి వీర చరిత్రలో అత్యంత ముఖ్య స్థానాన్ని ఆక్రమించింది. ఇక్కడ చాగి బేతరాజు త్రవ్వించిన మహాదేవి చెరువు ప్రసిద్ధి చెందింది. ఆ ప్రాంతంలో పూర్వం మహాదేవి ఆలయం ఉండేదని, మహాదేవి (పార్వతి) చెరువు క్రమంగా మార్పు చెంది మా చెరువై చివరకు జనబాహుళ్యంలో వ్యావహారికంగా మాచెరువు కాస్తా మాచెర్లగా మార్పు చెందిందని చాలామంది అభిప్రాయం. మాచర్లలో పాత బజారులో హైహవరాజుల కాలంలో నిర్మించిన చెన్నకేశవస్వామి దేవాలయం ఉంది. పల్నాటి యుద్ధం జరిగే సమయంలో బ్రహ్మనాయుడు ఈ ఆలయంలో స్వామికి పూజలు జరిపి, యుద్ధానికి వెళ్లేవాడు. ఇంకా బ్రహ్మనాయుడు మలిదేవరాజుకి పల్నాటి రాజ్యంలో కొంత భాగము ఇప్పించి, గుహజాల నుండి విడిపోయి మాచర్ల రాజధానిగా పరిపాలింపజేశాడు. నల గామరాజుకు, మలిదేవరాజుకు జరిగిన యుద్ధం పల్నాటి యుద్ధం. ఇది మాచర్లకు, గురజాలకు మధ్యన జరిగింద నవచ్చు. మాచర్ల మండలంలో ప్రస్తుతం సుమారు 26 గ్రామాలున్నాయి.

వీటిలో ముఖ్యమైన గ్రామాలు... రేగులవరం తండా, చింతల తండా, లచ్చంబావి, భైరవునిపాడు, బోదనం పాడు, అచ్చమ్మకుంట తండా, లింగాపురం, బెల్లంకొండ

వారిపాలెం, మిట్టమీదపల్లె వంటి గ్రామాలు అలుగురాజు పల్లె హైహయ వంశపురాజు పేరు మీద ఏర్పడింది. ఇది నేటికీ అదే పేరుతో పిలువబడుతుంది. ఇవన్నీ నేటికి జానపదుల నిలయాలుగా ఉన్నాయి. మాచర్ల మండలంలో నేటికీ అదే పేరుతో ఉన్న గ్రామాలు కంభంపాడు, విజయపురి అనేవి.

కారెంపూడి :

ఈ గ్రామాన్ని కారంపూడి అని కూడా పిలుస్తారు. ఇది గురజాల పట్టణానికి ఆగ్నేయంగా సుమారు పది మైళ్ల దూరంలో ఉంది. ఈ కారెంపూడికి తూర్పున నాగులేరు నది ఉంది. ఈ నాగులేటి తూర్పు ఒడ్డున పల్నాటి వీరుల రుణభూమి ఉంది. ఆ ప్రక్కన వీరులగుడి దాని సమీపాల గంగ విగ్రహం, కాలభైరవ విగ్రహాలు ఉన్నాయి. ఇంకా దగ్గరలో కళ్లిపాతురాజు దేవాలయం, ఎరుకల శక్తి దేవాలయాలున్నాయి. వీరులు ఆవేశంతో రణరంగంలో ప్రవేశించే ద్వారాన్నే కళ్లితోరణం అని అంటారు. ఈ పట్టణంలో ఇంకా మనకు చరిత్ర ప్రసిద్ధమైన చెన్నకేశవాలయం, ఒక ప్రక్క అంకమ్మ గ్రామదేవత గుడి, కారంపూడి మండలంలో సుమారు 17 గ్రామాలు ఉన్నాయి. చినగార్లపాడు, గాదెవారిపల్లె, మిరియాల, ఇనపరాజు పల్లి, కాచవరం, చింతపల్లె, ఒప్పిచెర్ల, పెదకొదమగుండ్ల, పేటసన్నిగండ్ల, వేపకంపల్లె భట్టువారిపల్లె నిర్మలపాడు, లక్ష్మీపురం, కాకానివారిపాలెం వంటివి కొన్ని.

దాచెపల్లి :

నేటి పల్నాటి సీమలో దాచేపల్లి కూడా ఒక మండలం. ఈ దాచేపల్లి మండలంలో ప్రస్తుతం 18 గ్రామాలు ఉన్నాయి. అవి తక్కెళ్లపాడు, ఇరికేపల్లి, పొందుగుల, అలుగుమల్లిపాడు, రామాపురం, భట్రుపాలెం, తంగెడ, కేశనపల్లి, ముత్యాలంపాడు, నారాయణపురం, గామాలపాడు, నడికుడి, మాదినపాడు, దాచేపల్లి, పెదగార్లపాడు, సారంగపల్లి, శంకరాపురం గ్రామాలు.

రెంటచింతల :

రెంటచింతల మండలంలో రెంటచింతల గ్రామం ఉంది. ఇక్కడ వాతావరణ శాఖవారు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రెంటచింతల మండలంలో 11 గ్రామాలు ఉన్నాయి. పురాతన గ్రామం జట్టిపాలెం అనేది నేటికీ అదే పేరుతో ఉంది. ఈ పిడుగురాళ్ల మండలంలో ఆనాటి నుండి నేటివరకు పేరు మార్పు లేకుండా ఉన్న గ్రామం జూలకల్లు.ఈ మండలంలో పిడుగురాళ్ల కాకుండా తుమ్మలచెరువు, కామేపల్లి, పెద అగ్రహారం, కరాలపాడు, కొండమోడు, గుత్తికొండ, బ్రాహ్మణపల్లి, వీరాపురం, కోనంకి, జానపాడు గ్రామాలు ఉన్నాయి.

పిడుగురాళ్ళ :

పూర్వం ఇక్కడ పిడుగులు పడడం, అవి మాత్రమే కాకుండా కొన్ని చిన్న చిన్న రాళ్లు కూడా పడేవని అందుకనే ఈ ప్రాంతాన్ని పిడుగురాళ్ల అని పిలిచేవారు. ఈ పిడుగురాళ్ల మండలంలో ఆనాటి నుండి నేటివరకు పేరు మార్పు లేకుండా ఉన్న గ్రామం జూలకల్లు. ఈ మండలంలో పిడుగురాళ్ల కాకుండా తుమ్మలచెరువు, కామేపల్లి, పెద అగ్రహారం, కరాలపాడు, కొండమోడు, గుత్తికొండ, బ్రాహ్మణపల్లి, వీరాపురం, కోనంకి, జానపాడు గ్రామాలు ఉన్నాయి.

వెల్దుర్తి :

ఇది దుర్గి, మాచర్ల మండలాలకు మధ్యన ఉంది. పల్నాడు ప్రాంతంలో ఇది పెద్ద మండలంగా ఉంది. వెల్దుర్తి మండలంలోని మందడి గ్రామం ఆనాటి నుండి నేటి వరకు అదే పేరుతో ఉంది. ఇక మిగిలిన గ్రామాల విషయానికి వస్తే ఈ మండలంలో మొత్తం 16 గ్రామాలు ఉన్నాయి. వాటిలో భోగోలు, కలుగోట్ల, లంజబండ, బుక్కాపురం, చెరుకులపాడు, గోవర్ధనగిరి, మల్లేపల్లి నార్లపురం, నరసాపురం, పుల్లగుమ్మి, రామళ్లకోట, సర్పరాజపురం, సూడేపల్లి, బోయినపల్లె, పేరేముల, వెల్దుర్తి గ్రామాలు ఈ మండలంలో ఉన్నాయి.

దుర్గి :

దుర్గి మండలంలో మొత్తం 18 గ్రామాలు ఉన్నాయి.

వాటిలో దుర్గి ఆనాటి నుండి పేరు మారకుండా ఉంది. అంతేగాక అడిగొప్పుల అనే గ్రామం కూడా ఆనాటి నుండి పేరు మారకుండా ఉంది. దుర్గి శిల్పకళా కేంద్రంగా చెప్పవచ్చు. 1962లో ప్రభుత్వంవారు దుర్గిలో శిల్పులను తయారు చేసే శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మండలంలో మిగిలిన గ్రామాలు... పోలేపల్లి, దరివేముల, ముటుకూరు, ఆత్మకూరు, కోలగట్ల, ధర్మవరం, కంచరగుంట, ఓబులేశినిపల్లి, నిదానంపాడు, ఎర్రపాలెం, తేరాల, జంగమహేశ్వరపాడు, నరమాలపాడు, శ్యామ రాజుపురం, మించాలంపాడు గ్రామాలు ఉన్నాయి.

మాచవరం :

మాచవరం మండలానికి దాచేపల్లి, పిడుగురాళ్ల మండలాలు సరిహద్దులుగా ఉన్నాయి. ఈ మండలంలో దాదాపు 12 గ్రామాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైన గ్రామాలు చెన్నయ్యపాలెం, మల్లవోలు, తాడుట్ల, పిన్నెల్లి, వేమవరం, ఆకురాజుపల్లె, మాచవరం, మొర్జంపాడు, గాంధీనగరం, పిల్లుట్ల, శ్రీరుక్మిణీపురం, తురకపాలెం గ్రామాలు ఉన్నాయి.

మొత్తం నేడు పల్నాటి సీమలో ఉన్న మండలాలోని 149 గ్రామాలకు ఈ ప్రాంతంలో 95 గ్రామాలు మాత్రం ఉన్నాయి. ఒకప్పుడు పల్నాడు రాజ్యం ఇంకా వ్యాపించి ఉండేది. నర్సరావుపేటను పల్నాడు ముఖద్వారమని పిలిచేవారు. నకిరికల్లు మండలం (పిడుగురాళ్ల పక్కన ఉంది) కూడా పల్నాడులో కలసి ఉంది. దీనిలోని చేజెర్ల గ్రామం నేటికీ అదే పేరుతో పిలువబడుతుంది. కంభం పాడు అనే గ్రామం అదే పేరుతో మాచర్లలోనే కాక నూజెండ్ల మండలం, పెదకూరపాడు మండలంలో కూడా ఉంది

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కులతత్వాన్ని కుళ్ళబొడిచిన వేమన

– డా॥ కె. పుల్లారెడ్డి , తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం కడప.

ఉర్వివారికెల్ల నొక్క కంచము బెట్టి
కులము పాలయ జేసి పొత్తుగుడిపి
తలను చెయ్యి బెట్టి తగనమ్మజెప్పరా
విశ్వదాభిరామ! వినుర వేమ!

వేమన ప్రాచీన తెలుగు కవులలో ప్రజాకవిగా ఆధునిక కాలంలో ప్రసిద్ధుడయ్యాడు. ఆయన భారతదేశ చరిత్రలో మధ్యయుగం చివరి దశలో క్రీ.శ. 17వ శతాబ్దిలో తెలుగు నాట పుట్టాడు. నన్నయాది పూర్వకవుల కంటే భిన్నంగా ఆయన మౌలికమైన కవిగా నిలిచాడు. పురాణాలను అనువదించే పనికి పూనుకోకుండా తన సమకాలీన సామాజిక వాస్తవికతను, విమర్శనాత్మకంగా పద్యాలలో ప్రతిబింబించాడు. ఈనాటి పరిభాషలో చెప్పాలంటే వేమన క్రిటికల్ రియలిస్ట్. విమర్శనాత్మక వాస్తవిక కవి. సమాజంలో ప్రజల మధ్య తిరుగుతూ తన దృష్టికి వచ్చిన ప్రతి సామాజికాంశాన్ని ఆయన ప్రజల భాషలో, సులభశైలిలో ఆటవెలది ఛందస్సులో విమర్శిస్తూ పద్యాలల్లాడు.

వేమన తన కవిత్వంలో ఘాటుగా విమర్శించిన సామాజికాంశాలలో 'కులతత్వం' ప్రధానమైనది. వేమన సమాజంలో కనిపించే అహంకార, ఆధిపత్య శక్తులను కఠినంగా విమర్శించారు. కులతత్వాన్ని చీల్చిచెండాడాడు. అందులో భాగంగా అస్పృశ్యతా జాడ్యాన్ని తీవ్రంగా విమర్శించాడు. కులరహిత సమాజాన్ని ఆయన కోరుకున్నాడు. కులాన్ని సమాజంలోంచి తరిమికొట్టమని పిలుపునిచ్చాడు. 'ఉర్వివారికెల్ల' అనే పద్యంలో వేమన ఒక సౌభ్రాతృత్వంతో కూడిన మానవీయ, ప్రజాస్వామ్య సమాజ నిర్మాణం కోసం తాపత్రయపడ్డాడు. భారతీయ సమాజంలో కులం చాలా ప్రధానమైనది. దానిని నిర్మూలించడానికి చరిత్రలో చాలా ప్రయత్నాలు జరిగాయి. అలా ప్రయత్నించినవాళ్ళలో వేమన ఒకడు. వేమనకు కులం పుట్టుక పట్ల సరైన అవగాహన ఉంది. కులాలన్నీ ఒకేసారి పుట్టాయనీ, వాటిలో ఎక్కువ తక్కువలు లేవనీ వేమన అభిప్రాయపడ్డాడు. కులాల ఎక్కువ తక్కువల పేరు మీద గొడవలు పడవద్దని ప్రజలకు ప్రబోధించాడు.

పరగ బొమ్మగుడ్డు పరికించి చూచిన
కులములన్ని యందు గూడబుట్టె
అందరొకటి గలయ నన్నదమ్ములె గదా
విశ్వదాభిరామ! వినుర వేమ!

జాగ్రత్తగా ఆలోచిస్తే, బ్రహ్మాండం అనే గుడ్డు నుండి కులాలన్నీ ఒకేసారి పుట్టాయి. అందువల్ల ప్రజలంతా అన్నదమ్ముల వంటివారు కదా! అని ఒక శాస్త్రీయమైన, ఆరోగ్యకరమైన ప్రతిపాదన చేశాడు వేమన. శ్రమవిభజన కోసం ఏర్పడిన కులాలు, తర్వాతి కాలంలో వంశపారంపర్య వ్యవస్థ ఏర్పడి, ఉచ్చనీచ భేదాలేర్పడి సమాజాన్ని నిచ్చెనమెట్ల సమాజంగా మార్చేశాయి. ఆ నిచ్చెనను కూల్చడానికి వేమన ఆధిపత్యవాదులకు బుద్ధి చెప్పాడు. ఆధునిక కాలంలో గురజాడ, గుర్రం జాషువ వంటి వాళ్ళు విశ్వజనీన సిద్ధాంతాలు చెప్పడంలో వేమన ప్రభావముంది. పనివిభజన కోసం ఏర్పడిన కులం, చివరికి పనివాళ్ళ విభజనగా మారిపోయిన తీరుపట్ల వేమన బాధపడ్డాడు. శ్రామికులను ఆధిపత్యవాదులు హీనంగా చూడటాన్ని నిరసించాడు.

కులము హెచ్చు తగ్గు గొడవలు పనిలేదు
సానుజాతమయ్యె సకల కులము
హెచ్చు తగ్గుమాట లెట్లెరుంగ గవచ్చు?
విశ్వదాభిరామ! వినుర వేమ!

కుల అహంభావంతో విర్రవీగే ఆధిపత్య కులాలవారికి వేమన వేసిన ప్రశ్న ఇది. ఈ ప్రశ్నకు ఇప్పటికీ ఎంతో

ప్రాసంగికత ఉంది. ఇవాళ జరుగుతున్న 'పరువు' హత్యలు, దళితులపైన జరిగే దాడులు చూస్తుంటే వేమన జనం మధ్య తిరుగుతూ ఈ ప్రబోధం చేస్తూనే ఉన్నాడ నిపిస్తుంది. వృత్తులలో ఎక్కువ తక్కువలు లేవు, వృత్తుల చుట్టూ అల్లుకున్న కులాలలో ఎక్కువ తక్కువలు లేవు అన్న వేమన సిద్ధాంతం శాస్త్రీయమైనది.

మన సమాజంలో కుల అసమానతే కాదు, ఆర్థిక అసమానత కూడా ఉంది. ఈ రెండే మన సమాజాన్ని నిరంతరం పిండి పొడిగా చేస్తున్నాయి. వేమన కులానికి, ధనానికి మధ్య ఉండే విడదీయరాని సంబంధాన్ని గమనించాడు. ఆధిపత్య కులాల వారి చేతిలో సంపద ఉంది. శ్రామిక కులాలచేతిలో శ్రమ మాత్రమే ఉంది. సంపద ఎవరి చేతిలో ఉంటే కులాలకు అతీతంగా, పెత్తనం వాళ్ళదేననే వాస్తవం కూడా వేమన గుర్తించాడు.

కులములేనివాడు కలిమిచే వెలయును
కలిమిలేని వాని కులము దిగును
కులముకన్న మిగుల కలిమి ప్రధానంబు
విశ్వదాభిరామ! వినుర వేమ!

గ్రామీణ భారతాన్ని లోతుగా అధ్యయనం చేసి వేమన చెప్పిన ఇలాంటి పద్యాలు, నేటి భారతాన్ని అర్థం చేసుకోడానికి కూడా పనికొస్తాయి. సంపద, ఉత్పత్తి, దాని ఫలితం అందరికీ అనీ, ఇందులో కుల అసమానతలు ఉండరాదని వేమన ప్రబోధించాడు.

వేమన గుణప్రాధాన్యవాది. కులాలకు అతీతంగా మనుషులు గుణసంపన్నులు, గుణ దరిద్రులుగా ఉన్నారని వేమన గుర్తించాడు. అన్ని కులాలలోనూ మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు ఉన్నారని గమనించిన వేమన మంచివాళ్ళవైపు మొగ్గాడు.

గుణము గల్గువారి కులమెంచగా నేల?
గుణము గలిగెనేని కోటిసేయు
గుణము లేకయున్న గవ్వయు లేదు
విశ్వదాభిరామ! వినుర వేమ!

దుర్మార్గులు కానివారు ఏ కులంవారైనా సమాజానికి హాని జరుగదు. సన్మార్గులు కాని వారు ఏ కులం వారైనా సమాజానికి హానేనని వేమన ప్రబోధించాడు. ఒక కులం వాళ్ళంతా పవిత్రులు, గొప్పవాళ్ళు, ఇంకో కులం వాళ్ళంతా అపవిత్రులు, దుర్మార్గులు అనే యాంత్రిక అవగాహనను వేమన తిరస్కరించాడు. "మంచి చెడ్డలు మనుజులందున" అన్న గురజాడకు మూలం వేమనలో ఉంది.

కుల అహంకారాన్ని, కుల అసమాతను నిర్ద్వంద్వంగా తిరస్కరించి కులనిర్మూలనకు పిలుపునిచ్చిన వేమన, కులవ్యవస్థలో బాగా అవమానింపబడిన, చితికిపోయిన దళితుల పక్షం వహించి, అస్పృశ్యతను చీల్చి చెండాడాడు. దళితులను అంటరానివారుగా చూచేవాళ్ళకు వేమన చాలా ప్రశ్నలు వేశారు.

మాలవాని నేల మహిమీద నిందింప
ఒడల రక్తమాంసమొకటి గాదె
వానిలోన మెలగు వానికులంబేది?
విశ్వదాభిరామ! వినురవేమ!

మాలలు, మాదిగలు, డక్కలి, మాష్టీలు మొదలైన పదులకొలది కులాల ఉపకులాలవారిని అంటరాని వారుగా ముద్రవేసి, ఊరికి దూరంగా పెట్టి, అన్ని పనులలో వాళ్ళ శ్రమను ఉపయోగించుకుంటూ, వాళ్ళను మాత్రం హీనంగా, నీచంగా చూచే అనాగరికత మీద వేమన వేసిన ప్రశ్న "ఒడల రక్తమాంస మొకటి గాదె?" అన్నది. ఇది వజ్రాయుధం వంటి ప్రశ్న. ఈ ప్రశ్నకు ఇంకా ప్రాసంగికత ఉంది. వేమన శాస్త్రీయమైన ప్రశ్నలే కాదు. మానవ శరీరంలోని రక్తమాంసాలకు కులం ఉన్నదా? అన్నది తార్కికమైన ప్రశ్న. కరోనా కాలంలో శారీరక దూరం పాటించమంటే, చూశారా! మేము చెప్పిన అస్పృశ్యతా సిద్ధాంతం ఇవాళ ప్రపంచానికి ఆదర్శమైంది అని ఒక కవి పద్యం రాసి చదివాడు. ఎంత అజ్ఞానంలో ఉన్నామో అనిపించింది. శారీరక దూరానికి అస్పృశ్యతకు తేడా తెలియని వారికి వేమన కళ్ళు తెరిపించే పద్యాలు

చెప్పారు. అంతే కాదు, ''వాని మాలయన్నవాడెపో పెనుమాల'' అని న్యాయమూర్తి లాగా తీర్పునిచ్చాడు వేమన. ''బుద్ధి చెప్పువాడు గుద్దితేనేమయా?'' అని వేమన అన్నట్లు, వేమన కులాధిపత్యం మీద సమ్మెట దెబ్బ కొట్టాడు.

వేమన అస్పృశ్యత మీద యుద్ధంలో పురాణ కథలను కూడా ఆయుధాలుగా ఉపయోగించుకున్నాడు.

మాదిగయ గానె మరితక్కువందురు
మాదిగ యిలసురుల మామగాదె
మాదిగకును బిడ్డ యన యరుంధతి గాదె
విశ్వదాభిరామ! వినుర వేమ!

దళితులలో ఒక భాగమైన మాదిగవాళ్ళను దళితే తరులు తక్కువగా చూస్తారు, ఒక మాదిగ దేవతలకు మామకాదా? మాదిగ బిడ్డ అరుంధతి కాదా? అన్నాడు వేమన. అరుంధతి మాతంగ అమ్మాయి అని, ఆమె బ్రాహ్మణుడైన వశిష్టుని భార్య అని పురాణం చెబుతున్నది. హిందూ వివాహాలలో తాళికట్టిన తర్వాత వేళపాళ లేకుండా అరుంధతీ నక్షత్రాన్ని చూపిస్తారు. అంత గౌరవం ఒక మాదిగమ్మాయికి ఇచ్చిన చోటనే, మాదిగలను తక్కువగా చూచి అవమానించడంలోని అసంబద్ధతను వేమన ప్రశ్నించాడు. నిజానికి ఇదొక కామన్‌సెన్స్ ప్రశ్న...

మనుషులను కులాల ఆధారంగా గౌరవించే, అవమానించే దుర్మార్గం మీద వేమన కవిత్వ యుద్ధం చేశాడు. మనుషులు మానవ గుణాలు కోల్పోయి కులాల కుమ్ములాటలలో కూరుకుపోవడాన్ని వేమన విమర్శించాడు. గుణం ముందు మనిషి కులం ఎందుకూ పనికిరాదని చెప్పాడు.

''మాదిగ యనవద్దు మారిగుణమొనరిన''

అని జాతికి బుద్ధి చెప్పాడు వేమన. అంతే కాదు అయన మంచిగుణములేక మరి ద్విజుడెట్లగు? అని కూడా ప్రశ్నించాడు. వర్ణవ్యవస్థను సృష్టించి, దానికి దైవ కర్తృత్వాన్ని అంటగట్టి అత్యధికులైన శ్రామికులను అవమానించే దుర్మార్గాన్ని వేమన భూస్వామ్య, రాచరిక యుగంలోనే తీవ్రమైన చర్చకు పెట్టాడు. అనేక ప్రశ్నలు సంధించాడు. అయినా మన సమాజంలో ఇంకా కుల తత్వం కొనసాగుతూనే ఉంది. కులవ్యవస్థలోని కుళ్ళునంతా వేమన తన పద్యాలతో శస్త్రచికిత్స చేసి వెలికితీసి సమాజగర్భాన్ని శుభ్రం చేయడానికి కృషి చేశాడు. నేటి కుల నిర్మూలనోద్యమకారులకు, కులవివక్ష వ్యతిరేక పోరాట కారులకు వేమన బాగా సహకరిస్తాడు. అందుకే వేమన ఈ నాటికీ అవసరం.

జాతులందు నెట్టి జాతి ముఖ్యము జూడ
ఎరుకలేక తిరుగనేమి గలదు?
ఎరుక గలుగు మనుజుడే జాతిగలవాడు
విశ్వదాభిరామ! వినుర వేమ!

ఆధార గ్రంథాలు :

1. వేమన పద్యరత్నావళి - తాడంకి వెంకటలక్ష్మీ - నరశింహారావు (2005) - జె.పి. పబ్లికేషన్స్, అరండల్‌పేట, విజయవాడ.
2. విశ్వదాభిరామం - స॥ కట్టా నరసింహులు (2020) - రెడ్డి సేవాసమితి, ఎర్రముక్కపల్లి, కడప.
3. మన వేమన - ఆరుద్ర - వేమన ఫౌండేషన్స్, దోమలగూడ, హైదరాబాద్.
4. ప్రజాకవి వేమన - డా॥ ఎన్. గోపి - ఎన్. అరుణ, రాంనగర్, హైదరాబాద్.
5. లోకకవి వేమన - మరుపూరు కోదండరామిరెడ్డి - వేమన ఫౌండేషన్స్, దోమలగూడ, హైదరాబాద్.

BHAVAVEENA
Vol. 17, Issue. 11, November 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

OBC Movements in Andhra Pradesh &Telangana

- ***Dr. Battu Kiritam***, Asst. Prof. Of History, Govt. Degree College, Hayathnagar.

Indian society's caste-based hierarchical social organisation was all pervasive and deep rooted. Inequality is built into its deepest structures, excluding vast majority of the people from public life for centuries, thereby denying social opportunity, which destroys the possibility of people realising their elementary human potential. The socially deprived backward castes lived in a social oblivion between the upper caste sudras and the untouchables and are collectively exploited and deprived of all the privileges along with dalits. In response to such hierarchically structured, unequal, and oppressive social system, some of the depressed castes have mobilised themselves into forming respective caste associations to fight for their socio-economic and educational development. A further step in such mobilisation efforts was that majority of these caste associations united to form backward castes associations. In the social history of modern India, the role of the social reformers and caste associations has been adequately recorded, but it missed out the role and place of the intermediary castes, a stratum higher than the untouchables, but nonetheless depressed. These groups, hitherto known as 'castes other than depressed classes' given a new name 'Other Backward Classes' by Nehru, have attracted little attention of researchers.

The term 'backward classes' finds its place in articles 15(4) and 16(4) of the Constitution of India, wherein the State is empowered to make special provision for any socially and educationally backward classes (SEBCs) of citizens. Yet, unlike the categories of Scheduled Castes (SCs) and Scheduled Tribes (STs) that were distinctly defined, the category 'backward classes' remained ambiguous. The term had come into usage during the British period but with a variety of referents and evidently without any clearly specified parameters regarding the inclusion and exclusion of groups clubbed as backwards. In its early usage, 'backward classes' was an all-encompassing category that would include the underprivileged and the marginalized castes, tribes and communities.

Initiatives of the Government of India :

Among the many initiatives that the government of India took up to counter the pervasive inequality, it found affirmative action to be the most sustaining panacea. The discussion about the material conditions or the economic dominance of the group of castes and communities classified as the "OBCs" in India is prompted more by beliefs, or localised case studies, rather than by a detailed analysis of nationally representative data. Part of the reason for this gap is the lack of hard data: until the 2011 census, OBCs were not counted as a separate category, while affirmative action was targeted towards OBCs at the national level since 1991, and since much earlier at the state level. This would be the only instance of an affirmative action policy anywhere in the world where the targeted beneficiaries of a national programme, who ironically form the largest social group with 41.72% of the population

(NSS 2009-10), are not counted as a separate category in the country's census. The few existing estimates on the socio-economic position of the OBCs place them somewhere in-between SC-STs and "Others" (the residual category).

The far-reaching changes that Mandal Report brought to social and political lives was to help recognise the idea of backwardness, as something that is weighed not just by access to money. In India a social system existed that sought to see vast number of people as lowly, inferior and backward. The reservation policy not only increased the representation of OBCs in the services, it also enhanced the confidence and hope amongst OBC students of getting selected to the services. A greater number succeeded in the examination, both in the general and reserved categories. However, a PIL was filed in the Supreme Court seeking to "to put to rest" the issue of reservation by seeking a definition of 'backward classes' and whether more than 50% of the seats could be reserved. The 1992 judgment in the famous Indira Sawhney case recognised socially and economically backward classes as a category, and said that caste could be a factor for identifying backward classes and recognised the validity of the 27 percent reservation. Another phrase that gained currency through this judgment was the 'creamy layer' — those among the OBCs who had transcended their social backwardness were to be excluded from the reservation. The bench also laid down a 50 percent limit on reservations and said that economic, social and educational criteria were needed to define backward classes.

BC Movements in Andhra Pradesh :

As a part of the affirmative action to alleviate the lot of the backward classes in Andhra Pradesh, the Anantharaman Commission was appointed in 1968 to determine the criteria to be adopted in preparing the list of backward classes and make suitable recommendations for the uplift of the backward classes. One of the recommendations of the Anantharaman Commission was that the reservation could be made for a period of 10 years and Government might review the position thereafter. Accordingly, Muralidhar Rao Commission was appointed by the State Government in 1981. Muralidhar Rao ignored the terms of reference in constituting the Commission, and refused to delete any of the backward castes from the existing list, instead added nine more. He recommended increasing reservation from 25 to 44 percent for the 52% of the backward classes' population in the State. The list of Backward Classes is divided into 5 groups viz., A, B, C, D and E in place of the four existing groups. The Commission determined the population of BCs as 52%, taking caste only as the basis for ascertaining and identifying them. Accepting these recommendations in July 1986, the Government of Andhra Pradesh raised the quantum of reservations for BCs from 25%to 44% and added more communities to the list. The hike in quota was challenged in the AP High court. A full bench of the AP High Court, pronouncing its judgment on 5thSeptember 1986, struck down the increase, holding that the hike in reservations is violation of Articles 15 and 16 of the Constitution. Faced with the wrath of the anti-reservationists, the government took shelter under the Court

decision and withdrew the Government Order with equal haste.

After large-scale affirmative action became the norm, powerful caste groups have started demanding that they be listed as disadvantaged in the constitutional schedules. Aspirations of a growing population have increased the competition for government jobs and college degrees and the battle for backwardness has intensified. Many groups have staged protracted battles for OBC status and those already within these categories have fought to keep them out. The Patidar movement in Gujarat energised others. Over the past year, the topic of reservations has constantly been in the news, with new demands rippling across regions and communities. For decades, the Kapus and their subsections – Telaga, Balija and Ontari – had been demanding OBC status in Andhra Pradesh. The Andhra Pradesh government in December 2017 approved the Justice Manjunatha Commission's recommendations to earmark 5% for Kapus. Other Backward Classes currently have 25% reservation under five sub-categories: A, B, C, D and E. Kapus, a predominant caste in coastal Andhra with a powerful political backing, will be included as the sixth sub-category F. The quota for Kapus is applicable only to educational seats and job, but they cannot contest seats reserved for OBCs in the local bodies. Existing OBCs have opposed the entry of Kapus into the OBC list on the ground that the powerful community would corner all others in the reserved seats in the local bodies.

Initiatives of the Government of Telangana :

The Union Government has recently notified several significant changes for inclusion of several castes/communities in the Central List of Other Backward Classes (OBCs) for Telangana. It is based on the recommendations of National Commission for Backward Classes (NCBC) to examine requests for inclusion of any class of citizens as backward classes in the lists and hear complaints of over-inclusion and under-inclusion of any backward class in such lists and advice to the Central Government as it deems appropriate.

